Mohan
PUBLICATIONS
Mohanpublication.com

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద,
మంత్రశాస్త్ర, స్మార్త గ్రంథములకు
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదురుగా,
రాజమహేంద్రవరం - 533101.

grantha nidhi
THE TREASURE OF PAGES
FIRSTEVER TELUGU FREE E-BOOKS
DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com
Granthanidhi.blogspot.in

తొందరేమీ లేదు

-నివేదా థామస్

నివేదా థామస్.... టాలీవుడ్‌కి కొత్త పేరే... కానీ గత కొన్ని రోజులుగా అందరి నోళ్లల్లో నానుతోంది ఈ పేరు. 'జెంటిల్మన్' సినిమాలో నివేద నటన చూసిన వారందరూ ఆమె గురించీ, ఆమె నటన గురించీ మాట్లాడుకోవడంలో పెద్ద ఆశ్చర్యమేమీ లేదు. అందం, అభినయం కలబోసినట్టు ఉండే నివేదకు అవకాశాలు క్యూ కడుతున్నా ఇంత వరకూ ఒక్క తెలుగు సినిమా కూడా అంగీకరించకపోవడానికి కారణం ఏమిటో ఆమె మాటల్లోనే....

మొదటి సినిమానే ఇంత విజయాన్ని అందిస్తుందని ముందే ఊహించారా?

కథ విన్నప్పుడు విజయం ఖాయం అనిపించింది. ఈ స్థాయిలో నాకూ, నా పాత్రకూ గుర్తింపు వస్తుందని మాత్రం ఊహించలేదు. తెలుగు వారు ప్రతిభను గుర్తిస్తారు అనడానికి నేనే నిదర్శనం.

తెలుగులో సినిమాలు ఒప్పుకున్నారా?

చాలా అవకాశాలు వస్తున్నాయి. వచ్చిన వన్నీ ఒప్పేసుకుని వరుస సినిమాలు చేయాలన్న తొందరేమీ నాకు లేదు. అందుకే కథలు మాత్రమే వింటున్నాను తప్ప ఎవరికీ ఓకే చెప్పలేదు. కథల ఎంపిక మాత్రం పూర్తిగా నాదే. ఆ విషయంలో ఎవరినీ జోక్యం చేసుకోనివ్వను. నా సినిమాలు సక్సెస్ అయినా, ఫ్లాప్ అయినా పూర్తి బాధ్యత నాదే అని నమ్మే వ్యక్తిని నేను.

ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు?

ఇలాంటి పాత్రలే చేయాలన్న నిబంధన ఏదీ పెట్టుకోలేదు. నచ్చితే ఎలాంటి పాత్ర చేయడానికి అయినా నేను రెడీ! ముందు కథ విని, ఆ తరువాత నా పాత్ర గురించి తెలుసు కుంటాను. ఈ రెండు విషయాల తరువాతే డైరెక్టర్, నిర్మాత గురించి ఆలోచిస్తాను. మంచి పాత్ర అయితే డీ గ్లామర్‌గా నటించడానికి కూడా అభ్యంతరం లేదు.

నానితో చేయడం ఎలా ఉంది?

ఈ సినిమా ఒప్పుకోకముందు నుంచే నానికి నేను పెద్ద అభిమానిని. ఆయన సినిమాలన్నీ చాలా వరకూ చూశాను. కొత్త హీరోయిన్‌ని అయినా చాలా బాగా సహకరించారు. నాకు ఇంత గుర్తింపు రావడానికి ఓ విధంగా నానినే కారణం అని నా అభిప్రాయం.

స్కిన్ షో చేయనంటున్నారట?

స్కిన్ షో చేస్తూ, గ్లామర్‌గా కనిపించడమే హీరోయిన్ పనికాదు అన్నది నా అభిప్రాయం. హీరోయిన్‌కి తప్పనిసరిగా నటన తెలిసి ఉండాలి. ఎక్కువ కాలం ప్రేక్షకులకు గుర్తుండిపోవాలంటే మాత్రం నటన తప్పనిసరిగా వచ్చి తీరాలి. అందుకే స్కిన్ షో, గ్లామర్ కన్నా నటనకే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాను.

తెలుగు బాగా వచ్చినట్టుంది?

ఈ సినిమా ఒప్పుకోగానే పట్టుపట్టి తెలుగు నేర్చుకున్నాను. ఈ సినిమాలో నా పాత్రకి నేనే డబ్బింగ్ చెప్పుకోవాలనుకున్నాను కానీ, కుదరలేదు. నా తరువాతి సినిమాలకి నేనే డబ్బింగ్ చెప్పుకుంటాను.

చదువు కంటిన్యూ చేస్తారా?

చదువు దారి చదువుదే! సినిమాల దారి సినిమాలదే! దేన్నీ మిక్స్ చేయను. ఈ సినిమా డబ్బింగ్ సమయంలో నాకు ఎగ్జామ్స్ ఉండడం వలన డబ్బింగ్ చెప్పలేకపోయాను. ఆర్కిటెక్ ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సరం చదువుతున్నా. ఈ సంవత్సరంతో చదువు అయిపోతుంది. ఆ తరువాత పూర్తి స్థాయిలో సినిమాల మీద దృష్టి పెడతాను.

సురభితో చేయడం ఎలా ఉంది?

తను మంచి మనసున్న అమ్మాయి. షూటింగ్ సమయంలో మా ఇద్దరికీ స్నేహం కలిసింది. ఇప్పటికీ ఇద్దరం ఫోన్‌లో టచ్‌లోనే ఉంటాం.

ఎక్కువగా అభిమానించే హీరో?

కమల్‌హాసన్ గారు. ఆయనతో కోలీవుడ్‌లో 'దృశ్యం' చేశాను. ఆయన ఎంత గొప్ప వ్యక్తో అప్పుడే నాకు తెలిసింది. అప్పటి నుంచీ ఆయనకు వీరాభిమానిని అయ్యాను. ఆ తరువాత నానినే! తెలుగులో హీరోలందరి సినిమాలు ఇప్పుడిప్పుడే చూస్తున్నాను. ఒక్కొక్కరిదీ ఒక్కో స్టయిల్. వీళ్ళు గొప్ప, వీళ్ళు తక్కువ అని చెప్పడం కష్టం. తెలుగు హీరోల డ్యాన్సులు బాగుంటాయి. అంత బాగా ఎలా చేయగలుగుతున్నారా? అని ఆశ్చర్యం కలిగింది.

-దేవి

సరదాగా

పర్‌ఫార్మెన్స్

దొంగతనం కేసులో కోర్టు బోనులో నిలబడ్డాడు వీరూ. సీసీ ఫుటేజ్‌లు, క్లిప్పింగ్స్ సహా దొంగతనానికి సాక్ష్యాలన్నీ ఉన్నాయి. "నువ్వు ఎంత బొంకినా లాభం లేదు. దొంగతనం చేసినట్లు సాక్ష్యాలన్నీ రుజువు చేస్తున్నాయి" అన్నారు జడ్జి. "సరే, ఇంకేమైనా చెప్పదలచుకున్నావా?" అడిగారు వీరూని. "ఉంది" అని జనాలవైపు తిరిగాడు వీరూ.

"నేను ఎంత తెలివిగా దొంగతనం చేశానో చూశారుగా! నా పర్‌ఫార్మెన్స్ గాని మీకు నచ్చినట్లయితే వీరూ అని టైప్ చేసి, స్పేసిచ్చి 55555కి ఎస్.ఎం.ఎస్ చేసి, నన్ను విడుదల చేయించండి" అంటూ జడ్జిగారి వైపు చూశాడు.

ఒక ప్రశ్న?

ఎగ్జిబిషన్ ఎక్కడ జరుగుతున్నా సరే, అక్కడ సాహిత్ ప్రత్యక్షమవ్వాల్సిందే! ఎగ్జిబిషన్ అంటే అంత పిచ్చి అతనికి. రంగులరాట్నం అంటే ఇంకా పిచ్చి. ఎన్నిసార్లు తిరిగి రమ్మన్నా సరే అలా ఎక్కేసి ఇలా తిరిగేసి వస్తుంటాడు. పక్కఊర్లో ఎగ్జిబిషన్ పెట్టారని తెలిసి రక్కున అక్కడ వాలిపోయాడు సాహిత్. అయితే ఈసారి ఎప్పుడూ ఉండే రంగులరాట్నం, బొమ్మల కొట్లు, మిఠాయిలు... ఇవే కాకుండా కొత్తకొత్త ఆటలు దర్శనమిచ్చాయి అతనికి. రింగులు వేయడం, గన్‌తో బెలూన్లు పగలగొట్టడం వంటివన్నమాట. ఇవన్నీ చూస్తూ ముందుకెళుతున్నాడు సాహిత్. ఒకచోట గుంపుగా జనం కనబడ్డారు. ఏంటా? అని వెళ్ళి చూస్తే అక్కడొక మాస్టర్ ప్లాస్టిక్‌తో తయారుచేసిన అంకెల సెట్టు పెట్టుకుని కూర్చున్నాడు. అదొక లెక్కలకు సంబంధించిన ఆట. అడిగినవాళ్ళకు ఆట గురించి చెబుతున్నాడు. ఆడాలనుకున్నవాళ్ళకు ఒక లెక్క ఇస్తాడు. లెక్కతోపాటు ప్లాస్టిక్ నెంబర్లిచ్చి వాటితో లెక్క చేయమంటాడు. గెలిచాడా, పెట్టినదానికి ఐదింతలు! ఆడాలనుకున్నవాళ్ళు డబ్బులిచ్చి ఆడి వెళ్ళిపోతున్నారు. మళ్ళీ ఆడాలనుకునేవాళ్ళు ఆడుతుంటే, వచ్చిందే చాలు అనుకున్నవాళ్ళు వెళ్ళిపోతున్నారు. సాహిత్‌కి కూడా ఆడాలనిపించింది. చూద్దాం తన లెక్కల ప్రతిభ ఎంతో! అనుకుంటూ డబ్బులిచ్చాడు. సాహిత్‌కి ఐదు ప్లాస్టిక్ నెంబర్లిచ్చాడు మాస్టర్. వాటిల్లో నాలుగు ఎనిమిది అంకెలు, మిగిలినది ఒకటి అంకె. ఇంకా అతనిముందు గణిత గుర్తులు కుప్పగా పోశాడు. ఏదో ఒక గణిత గుర్తు ఉపయోగించి ఆ నెంబర్లను వంద చేయాలి. అదే పందెం! గుర్తుపెట్టుకో, మూడే మూడు అవకాశాలు అన్నాడు మాస్టర్. ఆలోచించాడు సాహిత్. నెంబర్లని, గణిత గుర్తులనీ అటూ ఇటూ మార్చాడు. మూడో ప్రయత్నానికి ఆ ఐదు నెంబర్లనీ వంద చేశాడు. ఇంతకీ ఎలా చేశాడు? ఇదీ ప్రశ్న? ఛేదించండి.

సమాధానం

199 - 99 = 100. అర్థమైందనుకుంటాను. మైనస్ గుర్తు ఉపయోగించి సాధించాడీ సమస్యను.

Jayadev

అడపా దడపా నవ్వాబ్బా



30

ము... ము... ము... ముద్దంటే చేదా?

మానవ జీవితంలో ముద్దుకు ఓ ప్రత్యేకత ఉంది. నాలుగువేల యేళ్ళ చరిత్ర దీనిది! మహాభారత కాలంలోనే లిప్‌లాక్‌లు ప్రసిద్ధి చెందాయట. జంతువులు కూడా ముద్దులు పెట్టుకుంటాయ్! ముద్దుల వల్ల రోగాలు కూడా తగ్గుతాయి!

8

నవ్వుదాం! నవ్విద్దాం!!

కష్టాలన్నీ పిలవని చుట్టంలా వచ్చి క్యూ కట్టి మరీ మనిషిని పలకరిస్తుంటే ఇక నవ్వేదెప్పుడు? ఆనందించేదెప్పుడు? జూలై 1వ తేదీ అంతర్జాతీయ జోక్ డే సందర్భంగా ఓ లుక్.

22

గేమ్ ఆఫ్ లవ్ *(కొత్త శీర్షిక ప్రారంభం)*

జీవిత క్రీడాస్థలిలో ప్రతి మనిషీ బ్యాట్స్‌మనే! వికెట్‌కీపర్ వెనుకే పొంచిఉంటాడు. చుట్టూ ఫీల్డర్లు మోహరించి ఉంటారు. ఫాస్ట్ బౌలరో, స్పిన్నరో మీదకు దూసుకొస్తుంటాడు. దీన్నెలా ఎదుర్కోవాలి?

సీరియల్స్

మదరిండియా	16
సమంత@లవ్	32
నిండు నూరేళ్లు	44
హవేలీ	56

కథలు

సమాంతర రేఖలు	10
ఖాళీలు	24
చూపులు కలసిన శుభవేళ	38
నోబెల్ కథలు	52
సౌరంగం	64

ఫీచర్స్

సురభి-15, ఆరోగ్యమే మహాభాగ్యం-29
వంటలు-37,సినీ నారాయణీయం-42
పుస్తక సమీక్ష-49, రివ్యూ-50
చిత్రమైన డైటు శరీరానికి చేటు-55
మనమీదేనర్రోయ్-59, మొలకెత్తే కాగితాలు-61
క్రైమ్-62, రామాయణం-66, సౌభాగ్యచక్రం-68
నవ్యసినిమా-69, అది నా తప్పు కాదు-70
ఇంటర్వ్యూ-72, ఇవన్నీ నిజాలే!, పదగారడి-74

ముఖచిత్రం: రెజీనా
ఫొటో: గోపీకృష్ణ

రచనలు, కథలు పంపవలసిన చిరునామా

నవ్య వీక్లీ, *ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం.76, అశ్వనీ లేఅవుట్, హుడా హైట్స్, రోడ్ నెం.70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.* **email: navyaweekly@andhrajyothy.com**

పది మార్కుల ప్రశ్న

ప్రశ్న: చీమను చంపడం ఎలా?

విద్యార్థి జవాబు: ముందుగా గుప్పెడు కారం తీసుకుని, అందులో చిటికెడు పంచదార కలపాలి. కలిపి, ఆ మిశ్రమాన్ని చీమ ఉన్న రంధ్రం దగ్గరగా ఉంచాలి. ఉంచితే చీమ వచ్చి మిశ్రమంలోని పంచదారను ఆశించి కారం తింటుంది. దాంతో దానికి దాహం వేస్తుంది. నీటి కోసం చూస్తుంది. అలా నీటికోసం చూస్తున్న చీమను తీసుకుని వెళ్ళి దగ్గరలో ఉన్న వాటర్ ట్యాంకర్‌లో పడేయాలి. కావాల్సినంత నీరు తాగి, అది అటు చలికీ, ఇటు ఈతరాక నీళ్ళలో కొట్టుకుంటుంటే తీసుకుని నిప్పుల దగ్గర ఉంచాలి. చీమ ఒళ్ళు ఆరబెట్టుకుంటుంటే... అదే అవకాశంగా ఆ నిప్పుల్లో బాంబు పడేయాలి. పేలుడికి చీమ తీవ్రంగా గాయాల పాలవుతుంది. అప్పుడు దానిని తీసుకుని వెళ్ళి ఆసుపత్రిలో, ఐసీయూలో జాయిన్ చెయ్యాలి. జాయిన్ చేసిన తర్వాత ఓ అర్ధరాత్రి ఐసీయూలో ఎవరూ లేని వేళ చొరబడి చడీచప్పుడూ లేకుండా చీమ నోటికి పెట్టిన ఆక్సిజన్ మాస్క్ తొలగించాలి. తొలగిస్తే చీమ చచ్చిపోతుంది.

నీతి: అందుకే విద్యార్థులతో పెట్టుకోకూడదు. పెట్టుకుంటే మార్కుల కోసం వాళ్ళు ఎంతకైనా తెగిస్తారు. ఏదైనా రాస్తారు.

అందమైన అమ్మాయి

భార్య: నిన్న ఓ అందమైన అమ్మాయిని చూశాను.

భర్త: చూశావా? ఏం చేశావప్పుడు?

భార్య: ఏం చేస్తాను? ఆ అందాన్ని ఆస్వాదిస్తూ... ఆస్వాదిస్తూ... నిల్చున్నాను.

భర్త: (కోపంగా) ఎంత సేపలా నిల్చుంటావు? తర్వాత ఏం చేశావో చెప్పు?

....

భర్త: (మరింత కోపంగా) నిన్నే అడుగుతోంది? తర్వాత ఏం చేశావు?

....

భర్త: (తట్టుకోలేనంత కోపంతో) నిన్నేనే! నిన్నే అడుగుతోంది. తర్వాత ఏం చేశావు?

భార్య: (నవ్వుతూ) ఏం చేస్తాను. అద్దం ముందు ఎంతసేపని నిలబడను. వచ్చి హాల్లో సోఫాలో కూర్చున్నాను.

ఫైన్

ప్రిన్సిపాల్: అర్ధరాత్రి ఆడపిల్లల హాస్టల్‌లోకి దూరిన ఏ కుర్రాడికైనా వందరూపాయలు ఫైన్. అది మొదటిసారైతే. అదే రెండోసారైతే రెండువందలు. మూడోసారైతే మూడువందలు.

కుర్రాడు: మంత్లీ పాస్ ఇచ్చే అవకాశం ఉందా సార్?

-వైనతేయ

నవ్య

సంపుటి: 13 సంచిక: 18

6-7-2016

మేనేజింగ్ డైరెక్టర్
వేమూరి రాధాకృష్ణ

ఎడిటర్
ఎ.ఎస్.జగన్నాథశర్మ

మొదటి పేజీ

బతకండి! ప్లీజ్!

ఇంటర్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. ఇంజనీరింగ్ చెయ్యాలని ఉంది. తండ్రికి చెప్పాడు ఆ సంగతి. దానికి అవుననిగానీ, కాదనిగానీ ఏమీ మాట్లాడలేదు తండ్రి. ఉండడం ప్రమాదకరం అన్నట్టుగా వెళ్ళిపోయాడక్కణ్ణుంచి. చూడమ్మా నాన్న! ఏమీ మాట్లాడరేంటి? తల్లికి వెళ్ళబోసుకున్నాడు. మాట్లాడడానికి ఆయనకు ధైర్యం చాలడం లేదురా! నేను చెబుతున్నాను, నిన్ను ఆయన ఇంజనీరింగ్ చదివించలేరు. బిఎ, బికామ్‌లాంటి ఏదైనా డిగ్రీ చేసుకో! ధైర్యంగా చదివిస్తారన్నది అమ్మ. ఆ డిగ్రీలు చెయ్యడం అతనికి ఇష్టం లేదు. చేస్తే ఇంజనీరింగే చెయ్యాలనుకున్నాడు. గట్టిగా పట్టుబట్టి దానిని సాధించాలనుకున్నాడు. ఆలోచిస్తూ బ్రిడ్జి మీద నుంచి నడచి వెళ్తూ ఉంటే మీదికి లారీ వస్తూ కనిపించిందతనికి. దానిని తప్పించుకునేందుకు ఇటు తిరిగాడో లేదో అంతెత్తు బ్రిడ్జి మీద నుంచి కిందకి... నీళ్ళల్లోకి పడిపోయాడు. ఈతరాదు. నీళ్ళలో మునిగి తేలుతున్నాడు. అప్పుడెవరో పట్టుకుని, గట్టుకి చేర్చారు. మింగిన నీళ్ళు కక్కించి స్వస్థత చేకూర్చారు. తేరిపార చూస్తే ఎవరో బైరాగి! థాంక్స్ చెప్పాడతను. ఎందుకు? అడిగాడు బైరాగి. నా జీవితాన్ని కాపాడారు కదా? అన్నాడతను. నిజంగా నీ జీవితం నేను కాపాడదగినంత గొప్పదైతే పాతికేళ్ళ తర్వాత మళ్ళీ కలుస్తాను, అప్పుడు ఈ థాంక్స్ చెప్పు అని నవ్వుతూ వెళ్ళిపోయాడు బైరాగి.

పాతికేళ్ళు ఎంత సేపు? ఇట్టే తిరిగిపోయాయి. కరిగిపోయాయి. అతనికి ఇప్పుడు నలభై రెండేళ్ళు. పెళ్ళయ్యింది. ఇద్దరు పిల్లలు. మొన్నటి వరకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేశాడు. నెలకి డెబ్బయి, ఎనభై వేలు సంపాదించాడు. పిల్లల్ని బాగా చదివించాలని ముందు నుంచే మంచి స్కూల్లో వేశాడు. బ్యాంకు లోను తీసుకుని ఫ్లాట్ కొన్నాడు. కారు కూడా కొన్నాడు. నల్లేరుపైనడకలా సాగిపోతోంది జీవితం. హ్యాపీ అనుకున్నాడు. అంతలో జరిగిందిది. రాత్రికి రాత్రే అతను పని చేస్తున్న కంపెనీ ఎత్తేశారు. ఏమైంది? ఎందుకిలా? అని అడిగేందుకు యాజమాన్యానికి సంబంధించి ఏ ఒక్కరూ ఊరిలో లేకుండా పోయారు. ఆ నెల జీతం కూడా ఇవ్వలేదు. తల మీద కొండ చరియ విరిగి పడ్డట్టు విలవిల్లాడిపోయాడతను. గట్టిగా ఏడవాలనిపించింది. చచ్చిపోవాలనిపించింది. అందుకోసం ఊరిచివర రైలుపట్టాలవైపు పరిగెత్తాడు. అక్కడ ఒంటరిగా నడుస్తూ ఏడుస్తూ రైలు కోసం చూస్తోంటే వచ్చిందది. దాని కింద పడబోయాడు. ఎవరో చేయి పట్టి వెనక్కి లాగారు. చూస్తే బైరాగి.

ఈసారి థాంక్స్ చెప్పలేదతను. ఎందుకు కాపాడావు? అన్నట్టుగా బైరాగిని చూశాడు. ముందు నీళ్ళు తాగు అన్నాడు బైరాగి. సంచీలోంచి వాటర్‌బాటిల్ తీసి ఇచ్చాడతనికి. తాగాడు. రా అన్నాడు బైరాగి. అతన్ని తీసుకుని వెళ్ళి ఓ చెట్టునీడన కూర్చోపెట్టాడు.

జీవితం చదరంగం లాంటిదయ్యా! ఎప్పుడూ ఆటలో గెలవాలనే ఎత్తులు వెయ్యాలి. వేసే ప్రతి ఎత్తూ జాగ్రత్తగా, తెలివిగా వెయ్యాలి. ఎత్తులెంత తెలివిగా వేసినా ఒకొక్కసారి ఎదురుదెబ్బలు తగులుతాయి. వాటిని పాఠాలనుకోవాలి. అంతేగాని ప్రమాదం అనుకుంటే ఎలా? చిత్తయిపోవూ? చిన్నప్పుడు ఇంజనీర్ అవ్వాలనుకున్నావు. పట్టుబట్టి ఆఖరికి సాఫ్ట్‌వేర్ ఇంజనీరయ్యావు. సంపాదించావు. సుఖంగా ఉన్నావు. సుఖాలు శాశ్వతం అనుకున్నావా? కాదు! కష్టాలెంత సహజమో! సుఖాలూ అంతే సహజం! జీవితం శాండ్‌విచ్‌లాంటిదయ్యా. పుట్టుక ఒక స్లైసైతే, చావు మరో స్లైస్! ఆ రెండింటి మధ్యా ఏం పెట్టి అనుభవిస్తావన్నది నీ ఇష్టం. కారం పెట్టుకుంటావో, తీపి పెట్టుకుంటావో అంతా నీ చేతుల్లోనే ఉంది అన్నాడు బైరాగి. పాతికేళ్ళ కిందట నిన్ను కాపాడినప్పుడు ఆనందం కలిగిందయ్యా! ఇప్పుడు కాపాడినందుకు ఆనందం లేదయ్యా! ఏంటో! నా మీద నాకే అసహ్యం వేస్తోంది అన్నాడు బైరాగి. ఉద్యోగఁదేముందయ్యా? ప్రయత్నించి ఇంకొకటి సంపాదించుకోవచ్చు. జీవితం మళ్ళీ రాదు! వెళ్ళు అన్నాడు. అతన్ని ఇంటివైపు నడిపించి, ఊపిరి పీల్చుకున్నాడు.

- **తెగిన షూలేస్‌తో కూడా ఉరిపోసుకోవచ్చు! చావడం చాలా సులభం! దాని కోసం ఆలోచించకండి! బతకండి! ప్లీజ్!**

WOW

ఢిల్లీగాళ్ హల్‌చల్

మనదేశం కళలకు నిలయం. మనల్ని సంపూర్ణమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడానికి కళలు ఎంతో దోహదపడతాయి. మానసిక వికాసానికి, ఆనందానికి కళలు దోహదం చేస్తాయి. అయితే ఈ కళనే ఆధారంగా చేసుకొని సమాజంలోని సమస్యలను కూడా ఎత్తి చూపవచ్చని నిరూపిస్తోంది కాంచీ. తనకున్న దార్శనిక దృక్పథాన్ని కళకు జోడించి 'ఆర్టివిజమ్' పేరుతో కొత్త ట్రెండ్ సృష్టిస్తోంది.

పదిహేడేళ్ళ కాంచీ చోప్రా ఢిల్లీ నివాసి. ఆమె అందరిలాంటి సగటు యువతి కాదు. చదువు, ఫ్యాషన్, పార్టీలు, కెరీర్ అంటూ తన వయసువాళ్ళు పరుగులు పెడుతుంటే కాంచీ మాత్రం ఆడవాళ్లపై జరుగుతున్న అఘాయిత్యాలకు పరిష్కారమేమిటా? అని ఆలోచిస్తుంది. రోడ్లపైన, బస్‌స్టాపుల్లోను, ఆఫీసుల్లోను స్త్రీలు ఎదుర్కొంటున్న లైంగిక అసమానతలు, వారిపై

జరుగుతున్న అఘాయిత్యాలు వంటి సమస్యలపై నిత్యం పోరు చేస్తోందామె. తనకు వచ్చిన చిత్రకళకు అదనంగా అందమైన, ప్రభావవంతమైన వాక్యాలను చేర్చి 'ఆర్టివిజమ్' పేరుతో ప్రజలను ఆలోచింపచేస్తోంది. దానికోసం ప్రత్యేకంగా ఓ బ్లాగు నిర్వహిస్తోంది. కాంచీ నిర్వహించే బ్లాగుకి ముప్పై దేశాలనుంచి ఫాలోయర్స్ ఉన్నారంటేనే, ఆమెకున్న ఫాలోయింగ్ ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు.! యాసిడ్ దాడులపై తన బ్లాగ్‌లో ఆమె చేసిన ఆర్ట్ పోస్టింగ్‌కు 48 గంటల్లోనే వేలాదిమంది స్పందించారు. వర్ణవివక్ష, లైంగిక అసమానత, ఆడపిల్లలపై అఘాయిత్యాలు, దాడుల వంటివి రూపుమాపేందుకు నిత్యం ఆమె తన బ్లాగు ద్వారా పోరాడుతోంది. "స్టాప్ యాసిడ్ ఎటాక్స్", "షీరోస్ హ్యాంగవుట్", "మేక్ లవ్ నాట్ స్కార్స్" వంటి సంస్థలు ఆమె పోస్టింగ్‌లెన్నింటినో పంచుకుంటున్నాయి. అంతేకాదండోయ్, వర్ణవివక్షపై చేసిన ప్రచారానికి గాను యూఎన్-ఎయిడ్స్ సంస్థ నుంచి అభినందనలూ అందుకుంది కాంచీ. తన ప్రతిభను ప్రజల్ని చైతన్యపరిచే ఆయుధంగా మలచుకున్న కాంచీ చోప్రా నేటి యువతకు ఆదర్శం. నిజంగా హ్యాట్సాఫ్ టు కాంచీ!

మెయిల్ బాక్స్

అమ్మలందరూ అన్నపూర్ణలైతే..

అమ్మలందరూ అన్నపూర్ణలైతే అమ్మాయిలకేం భయం? అవును. జీవితమనే రైలు ప్రయాణంలో ఎవరు, ఎప్పుడు, ఎలా తారసిల్లుతారో చెప్పడం చాలా కష్టం. అలా కలిసేవారిలో ఆత్మీయులు , శ్రేయోభిలాషులు, మోసకారులను గుర్తించడం కష్టమే. రోజులు, పరిస్థితులు అలా ఉన్నాయి మరి. మంచితనంతో మాటలతోనే బురిడీ కొట్టించి ముసుగేస్తున్న కాలంలో ఒంటరి అమ్మాయికి అర్ధరాత్రి అన్నపూర్ణ పరిచయం ఇంకా మానవత్వం బతికేఉందని ఋజువు చేసింది. ఉపకార బుద్ధి, జీవన గమనాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అన్నపూర్ణ ద్వారా గ్రహించవచ్చు. ఒక చక్కని ఆలోచనను చిన్న కథగా మలిచి మొదటి పేజీలో అందించిన శర్మగారు సదా స్మరణీయులు.

-భమిడి వెంకటేశ్వర్లు, హైదరాబాద్

దివ్యాంగుల స్ఫూర్తి

'దివ్యాంగులే స్ఫూర్తి ప్రదాతలు' వ్యాసంలో అంగవైకల్యాన్ని లెక్కచేయకుండా ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని సోదాహరణంగా వివరించారు. నిక్‌వ్యూజెసిన్ కాళ్ళూ చేతులూ లేకపోయినా దిగులు చెందకుండా ఆటపాటల్లో రాణించి ఉన్నత చదువులు చదివి అందర్నీ ఉత్తేజపరచడం గొప్పవిషయం. ఇలాంటివారెందరో మనకు స్ఫూర్తినిస్తున్నారు.

-సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

చాలా బాగుంది

రకుల్‌ప్రీత్‌సింగ్ ముఖచిత్రంతో వెలువడిన నవ్య వారపత్రిక చాలా బాగుంది. 'నాన్నకు ప్రేమతో' వ్యాసం ప్రయోజనకరంగా ఉంది. ఈ వారం శృంగార కథ, మిగిలిన అంశాలు అన్నీ బాగా ఆకర్షించాయి. ఈవారం కవిత బాగుంది.

-లక్కరాజు ప్రఫుల్లచంద్ర, ధర్మవరం.

కన్నీరు తెచ్చిన మన్నెం కథ

మన్నెం శారదగారి కథ 'ప్రేమా నీపేరే అమ్మ' కన్నీరు రప్పించింది. నోబెల్ కథ మౌనానికి ఉన్న విలువను తెలియజెప్పింది. నిండునూరేళ్ళ సీరియల్ ఉత్కంఠతో సాగుతోంది. 'మదరిండియా' సీరియల్ ఆరంభమే ఆశ్చర్యం కలిగించింది. సంగీతాని కున్న శక్తి ఔషధంలా పనిచేస్తుంది. సీనియర్ నటులు తిలక్ ఇంటర్వ్యూ బాగుంది.

-కె.వి.దుర్గామోహనరావు, హైదరాబాద్

మెచ్చదగిన ఎమ్మెస్

ఎమ్మెస్ చెప్పిన స్వానుభవాల్లో కొన్ని సినీ భ్రమలు వెలుగులోకొచ్చాయి. మెగా ప్రొడ్యూసర్లు ఇచ్చే గ్రాండ్ బాటిల్ పార్టీల్లో అతిథుల్ని విభజించడం చూసి దానిని అంత ధైర్యంగా రిజెక్ట్ చేయడం మెచ్చుకోదగింది. విచిత్రమైన పెంపుడు జంతువుల్ని లక్షలు, కోట్లు చెల్లించి కొనుక్కోవడం నిర్ఘాంత పరిచింది. హిజ్రా మహిళ కల్కి సాధించిన విజయాలకు, ప్రపంచవ్యాప్తంగా ఆమె పొందిన సత్కారాలకు మనస్సు ఆనందానికి గురైంది. తిలక్, ప్రభాకర్‌ల ఇంటర్వ్యూలు ఆసక్తిగా చదివించాయి.

-తాళాబత్తుల సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం-11

అలరించిన 'అన్నపూర్ణ'

ఆ దేవుడే ఆపన్నులకు సాయం చేస్తాడని మనలో ఒక నమ్మకం. ఆ నమ్మకాన్ని బలపరిచేలా మొదటిపేజీలో అన్నపూర్ణ కథ అలరించింది. మ్యూజిక్ థెరపీ వ్యాసం స్ఫూర్తిదాయకంగా ఉంది. రోగాలకు ఉపశమనమే కాదు, మంచి సంగీతం వినిపిస్తే పొలాలు బాగా పండుతాయని, పశువులు బాగా పాలిస్తాయని నిరూపితమైంది. పార్టీల్లో గెస్టుల స్థాయిని బట్టి హాట్ డ్రింక్స్ ఇస్తారని సినీ నారాయణీయం చదివితే తెలిసింది. సాధారణంగా అన్ని రకాలు ఒకచోట ఉంచి ఎవరికి కావాల్సింది వారు తీసుకునే ఏర్పాటు ఉంటుంది.

-కె.సుధీర్, శ్రీనగర్. తూ.గో.జిల్లా

రాముడి యుద్ధవ్యూహం

రామాయణం యుద్ధకాండలో శ్రీరాముడి యుద్ధ పథక రచన ఉత్తేజం కలిగించింది. ఖరీదైన పెంపుడు జంతువుల గురించి చదివిన తర్వాత ఆశ్చర్యం కలిగింది. ఇంటినిండా డబ్బుంటే చాలు ఖరీదైన హాబీలు, జంతు ప్రేమలు విజృంభిస్తాయి. కాస్ట్రో హత్యకు అమెరికా 600 సార్లు ప్రయత్నించి విఫలం కావడం, బియ్యంలో 15 వేల రకాలు లాంటి నిజాలు తెలిసి ఆశ్చర్యపోయాం.

-చైతన్య, వాకలపూడి. తూ.గో.జిల్లా

నోబెల్ కథలతో మనోవికాసం

'నరకానికి లిఫ్ట్' నోబెల్ కథ ఆసక్తికరంగా ఉంది. అడపాదడపా విదేశీ కథలు చదవడం అవసరమే. అది మనోవికాసం. రోగాన్ని ఆహారంతో నయం చేయొచ్చునని కాన్సెప్ట్ బాగుంది. తినడానికి సరైన తిండి, చదువుకోవడానికి సరైన పుస్తకాలు లేకే ఆందోళనలూ, అనారోగ్యాలూ అంటూ చెప్పిన మొదటిపేజీ కథ అద్భుతంగా ఉంది. ఇప్పుడిప్పుడే నల్లబియ్యం ప్రచారంలోకి వస్తోంది.

-శుభలక్ష్మి, కాకినాడ

వృద్ధుడి ఫిలాసఫీ భేష్

ఉన్నదానితో ఆనందించడం అనే ఎనభైయేళ్ళ వృద్ధుడి ఫిలాసఫీ బాగుంది. ప్రకృతిలో అంతుచిక్కని రహస్యాల గురించి చక్కగా వివరించారు. సురభిలో ప్లాస్టిక్ బాటిల్స్‌తో ఇళ్ళు, టాటూల తాతయ్య విశేషాలు భలేగా ఉన్నాయి. భయాలన్నింటికీ కారణం అభద్రతాభావమే. భయాన్ని కన్నెత్తి ప్రశ్నించాలని బోధించిన విజయవిలాసం ఉపయుక్తం. కలహాల కాపురం వల్ల డయాబెటిస్ వస్తుందని తెలుసుకుని ఆశ్చర్యపోయాం.

-ఆర్.మరుదకాశి, కరప. తూ.గో.జిల్లా

మైగ్రేన్ (పార్శ్వపు తలనొప్పి)

తరుచుగా తలనొప్పి వస్తే అశ్రద్ధ చేయకూడదు. ఎందుకంటే తలనొప్పికి చాలా కారణాలున్నాయి. రక్తపోటు, మెదడులో కణతులు, రక్తనాళాలలో రక్త ప్రసరణలో మార్పులు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి వల్ల, మగవారిలో రక్తపోటు, మానసిక ఒత్తిడి, మెదడులో కణతుల వల్ల తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. మైగ్రేన్ తలనొప్పి స్త్రీలలో అధికంగా చూస్తుంటాం. ఈ నొప్పి చాలావరకు తలకు ఒకపక్కవస్తుంది. వాంతులూ ఉండవచ్చు. తలలోని రక్తనాళాలు ఒత్తిడికి లోనయి వాచడం వల్ల ఈ నొప్పి వస్తుంది.

పార్శ్వపు తలనొప్పికి కారణాలు: పార్శ్వపు తలనొప్పి కి మానసిక ఆందోళన, ఒత్తిడి ముఖ్య కారణాలు. అనవసరపు ఆలోచనలు, జరిగిపోయిన విషయాల ను తరుచుగా ఆలోచించడం వల్ల వస్తుంది. డిప్రెషన్, నిద్రలేమి, కొందరిలో బయటకు వెళ్ళి నప్పుడు, సూర్యరశ్మి వల్ల, అధికంగా ప్రయాణాలు చేయడంవల్ల వస్తుంది. స్త్రీలలో హార్మోన్ల సమస్యలు ఏర్పడినప్పుడు, ఋతుచక్రం ముందుగా గాని, తర్వాత గాని వచ్చేఅవకాశం ఉంటుంది. గర్భాధారణ సమయంలో స్త్రీలలో ఋతుచక్రం ఆగిపోయినప్పుడు ఈ సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. ఓరల్ కాంట్రసెప్టివ్ పిల్స్ లాంటి కొన్నిరకాల మందులువాడటంవల్ల రావచ్చు. **మైగ్రేన్ దశలు–లక్షణాలు:** సాధారణంగా 24-72 గంటల్లో దానంతట అదే తగ్గవచ్చు. ఒకవేళ నొప్పి 72 గంటలు ఉంటే స్టేటస్ మైగ్రేన్ అంటారు. మైగ్రేన్ 4 దశలలో సాగుతుంది. **ప్రోడ్రోమ్ ఫేజ్:** ఇది నొప్పికి ముందు 2 గంటల నుంచి 2 రోజుల ముందు వరకు జరిగే ప్రక్రియల సమూహం. ఈ దశలో చిరాకు, మానసికఆందోళన, డిప్రెషన్, ఆలోచనలో మార్పులు రావడం, వాసన, వెలుతురు పడకపోవడం, మెడనొప్పి ఉంటాయి.

ఆరాఫేజ్: ఈ దశ నొప్పి ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు ఉంటుంది. చూపు మందగించడం, జిగ్ జాగ్ లైన్స్ కనిపించడం, తలలోసూదులు గుచ్చిన ఫీలింగ్, మాటలు తడబాటు, కాళ్ళలో నీరసం ఉంటాయి. **నొప్పిదశ:** ఈ నొప్పి దశ 2 గంటల నుంచి 3 రోజుల వరకు ఉండే అవకాశం ఉంటుంది. ఈ దశలో వాంతులు ఉంటాయి. చాలా వరకు ఒక వైపునే ఉంటుంది. కాంతికి, ధ్వనికి చాలా సెన్సిటివ్‌గా అంటే చికాగ్గా అనిపిస్తుంది.

పోస్ట్‌డ్రోమ్ ఫేజ్: నొప్పి తగ్గిన తర్వాత కొద్ది రోజుల వరకు తలభారంగా అనిపిస్తుంది. ఒళ్ళంతా నీరసంగా, నిరాసక్తంగా అనిపిస్తుంది.

వ్యాధి నిర్ధారణ: 1 రక్త పరీక్షలు-సీబీపి, ఈఎస్ఆర్ 2. రక్తపోటును గమనించడం. 3.ఈఈజీ పరీక్ష సిటీస్కాన్(మెదడు). 4.ఎం.ఆర్.ఐ పరీక్షలు ఉపకరిస్తాయి.

మైగ్రెన్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

1. మానసిక ఆందోళన తగ్గించాలి.

డా. మురళి అంకిరెడ్డి
M. D (Homeo)
స్టార్ హోమియోపతి

2. అతిగా ఆలోచనలు చేయకూడదు. మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి. దీనికోసం యోగా, ప్రాణాయామం చేయాలి. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది. 3. తలకు నూనేతో మసాజ్ చేసుకుంటే తలలోని నరాలు రిలాక్సవుతాయి.

4.తలనొప్పి వచ్చినప్పుడు ప్రశాంతవాతావరణంలో, లైటు తీసేసి నిశ్శబ్దంగా ఉన్నచోటపడుకోబెట్టాలి.

హోమియోవైద్యం: మైగ్రేన్ తలనొప్పికి హోమియోలో మంచి మందులున్నాయి. ఘాటైన వాసనలు పీల్చిన పుడు వస్తే, బెల్లడోనా, లైకోపోడియం, ఇగ్నీషియా ఇవ్వాలి. తరుచు ఎక్కువగా వస్తుంటే, నాట్రంమూర్, సాంగ్యునేరియా, చైనా, సెపియా ఇవ్వాలి. గర్భవతు ల్లో వస్తే బెల్లడోనా, సక్సవామికా, సెపియా ఇవ్వాలి. ఎక్కువగా చదవడం వల్ల వస్తే కాల్కేరియా కార్బ్, నాట్రామూర్, ట్యూబర్కులినమ్. ప్రయాణాల వల్ల వస్తే -ఇగ్నీషియా సెపియా, కాక్యులస్, కాలికార్బ్ ఇవ్వాలి. స్కూల్‌కి వెళ్ళే ఆడపిల్లలో వస్తే - కాల్కేరియాఫాస్ నాట్రంమూర్, పల్సటిల్లా ఇవ్వాలి. పైన తెలిపిన మందులు కేవలం అవగాహనకు మాత్రమే. వాటిని నిష్ణాతులైన హోమియో డాక్టర్‌ని సంప్రదించి మాత్రమే తీసుకోవాలి.

www.starhomeo.com
సికింద్రాబాద్ | కొత్తపేట | కూకట్‌పల్లి | వరంగల్ | గచ్చిబౌలి
విజయవాడ | తిరుపతి | వైజాగ్ | రాజమండ్రి | కర్నాటక
90300 64224

నడుంనొప్పికి ఆయుర్వేద చికిత్స

ప్రస్తుత పరిస్థితుల్లో మానవుని జీవనం ప్రకృతి సహజ విధానాలకు విరుద్ధంగా ఉంటోంది. పెరిగి పోతున్న పని ఒత్తిడి, పోషకాహారం సరిగా తీసుకోక పోవడం వల్ల ఈ రోజుల్లో 40 ఏళ్లకే నడుంనడప్పి వస్తోంది. శారీరకంగా, మానసికంగా సమస్యలు కలిగించే నడుంనొప్పిని దూరం చేయాలంటే ఆయుర్వేద చికిత్సే ఉత్తమమైన మార్గం అంటున్నారు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ మనోహర్.

నేటి జీవనవిధానంలో ఆహారలోపాలు, అస్తవ్యస్తమైన దిన చర్యలు, స్వప్న విపర్యం అంటే రాత్రివేళ నిద్రపోక పోవడం, పగటిపూటనిద్రపోవడం వంటి అలవాట్లు శరీర వ్యవస్థను బాగా దెబ్బ తీస్తున్నాయి. ఆందోళన, మానసిక ఒత్తిడి కూడా అనేక అనారోగ్యాలకు కారణ మవుతున్నాయి. వీటిలో అతిముఖ్యమైనది నడుంనొప్పి. ఆయుర్వేదశాస్త్రం నడుం నొప్పికి 'గృధ్రసీవాతం' గా నామకరణం చేసింది. తొంభైశాతం మంది తమ జీవిత కాలంలో ఎప్పుడో ఒక్క సారి నడుంనొప్పి బారినపడతారని కొన్నిఅధ్యయనాల్లో స్పష్టమయింది. **కారణాలు:** ఎక్కువసమయం ఒకే భంగిమలో కూర్చోవటం, స్థూలకాయం, ఎక్కువగంటలు విపరీతంగా శ్రమించడం, అతిగా బరువులు మోయడం, ద్విచక్ర వాహనం మీద ఎక్కువ దూర ప్రయాణం చేయడం, రోడ్డు ప్రమాదాలు,దీర్ఘకాలికరుగ్మతలు, వంశ పారంపర్య వ్యాధులు ఇవన్నీ నడుంనొప్పికి కారణాలు. ఈ కారణాల వల్ల వాత ప్రకోపం జరుగుతుంది. ఫలితంగా ముందుగా పిరుదుల పైభాగాన స్తబ్ధతను, నొప్పిని కలిగించి ఆ తరువాత నడుం భాగం, ప్రత్యేకించి ఎల్-4, ఎల్-5 వెన్నుపూసల మధ్య ఉండే సయాటికా నరం మీద ఒత్తిడి పడటంవల్ల నడుంనొప్పి వస్తుంది. డిస్కులో వచ్చే మార్పులు. వెన్నుపూసల మధ్య ఉండే డిస్కుల్లో కొన్ని మార్పులు జరిగినప్పుడు డిస్కుల మీద ఒత్తిడి పెరుగు తుంది. వాపు రావడం, డిస్కుకి రక్త ప్రసరణ సరిగా లేక పోవడం, డిస్కు అరిగి పోవడం వంటి సమస్యల వల్ల ఈ నొప్పి వస్తుంది. డిస్కులలో వాపువస్తే అందులోనుంచి ద్రవం బయటకు వచ్చి మేరుదండం నుంచి వచ్చే నరాల పైన ఒత్తిడి పెరుగు తుంది. దీనివల్ల వెన్ను నొప్పి వస్తుంది. **లక్షణాలు:**నడుంనొప్పి, వాపు, కాస్త శ్రమించినా సూదుల తో గుచ్చినట్లుగా నొప్పి తీవ్రంకావడం, కాళ్ళలో తిమ్మిర్లు, మంటలు ఉంటాయి. సకాలంలో చికిత్స అందకపోతే స్పర్శజ్ఞానం కోల్పోతారు.సమస్య తీవ్రమైతే మలమూత్రాల మీద నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంది. పెయిన్ కిల్లర్స్ వాడకూడదు. పెయిన్‌కిల్లర్స్‌తో మలబద్దకం, జీర్ణా శయ సమస్యలు వస్తాయి. వెన్నుసంబంధిత సమస్యలను వెంటనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఈ వ్యాధిరాకుండా ఉంటుంది.

ఆయుర్వేదచికిత్స: నడుంనొప్పిసమస్యకు ఆయుర్వేద శాస్త్రం సూచించిన సమగ్రమైన చికిత్సా పద్ధతుల్లో నిదాన పరి వర్జనము, శమన చికిత్స, శోధనచికిత్స అని మూడు ప్రధానమైనవి ఉన్నాయి. **నిదానపరివర్జనము:** వ్యాధికి కారణమయిన విషయాలను పాటించక పోవడం. ఉదా॥ విరుద్ధ ఆహార, విహార సేవన (రాత్రి మేల్కోవటం, పగలు నిద్రపోవటం).**శమనచికిత్సలు:** వ్యాధితాలూకు దోషాలను శమింప చేయటానికి తెచ్చే ఔషదాలు. ఇందులో రోగ బలాన్నిబట్టి, రోగిబలాన్నిబట్టి చూర్ణాలు, గటికలు, కషాయాలు, లేహ్యాలు, తైలాలు వంటి ఔషదాలు రోగికి ఇవ్వడం జరుగుతుంది. కానీఈ శమన చికిత్సవల్ల ఒక్కో సారి ప్రకోపించిన దోషాలుమళ్ళీ తిరగబడవచ్చు. అందుకే వ్యాధితీవ్రతను బట్టి శమన చికిత్సలతో పాటు కొందరికి పంచకర్మ (శోధన చికిత్స) కూడా అవసరం. ప్రకోపించిన దోషాలను(వాత, పిత్త, కఫ) దీని ద్వారా సమంగా చేసి శరీర శుద్ధిని, అగ్ని బలాన్ని పొందవచ్చు. ఆయుర్వేదంలోని స్వేద కర్మ ద్వారా వెన్నుపూసల మధ్య స్థిర్ధత్వాన్ని పెంపోదించి కీళ్లకదలికలను సులభతరం చేయవచ్చు. బిగుసుకుపోయిన కీళ్లను స్వేదకర్మ ద్వారా వదులుగా, మృదువుగా మార్చవచ్చు. **కటివస్తి:** ఇది ఆయుర్వేదంలోని ఒక విశిష్టప్రక్రియ. అరిగిపోయిన మృదలాస్థి (కార్టిలేజ్)కి రక్తప్రసరణ పెంచినొప్పి తీవ్రతను తగ్గించడంలో ఈ ప్రక్రియఎంతగానో ఉపయోగపడు తుంది. ఇదే క్రమంలో సర్వాంగధార చికిత్స కూడా వీరికి బాగా ఉపయోగపడుతుంది. వస్తికర్మ, ఆయుర్వేద శాస్త్రం లో వస్తికర్మచికిత్స అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించు కుంది. ఈ వస్తికర్మచిన్నపేగులు, పెద్దపేగులలోని ఎంటరిక్ నర్వస్ సిస్టమ్‌పై ప్రభావం చూపుతుంది. తద్వారా నాడీ కణాలలో ఏర్పడిన లోపాలను సరిచేసి బలం చేకూర్చ వచ్చు. అలాగే పక్వాశయ వాతస్థానంకాబట్టి ప్రకోపించిన వాతాన్నికూడా సహజస్థితికి తీసుకురావచ్చు.

జాగ్రత్తలు: అవసరమైన పోషకాహారం తీసుకుంటూ వైద్యులు సూచించిన విధానా లను అనుసరించడం చాలా ముఖ్యం. ఔషదచికిత్సల తరువాత క్రమం తప్పకుండా వ్యాయామం కూడా చేస్తే నడుం నొప్పి సమస్యనుంచి శాశ్వతంగా విముక్తి కలుగుతుంది.

డా. లక్ష్మి M. D (Ayurveda)
స్టార్ ఆయుర్వేద

ADVT
90300 85456
సికింద్రాబాద్ | కొత్తపేట | కూకట్‌పల్లి | వరంగల్ | గచ్చిబౌలి
విజయవాడ | తిరుపతి | వైజాగ్ | రాజమండ్రి | కర్నాటక
www.starayurveda.com

నవ్వుదాం! నవ్విద్దాం!!

నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారిచుట్టూ జేరతారు ఎవరైనా! అలాంటివారు అందరినీ చుట్ట బెట్టేస్తూ పరిసరాల్ని తేలికపరిచేస్తూ ఉంటారు. నిజం చెప్పాలంటే ప్రతివారిలో హ్యూమర్ సెన్స్ ఉంటుంది. ప్రెజెంటేషన్‌లో కొందరు అభాసుపాలైతే మరికొందరు సందర్భోచి తంగా అలరిస్తారు. ప్రాక్టికల్ లైఫ్‌లో ఎవరినీ నొప్పించని హ్యూమర్ సృష్టించడం, జోక్స్, జోవియల్ కథలు చెప్పడం, ప్రాక్టికల్ జోక్స్ వెయ్యడం, చిలిపిగా ప్రవర్తిస్తూ నవ్విం చడం, కొందరైతే గంభీరంగా ఉంటూ అందర్నీ నవ్వించడం, సైగలతో పది మందినీ నవ్వించగలగడం... ఇలాంటివన్నీ నిత్యం మనం చూసేవే. ఇప్పటి సమాజానికి కావాల్సింది ఇదే. దీనికోసం కొందరు ఎంపిక చేసుకుని మరీ స్నేహాలు చేస్తే, మరి కొందరు ఈ జోవియా లిటీ కోసం రిస్కుచేసి ఎన్నో కిలోమీటర్లు ప్రయా ణిస్తారు. హాస్యానికి జీవితంలో అంత ప్రాధాన్యం ఉంది మరి!

(జూలై 1 ఇంటర్నేషనల్ జోక్ డే సందర్భంగా)

నవ్వుతూ బతకాలిరా..తమ్ముడూ నవ్వుతూ చావాలిరా / చచ్చినాక నవ్వలేవురా... ఎంత ఏడ్చినా తిరిగిరావురా... అన్నాడో సినీకవి. జేబు నిండా జీతం, అకౌంట్ నిండా బ్యాలెన్స్.....! అయినా ఎప్పుడూ పనే. ఏదో హడావిడే! అన్నీ ఉన్నాగానీ ఎందరో ఇలా ఆనందం కోల్పోతూ ఉంటారు. పిలవని చుట్టంలా కష్టాలు క్యూ కట్టి మరీ వేధిస్తుంటాయి. వాటినెలా రిలీజ్ చెయ్యాలో తెలీక మనిషి గంభీర సముద్రంలా మారి, చిరునవ్వు వెనుక బడబా గ్నులు దాచుకుంటాడు. షిఫ్టు డ్యూటీలు సగం జీవి తాన్ని మింగేస్తే, మిగిలిన సగం కోసం నిద్రాదేవి సిద్ధం! వారాంతపు సెలవుల్లో కూడా అది మనల్ని కౌగిలిలో బిగించేస్తుంది. అలాంటి వారికి ఎడారిలో ఒయాసిస్సులా ఛలోక్తులు విసురుకుంటూ, ఆట పట్టించుకుంటూ ఆనందంగా గడపగల రోజు ఒకటి తారసపడితే....? అంతకు మించిన సంతోషం మరేం ఉంటుంది?

అలాంటి వారి కోసమే ఈ అంతర్జాతీయ జోక్ డే. ప్రతి ఏడాది జూలై ఒకటో తారీఖున ఒకరికొ కరు జోకులు చెప్పుకుంటూ, సరదాగా నవ్వుతూ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితంగా గడపా లన్నదే దీని ఉద్దేశం. హాస్య రసంతో నగుమో మును మరింత వికసింపజేసే మనదైన ప్రత్యేక రోజే ఈ జోక్ డే.

చిలిపి జ్ఞాపకాలు

బాల్యంలో ప్రతిఒక్కరూ పొరపాట్లు చేసిన వారే. ఆ పొరపాట్లు ఎన్నో జోకుల్ని సృష్టించి ఎంద రినో కడుపుబ్బా నవ్వించి ఉంటాయి. ఇంటికొచ్చిన ప్రతిసారీ మన చుట్టాలు వాటిని గుర్తుచేస్తూ ఆటపట్టించే సందర్భాలెన్నో. మా బుడ్డోడు చాలా మొండి.. మా గుండమ్మది మామూలు అల్లరి కాదు బాబోయ్...., వేలెడు లేదు, వాడి మాటలు చూశారా... అంటూ మన పసితనం లీలల్ని ఇరుగు పొరుగుతో చెప్పుకుంటూ తల్లిదండ్రులెంతో ఆనందిస్తారు. అలాంటి చిట్టిపొట్టి జ్ఞాపకాలు కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకుంటుంటే మనకెప్పుడూ పట్టలేని ఆనందమే. అలా సినిమా ల్లోని కామెడీ సన్నివేశాలు, కథలు, చమత్కారాలు చెప్పుకుంటూ ఒకరినొకరు నవ్విస్తూ అందరూ సర దాగా గడపగలిగితే మన చుట్టూ పండుగ వాతా వరణమే.

చమత్కారం, ఛలోక్తులు...

చమత్కారాలు..ఛలోక్తులు అంటే మన తెలుగు వారికి భలే సరదా. కొన్ని ప్రాంతాల్లో ఇది మరీ ఎక్కువ! ఎవరైనా బంధువులు ఇంటికివచ్చినప్పుడో, స్నేహితులను ఆటపట్టించేందుకో మాటల మధ్య చమత్కారాలు దొర్లుతుంటాయి. నవ్వులు వెల్లివిరు స్తుంటాయి. స్నేహితులు, బంధువులున్నప్పుడు ఈ ఛలోక్తులే ఎక్కువ. మరీ గంభీరంగా ఉంటే విషయం ఒక పట్టాన బుర్రకెక్కదు సరికదా, మాన సికోల్లాసం కూడా కరువైపోతుంది.

నవ్వడం మన జన్మ హక్కు. అలాంటప్పుడు ఆ హక్కు వాడుకుని కాసేపు సరదాగా గడిపేస్తే

పోలా.. మరీ కోపం కాకుండా, మనసులో అసూయ లేకుండా వ్యంగ్యంగా సుతిమెత్తని హాస్యం పండిస్తూ నవ్వులు నలుమూలలా వ్యాపింప చేద్దాం. దానికంటూ కేవలం ఈరోజే అనికాకుండా మనకంటూ మనం అంటూ నీలాకాశంలో విహ రిస్తున్న పక్షుల్లా ఆనందంగా సంచరిద్దాం.

హాస్యమే ఔషధం

గుండె లోతుల్లో దాగిన బాధ క్షణాల్లో మర పించి మురిపిస్తుంది హాస్యం. ముఖావంగా కూర్చున్న మనవారికి తియ్యని ఔషధం సరదా మాటలే. ఆ సరదా మాటలే చెప్పుకుందాం. గుండెలను తాకి ఆనందం పంచే జోకులు వేసుకుందాం. నిట్టూర్పు దూరంచేసే సున్నితమైన జోకులతో మన చుట్టూ మధుర భావనలు సృష్టిద్దాం.

జోకులకు ఎన్నెన్ని రూపాలో!

'బాటిల్ ఏ బ్రాండ్ అయితే ఏమి బాబాయ్.. దాహం తీర్చుకోవడానికి తాగేది మంచి నీరేగా' అన్నట్లు రూపం ఏదైనా జోకుల లక్ష్యం నవ్వించ డమే. వెజ్జా..నాన్‌వెజ్జా అన్నది పక్కన పెడితే అభి రుచులను బట్టే ఏ జోకైనా వ్యక్తులను నవ్విస్తుంది. అలా ఈ జోకులకు వివిధ రూపాలున్నాయి. మెమేలు, పంచ్‌లు, చుట్కేలు, వ్యంగ్యం, కార్టూన్‌లు ఇలా చెప్పుకుంటూ పోతే అబ్బో బోలెడు రకాలు. సాంకేతికత తోడవ్వడంతో నచ్చిన వారికి తోచినట్లు నానా రకాల జోకులు పుట్టుకొస్తున్నాయి. కొత్తదనంతో కితకితలు పెడుతున్నాయి.

నెటిజన్స్ జోక్ బాక్స్!

నవ్వించడానికి ఎవరూ లేరు..నాకు నేనే నవ్వుకుంటే పిచ్చోడనుకుంటారని చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. అవును మరి అర్థం పర్థం లేకుండా నవ్వితే అలానే అనుకుంటారు. మరేం చేద్దాం? జోకులు చెప్పడానికి ఎవరున్నా రని ఆలోచిస్తూ సతమతమవుతున్నవారికోసం ఇప్పుడు సోషల్ మీడియా జోకులను అందించే మాధ్యమంగా తయారయింది. నవ్వాలనుకునే వారు జోకులు వెతుక్కుంటే నవ్వించాలనుకునే వారు జోకులను సోషల్ మీడియా వేదికగా పంచుకుం టున్నారు. దీంతో నవ్వుకు కొదవ లేకుండా పొట్ట చెక్కలయ్యేలా నెటిజన్స్‌ను నవ్విస్తున్నారు. ఫేస్ బుక్, ట్విట్టర్ వంటి అత్యంత ఆదరణ కలిగిన సైట్‌లలో జోకులను అందించే పేజీలకు వెబ్‌సైట్ లకు ఆదరణ పెరుగుతూ ఉండడమే ఇందుకు నిదర్శనం. ఇక వాట్సాప్‌లో అయితే చెప్పనక్క ర్లేదు స్నేహితులతో, గ్రూపులలో గంపగుత్తగా పంచేసుకుంటున్నారు.

నవ్వించే వారికి ప్రత్యేక కొలువులు

మీ మీ మాటలతో ఎదుటివారిని నవ్వించగలరా? ఎంత మూడీగా ఉన్నా మైమరపించేలా చేయగలరా? సభలో ఉన్న వారందరి చేత నవ్వుల ముత్యాలు రాలించగలరా? వేదికను హాస్యంతో ఉబ్బితబ్బి బ్బయ్యేలా చేయగలరా..! అయితే పొట్టకూటికి ఇక ఢోకా లేదు. సమాజంలో పెరుగుతున్న ఆందోళ నలు, ఒత్తిళ్ళ కారణంగా ప్రజలు హాస్యానికే పెద్ద పీట వేస్తున్నారు. నిజానికి నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారి చుట్టూ జనం ఎప్పుడూ గుమిగూడి ఉంటారు. అది నేడు ఉపాధి మార్గంగా మారింది. ముఖంపై చిరునవ్వు చిందిస్తూ ఉండేవారికి టీవీ ఛానెల్స్, ఇంటర్నెట్ ఛానెల్స్, ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థలూ పిలిచి కొలువులను ఇస్తున్నాయి. అంతేకాకుండా ఎంతోమంది స్వయం ఉపాధి కూడా పొందుతున్నారు. ఇందుకు నిదర్శనమే గత దశాబ్దకాలంగా టీవీలలో పెరిగిన కామెడీ షోలు. ప్రజలలో హాస్యం పట్ల ఆసక్తి పెరగడం, అందుకు వివిధ మార్గాలు వెతుకుతూ ఉండటంతో జోకులు రాసే రచయితలకు హాస్యం పండించే కళాకారులకు మార్కెట్‌లో డిమాండ్ బాగా పెరిగిందనడం అతిశ యోక్తి కాదు.

ఆరోగ్యానికి అండగా..

ఎల్లప్పుడూ సంతోషంగా ఉండేవారికి ఏ రోగం దరిజేరదు. ఒకవేళ ఎటువంటి వ్యాధులు వచ్చినా సరే ఆనందంగా ఉండేవారు త్వరగా కోలుకుంటారని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. అందుకే హాస్యా నాలు కానివ్వండి.. పార్కుల్లో గుంపులుగా చేరి విరగ బడి నవ్వే లాఫింగ్ థెరపీలు కానివ్వండి ఎటు తిప్పి రోజులో బలవంతంగా కనీసం పది నిమిషా లైనా నవ్వుతున్నారు. సంతోషంగా ఉండేవారి గుండె ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు చెబుతు న్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వ్యక్తి సంతోషంగా ఉంటే అతను సాధారణ వ్యక్తి కంటే త్వరగా కోలుకుంటాడని, అతని శరీరంలో కణాలు ఇందుకు పూర్తిగా సహకరిస్తాయని ఒక సర్వేలో తేలింది. అందుకే జోకులకు బాగా ఆదరణ పెరి గింది. సో.... మనల్ని నవ్వించే జోకులు మన ఆరో గ్యానికి మేలు చేస్తున్నట్లేగా మరి....!

నవ్వు ముఖానికి మార్కెట్‌వాల్యూ ఎక్కువ!

నవ్వు ముఖానికి మార్కెట్ వాల్యూ ఎక్కువ. మానవ వనరుల శాఖాధికారులు నిత్యం చెప్పే మాట ఇదే. ఉద్యోగులు, స్నేహితులు వారి మధ్య బంధాలను బలపరుచుకోవడానికి హాస్యం ఎంత గానో ఉపయోగపడుతుంది. సరదాగా మాట్లాడే మాటలు ఎదుటివారిని నవ్వించడంతో పాటు వారికి మనపట్ల సదభిప్రాయం పెంచుతాయి. అలా అని అసందర్భంగా జోకులు పేల్చడం కూడా ప్రమా దమే సుమీ. మన స్నేహితుణ్ణి మనం ఎంత ఆట పట్టిస్తే మన స్నేహం అంత బలంగా ఉందని అర్థం అని చెబుతున్నారు. అంతేకాకుండా చిరునవ్వు ముఖానికి స్నేహితులూ, సన్నిహితులూ ఎక్కువే. కాబట్టి మాటల్లో ఆప్యాయత నింపుకుని నలుగు రికీ ఆనందం పంచండి.

- హరీష్ పురోహిత్

ఇలా చేసి చూద్దాం!

- ఉదయం లేవగానే టీవీలు, ఫోన్లు అంటూ పట్టుకోకుండా మంచి హాస్యం చదివో లేక జోక్స్‌తో రోజును ప్రారంభిద్దాం. లేవగానే కాఫీ, టీ అని ఇంట్లో వారిపై అరవకుండా ఇంట్లో వారితో కాసేపు సరదాగా మాట్లాడండి.
- కళాశాలల్లో, ఆఫీసులో ఎప్పుడూ చదువు, లేక పనే కాకుండా అప్పుడప్పుడూ కాసేపు హాస్యాన్ని పండిద్దాం. అలానే వారికి కూడా అవకాశం ఇవ్వాలి. మనమే ఎప్పుడూ జోకులు చెప్పడం కాకుండా వారితో చెప్పిస్తూ ఒక ఆహ్లాదకర వాతావరణం సృష్టించాలి.
- సమస్యలు కాసేపు పక్కన బెట్టి సోషల్ మీడియాలో జోకులు, సరదా వ్యాఖ్యలు పంచుకుందాం.. ఎప్పుడూ సమాజసేవేనా ! ఈ జోక్స్ డే రోజైనా ప్రశాంతంగా నవ్వు కుందాం. కొద్దిసేపు కష్టాలు మరిచి పోయేలా నవ్వుకుందాం.

సరదాగా కాసేపు..

- "పెళ్లి చూపుల్లో అమ్మాయిని వంట చేయడం వచ్చా అని అడిగా' అన్నాడు రవి
  "ఏమందేమిటి? ఆసక్తిగా అడిగాడు శ్రీను"
  "వంట చేయడం తెలియదట గానీ చేయిం చడం వచ్చట బాధగా చెప్పాడు రవి"
- "సార్ నిన్న మధ్యాహ్నం మన గుమాస్తా సుబ్బారావు పనిమానేసి టేబుల్ మీద పడుకుని నిదురపోయాడండీ" చెప్పాడు అటెండర్ అప్పారావు.
  మరి అప్పుడే ఎందుకు చెప్పలేదు? సీరి యస్ అయ్యాడు మేనేజర్.
  "చెబుదామనే వచ్చాను సార్! కానీ మీరు నిద్రపోతున్నారు." వినయంగా చెప్పాడు అప్పారావు.
- "ఏం చేస్తున్నారండీ అక్కడ?" అడిగింది కాంతం
  "మొక్కలకి నీళ్లు పోస్తున్నానే" చెప్పాడు సుబ్బారావు.
  "వర్షం పడుతోందిగా?"
  "పర్వాలేదు. గొడుగు పట్టుకునే పోస్తున్నా!" బదులిచ్చాడు సుబ్బారావు.

సమాంతర రేఖలు

సి.ఎస్.రాంబాబు

పావుగంట నుంచి తదేకంగా ఆ అక్వేరియంలో చేపల్నే చూస్తోంది రజని. ఒక్క రెండు చేపలు తప్ప మిగిలిన చేపలన్నీ తమ ఇష్టమొచ్చినట్టు కదులుతున్నాయి. రెండు చేపలు మాత్రమే ఒకదానినొకటి వెంబడిస్తున్నట్టు కదులుతున్నాయి. అందులో ఒక చేప ఇంకో చేపని స్వేచ్ఛగా కదలనివ్వడం లేదు. వెంటే ఉంటూ దాని దారికి అడ్డొస్తోంది. కచ్చితంగా ఇది మగ చేపే అయ్యుంటుంది అందుకే ఇలా అడ్డు తగుల్తోంది అనుకోకుండా ఉండలేకపోయింది రజని. ఆ అడ్డమొచ్చే చేపను చూస్తే రజనీకి ఆనంద్‌లా కనిపించాడు.



అరగంటక్రితం తామిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఇంకా కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది. వద్దనుకున్నా కూడా ఆ చేప ఆనంద్‌నే గుర్తు చేస్తోంది. ఏం తక్కువ, ఇద్దరికిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. హాయిగా అన్నీ అమర్చుకున్నారు. అప్పుడే పెళ్లై ఆరేళ్ళయిపోయింది. చిన్న పిల్లల్ని చూసినప్పుడల్లా తనకో వెలితి. తమింట్లో అలాంటి పాపో, బాబో తిరుగాడుతుంటే ఇల్లెంత కళకళలాడుతుంది అనుకుంది. తమ ఇల్లెప్పుడూ ధ్యాన మందిరంలా నిశ్శబ్దంగా కొంచెం భయపెడుతున్నట్లు కూడా ఉంటుంది. ఇంకా ఎన్నాళ్ళిలా హింస పడాలి అని అనుకోకుండా ఉండలేకపోయింది. ఒళ్లంతా గీరినట్లు ఆనంద్ మాటలు గుచ్చుతూనే ఉన్నాయి. ఏమన్నాడు ఆనంద్...

“రజనీ డియర్! నీ ఆదుర్దా నాకర్థమైంది. మన కింకా పిల్లలు లేరే అన్నది కదా నీ బాధ. పిల్లలుండాలి సరే. నీ పిల్లలకు అన్నిసౌకర్యాలు నువ్వివ్వగలగాలి కదా! దానికి మనం సంపాదించేది సరిపోతుందా? మనకి గేటెడ్ కమ్యూనిటీలో ఇల్లుండాలి. స్కూలుకు లక్ష రూపాయల ఫీజుకట్టే స్తోమతుండాలి. ఈలోగా మనం ప్రాజెక్ట్ అసోసియేట్ స్థాయి నుంచి టీం లీడర్లవ్వాలి. ఒక ఫారిన్ అసైన్‌మెంట్ సంపాదించాలి. అంతవరకు ఓపిక పట్టాలి! తప్పదు” లోపలి అసహనాన్ని నవ్వుతో కప్పేస్తూ విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. దానికి తనేం చెప్పింది “ఆనంద్, జీవితమంతా లెక్కలు వేసుకుంటూ బతకటమేనా? ఆఫీస్ తప్పిస్తే నీకు వేరే ప్రపంచం అక్కర్లేదా! ఇంకా ఎన్నాళ్ళు ఎండమావి వెనక పరిగెడతావు?”

“రజ్జూ డియర్, ఇవాళ నీ చుట్టాల్లో, స్నేహితుల్లో నీకో స్టేటస్ ఉంది. ఓ గుర్తింపు ఉంది. కాదనను. అది మాత్రమే సరిపోతుందా చెప్పు. ఇవాళ నీకో మంచి అపార్ట్‌మెంట్ ఉంది. వచ్చే సంవత్సరానికి అది పాతన్యూస్. మనం ఎప్పటికప్పుడు మనల్ని అప్‌గ్రేడ్ చేసుకుంటూ ఉంటేనే మనకా స్టేటస్సూ, గుర్తింపూ! ఇదో పరుగుపందెం రజనీ. దీన్ని ఆపటానికి వీల్లేదు. ఇలా పరిగెడుతూనే ఉండాలి. నువ్వు పరుగు ఆపావనుకో. నిన్ను మర్చిపోతుంది లోకం. కాబట్టి దానికి తగ్గట్టు ఓ ‘ఆడి’ కారుకు ప్లాన్ చేస్తున్నా. అలాగే మన యూ.ఎస్. ట్రిప్‌కు

నవ్యవీక్లి- నాటా సంయుక్త నిర్వహణలో బహుమతి పొందిన కథ

ప్రయత్నం చేస్తున్నా. ప్రస్తుతం ఇవే నా లక్ష్యాలు. సరేనా” మళ్ళీ అదే తెచ్చిపెట్టుకున్న నవ్వు ఆనంద్ మొహంలో..

“నీకేమైనా పిచ్చి పట్టిందా ఆనంద్” ఆవేశం ఆగలేదు తనకి.

“అవును రజనీ. నాది పిచ్చే. చిన్నప్పట్నించి అమెరికా వెళ్ళాలన్నదే నా పిచ్చి. కానీ మధ్య తరగతి విలువలు, మధ్య తరగతి జీవితం నాకా అవకాశాన్ని ఇవ్వలేదు. అమెరికా జీవితం సౌకర్యంగా, సుఖంగా ఉంటుందని నేను నీకు చెప్పాలా! నీకు తెలియదా! సరే ఆక్కడకు ఎలాగూ వెళ్ళలేకపోయాం కాబట్టి ఇక్కడ ఆ సౌకర్యాలు పొందాలనుకోవటంలో తప్పేమీ లేదు కదా! అవేవీ తీరకుండా పిల్లలు కావాలనుకోవటం కరక్టేనంటావా! నువ్వు చెప్పు పోనీ”.

ఆనంద్ మాటలకు హతాశురాలైంది తను. ఇంత పిచ్చిగా ఇంత మూర్ఖంగా ఆలోచిస్తాడనుకోలేదు తను. జీవితమంటే ఓ విల్లా, ఓ ఖరీదైన కారు, ఓ ఏసీ రూమ్ అనుకునే మొగుడికి జీవితమంటే వస్తువుల్ని కాదు, మనుషుల్ని ప్రేమించడం అని ఎలా చెప్పాలో తెలియలేదు తనకి.



“జీవితంలో నీ ప్రాధాన్యాలు వేరైనప్పుడు పెళ్ళెందుకు చేసుకున్నావ్ ఆనంద్”.

“పెళ్ళిచూపుల్లో నేను నీకు నచ్చాను. నాకు నీ జీతం నచ్చింది. కాబట్టి నో చెప్పటానికి కారణమేమీ కనబడలేదు” చిత్రంగా భుజాలెగరేస్తూ అన్నాడు ఆనంద్.

“మరి నేనూ, నా కుటుంబం అన్న నా కలను ఏం చేయమంటావు. మూటగట్టి మంచం కిందకు తోసేయమంటావా” ఉక్రోషంగా అడిగింది రజని.

“అది నీ సమస్య. సరే నాకు టైమవుతోంది. నువ్వు పిల్లల గురించి ఆలోచించడం తగ్గించి మన గురించి ఎక్కువ ఆలోచించు” మరో మాటకోసం ఎదురుచూడకుండా కార్ కీస్ తీసుకుని వెళ్ళిపోయాడు.

ఏతావాతా ఆనంద్ చెప్పేదేమిటంటే అతనికి నచ్చినట్టు తను బతకాలి. అతను ఆడమన్నట్టు ఆడాలి. అతను సర్కస్‌లో రింగ్ మాస్టర్. మరి తను, మచ్చిక చేసిన ఓ పెంపుడు జంతువు. మళ్ళీ ఆ అక్వేరియంలోకి చూసింది. ఈసారి ఆ రెండు చేపలు రెండుదారుల్లో కదులుతున్నాయి. అమ్మయ్య, రజనీకి కాస్త లోపలి ఇరుకేదో తగ్గినట్టనిపించింది.

రజనికి అత్తగారు, మామగారు గుర్తొచ్చారు. వాళ్ళెంతో సౌమ్యులు. వాళ్లకా ఇలాంటి కొడుకు!

అత్తగారు ఎప్పుడో చెప్పిన మాటలు రజని చెవిలో మారుమోగుతున్నాయి.

“రజనీ, ఆనంద్‌ది చిన్నప్పట్నించి దుందుడుకు స్వభావం. వాడితో వాదన పెట్టుకోవద్దు. వాడికి నచ్చినట్టు మనం ఉండాలేగానీ, మనకి నచ్చినట్టు వాడు ఉండడు. కొంచెం ఓపిక ఉండాలి మనకు”.

“ఓపిక.. హు! ఎంతవరకు... రోజులు... నెలలు సంవత్సరాలు గడిచిపోతున్నాయి. అయినా ఆనంద్‌లో మార్పు లేదు. తన జీవితం ఇలా గడిచి పోవలసిందేనా అనుకుంది రజని. అసలు తామిద్దరం ఉత్తర, దక్షిణ ధ్రువాలు. తనకి సింపుల్‌గా ఉంటే ఇష్టం. ఆనంద్‌కి అట్టహాసంగా, ఆర్భాటంగా ఉండటం అలవాటు”.

తనని తల్లిదండ్రులు అనాథ శరణాలయం నుంచి దత్తత తీసుకుని పెంచారు. ఆ విషయం ఎవరికీ తెలియదు. ఎంత ప్రేమగా చూసుకునే వారు తనని. తన దత్తత విషయం కూడా తన పెళ్లిముందర, అదీ తనకి మాత్రమే చెప్పింది తల్లి. ఎవరికీ చెప్పొద్దని ఒట్టు వేయించుకుంది.

“నీ కడుపున ఓ నలుసు పుడితే ఆ బుల్లి దానితో మేం ఆడుకోవాలే తల్లీ” అని అంటుండేది అమ్మ. బుడిబుడి నడకలతో ఓ చిన్నారి ఇంట్లో సందడి చేస్తే ఎంత బావుంటుందో. ఆనంద్‌కు పిల్లలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవటంలోనూ, కొత్త ఆస్తులు కూడబెట్టడంలోనూ ఉన్న శ్రద్ధ భార్య మనసు తెలుసుకోవటంలో లేదు. లాభం లేదు. అనురాధ దగ్గరకు వెళ్ళాలి అనుకుంది రజని.

మనశ్శాంతి కరువైనప్పుడల్లా అనురాధ గారి స్కూలుకు వెళ్ళడం అలవాటు రజనికి. అక్కడి పిల్లల నవ్వులు, కేరింతలు ఎంతో రిలీఫ్ ఇస్తాయి రజనికి. ఆవిడ నిజంగా గొప్పమనిషి అనుకుంది. డబ్బులు సంపాదించాలన్న ధ్యేయం కాకుండా పేదపిల్లల కోసం, అనాథ పిల్లల కోసం స్కూలు పెట్టింది ఆవిడ. చేస్తున్న మంచి ఉద్యోగం మానేసి పిల్లల కోసం ఇక్కడికి వచ్చేసింది. అవిడ భర్త కూడా భార్య నడుపుతున్న స్కూలుకు తనకు వీలయినంత సహాయం చేస్తాడు. ఎప్పుడూ విసుక్కోడు. వీలైనప్పుడల్లా స్కూలుకు వస్తూ ఉంటాడు. అదే మరి ఆనంద్! పోల్చుకోలేకుండా ఉండలేకపోయింది రజని.

ఆనంద్‌లో మార్పు ఎలా వస్తుంది? ఎప్పుడొస్తుంది. రజని ఆలోచనలు తెగటం లేదు. ఛ.. ఛ... ఇదేమిటి తను ఇంత బేలగా అయిపోయింది. సంబాళించుకునే ప్రయత్నం చేసింది రజని. ఇవ్వాళో, రేపో గైనకాలజిస్టు దగ్గరకు వెళ్ళాలి. ఇప్పుడు మాత్రం వెళుతూ, వెళుతూ అనురాధ గారి 'అమ్మ ఒడి'కి వెళ్ళాలి. స్కూలుకి కూడా ఎంత మంచి పేరు పెట్టింది ఆవిడ అనుకుంటూ రెడీ అవసాగింది రజని.

●●●

రజనీ స్కూటీ నడుపుతోంది కానీ ఆలోచనలన్నీ 'అమ్మఒడి' చుట్టూ తిరుగుతున్నాయి. 'అమ్మ ఒడి' మరీ పెద్ద స్కూలేమీ కాదు. ప్రస్తుతానికి ఏడోతరగతి వరకు పిల్లలున్నారు. అది ఆడపిల్లల స్కూలు. అక్కడున్న పిల్లల్లో ఎక్కువశాతం మంది చదివించే స్థోమత లేని కూలీనాలీ చేసుకునే కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళు. మిగిలిన వాళ్ళు తల్లీ, తండ్రీ ఇద్దరూ లేని పిల్లలు. ప్రతి సెక్షన్‌కు పాతికవరకు పిల్లలుంటారు. రజనికి అనురాధతో పరిచయమే గమ్మత్తుగా జరిగింది.

ఒకరోజు ఆఫీసులో స్కూటీ పార్క్ చేస్తుంటే, అనురాధ కూడా తన స్కూటీ పార్క్ చేస్తోంది. కొత్తగా చేరుతున్నదేమోనని అనుకుని ఆవిడను క్యాంటీన్‌కు తీసుకు వెళ్ళింది తను. కాఫీ తాగుతూ అనురాధ తన స్కూలు ప్రాజెక్ట్ గురించి చెప్పింది. ఆవిడ మాటలు తనకెంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఇంతకీ ఆ రోజు అనురాధ ఆఫీసుకు ఎందుకు వచ్చిందంటే, తన ప్రాజెక్టుకు ఎవరైనా సపోర్టుగా నిలుస్తారేమో అని అడగటం కోసం.

ఇలాంటివి చెప్పినప్పుడు ముందు అభినందించే వాళ్ళేగానీ, వెనక నిలబడే వాళ్ళు తక్కువ. తన ఆఫీసులో కూడా అదే జరిగింది. కానీ అనురాధలో నిరాశ కనపడలేదు. ఇది మామూలేనని చాలా తేలిగ్గా తీసుకుంది. తను మాత్రం ఆ ప్రాజెక్టుని సీరియస్‌గా తీసుకుంది. అలా ఏర్పడిన పరిచయంతో క్రమంగా తను 'అమ్మఒడి'కి దగ్గర అయింది. అనురాధ ఆ ప్రాజెక్టుని పదిమంది పిల్లలతో మొదలుపెట్టింది. విత్తనం మొలకెత్తి మొక్కై రెమ్మలు, ఆకులు పూలతో ఎలా కళకళలాడుతుందో, ఈ రోజు 'అమ్మఒడి'ని చూస్తే తామందరికీ అలాంటి తృప్తి. వారానికి రెండు మూడు రోజులన్నా ఆ స్కూలుకి వెళ్లి ఆ పిల్లల్ని చూడకపోతే మనసుకు తృప్తిగా ఉండదు.

రజని ఇలా ఆలోచనలో ఉండగానే 'అమ్మఒడి' స్కూలు వచ్చేసింది.

●●●

అపార్టుమెంట్లలో ఉన్న స్కూలులా కాకుండా పాత రోజుల నాటి బడిలా ఉంటుంది. 'అమ్మఒడి' ముందు కొంచెం ఖాళీగా ఉండి వెనక నాలుగు క్లాసురూములుంటాయి. పైన ఫస్టుఫ్లోర్‌లో మూడు క్లాసురూములు ఉంటాయి. ఇంకో రూములో టీచర్లు ఉంటారు. ముందున్న ఖాళీ స్థలంలో చామంతి, కనకాంబరం పూలచెట్లు విరబూస్తుంటాయి. ఈ పూల పరిమళం మనసులోని బాధను సగం తీసేస్తుంది అనుకుంది రజని. ఒకటే ఇబ్బంది, ఊరికి కొంచెం దూరం అనుకుంది. అక్కడ చదివే ఈ పిల్లలందరి ఖర్చుల్ని ఎవరో ఒకరు భరిస్తున్నారు. ఆ భరించే వాళ్ళు కూడా తమ పేరెక్కడా చెప్పొద్దని కోరుకునేవాళ్లే.

ప్రిన్సిపాల్ అన్న బోర్డున్న రూంలోకి వెళుతుండగానే అనురాధ ఎదురుగా ఒక ముసలాయన పాలుగారుతున్న ఇద్దరు ఆడపిల్లలతో కూర్చొని ఉన్నాడు. రజనీని చూడగానే అనురాధ "రా, రజనీ... ఈయన వెంకట్రామయ్యగారని మన స్కూలు గురించి తెలిసివచ్చారు. ఈ ఇద్దరాడపిల్లలు ఈయన మనవరాళ్ళు. కవలపిల్లలు. పేర్లు స్పందన, వందన. మన దగ్గర చేరుద్దామని వచ్చారు. "సార్! తను రజని అని మా వెల్‌విషర్. మాకెప్పుడూ అండగా నిలుస్తుంది".

తన గురించి అంత గొప్పగా చెప్పేసరికి సిగ్గుపడిపోయింది రజని. "మీక్కూడా నమస్కారమమ్మా" అంటూ రజనీని పలకరించి తన మనవరాళ్ళ కథ చెప్పటం మొదలు పెట్టాడు ఆ ముసలాయన.



అభిరుచులు ఏకమైతేనే కాలం, కాపురం కలిసొస్తాయి. కానీ ఈ కథలో ఆ భార్యాభర్తల లక్ష్యాలు వేరు వేరు. ఒకరి కల మరొకరికి ఆటంకంగా పరిణమించింది. ఇద్దరివీ ఉన్నత లక్ష్యాలే. కానీ పొంతన కుదరడం లేదు. ఒక ఒరలో అవి ఇమడటం లేదు. ఈ సందిగ్ధ స్థితిలో ఆ భార్యాభర్తలు ఏం చేశారు? ఒకరికోసం మరొకరు ఎడ్జస్ట్ అయ్యారా? లేక ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారా?

"నేనో స్కూలు టీచర్‌ని. నాకో కూతురు, కొడుకు. ఆరేళ్ళక్రితం నా కూతురు మమ్మల్ని కాదనుకుని తనకు ఇష్టమైన వాడిని చేసుకుంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న నా కూతురు ఆ పని చేయటం నేనూ, నా భార్యా తట్టుకోలేకపోయాం. నేను రాజీపడ్డాను కానీ నా భార్య, నా కొడుకు మాత్రం రాజీ పడలేకపోయారు. దాంతో నా కూతురునీ, అల్లుడినీ ఎప్పుడూ మా ఇంటికి పిలవలేకపోయాను. ఎలాంటి గాయానికైనా కాలం గొప్ప మందు వేస్తుందంటారు. నా భార్యలో కొంచెం మార్పు రావటం మొదలైంది. నా కొడుక్కే ఇంకా ఆ మందు పడలేదు. బండరాయిలా ఉండిపోయాడు. క్షమించండమ్మా నా కథతో మిమ్మల్ని విసిగిస్తున్నానేమో".

"ఫర్వాలేదు చెప్పండి" అనునయంగా అన్నది అనురాధ.

"నాలుగు నెలలక్రితం మా అమ్మాయి, అల్లుడు నా మనవరాళ్ళు కారులో వస్తుంటే యాక్సిడెంట్ జరిగింది. వాళ్ళు మా ఇంటికే వస్తున్నారు" ముసలాయన గొంతు పూడుకుపోయింది. కొద్ది క్షణాల తర్వాత ఆయనే తేరుకుని మళ్ళీ మొదలు పెట్టాడు.

"నేను, నా భార్య ఆస్పత్రిలో చివరి క్షణాలలో ఉన్న నా కూతురునీ, అల్లుడినీ చూశాం తల్లీ. పిల్లలిద్దర్నీ నా చేతిలో పెట్టి "నన్ను క్షమించు నాన్నా, వీళ్ళు నా గుర్తు నీకు" అని నా చేతుల్లో కన్ను మూసిందమ్మా. అల్లుడు అప్పటికే పోయాడు. ఇష్టంలేని పెళ్లి చేసుకున్నాడన్న కోపంతో అతని తరపు వాళ్ళు సమాచారమిచ్చినా రాలేదు. ఈ పిల్లలిద్దరూ అప్పటి నుంచి మాతోనే ఉన్నారు. అప్పటి వరకు కూతురి గురించిన దుఃఖాన్ని, బాధను ఎవరికీ చెప్పకుండా బడబాగ్నిలా గుండెల్లో దాచుకుంది నా భార్య. కూతురు పోయిన దుఃఖం భరించలేకపోయిందేమో రెండు నెలల్లోనే తను కూడా నన్ను ఒంటరినిచేసి వెళ్లిపోయిందమ్మా. ఈ పిల్లలంటే నా కొడుక్కి, నా కోడలుకి ద్వేషం. ఎలాగయినా వాళ్ళను వదిలించుకోమంటారు. వీళ్ళిద్దరూ బంగారు తల్లులమ్మా. వీళ్ళేం చేశార్రా అంటే వినడు. వీళ్ళే కావాలనుకుంటే వాళ్ళను తీసుకుని వెళ్ళిపో అంటాడు. నాకున్న ఆధారం నా పెన్షన్ ఒక్కటే. నాకున్న ఇంటిని ఎప్పుడో నా కొడుకు తన పేర రాయించుకున్నాడు. ఈ పిల్లల్ని తీసుకుని ఎటు వెళ్ళాలో అని మథనపడుతూ ఉంటే మీ స్కూలు పేరు చెప్పారు తల్లీ. నా మనవరాళ్ళిద్దరికీ ఓ దారి

చూపించమ్మా" ముసలాయన కండువాతో కళ్ళు తుడుచుకున్నాడు.

"మీరు పెద్దవారు వెంకట్రామయ్య గారు. మీ మనవరాళ్ళ గురించి మీరు వర్రీ అవకండి. వాళ్ళ చదువు బాధ్యతలు మేము తీసుకుంటాం. అయితే మీరు రోజూ తీసుకొచ్చి, తీసుకువెళ్ళటం చేయ గలరా అని సందేహిస్తున్నాను. కొంచెం టైం ఇవ్వండి. దాని గురించి కూడా ఆలోచిస్తాను. ముందరయితే క్లాసులో కూర్చోపెడతాం ఈ పిల్లలని" ధైర్యం చెబుతోంది అనురాధ.

"మా అనురాధగారు మీ మనవరాళ్ళని జాగ్రత్తగా చూసుకుంటారు. మీరేమీ కంగారు పడకండి" ఓదార్పుగా అంది రజని.

"వస్తానమ్మా మళ్ళీ సాయంత్రం వస్తాను" అంటూ లేచాడాయన.

అనురాధ, రజని ఆ పిల్లల వంక చూశారు తల్లి లేదు. తండ్రి లేడు. ఉన్న తాత ఒక్కడూ ఏమీ చేయలేక పోతున్నాడు అనుకున్నారిద్దరూ. బెరుకు బెరుకుగా చూస్తున్నారిద్దరూ. బ్యాగులోనుంచి రెండు చాక్లెట్ బార్లు తీసి ఆ పిల్లల చేతిలో పెట్టింది రజని. భయం భయంగా తీసుకున్నారిద్దరూ. చెరో పిల్ల చేయి పట్టుకుని క్లాసువైపు నడిపించారిద్దరూ.

"రజనీ ఈ పిల్లల విషయంలో నీ హెల్ప్ అవసరం నాకు" పిల్లల్ని క్లాసులో కూర్చోపెట్టిన తర్వాత అన్నది అనురాధ.

"ష్యూర్ మేడం. రేపు మళ్ళీ కలుస్తాను" అంటూ లేచింది.

•••

రజని టైం చూసుకుంది. ఎలాగూ ఆలస్యం అయింది. ఒకసారి గైనకాలజిస్టు దగ్గరకు వెళ్లి అటునుంచి ఆఫీసుకు వెళ్లాలని నిశ్చయించుకుంది. డాక్టర్‌ని కలవటానికి గంటకు పైగా వెయిట్ చేయాల్సి వచ్చింది.

"ఎలా ఉన్నారు రజనీ, ఏమన్నా తేడా కనిపిస్తోందా?" నవ్వుతూ అడిగింది డాక్టర్ వత్సల.

"తేడా లేదనే కదా నా బాధ. అందుకే గదా మీ దగ్గరకు వచ్చింది డాక్టర్. అసలు ఒక విషయం చెప్పండి. నేను బిడ్డను కనగలుగుతానా? లేదా?"

"అంత డైరెక్టుగా మెడ మీద కత్తి పెట్టినట్లు అడిగితే ఎలా రజని. ఒకసారి పరీక్ష చేయనీ నిన్ను" అంటూ పరీక్షలు చేసి స్కానింగ్ తీయించింది డాక్టర్ వత్సల.

"రజనీ నీ ఫాలోపియన్ ట్యూబ్స్ పాత్ కొంచెం మూసుకున్నట్లుగా ఉంది. అండం విడుదలకు కొంచెం సమస్యకావచ్చు. అయినా నీతో పాటు మీ వారు కూడా టెస్టులు చేయించుకోవాలి. కానీ నువ్వు ఇప్పటికే ముప్పై దాటావు. ఇక మీరు గర్భ నిరోధక పద్ధతులు ఆపేయటం మంచిది. పైగా నువ్వే పిల్స్ వాడుతున్నాను అని చెప్పావు ఇంతకు ముందు. ఇవన్నీ ఎక్కువకాలం వాడినప్పుడు ఎంతోకొంత దుష్ప్రభావం చూపిస్తాయి. నా ఉద్దేశంలో మీరిద్దరూ ఇంకా ఆలస్యం చేయటం మంచిది కాదు. ఆలస్యం అయినకొద్దీ గర్భం దాల్చడం కష్టం అవుతుంది" సూటిగా విషయం చెప్పేసింది డాక్టర్ వత్సల.

"థాంక్స్ డాక్టర్! మళ్ళీ వస్తాం ఇద్దరం" అంటూ లేచింది. దారి పొడుగునా రజనీని అనేక ఆలోచనలు తొలుస్తున్నాయి. అయితే ఆలోచనలకో రూపం ఇవ్వలేక పోతోంది.

•••

"ఆనంద్ ఒకసారి వస్తారా?" ఇంటర్‌కంలో బాస్ వాయిస్ మెసేజ్ విన్పించింది. టైం చూశాడు ఆనంద్. ఐదవుతోంది. 'ఏమిటి ఇప్పుడు పిలిచాడు' అనుకుంటూ లోపలికి వెళ్ళాడు.

"కూర్చోండి ఆనంద్. మీకో శుభవార్త" అన్నాడు ఆనంద్ బాస్ నీరజ్.

"ఏమిటి సర్" మెత్తగా మింగేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఛైర్‌లో కూర్చున్నాడు ఆనంద్.

"నీ నిజాయితీ, కష్టపడేతత్వం చూసి కంపెనీ నిన్ను 'అమెరికా' పంపుదామనుకుంటోంది".

"సర్" ఆనంద్‌కు ఇంకో మాటరాలేదు.

"మొదట ఓ సంవత్సరం పాటు కాంట్రాక్ట్ ఉంటుంది. కంపెనీ అవసరాలనుబట్టి మీ కాంట్రాక్టును పొడిగించే వీలుంది. పదిరోజుల పెయిడ్ హాలిడేతో కంపెనీ ఖర్చుల మీద అమెరికాలో మీరెక్కడయినా విహారయాత్ర చేయవచ్చు. అప్పుడు మీరు మీ భార్యని కూడా మీతో తీసుకెళ్ళొచ్చు".

"సర్, నేను నమ్మలేకపోతున్నాను. ఇది కల నిజమా అన్న అనుమానం వస్తోంది".

"ఇది మీరు సాధించిన కల ఆనంద్. ఇంకో విషయం మీరు 'యూఎస్'లో ఉంటూనే క్లయింట్ దేశాలకు వెళ్ళాల్సి ఉంటుంది. మీకు అంగీకారమే కదా".

"ష్యూర్ సర్, ఈ రోజు నేను జీవితంలో మర్చిపోలేని రోజు సర్".

"మీలాంటి సిన్సియర్ ఎంప్లాయీస్‌ని కంపెనీ ఎప్పుడూ గుర్తుంచుకుంటుంది ఆనంద్. మీ పాస్‌పోర్ట్ రెడీగా ఉంది కదా. వెంటనే వీసాకి అప్లయ్ చేయండి. ఆల్ ది బెస్ట్" అంటూ ఆనంద్‌కు షేక్ హ్యాండ్ ఇచ్చాడు బాస్ నీరజ్.

బాస్ రూంలో నుంచి బయటకు వచ్చిన ఆనంద్ ఆనందం పట్టలేకపోయాడు. అందరివంకా చూశాడు. ఇన్నాళ్ళూ వాళ్ళందరూ ఇష్టం వచ్చినట్లు కామెంట్ చేస్తూ ఉండేవారు. వాళ్ళందరు ఇప్పుడు ఆనంద్‌కు అల్పుల్లా అన్పించసాగారు. వాళ్ళ మధ్య తనో శిఖరంలాఉన్న ఫీలింగేదో కలగసాగింది. ఈ ఫీలింగ్ ఇప్పుడు ఆనంద్‌కు ఇంకా ఆనందాన్నిస్తోంది.

"రజనికి ఫోన్‌చేస్తే! ఏమన్నా ఫీలవుతుందా! కంగారు పడుతుందా! అసలే సెంటిమెంటల్ ఫూల్" ఆలోచించసాగాడు ఆనంద్.

ప్రేమలో పడిన అంజలి?

తెలుగమ్మాయి అంజలి కోలీవుడ్‌లో ఓ కుర్ర హీరోతో రొమాన్స్ చేస్తోందన్న పుకార్లు జోరుగా వినిపిస్తున్నాయి. గతంలో ఆ హీరోతో ఓ సినిమా చేసిన అంజలి మధ్యలో అతగాడికి కటీఫ్ చెప్పేసింది. ఇప్పుడు తిరిగి ఆ ప్రేమ చిగురించిందని అంటున్నారు. ఇప్పుడు తిరిగి ఇద్దరూ కలిసి ఓ సినిమా చేస్తున్నారట! ఈ సినిమా షూటింగ్ సమయంలోనే ఇద్దరి మధ్యా ప్రేమ తిరిగి మొదలైందని తమిళ తంబీలు అంటున్నారు. సినిమాల కన్నా ఇలాంటి పుకార్లతోనే మరోసారి అంజలి పేరు వార్తల్లో మారుమోగిపోతోందట! కోలీవుడ్‌లో మిగతా హీరోయిన్లు సినిమాల మీద దృష్టి పెడుతుంటే అంజలి దృష్టి రాంగ్ ట్రాక్‌లో వెడుతోందని ఆమె సన్నిహితులు సైతం చెబుతున్నారు. తెలుగులో ఆఫర్లు వచ్చినా చేయకపోవడానికి కారణం ఈ కుర్రహీరోతో ప్రేమలో ఉండడమేనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తనకు ఎవరితోనూ ప్రేమా దోమా లాంటివి లేవని అంజలి బుకాయిస్తున్నా ఆమె మాటలు ఎవరూ నమ్మడం లేదట!

"నో నో ఇది నా లైఫ్. ఇది జీవితంలో దొరికిన ఒకే ఒక గొప్ప అవకాశం. దీన్నెలా పోగొట్టుకుంటాను. అయితే రజనిని కాస్త తనదారిలోకి తీసుకురావాలి. అప్పుడు ఒప్పుకుంటుంది అనుకున్నాడు. ఫోన్‌కన్నా ముందు మెసేజ్ పెడితే బావుంటుందనుకుని మెసేజ్ పెట్టాడు. 'రజ్జూ డియర్ నీకో కళ్ళు చెదిరిపోయే వార్త చెప్పాలి. సాయంత్రం సిద్ధంగా ఉండు. మనం డిన్నర్‌కి బయటకు వెళుతున్నాం' అంటూ.

●●●

ఫోన్‌లో వాట్సప్ బీప్ విని ఆనంద్ ఇచ్చిన మెసేజ్ చదివింది రజని. అంత షాకింగ్ న్యూస్ ఏముంటుంది. ఎన్నో రోజులబట్టి ఎదురుచూస్తున్నాడు కాబట్టి ఆనంద్‌కు ఏదో 'ఫారిన్ ట్రిప్' తగిలి ఉంటుందనుకుంది రజని. పొద్దున్న చూసిన స్పందన, వందన గుర్తుకొచ్చారు రజనికి. దిగులుగా ఉన్న ముసలాయన గుర్తుకొచ్చాడు. ఈ వయసులో ఆయనకు ఈ కష్టాలేమిటి, తనేమీ చేయలేదా అనుకుంది. ఒక పక్క ఆనంద్ తన ఆనందం, తన కెరీర్ అంటూ తనదారి చూసుకుంటున్నాడు. తనకు పిల్లలు పుడతారన్న ఆశ పూర్తిగా అడుగంటి పోతోంది. ఆనంద్ పిల్లలు కావాలి అనుకునేనాటికి అప్పటికి సమయం మించిపోవచ్చు.

షాకింగ్ న్యూస్ చెప్పబోతున్నాను సిద్ధంగా ఉండు".

●●●

'ఇటు వైపు సర్' అంటూ లాబీ మేనేజర్ దారి చూపుతుంటే ఓ ఖరీదైన రెస్టారెంట్లో అడుగుపెట్టారు ఆనంద్, రజనీ. జనం పల్చగా ఉన్నారు. పింగాణీ ప్లేట్లు చేసే వింతధ్వనులు దూరంగా మృదువుగా విన్పిస్తున్న సంగీతంతో మిళితమై పోయాయి. ఆనంద్‌కు బాగా పరిచయమున్న హోటల్‌లా ఉంది. అవసరమైన దానికన్నా ఎక్కువ మర్యాద చేస్తున్నారు.

స్టీవార్డ్ సూప్‌బౌల్స్‌ని టేబుల్‌మీద పెట్టేసి స్టార్టర్స్ వడ్డించేసిన తర్వాత సూటిగా విషయంలోకి వచ్చింది రజని.

"ఆనంద్ నువ్వు మెసేజ్ పెట్టావు. నేనో మెసేజ్ పెట్టాను. ముందర నువ్వంత ఆత్రంగా చెబుదామనుకున్న విషయం వినాలని ఉంది. తర్వాతే నేను చెప్పే విషయం".

"నేనిప్పుడు చెప్పే విషయం చాలా సంవత్సరాల నుంచి నేను ఎదురుచూస్తున్నదే. ఈ పాటికి నువ్వు ఊహించి ఉంటావు. వచ్చేనెల నుంచి నా కలల సామ్రాజ్యమైన అమెరికాలో పనిచెయ్యమన్నారు నన్ను. అక్కడే పోస్టింగ్ ఇచ్చారు. జీతం, అలవెన్సులు, పెయిడ్ హాలిడే వగైరా వగైరా.. అన్నీ

నాకు కొంచెం గైనిక్ సమస్య కూడా ఉంది. నిన్ను కూడా తీసుకురమ్మని అంటోంది. ఇద్దరితో కలిసి మాట్లాడతాను అంది".

"రజనీ, పిల్లల గురించి నా అభిప్రాయం నీకు ముందే చెప్పాను" ఆనంద్ గొంతులో మళ్ళీ అసహనం మొదలయింది.

"యస్ ఆనంద్. నేను చెప్పేది అదే. నేను పిల్లల్ని కని పెంచగలను అన్న నమ్మకం ఇప్పుడు నాక్కూడాలేదు. అయినా ఇద్దరు పిల్లలకు కొత్త జీవితం ఇవ్వగలిగితే, అంతకు మించిన ఆనందం ఇంకేముంటుంది ఆనంద్. ఇన్నాళ్ళూ నీకు చెప్పని విషయం ఒకటుంది. అది వింటే నీకు కోపం కూడా రావచ్చు" ఒక్కక్షణం ఆనంద్‌కు రజని ఏం చెబుతుందో అర్థం కాలేదు.

"రజనీ ఏమంటున్నావు నువ్వు" ఈసారి ఆనంద్ గొంతులో ఆత్రుత లాంటిది తొంగి చూసింది.

"ఐయాం సారీ ఆనంద్. ఇన్నాళ్ళు నీకు చెప్పలేదు. నేనో అనాథను. మా అమ్మ, నాన్న నన్ను పెంచి పెద్ద చేశారు. ఈ విషయం నాకే చాలా ఆలస్యంగా తెలిసింది. అత్తయ్యగారికి మా అమ్మ చెప్పింది. ఆవిడకు ముందు కోపం వచ్చినా తర్వాత అర్థం చేసుకున్నారు. ఈ విషయాన్ని నీకు మాత్రం చెప్పొద్దన్నారు. కానీ ఇప్పుడు చెప్పక తప్పలేదు".

రజని మాటలు ఆనంద్‌ను కొరడా దెబ్బల్లా తాకాయి. ఆ తర్వాత కోపం పెల్లుబికింది. ఒక్క క్షణం ఆలోచించాడు. ఇప్పుడు రజనీ గతంకన్నా ఈ ఇద్దరు పిల్లల్ని పెంచుకోవటం ఎలా అన్నది పెద్ద సమస్య. అందుకే అనునయంగా చెప్పే ప్రయత్నం చేశాడు.

"రజనీ, ఇద్దరు పిల్లల్ని పెంచడం అంత సులభమైన విషయం కాదు. కావాలంటే ఏదైనా డబ్బు సహాయం చెయ్. మన ఆలోచనలు మనకున్నాయి కదా! ముందు నేను అమెరికా వెళతాను తర్వాత నువ్వు వచ్చేస్తావు".

ఆనంద్ ఎలా మాట్లాడతాడనుకుందో అలాగే మాట్లాడాడు అనుకుంది రజని.



తన జీవితాన్ని తను కోరుకున్నట్టుగా గడపలేదా! పొద్దున ఆ ఇద్దరు పిల్లల్ని ఎక్కడుంచాలా అని ఆలోచిస్తోంది అనురాధ. ఎన్నిరోజులని ఆవిడ వాళ్ళ బాధ్యత తీసుకోగలుగుతుంది. ఆ పిల్లల బాధ్యత తనెందుకు తీసుకోకూడదు. ఇందులో పిల్లలు కావాలనుకునే తన స్వార్థమూ ఉంది. ఆ పిల్లలకు ఒక ఆసరా ఇచ్చినట్టవుతుంది. మరి ఆనంద్ ఆ పిల్లల్ని పెంచి పెద్దచేస్తానంటే ఒప్పుకుంటాడా! ఒప్పుకోకపోతే తనేం చేయాలి?

జీవితంలో ఒక నిర్ణయం తీసుకోవలసిన సమయం వచ్చింది అనుకుంది. ఆనంద్ తనకు ఇష్టమైనట్టు అతని జీవితాన్ని మలచుకుంటుంటే తన జీవితం మీద తనకు హక్కులేదా! ఆ ఇద్దరి పిల్లల జీవితాన్ని కాపాడేందుకు తనెందుకు ముందుకు రాకూడదు! ఆక్వేరియంలోని చేపలు గుర్తుకొచ్చాయి రజనికి. ఆ క్షణంలో ఓ స్థిర నిర్ణయానికి వచ్చింది! ఆ పిల్లలిద్దరూ తనింట్లో ఉంటారు. వాళ్ళకో మంచి భవిష్యత్తునిస్తుంది. అవును వాళ్ళు తన రేపటి వెలుగు!

అనురాధకు తన నిర్ణయం చెప్పాలని ఫోన్ తీసి డయల్ చెయ్యబోయింది. అంతకన్నాముందు ఇంకో పని చెయ్యాలి అనుకుంది రజని. వెంటనే ఆనంద్‌కు మెసేజ్ పెట్టింది. "ఆనంద్ నేనూ నీకో

ఎక్కువే. బాస్ చెప్పేదేమిటంటే ఇదేమీ లిమిటెడ్ పీరియడ్ ఆఫర్ కాదు. ఎంతకాలం ఉంటాననేది నా ఇష్టం. క్లయింట్ కంట్రీస్‌కి కూడా నన్నే వెళ్ళమంటున్నారు. ముందు నేను వెళతాను. మేఘాల మధ్య తేలిపోతున్నట్టుంది రజ్జూ" ఆనంద్ కళ్ళలో వెలుగులు విరజిమ్ముతున్నాయి.

"ఇక ఇపుడు నువ్వు చెప్పు".

"నీ కలల ప్రపంచం లాంటిదే నాది కూడా ఆనంద్. అనురాధ గారి 'అమ్మఒడి' తెలుసుగా. ఇవాళ పొద్దున్నే వెళ్లాను. అక్కడో పెద్దాయన ఇద్దరు ఆడపిల్లల్ని తీసుకువచ్చాడు. వాళ్ళు ఆయన మనవరాళ్ళు, కవలపిల్లలు. ఆయనదో విషాదగాథ. అదంతా నీకు చెప్పను కానీ, ఆ పిల్లలకు తల్లీ దండ్రీ లేరు. మేనమామ అంటే ఆయన కొడుకు వాళ్ళను వదిలించుకోమంటున్నాడు. ఆ పిల్లలు ఎంత ముద్దుగా ఉన్నారో! నాకో ఆలోచన వచ్చింది. వాళ్ళ పోషణ చదువు బాధ్యత మనమెందుకు తీసుకోకూడదు?

"నీకేమయినా పిచ్చిపట్టిందా రజనీ" రజనీ చెప్పిన వార్త ఆనంద్‌ని నేలమీదకు తెచ్చింది.

"తప్పేముంది ఆనంద్. ఇవాళ డాక్టర్ వత్సల దగ్గరకు వెళ్ళాను. ఆవిడ పిల్లలు కావాలనుకుంటే ఇంకా ఆలస్యం చెయ్యొద్దు అంది. దానికి తోడు

"ఆనంద్, మొదటి నుంచి మనవి కలవని దారులు. అయినా కలిసినట్టు నటిస్తూ బ్రతికాం. ఇప్పుడు మనిద్దరి లక్ష్యాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమెరికా దేశపు అణువుగా మారటం నీకు అత్యంత ఇష్టమైన విషయం. ఇద్దరు పిల్లలకి ఒక అందమైన జీవితాన్నివ్వటం ఇక నుంచి నా లక్ష్యం. ఎవరి బాటలో వారు సాగుదాం. ఆల్ ది బెస్ట్" ఇదే తన నిర్ణయమన్నట్టు రజని చెప్పేసింది.

అప్పటికి వాళ్ళ డిన్నర్ పూర్తయ్యింది. ఆనంద్ బిల్లు చెల్లించాడు. మిగిలిన నోట్లు బిల్లు ఫోల్డర్‌లో ఉంచాడు. రజని టైం చూసుకుంటూ లేచింది. ఇప్పుడామె మనసు ప్రశాంతంగా ఉంది. ఇంకా చెప్పాలంటే హాయిగా ఉంది. భారం వదిలించుకున్నట్టుగా ఉంది.

రజని అంత కచ్చితంగా మాట్లాడుతుందని ఊహించని ఆనంద్ డైలమాలో పడ్డాడు. రజని కోరినట్టు ఆ ఇద్దరు పిల్లల ఆలనాపాలనా చూడటానికి అంగీకారం చెప్పాలా? వద్దా? తను అక్కడ. రజని ఇక్కడ... ఇలా సాగాల్సిందేనా తమ జీవితాలు! సమాంతర రేఖల్లాగా తమ జీవితాలు కూడా సమాంతరమేనా?...

ఈ ప్రశ్నకు బహుశా కాలమే సమాధానం చెబుతుందేమో!

సెల్: 94904 01005

సురభి

బొమ్మాళి

ఈ అమ్మడు నిజంగా ఓ 'బొమ్మా'ళే! అందుకే తన శరీరాన్నే ఒక కాన్వాస్‌గా మార్చేసుకుంది. కబడ్డీలీగ్, ఐపీఎల్, క్రికెట్ వరల్డ్‌కప్, సాకర్... ఇలా ఏ ఆట జరుగుతున్నా ప్రాంతీయాభిమానం, దేశాభిమానం పెయింటింగ్ రూపంలో దర్శనమిస్తూనే ఉంటుంది. శరీరభాగాలపై జాతీయపతాకాలు, దేశ చిహ్నాలను పెయింట్ చేసుకోవటం చూస్తూనే ఉంటాం. అలాంటప్పుడే పిచ్చి ముదిరి పాకాన పడింది అనుకోవడం పరిపాటి. కానీ ఈ అమ్మడికి మాత్రం కామిక్ క్యారెక్టర్లంటే తెగ ఇష్టమంట! ఎంత ఇష్టమంటే, ఆమే ఓ కామిక్ క్యారెక్టర్‌లా మారిపోతుంది, పెయింటింగ్ వేసుకుని మరీ!

కెనడాలోని ఆల్బెర్టాకి చెందిన కేఫైక్ కామిక్ క్యారెక్టర్లంటే ప్రాణం ఇచ్చేస్తుంది. ఎంతలా అంటే వారానికి రెండుసార్లు తన దేహమంతా కామిక్ క్యారెక్టర్‌లా పెయింటింగ్ వేసుకుంటుంది. మామూలుగా కాదు, అచ్చంగా కామిక్ క్యారెక్టరే దిగి వచ్చిందా! అన్నట్టుంటుంది. ఆమెని చూస్తే ఎవరైనా సరే బొమ్మే అనుకోవాల్సిందే! ఇలా పెయింటింగ్ వేసుకోవడానికి పైన 15 గంటలు సమయం వెచ్చిస్తోందట. పెయింటింగ్ వేసుకున్నాక ఎంచక్కా ఫోటోలు, వీడియోలు తీసుకుని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసేస్తుంది. విచిత్రంగా ఉంది కదూ ఈ అమ్మడి అభిమానం!

ఆ దేవుడికి పూజ నేరం!

పిల్లలకు భయం వేస్తే ఆంజనేయస్వామిని తలచుకోమంటారు. ఆంజనేయ విగ్రహం, ఆంజనేయ ఆలయం దుష్టశక్తుల నుంచి ఊరిని రక్షిస్తుందని భావిస్తారు. అంతెందుకు, హనుమంతుని ఆలయం లేని ఊరు ఉండదంటే అతిశయోక్తికాదు. కానీ ఈ గ్రామంలో మాత్రం మీకు ఎక్కడా ఆంజనేయుడి గుడి కాదుకదా, ఆ పేరు కూడా వినబడదు.

ఉత్తరాఖండ్‌లోని ద్రోణగిరి గ్రామంలో భూటియా అనే జాతి నివసిస్తుంది. వీళ్ళంతా ఆంజనేయుడిని తప్ప మిగతా దేవుళ్ళందరినీ పూజిస్తారు! ఒకవేళ గ్రామంలో ఎవరైనా ఆ స్వామి పేరు పలికినా, పూజించినా నేరంగా పరిగణిస్తారు. గ్రామం నుంచి వాళ్ళని బహిష్కరిస్తారు. ఎందుకని అడిగితే ఓ కథ చెబుతారు గ్రామస్థులు.

త్రేతాయుగంలో రామరావణయుద్ధ సమయంలో మూర్ఛిల్లిన లక్ష్మణుని కోసం హనుమంతుడు తెచ్చిన సంజీవని పర్వతం ఈ ద్రోణగిరి ప్రదేశంలోనే ఉండేదట. వాళ్ళు పూజించే ఈ గుట్టను హనుమంతుడు తీసుకెళ్ళేసరికి అతనిపై ఈ ఊరివాళ్ళు ద్వేషం పెంచుకున్నారు. అందుకే ఆంజనేయుడంటేనే వారికి మంట. అదీ కథ! మొత్తానికి ధైర్యానికి ప్రతీకైన హనుమాన్‌జీని ద్వేషించే గ్రామం కూడా ఉంది!

సాహస డింభకులు

కింద ఫోటో చూశారుగా! వాళ్ళేదో ట్రెక్కింగో, సాహసయాత్రో చేయట్లేదు. చక్కగా నిచ్చెన పట్టుకుని కొండ ఎక్కుతున్నది దేనికో తెలిస్తే, ఇంకా అలాంటి ఊళ్ళు ఉన్నాయా? అని ఆశ్చర్యపోతారు. ఇంతకీ వాళ్ళు అంతలా కష్టపడి కొండలు ఎక్కుతున్నది బడికి వెళ్ళడానికట!

చైనాలోని సిచువాన్ ప్రావిన్స్, అతులూర్ గ్రామంలో పిల్లలు స్కూలుకు వెళ్ళటానికి 800 మీటర్ల కొండను ఎక్కాలి. ఆ గ్రామంలో దాదాపు 15 మంది పిల్లలు ఈ విధంగా ఊరి నుంచి స్కూలుకి, స్కూలు నుంచి తిరిగి ఇంటికి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదట. పిల్లలు ఈ విధంగా నిచ్చెన ఎక్కుతూ తీసిన ఫోటోలు, వీడియోలు మీడియాలో రావడంతో ప్రభుత్వం కూడా దిగివచ్చింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వ అధికారులు అక్కడివారికి భరోసా ఇచ్చారు. ఎటువంటి భద్రత లేకుండా గ్రామ ప్రజలే అమర్చుకున్న చెక్క నిచ్చెనలను పట్టుకుని స్కూలుకు వెడుతున్న ఆ పిల్లలకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే!





పంట పొలాలే ఆర్ట్ డిజైన్లు

పై ఫోటో చూస్తే పంట పొలాల్లో పెయింటింగ్ ఎవరు, ఎలా వేశారబ్బా? అనుకుంటున్నారు కదా! కానీ ఇది ఏ పెయింటింగో కాదు. రంగు రంగుల వరి విత్తనాలను రకరకాల డిజైన్లలో నాటి పంటలు పెంచి ఆర్ట్ క్రియేట్ చేశారు జపాన్‌లోని ఒక గ్రామానికి చెందిన రైతులు. ఆ విధంగా తమ గ్రామాన్ని ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు! రకరకాల డిజైన్లలో ఏపుగా పెరిగిన పంట పొలాలను చూసేందుకు లక్షలాదిమంది పర్యాటకులు ఆ గ్రామానికి క్యూ కట్టారు.

జపాన్‌లోని హిరోసాకి నగరానికి దగ్గరలో ఉన్న ఇనకడేట్ గ్రామంలో వరి విత్తనాలతో వివిధ డిజైన్‌లలో ఆర్ట్ సందర్శకులను కట్టిపడేస్తోంది. ఈ గ్రామ రైతులు ప్రతి యేటా వరి పంటను పండిస్తూ, దానిలోనే వారి కళా నైపుణ్యాన్ని కనబరుస్తారు. పొలాల్లో రంగు విత్తనాలతో మొలకలు పెంచి వాటిని రకరకాల రూపాలతో నాట్లు వేస్తారు. మొలకలు పెరిగి పంట అయ్యాక వారి కళారూపం బైటపడుతుంది. ఇలా పెంచిన పంటలను చూడటానికి ఏటా దాదాపు రెండు లక్షలమంది పర్యాటకులు వస్తున్నారట!

-నర్మద వాసిరెడ్డి

మదరిండియా 3

-వక్కంతం సూర్యనారాయణరావ్, సెల్:98662 67287

ఏకాంత్ రెప్పలెత్తి చూశాడు. 'ఎందుకు?' అంటున్నాయి అతని కళ్ళు.

"నేను మీ ఇంటికి రాను. నువ్వే మా ఇంటికి రావాలి!" అని రంజన అంటే నిరాకరించే అవకాశం నీకు ఉండదు! నువ్వు వెళ్ళాలనుకుంటే ఆపే శక్తి నాకు లేదు!"

"అయాం సారీ అమ్మా..."



"సారీలు 'సారో'ని దూరం చేయలేవు ఏకాంత్. నీ జీవితం నిన్ను నిర్దేశిస్తోంది. నీ జీవితాన్ని నిర్దేశించే అధికారం నా భర్తతో బాటే వెళ్ళిపోయాయి. నా భర్తను నాకు దూరం చేసిన వ్యక్తి కూతుర్ని కోడలిగా తెచ్చుకున్నందుకు లోకం కొన్ని కంఠాలగుండా నన్ను అపహాస్యం చేసింది. 'ముగ్గురు కొడుకుల్ని పెట్టుకుని, ఒక కొడుకుని కోటీశ్వరుడి ఇంటికి ఇల్లరికం పంపకుండా మూర్ఖంగా ప్రవర్తిస్తోంది, ఆ నిగమ' అంటూ ఆ కంఠాలతోటే విమర్శించి అపహాస్యం చేస్తుంది లోకం..?"

"ఎగైన్ సారీ అమ్మా... ఇల్లరికం అనేది ఒక చిన్న హోదా అవుతుంది కానీ, అది నన్ను నీకు దూరం చేయదమ్మా... మనసు పాడు చేసుకోకమ్మా..."

"అన్నాయ్... నిన్ను ఇల్లరికం రమ్మంటారని అమ్మ నాతో ఎప్పుడో అంది. అమ్మ ఈ షాక్‌కి సిద్ధపడే ఉంది...." అంత సేపూ మౌనంగా వున్న నిశిత అంది.

"అయితే... నేను... ఇల్లరికం.. వెళ్ళడం... ఐ మీన్ ఇల్లరికం అల్లుడు కావడం అమ్మకు ఇష్టమేనా చెల్లాయ్?" ఏకాంత్ కంఠంలో ఆశ గంటలా మోగింది.

"సమాధానం నేను చెప్తాను, ఏకాంత్!" నిగమ కల్పించుకుంటూ అంది.

"కన్నకూతుర్ని అత్తవారింటికి పంపడం ఆడదాని మాతృత్వానికి ఒక పరీక్ష. అంది వచ్చిన కొడుకుని ఇల్లరికం పేరుతో అత్తవారింటికి

పంపడం ఒక శాపం!"

"అమ్మా..."

"నీ ఇష్టాన్ని నా ఇష్టంగా మలచుకోవాల్సిన పరిస్థితి, నాయనా ఇది. నువ్వు ఇల్లరికం వెళ్తావు.." నిగమ గాద్గదికంగా అంది.

"నొప్పిస్తున్నానా అమ్మా?"

"లేదు... నాయనా... ఇది వియోగవేదన...తాత్కాలిక నిర్వేదం..." నిగమ మెల్లగా అంది.

ఏకాంత్ పైకి లేచాడు. "ఆఫీసుకి వెళ్ళాలి. వస్తానమ్మా..." అంటూ గుమ్మం వైపు నడిచాడు.

"అమ్మా... ఇల్లరికం వెళ్తే అన్నయ్య మనకు పర్మనెంటుగా దూరమైపోతాడా?" నిశిత అమాయకంగా అడిగింది.

నిగమ నిట్టూర్చింది. "శారీరకంగా... దూరమవుతాడమ్మా. మానసికంగా చేరువగా వుంటే చాలు; అదే పది వేలు!"

"నాకు తెలుసు... అన్నయ్య మళ్ళీ నిన్ను నొప్పించాడు!" నిశిత చాడీ చెప్తున్నట్టు అంది.

నిగమ చిరునవ్వు నవ్వింది. కడుపులో ఉన్నప్పుడు చిన్ని చిన్ని పాదాలతో తన్నుతూ సున్నితంగా నొప్పించాడు. పెరిగి పెద్దవాడయ్యాక తన ప్రవర్తనతో, నిర్ణయాలతో మనసుని నొప్పిస్తున్నాడు. పురిటి నొప్పులతో మొదలయ్యే మాతృత్వానికి ఎప్పుడూ నొప్పులే! అప్పుడూ, ఇప్పుడూ ఎప్పుడూ నొప్పులే!

•••

గతంలో కూరుకుపోయిన ఏకాంత్‌ని, తలుపుతట్టిన చప్పుడు వర్తమానంలోకి లాగింది. నిద్రలో నడుస్తున్న వాడిలా నడుస్తూ వెళ్ళి, తలుపు తెరిచాడు. ఎదురుగా గుమ్మంలో రంజన. ఆమెచేతిలో కాఫీ కప్పు. అలసిపోయినట్టున్న భర్త ముఖంలోకి రంజన జాలిగా చూసింది.

"ఏకాంత్, పేపర్లు చిలవలు పలవలు అల్లి రాస్తాయి. ఆ వార్తలు చూసి ఆందోళన పడటం వేస్ట్. నేను వెళ్ళి అత్తయ్యతో..."

అడ్డంగా ఊగుతున్న ఏకాంత్ తలను చూస్తూ ఆపేసింది రంజన.

"రంజనా.. ఆలోచిస్తున్నాను.. నన్ను ఆలోచించనీ.. నిర్ణయం ఇద్దరం కలిసి తీసుకుందాం.." అంటూ ఆమె చేతిలో కాఫీ కప్పు అందుకుని, తలుపు మూసి, గొళ్ళెం పెట్టేశాడు ఏకాంత్. కిటికీ అద్దం గుండా బైటికి చూస్తూ, కాఫీ చప్పరించ సాగాడు. కాఫీ చాలా చేదుగా ఉంది. ఎందుకో. సగం ఖాళీ అయిన కప్పుని టేబుల్ మీదపెట్టి, పడక్కుర్చీలో కూచున్నాడు. గతం ఏదో సలుపు పుట్టిస్తూ అతన్ని తనలోకి లాగుతోంది. 'ఇల్లరికం అల్లుడు' అని అనిపించుకున్నాక... రోజూ అమ్మ దగ్గరకు వెళ్ళలేకపోయాడు తను. ఇల్లరికం షాకు నుండి అమ్మ కోలుకుంటోందని పిస్తున్న తరుణంలో మరో అవాంతరం వచ్చి పడింది. నిజం చెప్పాలంటే అది అవాంతరం కాదు,

జరిగిన కథ

భర్త మరణించినప్పటికీ అతడి స్ఫూర్తితో ముగ్గురు కొడుకుల్నీ, కూతుర్నీ నీతీ నిజాయితీలు రంగరించి పెంచి పెద్ద చేస్తుంది నిగమ. కానీ అత్యున్నత స్థానాలకు ఎదిగిన తర్వాత ఆ కొడుకులు తండ్రి స్ఫూర్తికి భిన్నంగా అక్రమార్కులుగా మారిపోతారు. దాంతో కన్న కొడుకులకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తుందా కన్నతల్లి. ఫ్లాష్‌బ్యాక్‌లో కెళితే, తన తండ్రిని చంపిన రాజవర్మ కూతురు రంజనను ప్రేమిస్తాడు నిగమ పెద్ద కొడుకు ఏకాంత్. తండ్రి తప్పు చేస్తే కూతుర్ని తిరస్కరించడం సరికాదని తల్లిని ఒప్పించి రంజనను పెళ్ళి చేసుకుని ఇల్లరికానికి వెళ్ళేందుకు సిద్ధమవుతాడు ఏకాంత్.

ఆ తర్వాత......



ఏకాంత్‌కి తన స్నేహితుణ్ణి పరిచయం చేశాడు మామగారు. అపారమైన ఆస్తి పాస్తులున్న ఆ వ్యక్తికి ఏకాంత్ దత్త పుత్రుడుగా వెళ్ళాలి! అదీ అసలు ప్రతిపాదన. అది విని ఉలిక్కిపడ్డాడతను. ఇల్లరికానికే అంగీకరించని తల్లి దత్తతకు ఎలా అంగీకరిస్తుంది! ఆ ఆలోచన రాగానే సందిగ్ధంలో పడ్డాడు ఏకాంత్. తల్లిని అడిగి చెబుతానన్నాడు. అతని తల్లి ఈ ప్రతిపాదనకు ఎలా స్పందించింది?

అదృష్టం...

ఆరోజు తను ఎక్కడో క్యాంపులో ఉన్నాడు. ఉన్నపళాన రమ్మంటూ మామ రాజవర్మగారు ఫోన్ చేశారు. ఆయన పిలుపు అండర్‌లైన్ చేస్తూ రంజన ఫోన్‌కాల్. ఏదో చాలా, చాలా ముఖ్యమైన పని అని వాళ్ళ కంఠస్వరాలు చెప్పకనే చెప్తున్నాయి. ఫోన్‌లో చెప్పే విషయం కాదంది రంజన. తాను హుటాహుటిన బయల్దేరి రంజన ఇంటికి చేరుకున్నాడు. ఆ రోజు గుర్తు చేసుకుంటూ, ఏకాంత్ కళ్ళు మూసుకున్నాడు. గతం సుడిగుండంలా అతన్ని తనలోకి లాక్కుంది...

●●●

ఏకాంత్ మామగారి గదిలోకి అడుగుపెట్టి ఆగాడు. రాజవర్మతో బాటు మరో పెద్దమనిషి ఎవరో ఉన్నారు.

"రా, ఏకాంత్! రా!" రాజవర్మ ఆహ్వానించాడు. "ఈయన గోపాలం బావగారు. బావగారంటే మీ అత్తయ్యకు అన్నయ్య వరసయ్యే దూరపుబంధువు. బంధుత్వం దూరమైనా మన కుటుంబానికి చాలా దగ్గరే. మన సలహా లేకుండా ఏ పనీ చేయరు.."

"నమస్కారమండీ..." ఏకాంత్ గోపాలంగారికి నమస్కరిస్తూ అన్నాడు.

"రా, నాయనా... కూర్చో. నిన్ను పెళ్ళిలో చూశాను. మళ్ళీ ఇప్పుడే చూడ్డం. నువ్వు అల్లుడిగా లభించడం తన అదృష్టం అంటూ ఉంటారు మీ మావయ్య".

ఏకాంత్ మర్యాదపూర్వకంగా చిన్నగా నవ్వాడు.

గోపాలం బావగారు బంగారుస్పూను చేత్తో పట్టుకుని పుట్టారు ఏకాంత్. వందెకరాల కొబ్బరితోట, వందెకరాల మామిడి తోట.. స్వగ్రామంలో అనుకో. ఇక్కడ అరడజను కమర్షియల్ కాంప్లెక్సులున్నాయి. 'గోల్డెన్‌నెస్ట్' ఫైవ్‌స్టార్ హోటలుంది చూడు ఆ బిల్డింగు బావగారిదే. అద్దెకిచ్చారు. టూకీగా చెప్పాను. వివరాల్లోకెళ్తే బావగారి ఆస్తుల చిట్టా పెద్దదే!" రాజవర్మ హుషారుగా అన్నాడు.

"ఐసీ..." ఏకాంత్ అన్నాడు.

"బావగారు ఒక ప్రతిపాదనతో వచ్చారు. నీతో చర్చించి నిర్ణయం తీసుకుందామనుకున్నా..."

"జాయింటు వెంచరేదైనా ప్లాన్ చేస్తున్నారా?" ఏకాంత్ అడిగాడు.

"వెంచర్లూ, అడ్వెంచర్లూ అన్నీ అయిపోయాయి నాయనా! ఈ వయసులో పొడిగింపులేవీ వద్దనుకున్నా... ఎనభై దగ్గర పడుతోంది!" గోపాలం నవ్వుతూ అన్నాడు.

ఏకాంత్ ఆయన్ని పరిశీలనగా చూశాడు. పంచె, జుబ్బాలో ఉన్న భారీ విగ్రహం. ముడతలు చాలా తక్కువగా ఉన్న గుండ్రటి ముఖం. బట్టతల. వెడల్పాటి నుదురు... ఎనభై దగ్గర పడుతోంది! అయినా చూడ్డానికి అరవై యేళ్ళ వ్యక్తిలా వున్నాడు.

"విషయం ఏమిటంటే ఏకాంత్... బావగారికి భగవంతుడు అన్నీ ఇచ్చాడు. ఆస్తి, ఆరోగ్యం, ఐశ్వర్యం..అన్నీ. ఒక్కటే ఇవ్వలేదు. బావగారికి పిల్లల్లేరు.."

"ఓహ్ అలాగా..." ఏకాంత్ పొడిగా అన్నాడు.

"కోట్లాది రూపాయలు విలువచేసే ఆస్తి... వారసుడిగా ఎవరినైనా దత్తత తీసుకోవాలనుకుంటున్నారు.."

"మంచిదే. అడాప్షన్ చేసుకోడమనేది గొప్ప విషయం!" ఏకాంత్ మెచ్చుకున్నాడు. 'శరణాలయాల్లో చూద్దామా?"

రాజవర్మ గొల్లున నవ్వాడు. "బావగారికి ఎనభై, అక్కయ్యకు డెబ్భై. ఈ వయసులో ఎవరో అనాథపిల్లాడిని అడాప్ట్ చేసుకుని, వాడి సేవ చేయగలరా? అలాంటి దత్తత దశాబ్దాల కిందటే జరిగి ఉండాలి. ఇప్పుడు చేతికి అంది వచ్చి ఉండేవాడు. తమ కడుపున ఒక కాయ కాయక పోతుందా అన్న ఆశతో దత్తత గురించి ఆలోచించలేదు. ఇప్పుడు వాళ్ళకి కావాల్సింది చేతికి అంది వచ్చే చెట్టంత దత్తత కొడుకు! నోట్లో వేలేసుకున్న బుడతడు కాదు!"

"అఫ్‌కోర్స్.... ఆ ఆలోచన మంచిదే..." ఏకాంత్ అన్నాడు.

"గోపాలం బావగారు ఒక ప్రతిపాదనతో వచ్చారు. అది నాకు నచ్చింది. నువ్వు నా అల్లుడివి. గోపాలం బావగారికి కొడుకు వరస అవుతావు. ఆయన నిన్ను దత్తత చేసుకోవాలనుకుంటున్నారు, ఏకాంత్!' రాజవర్మ చిరునవ్వుతో అన్నాడు.

ఏకాంత్ నిర్ఘాంతపోతూ చూశాడు.

"అవున్నాయనా ఏకాంత్... మా ఇద్దరికీ వయసు ముదిరి పోయింది. అనారోగ్య సమస్యలున్నాయి. చూసుకునే వాళ్ళు లేరు. అన్నింటికీ పని మనుషుల మీదే ఆధారపడుతున్నాం. అన్నింటికన్నా ముఖ్యంగా పుట్టుకతో అందివచ్చిన సంపదను, నేను దానికి జత చేసినవన్నీ ఏ సంస్థకో ధారబోయడం కన్నా, నా అనే వాళ్ళకు ఇవ్వడం మంచిదని నా భావన. నాకు నా అనేవాడూ, మా క్షేమం కోరేవాడూ మీ మామయ్యే! ఆయన కూతురు రంజనకి నేను ఆస్తి రాసిచ్చేయవచ్చు. నేనూ, నా భార్య గతించిపోతే, మాకు ఉత్తరక్రియలూ, తదనంతర సంస్కారాలూ చేసేదెవరు? ఆడపిల్ల చేయరాదు కదా! అందుకని నిన్ను ఎన్నుకున్నా...'

ఏకాంత్ కంగారుగా చూశాడు. అది నిరాకరించాల్సిన ప్రతిపాదన కాదు. కానీ... కానీ... అమ్మ... ఇల్లరికానికే బాధపడిపోయిన అమ్మ, దత్తత... అంటే.. ఆలోచిస్తున్న అతని తల అతని ప్రయత్నం లేకుండానే అడ్డంగా ఊగసాగింది. రాజవర్మ అల్లుడిని చిరునవ్వుతో చూశాడు.

"నీ ఆలోచన నాకు వినిపిస్తోంది అల్లుడూ!" రాజవర్మ సగర్వంగా అన్నాడు. "నువ్వు మీ అమ్మగారి రియాక్షన్ గురించి ఆలోచిస్తున్నావు. ఆమె వ్యక్తిత్వాన్ని నేను అంచనా వేయగలను. ఆమెను విమర్శించను గానీ, ఒక నగ్నసత్యం చెప్తాను. తన కొడుకు కోట్లాది రూపాయల ఆస్తికి యజమాని కావడాన్నీ, ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా సుఖంగా, సంతోషంగా జీవించడాన్నీ వ్యతిరేకించే తల్లి నా దృష్టిలో తల్లికాదు! అహంకారంతో, ఆత్మగౌరవం, ఆత్మాభిమానం అనే అతిశయంతో బిడ్డల అభివృద్ధిని అడ్డుకునే తల్లి తల్లికాదు; మూర్ఖురాలు..."

"అదికాదు మామగారూ, మీరొక ముఖ్య విషయం విస్మరించారు. జ్యేష్ఠపుత్రుడి దత్తత చట్టబద్ధం కాదు. అది చెల్లదు. నేను జ్యేష్ఠపుత్రుణ్ణి..."

"ప్రతీ రోగానికీ మందుంటుంది ఏకాంత్. ఆ పాయింటునీ బావగారూ, నేనూ ఆలోచించాం. అధికారికంగా పత్రాలు రాసుకుని నిన్ను దత్తత చేసుకోరు బావగారు. ఆస్తంతా నీ పేరిట దాన విక్రయం చేస్తారు. ఆ దంపతులు జీవించినంతకాలం వాళ్ళ బాగోగులు చూసుకుంటాననీ, వాళ్ళు స్వర్గస్థులు అయ్యాక వాళ్ళ పుత్రుడి హోదాలో చేయాల్సిన కార్యాలు చేస్తాననీ, నీ జీవితాంతం వాళ్ళ వార్షిక తద్దినాలు జరిపిస్తాననీ నువ్వు డాక్యుమెంట్ రాసివ్వాలి. అంతే!" రాజవర్మ అన్నాడు.

ఉత్సాహంగా, ఉత్కంఠగా తననే చూస్తున్న ఇద్దర్నీ ఏకాంత్ అయోమయంగా చూశాడు. రాజవర్మ చిరునవ్వు నవ్వాడు.

"మీ అమ్మగారితో నువ్వు మాట్లాడతావా? నన్ను మాట్లాడమంటావా?" రాజవర్మ రెచ్చగొడుతున్నట్టు అన్నాడు.

"...కొంత టైం ఇవ్వండి... నేనే మాట్లాడతాను" ఏకాంత్ బలహీనంగా అన్నాడు.

"అదే మంచిది. నా టెక్నిక్ వేరులే! ఈ రాజవర్మ ఎవర్నీ ఏదీ అడగడం అలవాటు లేదు. ఎవరికైనా, ఏదైనా చెప్పడమే!" రాజవర్మ కంఠంలో గర్వం



జేగంటలా పలికింది.

•••

"ఇది నిజంగా శుభవార్తే ఏకాంత్! అదృష్టం నిన్ను అన్వేషిస్తూ వస్తోంది. 'మీ అమ్మాయిది బలమైన జాతకం. కట్టుకోబోయే వ్యక్తిని మహద్భాగ్యం వెతుక్కుంటూ వస్తుంది!!' అనేవాళ్ళు నా జాతకం చూసిన పండితులు. అత్తయ్య ఏదో అనుకుంటారనీ, అంటారనీ కంగారుపడకు! మోకాలు అడ్డం పెట్టకు!" రంజన ఉత్సాహంగా అంది.

ఏకాంత్ బరువుగా నిట్టూర్చాడు. "నీకు తెలీదు రంజనా, అమ్మకు ఆస్తులమీదా ఐశ్వర్యంమీదా వ్యామోహం లేదు.."

"కరెక్టే. అది మంచిది కూడా. అయితే ఐశ్వర్యం మీద వ్యామోహం పెంచుకోమని మనం అత్తయ్యను ఒత్తిడి చేయడం లేదుగా! కన్నకొడుకు కలిగిన వాడైతే కన్నకడుపు వద్దంటుందా? అత్తయ్యకు నచ్చచెప్పే అవసరమే వస్తే సాకేత్ సహాయం, సంకేత్ సహాయం తీసుకో. నువ్వు అవసరమంటే నిశితతో నేను మాట్లాడతాను" రంజన భర్తను ఉత్సాహపరుస్తూ అంది.

ఏకాంత్ మౌనంగా చూశాడు.

"నీ సంపద, నీ హోదా నీ భార్యకే కాదు, కన్న తల్లికీ, తోడ బుట్టిన వాళ్ళకీ తోడుగా ఉంటుంది ఏకాంత్!" రంజన మళ్ళీ అంది.

"నువ్వు చెప్పేదంతా నిజమే రంజనా, కానీ మన ఆలోచన వేరు. అమ్మ ఆలోచన వేరు!"

"పోనీ, అమ్మా, నాన్నా, నేనూ వెళ్ళి మాట్లాడమా, అత్తయ్యతో?"

ఏకాంత్ కంగారుగా చూశాడు. "వద్దు.. నేనే మాట్లాడతాను"

•••

నిగమ కళ్ళు చిన్నగా అయ్యాయి. నోరు కొద్దిగా తెరుచుకుంది. ఆశ్చర్యం విశ్వరూపం ధరించి ఆమె ముఖం మీద ఘనీభవించింది.

రెప్పపాటు మరిచిపోయి, తననే చూస్తున్న తల్లి కళ్ళలోకి చూడలేక, ఏకాంత్ రెప్పల్ని దించుకున్నాడు. సరిగ్గా తొమ్మిది నెలలు. ఔను తొమ్మిది నెలలే. నవమాసాలు.. నవమాసాలు మోసి, కని, తనకు జన్మనిచ్చిన తల్లికి తొమ్మిదేసి నెలలకోసారి మానసికక్షోభ అందిస్తున్నాడు తాను. విధి, పరిస్థితులు తనచేత అలా చేయిస్తున్నాయి. రాజవర్మ కూతురితో పెళ్ళి అంశంతో అమ్మకు కష్టం కలిగించిన తొమ్మిదినెలలకి, సరిగ్గా తొమ్మిది నెలలకి ఇల్లరికం అంశంతో ఇబ్బంది కలిగించాడు. ఇల్లరికం అంశం తరువాత మళ్ళీ సరిగ్గా తొమ్మిది నెలలకి దత్తత అంశంతో.. దత్తత అంశాన్ని అంకుశంగా చేసి అమ్మని పొడుస్తున్నాడతను...

ఇదంతా తాను ఉద్దేశపూర్వకంగా చేస్తున్నాడా? లేదు? అవకాశాలూ, అవసరాలూ అలా వస్తున్నాయి. తనను కట్టిపడేసి, తన చేత అమ్మకు ఇష్టంలేని పనులు చేయిస్తున్నాయి. ఒక్క రంజనతో పెళ్ళి అనేది తప్ప, ఏదీ అమ్మను కష్టపెట్టేవి కావు. శత్రువు కూతుర్ని కోడలిగా ఆహ్వానించడం ఒక్కటే అమ్మ అభిమానాన్ని గాయపరచిన అంశం.

"ఇది నీ రాజవర్మగారి రాజనీతా."

తల్లి ప్రశ్న చెంపపెట్టులా ఏకాంత్ చెవుల్ని తాకింది. తల పైకెత్తి, అర్థం కానట్టు చూశాడు.

"ఈ పాపిష్టి పథకం ఎవరిది?" నిగమ కంఠం ఖంగుమంది.

"సారీ అమ్మా. అది పథకం కాదు. ప్రతిపాదన".

"రాజవర్మకు నేను కలలో కూడా అపకారం తలపెట్టలేదు. నా భర్తను నాకు దూరం చేశాడు. ఇప్పుడు నా పెద్ద కొడుకుని దూరం చేసే ఎత్తువేస్తున్నాడు"

"రాజవర్మగారి ఉద్దేశాన్ని నువ్వు పూర్తిగా అపార్థం చేసుకుంటున్నావమ్మా" ఏకాంత్ ధైర్యంగా అన్నాడు. గోపాలం గారి ఆస్తి యావత్తూ ఎవరో ముక్కూ మొహం తెలీని వాళ్ళకో, సత్రాలకో, సంస్థలకో వెళ్ళడం కన్నా, తన అల్లుడికీ, కూతురికీ, తదనంతరం వాళ్ళ సంతతికీ అక్కరకు రావాలనుకోవడం తప్పెలా అవుతుంది! ఇది ఆయన ఆలోచన. పథకం కాదు!"

"ఏకాంత్ ఒక ప్రశ్నకు సమాధానం చెప్పు" నిగమ అతన్నే చూస్తూ అంది. "జ్యేష్ఠపుత్రుడి దత్తత చెల్లదని నీకు తెలుసా?"

"వాళ్ళకు కూడా తెలుసు. అంటే, రాజవర్మ గారికీ, గోపాలం గారికీ ఇద్దరికీ తెలుసు. అందుకే నామమాత్ర దత్తత చేసుకుంటామంటున్నారు.."

"చట్టబద్ధమైనా, నామమాత్రమైనా నా దృష్టిలో దత్తత దత్తతే ఏకాంత్!" నిగమ గంభీరంగా అంది. "రాతకు ఎంత విలువ ఇస్తానో, నేను మాటకూ అంతే విలువ ఇస్తాను. నువ్వు 'నామమాత్రంగా' నామ్‌కే వాస్తేగా' ఉత్తుత్తి దత్తతకు వెళ్ళినా, నువ్వు శాశ్వతంగా దత్తత అయినట్టే భావిస్తాను. దానివల్ల నువ్వు కొన్ని అధికారాలు పోగొట్టుకుంటావు.."

"అధికారాలా?!" ఏకాంత్ అడ్డొస్తూ అన్నాడు.

నిగమ చిన్నగా, విరక్తిగా నవ్వింది. "అధికారాలు, అంటే ఆస్తిపాస్తుల మీదే అని అనుకుంటున్నట్టుంది, నువ్వు! మనకు ఈ ఇల్లు తప్ప ఏ ఆస్తీ లేదని నీకు తెలుసు! అసలు ఇంటిమీద నీకు మమకారం లేదని నాకు తెలుసు! నువ్వు కోల్పోయే అధికారాలు వేరే ఉన్నాయి. అవేమిటో తరువాత చెప్తాను. 'నామమాత్రం దత్తత' అంటున్నావు. అంటే..'

"దత్తపుత్రుడు అనుకుంటాం కానీ, దత్తత కాదు. పత్రాలూ, అవీ ఉండవు. పేరుకి మాత్రమే!" ఏకాంత్ అడ్డు తగిలాడు.

"సరే. ఈ నామ మాత్రం దత్తపుత్రుడికి గోపాలం గారో, ఎవరో తన యావదాస్తినీ నామ మాత్రంగానే ఇస్తారా? లేక..."

"చెప్పడం మరిచిపోయానమ్మా, ఆయన తన యావదాస్తినీ నీ కొడుక్కి దాన విక్రయం రాసి, రిజిస్టర్ చేసి మరీ ఇస్తాడు!" ఏకాంత్ ఉత్సాహంగా అన్నాడు.

ఏకాంత్ ముఖంలోకి తీక్షణంగా చూసింది నిగమ. "ఏకాంత్ అంత ఆస్తిని ఆయన అక్రమంగా ఆర్జించాడో, సక్రమంగా ఆర్జించాడో తెలీదు. ఆ ఆస్తి నీకు కావాలా?"

"నేను కావాలనలేదు. అడగలేదు. వాళ్ళు ఇస్తామంటున్నారు. అంతే!"

"నా ప్రశ్నకు నువ్వు సూటిగా సమాధానం చెప్పలేదు. చెప్పలేవు. నాకు తెలుసు. ఇప్పుడు నువ్వు కోల్పోయే అధికారాలు చెప్తాను.." నిగమ అంది. "ఇది వరకులాగా ఏడాదేడాదీ మీ నాన్నగారికి తిలతర్పణం ఇచ్చే అధికారం కోల్పోతావు. రేపు నేను మరణిస్తే నా శవానికి తలకొరివి పెట్టే అధికారం, ఉత్తరక్రియలు జరిపించే అధికారం, సాంవత్సరీకాలు, ఇతర సంస్కారాలు చేసే అధికారం కోల్పోతావు"

ఏకాంత్ ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. "ఇది ఇది అబ్సర్డ్! వాళ్ళు ఆస్తి నా పేర రాసినంత మాత్రాన నేను నాన్నకూ, నీకూ కొడుకును కాకుండా పోతానా?"

"ఆస్తి ఇతరుల పాలుకాకుండా బంధువులకే చెందాలన్న ఆశ ఉంటే, యావదాస్తినీ రంజన పేర రాయొచ్చుగా! వృద్ధాప్యంలో రంజన వాళ్ళ బాగోగులు చూసుకుంటుందిగా?" నిగమ సూటిగా చూస్తూ ప్రశ్నించింది. 'నీ పేరనే రాయడానికి కారణం ఏమిటి?"

ఏకాంత్ మౌనంగా చూస్తూ నీళ్ళు నమిలాడు.

"చెప్పు ఏకాంత్! నీ నుండీ వాళ్ళు ప్రతిఫలంగా ఏమిటి ఆశిస్తున్నారు?"

ఏకాంత్ పెదవులు కదిలాయి. "వాళ్ళ తదనంతరం చేయాల్సిన కర్మక్రియల్ని చేయాలన్న కోరిక

హగ్ మీ అంటున్న సన్నీ?

ఇలాంటి మాటలు బహిరంగంగా మాట్లాడే ధైర్యం బాలీవుడ్‌లో సన్నీలియోన్‌కి తప్ప మరొకరికి లేదన్న సంగతి తెలిసిందే! తన సినిమాలతోనో, మాటలతోనో ఎప్పుడూ వార్తల్లో ఉండే సన్నీ ఇప్పుడు ఇలాంటి స్టేట్‌మెంట్‌తో మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. సన్నీ తాజా సినిమాలో 'హగ్ మీ' అంటూ ఓ పాట ఉంది. ఈ పాటలో సన్నీ చేసిన డ్యాన్సు, ఆరబోసిన అందాలు అదరహో అంటున్నారు బాలీవుడ్ జనాలు. ఇప్పుడు ఎక్కడ చూసినా 'హగ్ మీ' పాట బాగా వినిపిస్తోందట! ఇటీవలి కాలంలో సన్నీ సినిమాలు బాక్సాఫీసు వద్ద వరుసగా బోల్తా పడుతున్నాయి. ఇప్పుడు ఈ పాటకు వస్తున్న ఆదరణ చూస్తుంటే సినిమా సక్సెస్ ఖాయం అని దర్శకనిర్మాతలు సంతోషపడుతున్నారట!

వాళ్ళది..."

నిగమ మౌనంగా చూస్తూ ఉండిపోయింది.

"అమ్మా ఒకమాట అడగనా? ఏమీ అనుకోకుండా సమాధానం చెప్తావా?" ఏకాంత్ ప్రశ్నించాడు.

"ఏమనుకున్నా, ఏమీ అనుకోకపోయినా, అడిగిన దానికి సమాధానం చెప్తాను. అడుగు!"

"మరణించినవాళ్ళ పేరుమీద ఎవరినో భోక్తలుగా కూచోబెట్టి భోజనాలుపెడితే, ఆ మరణించిన వాళ్ళ ఆకళ్ళు తీరుతాయా? తర్పణాలు వదిల్తే వాళ్ళ దప్పిక తీరుతుందా? ఇది మూఢ నమ్మకం కాదా?"

"మూఢనమ్మకం అని నీకు అనిపించివుంటే, ఇన్నాళ్ళూ నువ్వు పెద్దవాడైన తర్వాత కూడా మీ నాన్నగారికి తర్పణాలూ అవీ ఎందుకు ఆచరించావు ఏకాంత్?"

"నిజం చెప్పాలంటే నీ తృప్తికోసమే చేశా. పిండ ప్రదానాలతో ఆకళ్ళూ, తర్పణాలతో దాహాలు తీరుతాయని నువ్వు నిజంగా నమ్ముతున్నావా?"



ఏకాంత్ కంఠంలో ఎగతాళి లీలగా ధ్వనించింది.

"నువ్వు ఉద్యోగరీత్యా ఆగస్టు పదిహేనునాడు జాతీయపతాకానికి వందనం అర్పిస్తావు. గుడ్డతో రూపొందిన ఆ పతాకం నీ వందనాన్ని స్వీకరిస్తే తద్దినం ఫలితాన్ని మరణించిన వాళ్ళు స్వీకరిస్తారు. గాంధీ జయంతి సందర్భంలో నువ్వు ఆయన విగ్రహానికి నివాళులు అర్పిస్తావు. జాతిపిత ఆ నివాళులు అందుకుంటారని నువ్వు నమ్ముతున్నావా? జనం కోసం నాటకం ఆడుతున్నావా?"

"అమ్మా!"

"ఆత్మపరిశీలన చేసుకో ఏకాంత్!' నిగమ గంభీరంగా అంది. మన జాతి పితామహులు, ఆర్షఋషులు ప్రవచించి, నిర్ణయించిన సంస్కారాలను అపహాస్యం చేయకు! నేను నమ్ముతాను. నేను చచ్చిపోయాక నా కొడుకులు నాకు చేయాల్సిన 'అపరకర్మలన్నీ చేయాలని ఆశిస్తాను'.

ఏకాంత్ గుటకలు మింగుతూ చూశాడు.

"నిన్ను నామ మాత్రం దత్తత తీసుకోవాలనుకుంటున్న గోపాలం దంపతుల పట్ల నాకు జాలి కలుగుతోంది'.

"అమ్మా..." ఏకాంత్ దెబ్బతిన్నట్టు చూస్తూ అన్నాడు.

"మనిషి జీవించి ఉన్నప్పుడూ, చనిపోయినప్పుడూ భారతీయ సంస్కృతి నిర్దేశించిన సంస్కారాల మీద ఏ మాత్రం గౌరవం, విశ్వాసం లేని నిన్ను దత్తత తీసుకుంటున్నవాళ్ళను తలుచుకుంటే జాలేస్తోంది!"

"అయితే అన్నయ్య ఎవరికో దత్తత అయిపోవడాన్ని నువ్వు ఒప్పుకుంటున్నావా, అమ్మా?"

గది గుమ్మంలోంచి వినవచ్చిన నిశిత ప్రశ్న ఇద్దర్నీ ఉలిక్కిపడేలా చేసింది.

"నిశితా..." నిగమ ఆశ్చర్యంగా అంది. "నువ్వు ఇంట్లోనే ఉన్నావా?"

"ఉన్నాను. అంతా విన్నాను" నిశిత ముక్తసరిగా అంది. "నువ్వు నా ప్రశ్నకు జవాబివ్వలేదమ్మా! అన్నయ్యను దత్తత ఇచ్చేస్తున్నావా?"

నిగమ చిరునవ్వు నవ్వింది. "బలే దానివేనే! అంతా విన్నానన్నావ్. అయితే నన్ను అర్థం చేసుకోలేదు. ఏకాంత్‌ది నామ మాత్రపు దత్తత. నేను ఇవ్వడం లేదు. తనే వెళ్తున్నాడు. నేను ఇవ్వకపోయినా, దత్త పుత్రుడిగా వెళ్ళిపోతాడు!"

"అమ్మా!" ఏకాంత్ ఉద్రేకంగా అన్నాడు.

"ఏకాంత్ నువ్వు రాజవర్మ అల్లుడు కావడం నాకు ఇష్టం లేదు. అయ్యావు. నువ్వు ఇల్లరికం అల్లుడవడం నాకు ఇష్టంలేదు. అయ్యావు. పేరుకి మాత్రం దత్తత అనే ముసుగుతో ఎవరికో దత్తపుత్రుడైపోవాలనుకుంటున్నావు. అది నాకు ఇష్టం ఉండదని నీకు తెలుసు. అయినా నన్ను అడిగి, అగ్నిపరీక్ష పెట్టావు. నన్ను ఒప్పించే నిర్ణయంతో వచ్చావు. అది లేకపోతే దత్తత ప్రతిపాదన అక్కడే వ్యతిరేకించి, నిరాకరించి, తిరస్కరించేవాడివి! అడిగే వాడెప్పుడూ కోరిక తీరాలనే, అడిగింది అందాలనే అడుగుతాడు! నేను వద్దనను. అమ్మ మాట నువ్వు అతిక్రమిస్తావని నాకు తెలుసు. ఓటమి తెలిసిన ఆట ఆడటం మూర్ఖత్వం! వెళ్ళు! నీ నిర్ణయాన్ని అక్కడ అనౌన్స్ చేయి! దత్తపుత్రుడిగా సుఖంగా ఉండు!"

"అమ్మా..." ఏకాంత్ కంఠంలో ఉద్వేగం ధ్వనించింది.

"ఏకాంత్ నీకూ, నిశితకూ ఒక విషయం చెప్తాను' నిగమ సాలోచనగా అంది. "అది మీ నాన్నగారు స్వర్గస్థులైన కాలం. మీరు ఎలిమెంటరీ స్కూళ్ళలో చదువుతున్న రోజులు. ఒకరోజు ఒక కోటీశ్వరుడు నా వద్దకు వచ్చాడు. నా గురించీ, మీ గురించీ ఆయనకు నాన్నగారి మిత్రుడు లాయర్ రామనాథంగారు చెప్పారట. తనకు బోలెడంత ఆస్తి ఉందనీ, పిల్లలు లేరనీ, ఇంక పిల్లలు కలగరనీ, భార్య అంటే తనకి ప్రాణమనీ, రెండో పెళ్ళి చేసుకోననీ చెప్పాడు. నిన్నో, సాకేత్‌నో, సంకేత్‌నో దత్తత ఇమ్మన్నాడు. మిగిలిన ఇద్దరబ్బాయిల పేరిటా, నిశిత పేరిటా అయిదేసి లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ వేస్తానన్నాడు. అది దత్తత ఇవ్వబడే పిల్లవాడి వెలకాదనీ, నిజాయితీకి మారుపేరైన సుగుణాకర్ గారి కుటుంబానికి సగౌరవంగా ఇచ్చే పురస్కారమనీ అన్నాడు. అవి నాకు ఏ పూటకాపూట సంపాదించి పొట్టపోసుకునే రోజులు. అలాంటి నిస్సహాయ పరిస్థితిలో కూడా యీ నిగమ తన బిడ్డల్లో ఒకణ్ణి కూడా ఆ కోటీశ్వరుడికి దత్తత ఇవ్వలేదు!

"ఎందుకో తెలుసా! నా బిడ్డలు నా భర్త ప్రతిరూపాలు. నా బిడ్డలు నా భర్త ఆత్మాభిమానానికి ప్రతిబింబాలు. మా ఇద్దరి అనుబంధాన్ని చూపించే సజీవ దర్పణాలు. నేను కన్నబిడ్డల్ని నా చేతుల్తోనే పెంచాలి. తండ్రిగారి ఆదర్శాలకి అనుగుణంగా పెంచాలి. విద్యావంతులుగా పెంచాలి. సంస్కారవంతులుగా పెంచాలి. ఈ ఆశయాలతో నేను కష్టాలనే కౌగిలించుకున్నాను. ఆస్తికోసం, డబ్బుకోసం ఆశపడి ఉంటే ఆనాడే ఒక కొడుకుని దత్తత ఇచ్చివుండేదాన్ని! కష్టకాలంలో, సహకారం అవసరమైన సమయంలో ఒక కొడుకును దత్తత ఇవ్వని నేను, చేతికి అందివచ్చిన కొడుకు దత్తతకు అంగీకరించాల్సి వచ్చింది."

"సారీ అమ్మా... వినడానికే బాధగా ఉంది..."

"అది విధి. నా జీవితం నా చేతుల్లో లేదు. విధి నియంత్రణలో ఉంది అని మరోసారి రుజువైంది. ఎలాగో తెలుసా ఏకాంత్?" నిగమ ఏకాంత్ కళ్ళల్లోకి చూస్తూ అంది.

ఏకాంత్ మాటలు మరిచి పోయినవాడిలా చూశాడు.

"బాల్యంలో నా కొడుకుల్లో ఒక్కణ్ణి దత్తత అడిగింది ఎవరో తెలుసా? ఇవాళ నిన్ను నామమాత్ర దత్తపుత్రుడుగా స్వీకరించబోతున్న గోపాలం గారు!"

●●●

గోపాలం దంపతుల దత్తపుత్రుడుగా వాళ్ళ ఇంట్లో అడుగుపెట్టాడు ఏకాంత్. గోపాలంగారు తన ఆస్తిపాస్తుల్ని ఏకాంత్ పేరిట దానవిక్రయం రాసేశారు. పత్రంలో రాజవర్మ ద్వారా ఏకాంత్‌తో ఏర్పడిన బంధుత్వాన్ని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో తమ యోగక్షేమాలు చూసుకోవడానికి ప్రతిఫలంగా ఆస్తి ధారాదత్తం చేస్తున్నట్టు పత్రంలో ఉటంకించారు.

గోపాలంగారు నిర్దేశించిన నిబంధనలన్నిటికీ అంగీకరిస్తున్నట్టు వివరిస్తూ ఏకాంత్ స్టాంపు పేపరు మీద ఒక ఆమోదపత్రం రాసిచ్చాడు. పగలు గోపాలంగారి ఇంట్లో, రాత్రిళ్ళు రాజవర్మ ఇంట్లో ఉండేలా ఏకాంత్ సర్దుబాటు చేసుకున్నాడు. వీలు చిక్కినప్పుడల్లా అమ్మనూ, చెల్లినీ చూడ్డానికి వెళ్తున్నాడు. ఎప్పుడు వెళ్ళినా తనకు కనిపించే భావాలు రెండే. అమ్మ ముఖంలో నిరాశ. చెల్లెలి ముఖంలో కోపం! అమ్మకీ, చెల్లికీ తాను దూరమవుతున్నాడా? ఏమో! తెలీదు! దూరమవుతున్నాడో లేదో తెలియదుకానీ, చేరువ మాత్రం కాలేకపోతున్నాడు.

(ఇంకా వుంది)

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో
'గౌట్' సమస్యకు సమర్థవంతమైన వైద్యం

డా. శ్రీకాంత్ మోర్లావర్
CMD
హోమియోకేర్ ఇంటర్‌నేషనల్

మన ప్రతి కదలికలో కీళ్ళ పాత్ర ప్రధానమైనది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న కీళ్ళలో, ఉదయాన్నే నిద్ర లేచేసరికి బొటనవ్రేలులో వాపు, సలపరంతో కూడిన నొప్పి మరియు ఆ కీళ్ళకు సంబంధించిన ప్రతి చిన్న కదలిక కూడా అత్యంత కష్టతరంగా అనిపించడం వంటి సమస్యలు కేవలం 'గౌట్' అనే వ్యాధి వలన మాత్రమే కలుగుతాయని మనం తెలుసుకోవాలి. గౌట్ వ్యాధి మన శరీరంలో యథావిధిగా జరిగే యూరిక్ ఆమ్లపు జీవప్రక్రియ సరిగ్గా లేనందున ఉత్పన్నమయ్యే ఒక కీళ్ళ వ్యాధి. ఒక అధ్యయనం ప్రకారం 2013 సం॥ నాటికి దాదాపు 5.8 మిలియన్ల మంది ఈ 'గౌట్' సమస్యతో బాధపడుతున్నారని తేలింది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల వలన ఈ సమస్య నానాటికీ పెరుగుతూనే ఉంది. స్త్రీల కంటే పురుషులలో 3 రెట్లు అధికంగా ఈ సమస్య కనిపిస్తుంది. 30 సం॥లు దాటిన పురుషులలో మరియు నెలసరి ఆగిపోయిన స్త్రీలలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. సాధారణంగా మనం తీసుకునే ఆహారంలో ఉండే ప్యూరిన్స్ విచ్ఛిన్నంలో భాగంగా ఏర్పడే యూరిక్ ఆమ్లం రక్తంలో ఉండవలసిన పరిమాణం కంటే అధికంగా ఉన్నట్లయితే అది కీళ్ళలో వచ్చి చేరుతుంది. ఇలా వచ్చి చేరిన యూరిక్ ఆమ్లం, స్ఫటికాల రూపంలో కీళ్ళలో మరియు కీళ్ళ చుట్టూ ఉండే కణజాలంలో పేరుకుపోయినప్పుడు, కీళ్ళు వాచిపోయి కదలికలు కష్టతరంగా మారడాన్ని 'గౌట్' అని అంటారు. దీని వలన కీళ్ళు హానికి గురవటం జరుగుతుంది కనుక దీనినే గౌటీ ఆర్థరైటిస్ అని కూడా అంటారు.

కారణాలు:

- సాధారణంగా రక్తంలోని యూరిక్ ఆమ్లం కిడ్నీల నుండి మూత్రం ద్వారా విసర్జించబడుతుంది. ఒకవేళ శరీరంలో యూరిక్ ఆమ్లం ఉత్పత్తి పెరిగినా లేదా దాని విసర్జన సరిగా జరగకపోయినా, అది రక్తంలో నిలిచిపోయి గౌట్ వ్యాధిని కలుగజేస్తుంది.
- ప్యూరిన్స్ ఎక్కువగా ఉండే ఆహారం ఉదా: మాంసము, గ్రుడ్లు, చేపలు, మొదలైన సముద్రపు ఆహారము ఎక్కువగా తీసుకోవడం.
- అధికబరువు, వయస్సు పెరగడం, వంశపారంపర్యత.
- కొన్ని కిడ్నీ సంబంధిత వ్యాధుల వలన యూరిక్ ఆమ్లం విసర్జక ప్రక్రియలో లోపాలు ఏర్పడి 'గౌట్' వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

లక్షణాలు:

- తీవ్రతను బట్టి వ్యాధి లక్షణాలు చాలా ఆకస్మికంగా కనిపిస్తాయి.
- ఈ వ్యాధి ఎక్కువ శాతం, కాలి బొటనవ్రేలులో ప్రారంభం అవుతుంది.
- ఉదయాన్నే నిద్ర లేచేసరికి లేదా అర్థరాత్రి సమయంలో కాలి బొటనవ్రేలులో విపరీతమైన సలపరంతో కూడిన నొప్పి, మంట, వాపు మరియు, ఆ ప్రాంతమంతా ఎర్రగా మారిపోవడం, చిన్న కదలికలు కూడా కష్టంగా ఉండటం వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి.
- మొదట్లో ఈ వ్యాధి కాలి బొటనవ్రేలుకు మాత్రమే పరిమితమైనప్పటికీ, క్రమేపీ ఇది మోకాళ్ళను, మడమలను, మోచేతులను, మరియు మణికట్టులను, చేతివ్రేళ్ళను కూడా ప్రభావితం చేస్తుంది.
- ఈ సమస్యను నిర్లక్ష్యం వహించి, సరైన చికిత్స తీసుకోకపోతే వ్యాధి తీవ్రతరంగా మారిపోయి కీళ్ళను పూర్తిగా దెబ్బతీస్తుంది మరియు ఈ వ్యాధి వలన కిడ్నీలలో రాళ్ళు కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు: రక్తపరీక్ష – రక్తంలో యూరిక్ ఆమ్లం ఎక్కువైనంత మాత్రాన 'గౌట్' వ్యాధికి గురైనట్లు భావించరాదు. రక్తంలో యూరిక్ ఆమ్లం ఎక్కువగా ఉండటంతో పాటు, కీళ్ళలో ఆర్థరైటిస్ సమస్య కూడా ఉన్నట్లయితే, దానిని 'గౌట్' గా భావించాలి. ● సోరియాటిక్ ఆర్థరైటిస్, కిడ్నీ ఫెయిల్యూర్, లుకేమియా వంటి ఇతరత్రా సమస్యలలో కూడా రక్తంలో యూరిక్ ఆమ్లపు శాతం ఎక్కువగా ఉండే అవకాశముంది. కాబట్టి 'గౌట్' విషయంలో రోగ నిర్ధారణ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. ● ఈ.ఎస్.ఆర్., **X-ray**, అల్ట్రా సౌండ్ (యూరిక్ ఆమ్ల స్ఫటికాలను గుర్తించడంలో సహాయపడుతుంది) ● కీళ్ళలోని ద్రవాన్ని తీసి పరీక్షించటం వంటి పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించుకోవచ్చు.

తీసుకోవలసిన జాగ్రత్తలు: గౌట్ వ్యాధిగ్రస్తులు, వారు తీసుకునే ఆహారంలో మాంసకృత్తులు బాగా తగ్గించాలి. మాంసకృత్తులు 2 రకాలు. అవి ప్యూరిన్స్, పిరమిడైన్స్. ప్యూరిన్స్ ఎక్కువగా ఉండే ఆహారం, ముఖ్యంగా మాంసాహారంలో మేక, గొర్రె మాంసం, బీఫ్ వంటివి గౌట్ బాధితులు తీసుకోరాదు. అలాగే లివర్, కిడ్నీ, ఎముక మూలుగు, ప్రేగులు వంటి జంతు అంతర్గత అవయవాలు తీసుకోరాదు. పాలకూర, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, చిక్కుళ్ళు, వివిధరకాల బీన్స్, పుట్టగొడుగులు వంటి శాకాహారాలు తగ్గించాలి. మద్యపానాన్ని మానివేయడం మంచిది.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్ చికిత్స: హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో అందించబడే అధునాతన కాన్స్‌టిట్యూషనల్ హోమియో వైద్యవిధానం ద్వారా రోగి యొక్క మానసిక మరియు శరీర స్థితిగతులను క్షుణ్ణంగా విచారించి, సరైన చికిత్సను అందించి, 'గౌట్' వ్యాధిని పూర్తిగా నివారించడం జరుగుతుంది. ఇంతే కాకుండా కీళ్ళలో స్ఫటికాలు మరోసారి ఏర్పడకుండా ఉండేందుకు మరియు రక్తప్రసరణలోని వివిధ రసాయనాల సమతుల్యత స్థిరంగా ఉంచేందుకు జాగ్రత్తలు తీసుకోవటంతో గౌట్ వ్యాధి శాశ్వతంగా నయమవుతుంది.

ఉచిత కన్సల్టేషన్ **955 000 1188 / 99**

www.homeocare.in

గే.మ్.ఆ.ఫ్.లై.ఫ్

-కంఠంనేని రాధాకృష్ణమూర్తి

చెలరేగిపోతావా? స్టంపౌట్ అవుతావా?

జీవితం ఒక గేమ్‌లాంటిది.

సమాజాన్ని ఒక క్రీడాస్థలంగా భావిస్తే సమాజంలోని ప్రతిమనిషీ అందులో ఒక క్రీడాకారుడే అవుతాడు.

గేమ్‌లో ప్రత్యర్థులుంటారు. పోటీ ఉంటుంది. గెలుపు ఓటములు ఉంటాయి. మనిషిలో ఎన్ని శక్తిసామర్థ్యాలుంటే, ఆటలో ఎన్ని యుక్తుల్ని, నైపుణ్యాల్ని ప్రదర్శించగలిగితే అంతగా అతడు 'విజేత' అవుతాడు. సమాజం అతడికి బ్రహ్మరథం పడుతుంది.

ఇందుకు ఉదాహరణగా అందరికీ తెలిసిన క్రికెట్ క్రీడనే తీసుకుందాం.

క్రికెట్ చూస్తున్నప్పుడు మీ దృష్టి - మీ ఫోకస్ - ఎక్కువగా ఎవరిమీద పడుతుంది?

అభిమాన క్రికెటర్ ఎవరైనా కావచ్చుగానీ, ఫోకస్ మాత్రం ఎక్కువగా బ్యాట్స్‌మన్ మీదే ఉంటుంది. అతడు కొట్టే బౌండరీలు, సిక్సర్లు, చేసే సెంచరీలమీదే ఉంటుంది ధ్యాసంతా.

అలా ఆలోచిస్తే నిజ జీవితంలో మీరు కూడా ఒక బ్యాట్స్‌మనే!

మైదానంలో ఉండే బ్యాట్స్‌మన్ ఇక్కడ నిజజీవితంలో ఉంటాడు. ప్రత్యర్థులు మాత్రం అనేకం! చుట్టూ ఫీల్డర్లు మోహరించి ఉంటారు. ఏ కొంచెం అవకాశం దొరికినా కాళ్ళు పట్టుకుని లాగటానికి - స్టంపౌట్ చేయడానికి - వెనుక వికెట్ కీపర్ సదా అప్రమత్తంగా వేచి చూస్తుంటాడు.

అతడిని బంతితో కొట్టి బయటికి పంపించటానికి అవతల బౌలర్ కదం తొక్కుతూ సిద్ధంగా ఉంటాడు. ఆ వ్యక్తి బలమైన ఆజానుబాహుడైన 'ఫాస్ట్‌బౌలర్' కావచ్చు లేక శక్తియుక్తుల్ని మెలికలు తిప్పుతూ గింగిరాలు తిరిగే బంతుల్ని వేసే 'స్పిన్‌బౌలర్' కావచ్చు.

జీవితక్రీడలో రూల్స్ అన్నీ బోగస్!

జీవితమనే క్రీడాస్థలిలో ప్రతి మనిషీ ఒక బ్యాట్స్‌మన్ లాంటివాడే! ఎక్కువ సమయం బ్యాట్స్‌మన్‌గానే గడపాల్సి వస్తుంది. అవసరాన్ని బట్టి బౌలర్ అవతారమూ ఎత్తాల్సి రావచ్చు.

ఒక విచిత్రం ఏమిటంటే క్రికెట్‌లో గాని, మిగతా ఏ క్రీడలోనైనా గానీ ఆడటంలో కొన్ని పద్ధతులు - కొన్ని రూల్స్ - కొన్ని నియమాలు ఉంటాయి. ప్రతి క్రీడాకారుడు వాటిని పాటించాల్సి ఉంటుంది. పాటిస్తాం. పాటించకపోతే అంపైర్ మందలిస్తాడు. వినకపోతే జరిమానా విధింపజేస్తాడు.

కాని లైఫ్ అనే గేమ్‌లో అలాకాదు. మనచుట్టూ ఉండే ఏ మనిషీ అలాంటి నియమాలు పాటించరు. రూల్సు పాటించరు. ధర్మం పాటించరు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు, ఎవరికి చేతనయినట్లు వాళ్ళు తలో రీతితో తమ తమ కుయుక్తుల్ని, బలప్రతాపాల్ని ప్రయోగిస్తుంటారు. వాటిని తట్టుకుంటూ, వాటికి ఎదురొడ్డి నిలవాల్సి వస్తుంది మనం.

ఇక్కడ అంపైర్లంటూ ఎవరూ ఉండరు. అలా ఉండాల్సిన ప్రభుత్వం, పోలీసులు, థర్డ్ అంపైర్లు (జడ్జీలు) కొందరు సాక్ష్యాల పేరిట ఎంత అన్యాయంగా, ఎంత వికారంగా ప్రవర్తిస్తుంటారో, ఎంతో అసంబద్ధమైన, ఎంత అన్యాయపూరితమైన తీర్పుల్ని కలబోస్తుంటారో మనం చూస్తూనే ఉన్నాం.

ప్రతి సందర్భంలో రూల్స్ ఉన్నట్లే కనిపిస్తాయి. పాటించబడ్డట్లే కనిపిస్తాయి. న్యాయసూత్రాలకు అనుగుణంగా జరుగుతున్నట్లే కనిపిస్తుంది. కాని బోగస్! అన్యాయమైన, దుర్మార్గమైన ఫలితాలు కళ్ళబడుతుంటాయి.

ఇదంతా చెబుతోంది ఎవరినో విమర్శించటానికి కాదు. అన్యాయమైన రూల్సంటూ లేని, నియమనియంత్రణలు లేని మనుషుల మధ్య మనం బ్రతుకుతున్నాం. అలాంటి వ్యవస్థ ఆడుతున్న గేమ్‌లో గెలవటానికి మనమెంత శక్తినీ, సమర్థతనూ కలిగి ఉండాలో, ఎంతటి సమున్నత వ్యక్తిత్వాన్ని సంతరించుకుని ఉండాలో గుర్తు చేయటానికే ఇదంతా చెప్పటం.

(కొత్త శీర్షిక ప్రారంభం)

ఏ మనిషికీ అందమైన వ్యక్తిత్వం, పరిపూర్ణ వ్యక్తిత్వం పుట్టుకతో ఏర్పడదు. ప్రతి మనిషీ దానిని అలవరచుకోవాల్సిందే. అలాంటి పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని ఎలా అలవరుచుకోవాలో, అందుకు మనం ఏమేం చేయాలో ముందుముందు చదువుదాం.

మరో సంగతి-

పేకాట లాంటిది జీవితం

మనిషికి జీవితం ఎప్పుడూ క్రికెట్‌లానో, కబడ్డీ లాంటి ఆటలాగానో ఉండదు.

జీవితం ఒక దొంగమొహం!

పేకాటలాంటిది కూడా!

ఆ ఆటలో మీకు వచ్చిన ముక్కల్ని అంగీకరించక తప్పదు. వాటితోనే ఆడాలి. గత్యంతరం లేదు. అవ

ప్రతి మనిషీ నిజజీవితంలో ఒక బ్యాట్స్‌మనే! మనల్ని స్టంపౌట్ చేయడానికి వికెట్‌కీపర్ మన వెనుకే పొంచిఉంటాడు. చుట్టూ ఫీల్డర్లు. ఎదురుగా ఫాస్ట్ బౌలరో, స్పిన్నరో మనమీదకు దూసు కొస్తుంటాడు. మైదానంలో నియమాలుంటాయి. కానీ నిజజీవితంలో నీతినియమా లుండవు. జీవితంలో ఎక్కువకాలం బ్యాట్స్‌మన్‌గానే బతకాలి. ఈ పరిస్థితుల్లో మనల్ని మనం ఎలా తీర్చిదిద్దుకోవాలి?

కాశాలు కానీండి, ఎదురుదెబ్బలు కానీండి. ముక్కలు మీ చేతిలోకి వచ్చాక వాటితో ఎలా ఆడాలి, ఎలా గెలవాలి అని ఆలోచించాలి తప్ప, నాకే చెత్త ముక్కలు వచ్చాయేమిటి అని వగచి లాభం లేదు. ఎవరూ వచ్చి మిమ్మల్ని ఓదార్చరు. మీ సర్వశక్తి యుక్తుల్నీ ప్రయోగించి గెలవాలి.

అదే గేమ్ ఆఫ్ లైఫ్!

గేమ్ గురించి ఆలోచించటానికి ముందు కొన్ని జీవిత వాస్తవాలు తెలుసుకోవాలి.

ఈ లోకంలో ఎవరి జీవితమైనా, ఫలానా విధంగా ఉంటుందనీ, లేకపోతే ఫలానా విధంగా ఉండాలనీ ముందుగానే నిర్ణయించబడి ఉండదు. ఎవరి జీవి తానికి వాళ్ళే కర్త. వాళ్ళే క్రియ.

మీ జీవితానికి మీరే బిల్డరు. మీరే ఆర్కిటెక్ట్.

వన్ టైమ్ ఆపర్చ్యునిటీ

పుట్టిన క్షణం నుంచి పోయేదాకా మన జీవితం ఒక 'యాత్ర'. తల్లి గర్భం నుంచి బయటపడ్డ క్షణంలో అక్కడున్న డాక్టరో, మంత్రసానో మనల్ని రెండు కాళ్ళూ పట్టుకుని తలకిందులుగా ఉంచి, పిరుదుల మీద చిన్నగా చరుస్తారు, శ్వాస తీసుకోమన్నట్లు.

తొలిశ్వాసతో అప్పుడు ప్రారంభమై తుదిశ్వాస వదిలేదాకా కొనసాగే ఈ జీవితం మనకు ఒక్కసారి మాత్రమే లభించే వరం. వన్ టైమ్ ఆపర్చ్యునిటీ అని గుర్తుంచుకోవాలి.

అలా ఒక్కసారి మాత్రమే లభించే జీవితాన్ని ఎంత అపురూపంగా చూసుకుంటారో, ఎంత విజయవంతంగా గడుపుతారో మీ ఇష్టం. అది మీ చేతిలోని పని.

జీవితాన్ని అందంగా గడపటం, సక్సెస్‌ఫుల్‌గా సాగించటం, గేమ్‌లో గెలవటం అనేది ఎవరికైనా సొంత బాధ్యత. ఎవరోవచ్చి జీవితాన్ని మారుస్తారను కోవటం భ్రమ. ఎవరికివాళ్ళు తమ జీవితాన్ని అంద మైన కట్టడంలా మలచుకోవాలి. 'లైఫ్ ఈజ్ బ్యూటి ఫుల్' అనేట్లుగా చేసుకోవాలి.

కఠినాతి కఠినం

బాల్యంలో కష్టాలు, బాధలు అంతగా తెలియవు. పైన పెద్దవాళ్ళుంటారు. అంతా వాళ్ళు చూసుకుంటారు. ఆ భరోసాతో చీకూచింతా లేకుండా కాలం గడిపేస్తాం.

ఎప్పుడన్నా వాళ్ళు చెప్పినట్లు వినకపోతేనో, వాళ్ళకు అనుగుణంగా నడుచుకోకపోతేనో వాళ్ళు కొడ తారు. పరీక్షల్లో పాస్, ఫెయిల్ లాంటి సందర్భాలలో డిస్టర్బ్ అవుతాం. అంతకుమించి వేరే ఈతి బాధ లేమీ ఉండవు.

కాని పెరిగి పెద్దయ్యాక అలా కాదు. మనకు మనం సొంతంగా బతకాల్సి వస్తుంది. ఉద్యోగాన్వేషణ దగ్గర నుంచి ప్రేమ, విరహం, పెళ్ళి, పిల్లలు, వాళ్ళ పెంపకం లాంటి వాటిల్లో రకరకాల సమస్యలు ఉత్పన్న మవుతుంటాయి. ఉద్యోగ నిర్వహణలో ఇబ్బందుల నుంచి సామాజికంగా చుట్టుపక్కల వాళ్ళనుంచి పోటీ, ప్రలోభాలు, సర్దుబాటు కావడం లాంటి ఇత రత్రా వివిధ సమస్యలు చుట్టుముడుతుంటాయి.

ఇలాంటి వాటన్నింటినీ మనకు మనమే పరిష్క రించుకోవాలి. ఇక అక్కడినుంచీ జీవన పోరాటం మొదలవుతుంది.

జీవితం అందరికీ అన్నివేళలా ఒకేరకంగా ఉండదు. కొన్నాళ్ళు హాయిగా, సంతోషంగా ఏ ఇబ్బం దులూ లేనట్లు అనిపిస్తుంది. అంతా బాగుంది అను కుంటుండగా అనుకోకుండా ఎదురుదెబ్బ తగులుతుంది. కష్టాలు మొదలవుతాయి. ఆర్థికంగా కావచ్చు, ఉద్యోగ పరంగాకావచ్చు. కుటుంబ సంబంధాల విష యంలో కావచ్చు. అంతా కిందామీదా అయిపోయి నట్టు, జీవితం చిన్నాభిన్నమైపోయినట్టనిపిస్తుంది.

"ఇదేమిటి ఇట్లా అయిపోయింది" అనిపిస్తుంది.

"లోకంలో ఇంతమంది ఉండగా నాకే ఇలా జర గాలా" అనిపిస్తుంది.

"ఇంత దురదృష్టమా!" అనిపిస్తుంది. భరించలే మనిపిస్తుంది.

"నా ఒక్కడికే ఇలా ఎందుకు జరిగింది" అనిపి స్తుంది.

తలనొప్పి లేనపుడు మనకు ఎంత హాయిగా ఉంటామో తెలిసిచావదు. కాని తలనొప్పి వచ్చిన పుడు మాత్రం తలనొప్పి లేకుండా ఉన్నప్పటి హాయి ఏమిటో అర్థమవుతుంది.

బాధలు, కష్టాల విషయం కూడా అంతే. అవి తెలియనపుడు జీవితం ఎంత ప్రశాంతంగా ఉందో ఆ సమయాన తెలియదు. కానీ సమస్యలు వచ్చి మీద పడ్డప్పుడు మాత్రం, 'అంతకు ముందు జీవితం ఎంత బాగుందో కదా!' అనిపిస్తుంది.

ఇదంతా మనసు బలహీనత. మనసు చేసే మాయా జాలం!

నీ సంతోషంతో లోకానికి పనిలేదు

వాస్తవానికి లోకంలో ప్రతి వాళ్ళకూ కష్టాలు, ఎదురుదెబ్బలు తగులుతూనే ఉంటాయి. అది సహజం. కాకపోతే వాళ్ళు వాటిని బయటికి చెప్పకపోవచ్చు. లేక వాటి గురించి మీకు తెలియకపోవచ్చు.

జీవితంలో ముందుకు ప్రయాణించేకొద్దీ ఇలాంటి కొన్నిపాఠాలు తెలుస్తాయి. వాటిలో ఒకటి.

"జీవితంలో బాధలు, కష్టాలతో పోరాటం తప్పని సరి. ఆ పోరాటం మనం ఒక్కళ్ళమే చేయాలి. మరెవరూ తోడు రారు".

అలాగే-

"మన సంతోషం కోసం ఈ లోకం ప్రయత్నిం చదు. మన సుఖసంతోషాలతో ఈ లోకానికి పని లేదు. మనకు మనమే సంతోషం పొందాలి. మనకు మనమే సంతోషం కొని తెచ్చుకోవాలి".

ఘంటసాల పాడినట్టు..

"ఎవరో వస్తారని, ఏదో చేస్తారని
ఎదురుచూసి మోసపోకుమా
నిజం మరచి నిదురపోకుమా.."

ఇది వాస్తవం. ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా జీవితం నేర్పే పాఠాలలో అత్యంత విలువైనది, అతి ముఖ్యమైనది ఇది.

దీనిని అంగీకరిస్తే క్లిష్టకాలంలో మనస్సుకు కొంత బరువు తగ్గుతుంది. కష్టాలు ఎదురైనప్పుడు, దురదృష్టం తలుపు తడుతున్నప్పుడు జీవన పరిణామ క్రమంలో వాటిని సహజంగా, ఒక భాగంగా స్వీక రించి నిబ్బరంతో ముందుకు సాగగలుగుతాం. మనస్సులో కుంగుబాట్లు, నిరాశలు, నిస్పృహలు లేకుండా జీవి తాన్ని సమర్థంగా నిర్వహించుకో గలుగుతాం. సమ స్యల గురించి ఊరికే వాపోవటం కాకుండా వాటిని మనకు మనంగా పరిష్కరించుకోవటానికి ప్రయత్నిస్తాం.

బాక్సర్‌కున్న స్పిరిట్ ఉండాలి

ఉపమానంతో చెప్పాలంటే 'జీవితం ఒక బాక్సింగ్ రింగ్ లాంటిది'.

తనకు దెబ్బలు తగులుతాయనీ, గాయాలతో నెత్తురోడవచ్చుననీ, గాయాలు అతితీవ్రంగా కూడా ఉండవచ్చుననీ, పోటీలో తను గెలవనూ వచ్చు, ఓడిపోనూ వచ్చుననీ రింగులోకి దిగబోతున్న ప్రతి బాక్సర్‌కీ ముందుగానే తెలుసు. మానసికంగా అందుకు సంసిద్ధమై రింగులోకి దిగుతాడు. అదీ బాక్సర్ స్పిరిట్!!

జీవితాన్ని మనం కూడా ఇదే స్పిరిట్‌తో తీసుకోవాలి. జీవితం అనబడే గేమ్‌లో గెలవటానికి మనం కూడా బాక్సర్ లాగే మానసికంగా సంసిద్ధమై ఉండాలి.

అందుకు మనం సేకరించుకోవాల్సిన సముపా ర్జించుకోవాల్సిన ఆయుధాలు కొన్ని ఉన్నాయి. మీ మీద మీకు గౌరవం, మీలో ఆత్మవిశ్వాసం, పట్టు వదలని తత్వం, బాధ్యతలను స్వీకరించగలిగే హుందా తనం, కెరటాలా ఎగసిపడే ఆటుపోట్లకు సర్దుబాట వుతూ బంతిలా తిరిగి పైకి ఎగసే మనో నిబ్బరం, పరిస్థితులను లోకాన్ని విశాలంగా సానుకూలంగా వీక్షించే దృక్పథం మొదలైనవి.

అవి ఏమిటన్నది, ఎలాగన్నది ముందుముందు చూద్దాం.

(ఇంకా వుంది)

మనసులో అణుమాత్రమైనా ఖాళీ లేకుండా నిరాశ నిండిపోతుంటే డాక్టర్‌గారి రూమ్ లోంచి వాడిన ముఖంతో బయటకు వచ్చాను.

నర్సు పిలవటంతో వెయిటర్స్‌లోంచి ఓ అమ్మాయి లేచి లోపలకు వెళుతోంది.

"దేవుడా...ఎంతో ఆశతో లోపలికి వెళ్తున్న ఈమెకు, పాపం నాలాంటి పరిస్థితిని ఇవ్వకు" అని మనసులో అనుకుంటూ మెయిన్ డోర్ వైపు కదిలాను.

నడుస్తున్నానే గానీ, అడుగులు తడబడుతున్నాయి. నా చుట్టూ ఉన్నవేవీ నాకు పట్టడం లేదు. ఏదీ మనసుకి ఎక్కడం లేదు.

"ఏయ్...శిరీ...శిరీషా..." గట్టిగా పిలిచారెవరో.

తల వంచుకుని నడుస్తున్నదాన్నల్లా ఉలిక్కి పడి చూశాను.

నాకు కొంచెం దూరంలో రాణి...! రాణి నా కాలేజ్‌మేట్.

అది నా దగ్గరకొస్తూనే, "ఏంటే అంత పరధ్యానం? ఒక్కదానివే వెళ్తున్నావేంటి? మీ వారేరీ? ఎప్పుడూ చిలకా గోరింకల్లా తిరుగుతారుగా..." అంటూ అటూ ఇటూ వెతుకుతున్నట్లుగా చూస్తూ అడిగింది.

నేను రాని నవ్వును బలవంతాన ముఖం మీదకి తెచ్చుకుని, "ఆయన రాలేదు. చిన్న పనుండి నేనే ఇటొచ్చాను" అన్నాను. నేను హాస్పిటల్‌కి వెళ్ళిన విషయం మరీ ముఖ్యంగా డాక్టర్‌గారు చెప్పిన మాటలు దీనికి తెలియకూడదనే నిశ్చయంతో.

"నిన్ను కలిసి చాలా రోజులైంది. రా...అలా ఐస్‌క్రీం తింటూ మాట్లాడుకుందాం.." అంది నా చేయి పట్టుకుని లాగుతూ.

తాపీగా కూర్చుని ఐస్‌క్రీం తినే పరిస్థితా నాది...! వెళ్ళడానికి మనసొప్పక, "ఇప్పుడు తినలేనే. అర్జంటుగా ఇంటికి వెళ్ళాలి" అని చెప్పాను.

నన్ను పై నుంచి చూస్తూ, "ఓహో...అర్థమైందిలే. డైటింగ్ చేస్తున్నావన్నమాట. ముప్పై ఐదు దాటుతున్నా పాతికేళ్ళమ్మాయిలా స్లిమ్‌గా కనిపించాలనా? ఏ...అలా లేకపోతే మీ ఆయన్ని ఎవరన్నా నాజూకమ్మాయి ఎత్తుకుపోతుందని భయమా?" గొంతులోంచి పలికే మాటల్ని మెలికలు తిప్పి దీర్ఘాలు తీస్తూ అడిగింది రాణి.

"ఏంటే...నీ సెటైర్లు..? పద వెళ్దాం.." అన్నాను అయిష్టంగానే. దీని డైలాగులు పడేకంటే, పార్లర్‌లో పడి దాంతో ఐస్‌క్రీం తినడమే మేలనిపించింది.

ఇద్దరం దగ్గర్లోని ఐస్‌క్రీం పార్లర్‌కెళ్ళాం.

"ఇంతసేపైంది, మా పిల్లలెలా ఉన్నారని అడగవేంటే..." దబాయింపుగా అంది రాణి.

"ఏదీ నువ్వు అడగనిస్తే కదా?.." అన్నాను.

నువ్వు అడక్కపోయినా చెప్తాలే. సమ్మర్ హాలిడేస్ కదా.... పెద్దోడు అత్తగారింటికి వెళ్ళాడు. చిన్నోడు ఊళ్ళోనే అమ్మా వాళ్ళింట్లో ఉన్నాడు. వాళ్ళ పోలికలు అని వాళ్ళు పెద్దోణ్ణి, వీళ్ళ పోలికలొచ్చాయని వీళ్ళు చిన్నోణ్ణి నెత్తి మీద పెట్టుకుని చూసుకుంటున్నారు. ఒకడు బంగారం, ఒకడు వజ్రమనుకో. చెప్పినమాట, గీసిన గీత దాటరు, తెలుసా..." దాని మాటలు అడ్డులేని ప్రవాహంలా సాగుతున్నాయి.

దాని ప్రతి మాటకీ నాలో నీరసం కేజీలెక్కన పెరుగుతున్నా వినక తప్పలేదు నాకు.

అదో ఫ్యామిలీ ప్యాక్ తినే లోపు నేనో మినీ తిని, బిల్ కట్టి బయటకొచ్చాను.

నా వెనకే హ్యాండ్‌బ్యాగ్ ఊపుకుంటూ వచ్చింది అది. ఆ బ్యాగ్ షోయింగ్‌కే తప్పా అందులో నోట్లేం ఉండవని దానితో పరిచయం ఉన్న ప్రతివారికీ తెలుసు.

"సరే. చాలా పనుంది. నేను వెళతాను. బై..." అంటూ నా భుజం మీద ఓ చరుపు చరిచి వెళ్ళిపోయింది రాణి.

దాని ప్రవర్తనకి విసుగేసింది. ఆ విసుగూ, నీరసంతో ఇంటికెలా వచ్చానో తెలీలేదు. మంచం

మీద వాలడం మాత్రమే తెలిసింది.

విజయ్ వచ్చుంటే కొంచెం ధైర్యంగా ఉండేది. కానీ ఈ రోజు ఆఫీసులో ఇన్‌స్పెక్షనుందని, రావడానికి లేటవుతుందని, హాస్పిటల్‌కి నన్నొక్కదాన్నే వెళ్ళొచ్చెయ్యమన్నాడు.

చీకటి పడుతోంది. విజయ్ వస్తాడు. వంట చెయ్యాలి. విచక్షణ ఏదేదో చెప్తోంది. కానీ లోలో పల తీరని అశాంతి...! ఏ పనీ చేయబుద్ధి కాని నిరాసక్తత! మంచం మీంచి లేవాలనిపించలేదు. కళ్ళు మూసుకునే ఉన్నాను. మెదడు మాత్రం ఎప్పటికంటే ఎక్కువ పని చేస్తున్నట్టుగా ఆలోచనలతో ఒంట్లో ఓపికని ఆవిరి చేసేస్తోంది.

మనసు వేదన ఎవరితో చెప్పుకోవాలి..? సంతోషాన్ని ఎవరికైనా చెప్పుకోవచ్చు. మరి బాధని? ప్రశ్నలు మిగుల్చుతున్న బాధతో నిమిషాలు యుగాల్లా అనిపిస్తున్నాయి.

“శిరీ...శిరీ...” విజయ్ గదుల్లో లైట్లేసి, నన్ను పిలుస్తూ బెడ్రూంలో కొచ్చాడు.

నిరాసక్తంగా కళ్ళు తెరిచి, తల తిప్పి చూశాను. విజయ్ నా వంకే చూస్తున్నాడు.

“నేను భోంచేసి వచ్చాను. ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ అయ్యాక అందరితో కలిసి తినక తప్పలేదు. నువ్వు చేసెయ్యి” టై నాట్స్ విప్పుతూ చెప్పాడు విజయ్.

రిలాక్స్‌గా నిట్టూర్చి, కళ్ళు మూసుకున్నాను. కాసేపటికి వంటగదిలో ఏదో చప్పుడు. “శిరీ...” పిలుస్తూ వచ్చాడు విజయ్.

ఫ్రెష్షయి వచ్చిన అతని చేతిలో పాలగ్లాసు.

వచ్చి నా పక్కన కూర్చుంటూ, “శోభనం రోజు నువ్వు పాలగ్లాసు తెచ్చావ్. పదేళ్ళకి సీన్ ఇలా రివర్స్ అవుతుందన్నమాట..” అన్నాడు నవ్వుతూ, నన్ను నవ్వించడానికి ప్రయత్నిస్తూ.

నేను మౌనంగా ఉండిపోయాను.

“వంట చెయ్యలేదు. ఫోన్ చేస్తే ఏమన్నా తెచ్చేవాణ్ణి కదా. లే...ఈ పాలు తాగు..?” అన్నాడు నా చేయి పట్టుకుని లేపుతూ.

“నాకేం వద్దు విజయ్. నోరు బాలేదు. ప్లీజ్...” అన్నాను.

ఒక నిమిషం నిశ్శబ్దం తర్వాత, “డాక్టర్ గారు చెప్పినదానికి బాధపడుతున్నావా...?” అన్నాడు.

నేను ఆశ్చర్యంగా చూశాను. నన్ను దగ్గరకు తీసుకుని పాల గ్లాసుని చేతికిచ్చాడు.

నా బాధ పోగొట్టాలని విజయ్ మాట్లాడుతూనే ఉన్నాడు. కానీ నా చెవులకి ఏదీ ఎక్కట్లేదు.

•••

ఏ వేళలోనో పట్టిన నిద్ర, ఎవరో కొట్టి మరీ లేపుతున్నారు.

నలిబిలి పెడుతున్న పీడకలలోంచి ఒక్కసారిగా కళ్ళు తెరిచాను.

ఎదురుగా లలిత! నన్ను చూసి నవ్వుతోంది.

“లలితా...! ఎప్పుడొచ్చావే..! ఇది కలా, నిజమా?” అపనమ్మకంతో తల విదిల్చి లేచి కూర్చున్నాను.

అప్పుడే విజయ్ లోపలకు వచ్చాడు. “మీ ఫ్రెండొచ్చిందిగా...ఇక మమ్మల్నేం పట్టించుకుంటారు రాణీవారు. అందుకే బయటే టిఫిన్ చేసి, తమ కోసం కూడా తెచ్చాను. మధ్యాహ్నం ఎలాగూ మీ ప్రయోగాలు మీకుంటాయి కదా! ఇక నేను బయలుదేరనా...” నవ్వుతూ నా వంక చూసి అడిగాడు విజయ్.

నేను విస్మయంగా వాల్‌క్లాక్ వంక చూశాను. పదిన్నర అయ్యింది!

నేను నిద్రపోతున్నానని నన్ను డిస్టర్బ్ చేయకుండానే తను ఫ్రెషప్ అయినట్టున్నాడు.

తలూపి వెళ్తానన్నట్టు చూస్తున్న విజయ్‌కి వెళ్ళిరమ్మన్నట్టు తలూపాను.

తలుపు దగ్గరకు వేసి వెళ్ళిపోయాడు విజయ్.

చిరునవ్వుతో నన్నూ, విజయ్‌నీ చూస్తూ కూర్చున్న లలితను చూడగానే నిన్నట్నుంచీ నేను అనుభవిస్తున్న దుఃఖం కళ్ళలోకి పొంగుకొచ్చింది.

వెక్కిళ్ళతో ఏడుస్తున్న నా భుజం చుట్టూ చెయ్యేసింది లలిత. ఇద్దరి మధ్యా కొన్ని నిమిషాల మౌనం. అది ఏంటీ అనడగలేదు. నేను ఇదీ అని చెప్పలేదు.

నిమిషాలు గడిచేకొద్దీ నా మనసులోని భారం తగ్గినట్టనిపించింది. లేచి కళ్ళు తుడుచుకున్నాను.

ఆమె మనసంతా నిరాశ నిండిపోయింది. ఆమెకు వచ్చింది మామూలు కష్టం కాదు. ఇప్పుడు ఆమె బాధ పంచుకోవడానికి వెంట భర్త కూడా లేడు. శరీరమంతా నిస్సత్తువ ఆవహించింది. ఇంటికెలా జేరిందో తెలియదు. మంచంమీద వాలిపోయింది. వెక్కిళ్ళతో ఏడుస్తున్న ఆమె భుజాన్ని చుట్టేసిందో ఆపన్న హస్తం. ఆమెకు అంతకష్టం ఏమొచ్చింది? ఆమె తిరిగి మామూలు మనిషి కాగలదా?

నవ్యవీక్లి-నాటా సంయుక్త నిర్వహణలో బహుమతి పొందిన కవిత

అక్షరాల్లేని పుస్తకం

ఏం చేస్తుంటావని ఎవరైనా ప్రశ్నిస్తే
మనుషుల్ని చదువుతుంటానని
సమాధానమిస్తాను
మనిషిని చదవటమంటే పుస్తకాన్ని చదివినట్టు
పేజీలు పేజీలు అక్షరాల చీమలబారుని
చదవటం కాదు
మనిషిని చదవటం అంటే అద్దం ముందు
నిల్చొని
తనలోని సృష్టిలోపాలని అదే పనిగా వెదకటం
కాదు
మనిషిని చదవటం అంటే ప్రపంచ పరిశోధనా
పత్రాన్ని చదవటం.
సప్తసముద్రాల సంగమ ప్రదేశంలో ఏకశ్వాసతో
మునకేసి
అగాధ అంతర్వేది మైదానాల్లో అహాన్ని
వెదకటం
తాను కాని తనలోకి కవ్వం వేసి చిలికి చిలికి
అనంత చీకటి ఊబిలో కూరుకున్న కిరణాన్ని
వెలికి తీయటం
మనిషిని చదవటం అంటే కాలపు చివరి
అంచుని
మనోవేగంతో వెంటాడి జతకట్టి పయనించటం
నవమాసాల అమ్మతిత్తిలోకి సూక్ష్మబిందువై
ప్రవేశించి
పేగుముడి బంధంలో కన్నమ్మ కలలు
తిలకించటం
జీవనోత్సాహపు పరివేషంలో అనామకుడై
పరిభ్రమిస్తూ
అమీబా ఆత్మలోకి పరకాయ ప్రవేశం
సాధించటం
నాటి పరిణతికీ నేటి వికాసానికీ మధ్య జరిగిన
అప్రత్యక్ష అంతరంగ తరంగ యుద్ధాన్ని
అవలోకిస్తూ
ఆరోహణం నుండి అవరోహణానికి పయనించి
పాత మనిషి నుండి సరికొత్త మనిషిని
అన్వేషించటం
మతాల మాయలో పడి కూపస్థ మండూకమై
తన చుట్టూ తానే పరిభ్రమిస్తున్నాడు మనిషి
నక్షత్రాల వెలుతురు రజనులా నేలకి
దిగివచ్చినా
నేల విడిచిన సాముకి తల్లకిందులౌతున్నాడు

మనిషి
పిడికెడు పొట్ట చేతబట్టుకొని కట్టెదుటి
కష్టాలను నిర్లక్ష్యం చేసి
ప్రవాస నివాసానికి కులాసాల విలాసాలకి
అర్రులు చాస్తున్నాడు
తనేంటో అన్వేషించను తపస్సులు చేస్తూ ఓ
వైపు
సమస్త భువనాల్లో తనకై వెతికే క్షిపణులతో
మరోవైపు
ఎంత చదవాలనుకున్నా అర్థం కాని మనిషి
అక్షరాల్లేని పుస్తకమే!

-ఈతకోట సుబ్బారావు
సెల్: 94405 29785

ఇద్దరం ఫ్రెష్ అయి టిఫిన్ చేశాం.

"ఇప్పుడు చెప్పు ఏంటి నీ ప్రాబ్లం...?" అంది లలిత.

కొత్తగా సమస్యలేమున్నాయని..? ఏం మాట్లాడ లేదు నేను.

"మనిషన్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లోటు ఉంటుంది శిరీ..." నా కళ్ళలోకి చూస్తూ అంది.

నేను నొసలు చిట్లించి చూశాను.

"నీకున్న లోటు మరొకరికి ఉండకపోవచ్చు. కానీ... లోటుమాత్రం ఉంటుంది. దాన్ని కొందరు తీరని సమస్యగా భావించి డిప్రెషన్‌లోకి వెళ్ళిపోతారు. మరికొందరు ఆ లోటుని మరొక దానితో పూడ్చుకుంటారు. ఇంకొందరు దాన్ని మామూలు విషయంగా తీసుకున్నా, నిరాసక్తంగా బతుకుతారు. కానీ తెలివైన వాళ్ళు, జీవితం విలువ తెలిసిన వాళ్ళు ఏం చేస్తారో తెలుసా?" అడిగింది లలిత.

ఆసక్తిగా చూశాను దానివంక.

"ఆ లోటు కలిగించిన బాధలోనే మంచినీ వెతుక్కుంటారు. దాన్నీ సంతోషంగా స్వీకరిస్తారు. పాజిటివ్ దృక్పథంతో ఆనందంగా బతుకుతారు" చెప్పి నావంక చూసింది.

మాటల అర్థం బుర్రకెక్కిందిగానీ, భావం బోధపడలా! క్షణక్షణం నలుగురిలో చులకన చేస్తున్న ఈ లోటులో మంచి ఏముంటుంది? బోసిగా ఎదుట నిలబడే శూన్యాన్ని చూస్తూ కూడా ఈ లోటుని మరిచి ఎలా బతకడం?

నేనెందుకు బాధపడుతున్నానో లలితకి పూర్తిగా తెలియకపోయినా, బాధపడే కారణం మాత్రం తెలుసు. ఎందుకంటే ఈ బాధ... కొత్తగా వచ్చింది కాదుగా...! ఇప్పుడు ఈ లోటు మరి దేనితో పూడ్చుకోవాలి...?

ఆలోచనలో పడ్డాను నేను.

"ఏయ్ అలా షాపింగ్‌కి వెళ్ళొద్దామా..?" మాట మారుస్తూ అడిగింది లలిత.

లలిత వాళ్ళుండేది సిటీకి కొంచెం దూరంగా. ఏమైనా కావలసి వచ్చిందేమో, వెళ్ళే ఆసక్తి లేకపోయినా కదిలాను.

ఇంటికి తాళం వేసి ఇద్దరం మెయిన్ రోడ్డు మీదకొచ్చాం. సెంటరంతా తిరిగాం. బేరాలాడి బట్టలూ, ఫ్యాన్సీ ఐటెమ్స్ కొన్నాం. వెనక్కి వస్తుంటే, "రాణి వాళ్ళింటికి వెళదామా?" అనడిగింది లలిత.

"అమ్మో రాణి వాళ్ళింటికా..! నేను రాను గానీ నువ్వు వెళ్ళు. నిన్న సాయంత్రమే కనిపించింది నాకు..." అన్నాను, నిన్నటి అనుభవాన్ని తలుచుకుంటూ.

"చాలా రోజులకి వచ్చాను. ఒక్కసారి ముగ్గురం కలుసుకుంటే బావుంటుందని నా సరదా. ప్లీజ్ నువ్వొస్తున్నావ్, అంతే. ముందు దానికి ఫోన్ చేసి, ఇంట్లో ఉందో లేదో కనుక్కో. నేనొచ్చానని చెప్పకు. సర్‌ప్రైజ్ ఇద్దాం..." అంది రిక్వెస్టింగ్‌గా.

దీని సర్‌ప్రైజ్ ఈ రోజు పొద్దున్న నేను చూసిందేగా. రాణీకి ఫోన్ చేసి అడిగాను.

"లేదు. నేను అమ్మావాళ్ళింట్లో ఉన్నాను. ఈవెనింగ్ ఇంటికెళ్ళేసరికి లేటయిపోతుంది. రేపు రా.." అంది రాణి.

"సరే ఉంటా"నని ఫోన్ కట్‌చేసి, రాణి చెప్పినదాన్ని లలితకు చెప్పాను.

"ఆంటీ వాళ్ళింటికెళ్ళిందా.. ఓకే... దార్లోనేగా వాళ్ళిల్లు. డైరెక్ట్‌గా అక్కడకే వెళ్ళి సర్‌ప్రైజ్ ఇద్దాం..." అంది లలిత.

దార్లో...నిన్న అది కలిసినప్పుడు జరిగిందంతా లలితకి చెప్పాను. మా మాటల్లోనే రాణి అమ్మా వాళ్ళుండే ఏరియా వచ్చింది. వాళ్ళ ఇంట్లోకి వెళ్ళే సరికి గోలగోలగా ఉంది.

"ఇలా చెప్పిన మాట వినకపోతే నిన్ను మీ నానమ్మా వాళ్ళింటికి పంపేస్తాన్రా. అప్పుడు గానీ కుదరదు నీ తిక్క" రాణి వాళ్ళమ్మగారు గట్టి గట్టిగా అరుస్తున్నారు.

ఇద్దరం లోపలికి వెళ్ళాం. మమ్మల్ని చూసి ఆవిడ సంతోషంగా లోపలికి ఆహ్వానించారు.

మేం కుర్చీల్లో కూర్చుంటుండగా, ఏడెనిమిదేళ్ళు కూడా లేని రాణి కొడుకు, ఆవిడ మీదున్న కోపాన్నంతా ఇంట్లోని సామాన్లని అటూఇటూ చిందరవందరగా పడెయ్యడంలో చూపిస్తున్నాడు.

ఇంట్లో వాళ్ళిద్దరే తప్ప రాణి ఉన్న జాడ ఎక్కడా కనపడలేదు.

"రాణీ లేదా ఆంటీ..?" అనడిగింది లలిత.

"ఇక్కడెందుకుంటుందమ్మా. మొన్న సెలవులివ్వగానే పిల్లోణ్ణి ఇక్కడ వదిలేసింది. అప్పట్నుంచీ ఇటువైపు రాలేదు" చెప్పారావిడ రాణీ మీదున్న విసుగును బాహాటంగా ప్రదర్శిస్తూ.

మేం ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళం చూసుకున్నాం.

లలిత నన్ను కళ్ళతోనే బయటపడొద్దన్నట్టు వారించి, "అయ్యో, అలా అంటారేంటాంటీ. దానికేవన్నా పనులున్నాయేమో" అంది మెల్లగా.

"పనులా...నా మొహమా, మీ ఫ్రెండు గురించి మీకు తెలిసిందేగా. దాని షోకులూ షికార్ల కోసం ఇక్కడొకణ్ణీ, అక్కడొకణ్ణీ పడేసింది. వీళ్ళేమో మా మాటిని సావరు. అబ్బబ్బ... సచ్చిపోతున్నాను..." వాడు విసిరేస్తున్న వాటిని తీస్తూ విసుగ్గా చెప్పిందావిడ.

రాణీ సెల్ఫిష్‌నెస్ తెలిసే ఒకే ఊరిలో ఉన్నా, నేను అంటీముట్టనట్టుగానే ఉంటాను. నిన్న దాని మాటలు విని, అదే నిజమనుకున్న నాకు ఆంటీ చెప్పిన మాటలు షాకింగ్‌గా అనిపించాయి.

"చిన్నవాడు కదా...తెలీనితనం. పోనీ పెద్దాణ్ణి ఇక్కడుంచుకోవలసింది..." అంది లలిత.

ఆవిడ కళ్ళు పెద్దవి చేసి భయం నిండిన భావంతో మావంక చూస్తూ, "అమ్మనాయనో! పెద్దాడికంటే వీడే నయం. రామరామ. పదేళ్ళ పిల్లాడికి అంత టీవీ పిచ్చా! అన్నం తింటున్నా టీవీ ఉండాలి. పడుకున్నా టీవీ ఉండాలి. కట్టేస్తే ఊరుకోడు. స్నానం చెయ్యడు, చెప్పిన మాట అస్సలు వినడు. అర్ధరాత్రి దాటినా నిద్రపోడు. రాణీకి చెప్తూనే ఉన్నాను, భయం చెప్పండే అని. అది పట్టించుకోదు. మగపిల్లలు చెయ్యిదాటితే ఎంత కష్టం. ఈ వయసులో మాట వినకపోతే పెద్దయ్యాక అసలు వింటారా? ఇప్పుడు మనం ఏం చేస్తే, పిల్లలు మనల్ని చూసి అదే నేర్చుకుంటారు. అంతే కదమ్మా. మీ ఫ్రెండుకి ఎన్నిసార్లు చెప్పినా వినదు. పెద్దోడు, ఆడెంత...ఆడి వయసెంత...మిడ్‌నైట్ మసాలాలు చూస్తాడు! ముందు వీళ్ళు మారాలి కదా. రాత్రిళ్ళు టీవీ కట్టేస్తేనేగా వాడు మారేది..." ఆవిడ చెప్తూనే ఉంది.

నాకు షాక్కొట్టినట్లైంది. అపనమ్మకంగా ఆంటీ వంక చూశాను.

ఆవిడ రాణీ పిల్లలతో పడుతున్న సాధకబాధకాలన్నీ చెప్తూనే ఉంది.

దయ్యం సినిమాలో బికినీయా?

రూటు మార్చి హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలు, దయ్యం సినిమాలు చేస్తూ, జనాలను భయపెట్టడానికి రెడీ అయిన త్రిష మరో దయ్యం సినిమాకు ఓకే చెప్పింది. అయితే ఇది అవడానికి దయ్యం సినిమానే అయినా, ఇందులో గ్లామర్ చూపించడానికి బోలెడంత అవకాశం ఉందట! పనిలో పనిగా ఈ సినిమాలో త్రిష బికినీ కూడా వేయబోతోందట! దయ్యం క్యారెక్టర్‌కి బికినీ ఏమిటీ? అని చాలా మంది అంటున్నా వాటిని లైట్‌గా తీసుకున్న త్రిష ఈ సినిమాలో బికినీ వేయడానికి డిసైడ్ అయిపోయిందట!

నేను మాత్రం ఆ మాటల దగ్గరే ఆగిపోయాను.

లలిత, ఆంటీ వాళ్ళ కుటుంబ విషయాలు అడుగుతుంటే, ఆవిడ తన జీవితాన్ని తిట్టుకుంటూ, అన్ని కష్టాలూ ఆవిడకే ఉన్నట్టుగా జవాబిస్తున్నారు.

నాకు మాత్రం ఆవిడ మాటలు వింటుంటే ఎక్కడలేని నిస్సారంగా అనిపిస్తూ నిమిషాలు అస్సలు కదలనట్లుగా ఉన్నాయి. జీవితంపై అనాసక్తి, నెగెటివ్ దృక్పథం ఏర్పరచుకుంటే బతుకు ఎంత భారంగా మారుతుందో ఈవిణ్ణి చూస్తే తెలుస్తుంది.

వాళ్ళిద్దరి మాటల్నీ వినీవిననట్టు వింటూ కూర్చున్నాను.

నా భావాల్ని గ్రహించిన దానిలా, "ఇక వెళ్ళొస్తాం ఆంటీ..." అంటూ లేచి నుంచుంది లలిత. ఆంటీ ఇద్దరికీ బొట్టుపెట్టి జాకెట్ ముక్కలు చేతిలో పెట్టింది.

నా కళ్ళలోకి చూస్తూ, "నీకు ఇంకా పిల్లలు లేరు కదూ! ఇంకెందుకులేమ్మా పిల్లలు..మీ ఫ్రెండు పిల్లల్ని చూస్తున్నావుగా. వీళ్ళు పిల్లలు కాదు పిల్ల రాక్షసులు. ఈరోజుల్లో పిల్లల్లేని గొడ్రాళ్ళ పనే హాయి." అందావిడ రపీమని.

నేను బిత్తరపోయాను. ఆవిడ మెచ్చుకుందా, వేలెత్తి చూపిందా...! నా కళ్ళ నిండా నీళ్ళు...నాకు తెలీకుండానే...!

శిలలా నిలబడ్డ నన్ను చెయ్యి పుచ్చుకుని లాక్కొచ్చింది లలిత.

ఇంటి వైపు సాగుతున్నాం ఇద్దరం. నా కళ్ళకి మాత్రం దారి బదులు ఇన్నాళ్ళూ నేనెదుర్కొన్న చేదు అనుభవాలూ, ముఖ్యంగా కొన్ని ఫంక్షన్లలో ఎవాయిడ్ చేయబడ్డ సంఘటనలూ, నిన్నటి డాక్టరు గారి మాటలూ, చివరగా ఈవిడ ఎత్తిపొడుపులూ ఇవే కనిపిస్తున్నాయి.

ఇంటికొచ్చీ రాగానే ఉగ్గబట్టుకున్న దుఃఖం వెల్లువై నా ప్రమేయం లేకుండానే కళ్ళ వెంట ధారలుగా బయటకొచ్చింది.

"ఏయ్...శిరీ...ఏంటిదీ..." అంటూ నా కళ్ళు తుడుస్తూ నన్ను ఓదార్చింది లలిత.

దాని ఆత్మీయపూరిత స్పర్శకి- నిన్న జరిగిన దాన్ని ఇంక మనసులో దాచుకోలేకపోయాను.

లాప్రోస్కోపీ ద్వారా గర్భాశయనాళాల్లోని నీటి బుడగల్ని తొలగించినా కూడా, నాకు ఇంక పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టరుగారు నిన్న సాయంత్రం కచ్చితంగా చెప్పేసిన విషయాన్ని లలితకి చెప్పాను. ఇక అన్ని ఆశల దారులూ మూసుకుపోయినట్టే. నాది గొడ్రాలి బతుకే అన్న నిజాన్ని జీర్ణించుకోలేనితనం నాలో.

నేను చెప్పిన దానికి లలితలో బాధో, మరో స్పందనో ఏదీ లేదు. నిశ్చలంగా ఉన్న దానిలోని ఆలోచనలు ఏమై ఉంటాయో!

"శిరీ...నీకు చెప్పాను చూడూ. మనిషన్న ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లోటుంటుందని. దాన్ని నువ్వు ఇంకా అర్థం చేసుకోలేకపోయావ్. అది అర్థం చేసుకుంటావనే నిన్ను రాణీ వాళ్ళింటికి తీసుకెళ్ళాలనుకున్నది." తల నిమురుతున్నట్టుగా, చెదిరిన జుట్టుని వెనక్కి సరిచేస్తూ నిదానంగా అంది లలిత.

నాకు నిజంగానే అది చేసిందేంటో అర్థంకాలేదు.



ఎవరికెన్ని సమస్యలున్నా నాలాంటి పెద్ద సమస్యలేం కావుగా అవి. వాటిని ఎలా అయినా పరిష్కరించుకోవచ్చు. కాని, నాది..? ఈ జీవితానికి సరిచేసుకోలేని అతి పెద్ద లోటు. అదే చెప్పాను దానికి.

నా మాటలకి నవ్వింది లలిత. "నువ్వు నీకు తెలిసిన జీవితంలోంచి చూసుకుంటూ, నీది మాత్రమే పెద్ద ప్రాబ్లం అనుకుంటున్నావు. అందరి జీవితాల్లోకి తొంగి చూస్తేనే కదా ఎవరిది పెద్ద సమస్యో నీకు తెలిసేది." అంది లలిత.

ఒప్పుకోలేనట్టుగా మౌనంగా ఉండిపోయాను.

'నువ్వు ఫోను చేసినప్పుడు రాణీ, వాళ్ళ అమ్మా వాళ్ళింట్లో ఉన్నానని చెప్పింది. మరి వాళ్ళ అమ్మగారేమో అది అసలు రావట్లేదు అంటున్నారు. మరి ఇంటికొస్తామంటే అబద్ధం ఎందుకు చెప్పింది..? అంటే మనకు తెలీకూడనివి ఏవో ఉన్నాయి. నిన్న వాళ్ళ పిల్లల గురించి నీతో చాలా గొప్పగా చెప్పిందన్నావ్. కానీ వాళ్ళమ్మగారేం చెప్తున్నారు? మరి రెండింట్లో ఏది నిజం?" అడిగింది లలిత.

"ఆంటీకి మనతో అబద్ధం చెప్పాల్సిన అవసరం ఉండదుగా.." అన్నాను ఆలోచిస్తూ.

"అంటే, రాణీకి ఆ అవసరం ఉందేమో.." అడిగింది లలిత.

స్థాణువయ్యాను దాని మాటలకి. "ఆ అవసరం రాణీకేంటి?" అనడిగాను.

"ఆ అవసరం రాణీకేంటా...అది నీకు డైలాగు లేసిందన్నావ్, ఏమనీ? మీ ఆయనా, నువ్వూ చిలకాగోరింకల్లా తిరుగుతారనీ, మీ ఆయన్ని ఎవరన్నా నాజూకమ్మాయ్ ఎత్తుకు పోతుందనా అనీ, మా పిల్లల్లో ఒకడు బంగారం, ఒకడు వజ్రం...ఇవేగా అది నీతో అన్న మాటలు. వీటిల్లో నీకు ఈర్ష్యా అసూయలు కనిపించట్లేదా? నువ్వూ విజయ్ ఏం చేసినా కలిసే చేస్తారు. అలాంటి అవకాశం తనకి లేకపోవడం దాని జీవితంలో లోటేమో. రాణీ వాళ్ళాయన నీకూ తెలుసుగా..'ఎప్పుడూ అమ్మాయిలను చూడని వాడిలా అలా చూశాడేంటే' అని నువ్వే నాతో ఓసారి అన్నావ్. విజయ్‌లాంటి - భార్యనే ప్రేమించే భర్త విలువా, ఆ లోటూ దానికి తెలుసు కాబట్టే ఏం సందర్భం లేకుండానే నీకా డైలాగ్ వేసింది. దానికంటే నీ జీవితం బావుంది అనేదాన్ని అది డైజెస్ట్ చేసుకోలేకే ఈ డైలాగులన్నీ! ఇక పిల్లలంటావా..ఆంటీ ఏం చెప్పారో విన్నావుగా. నీతో అవన్నీ చెప్తే, హమ్మయ్య అనుకుని హ్యాపీగా ఫీలవుతావు కదా. అలా కాకుండా నీలోని లోటుని ఎత్తి చూపాలనీ, అది నీకంటే హ్యాపీగా ఉందని నీ ముందు ఋజువు చూపించుకోవడం కోసం ఆ సోది కబుర్లన్నీ.." విశ్లేషించి చెప్పింది లలిత.

నేను కళ్ళు పెద్దవి చేసి, నిజంగా అంత అర్థముందా అన్నట్టు చూశాను.

"నీకు పెళ్ళై పదేళ్ళైనా పిల్లల్లేరు అనేది తప్ప ఇంకే లోటూ లేదు. లోపం నీలో ఉందని తెలిసినా ఒక్కమాట అనని, ఎవరినీ అననివ్వని మంచి భర్త విజయ్. సో నీ లోటల్లా పిల్లలు. అంతేగా, మరి రాణీకి..? మీ అత్తగారోళ్ళకీ..? నాకు..? ఇంకా నీ చుట్టుపక్కల వాళ్ళకీ..? ఎప్పుడన్నా గమనించావా..?" నావంక చూస్తూ గంభీరంగా అడిగింది.

రాణీ విషయం వరకూ అర్థమైంది. మిగతా సమస్యలు నాకు అర్థమయ్యీ కానట్లున్నాయి.

"నీకు తెలుసుగా ఈరోజుకీ మాది ఉమ్మడి కుటుంబం. మా అత్తగారి ఎదురుగా ఏం చేసినా తప్పే. అందర్లోకి ఎక్కువ సంపాదించేది మా ఆయనే. అయినా స్వతంత్రించి ఏ ఖర్చూ పెట్టుకోడానికి ఉండదు. వేరే కాపురమన్న ఊహే రాకూడదు. మా అత్తగారు చెప్తే నా మీద చేయి చేసుకోవడానికి వెనుకాడడు రఘు. ఆ ఇంట్లో నాది ఓ పనిమనిషి స్థానం. నీకు తెలీని విషయమేమిటంటే.. కనీసం నేను ఇక్కడకు రావాలన్నా మా అత్తగారి పర్మిషన్ కావాలి. అందుకే అమ్మా వాళ్ళనో, నిన్నో చూడాలని ఎంత అనిపించినా... ఎప్పటికో ఓసారి ఇలా.." చెప్తుంటే దాని కళ్ళల్లో నీటి చెమ్మ కదిలింది.

దాన్ని చూసి నా కళ్ళు తడిబారుతుంటే అసంకల్పితంగా దాని చేతిని నాచేతిలోకి తీసుకున్నాను.

"నా సంగతి పక్కన పెట్టెయ్. అసలు నీ ఉద్దేశంలో పిల్లలు ఎందుకే..?" అంది లలిత. తన కళ్ళలోని చెమ్మని కొనగోటితో తుడుచుకుంటూ.

"అదేంటే అలా అడుగుతావ్..! వాళ్ళు మనకి వారసులు. మనం సంపాదించిన పేరునీ, మంచితనాన్నీ, ఆస్తుల్ని అనుభవించాల్సిన వాళ్ళు. మన వృద్ధాప్యంలో ఆసరా వాళ్ళేగా.." చెప్పాను.

"అవునా. మరి ఈ రోజుల్లో ఎందరు పిల్లలు అలా మన పేరునీ, మంచితనాన్నీ నిలబెడుతున్నారు? ఈ తరం పిల్లల గురించి కాదు, మనం... మనం ఏం చేశాం? మొన్న మీ అమ్మగారికి కాలు విరిగిందన్నావ్. ఎన్ని రోజులు ఆవిడ దగ్గరున్నావ్? పోనీ మీ అన్నయ్యా వదినలు చూశారా? వాళ్ళ ఉద్యోగాలకు వాళ్ళు వెళ్ళిపోయారు. నువ్వూ నాలుగు రోజులుండి వచ్చేశావ్. ఎందుకు? ఇక్కడ మీ ఆయన ఇబ్బంది పడుతున్నాడని. పోనీ నువ్వు ఆడపిల్లవి. మరి మీ ఆయన విజయ్..? మీ అత్తగారికి లేకలేక లేటు వయసులో పుట్టిన ఒక్కడే కొడుకు. వాళ్ళని ఈ డెబ్బై ఏళ్ళ వయసులో చూసుకోవాల్సింది మీరే. కానీ వాళ్ళెక్కడో, మీరు ఎక్కడో. నేను ఒప్పుకుంటాలే. అది మీ ఉద్యోగ పరిస్థితి. మీ వైపు నుంచి కాదు. మీ అత్తగారి వైపు నుంచి ఆలోచించు. ఉన్న ఒక్క కొడుకూ ఎక్కడో ఉండి, కనీసం ఆర్నెల్లకోసారి కూడా రాకపోయినా మిమ్మల్ని ఏమనలేక, ముఖ్యంగా ఆ అసంతృప్తిని నీపై చూపించక, వంశాంకురాన్ని చూసుకోవాలనున్నా కొడుకు బాధపడతాడని నిన్ను ఏమనకా...ఇప్పుడు చెప్పు వాళ్ళకి లోటు లేదంటావా?" సూటిగా అడిగేసింది.

నాకు మా అత్తగారూ, ఆ ఊరూ కళ్ళలో మెదిలాయి. మేం వెళ్ళినప్పుడల్లా ఆవిడ ఆశగా ఎన్ని రోజులుంటారని అడగడం, నాతో పని చేయిస్తే మేం ఎక్కడ వెళ్ళిపోతామేమోనని, నన్ను కూతుర్లా కూర్చోబెట్టి పనంతా ఆవిడే చెయ్యడం గుర్తొచ్చింది.

కనీ పెంచిన కొడుకు ముసలితనంలో తోడుగా పక్కన లేకపోవడం, సొంత పనులే చేసుకోలేని ఆ వయసులో ఏకాకులుగా బతకాల్సి రావడం అతి పెద్ద లోటేగా..!

"ఈ ప్రపంచంలో లోటంటూ ఉండని వారు ఎవరూ ఉండరే. కానీ కొన్ని లోటులకి ప్రత్యామ్నాయాలు ఉంటాయి. బహుశా మీ లోటు సరోగసి ద్వారా బిడ్డని కంటేనో, లేక ఒక అనాథ బిడ్డని దత్తత తీసుకుంటేనో క్రమక్రమంగా తీరుతుంది. మరి మీ అత్తగారు ఎవరిని పెంచుకోవాలి..? నేను మా బందిఖానా నుంచి ఎలా తప్పించుకోవాలి? రాణీ తన లోటు పోగొట్టుకోవడానికి మొగుణ్ణి మార్చుకోగలదా..? మా అందరికంటే నీది పెద్ద సమస్యా?" నా కళ్ళలోకి చూస్తూ అడిగింది లలిత.

ఈ ఆలోచన ఏనాడూ నాలో కలగనిది..! నా జీవితం విలువ ఎంతో..అసలు జీవితమంటే ఏంటో...అవగాహనైంది.

లోటు తీరి తృప్తి నిండిన కళ్ళతో నవ్వుతూ లలిత వంక చూశాను.

లలిత తన ఫోనులో ఏదో వెతికి నాకు చూపించింది.

"మీ ఫ్రెండు చాలా బాధలో ఉంది. ఎలాగోలా వీలు చేసుకుని ఒక్కసారి తనని కలిసి వెళ్ళండి-విజయ్" అంటూ విజయ్ సెల్ నుంచి వచ్చిన మెసేజ్ అది.

ఎప్పుడు ఇచ్చాడా అని, టైం చూశాను. నిన్న అర్థరాత్రి సమయంలో...!

ఎందుకో.. నా మనసులోని లోటూ, బాధా.. మచ్చుకైనా లేకుండా మాసిపోయాయి.

సెల్: 9908063266

అందరూ కలిసి తింటేనే ఆరోగ్యం

ఇప్పుడున్న సాంఘిక పరిస్థితుల నేపథ్యంలో అందరూ కలిసి కూర్చుని తినే అవకాశాలు మృగ్యమైపోతున్నాయి. దీని ప్రభావం పెద్దల మీద కన్నా పిల్లల మీదే ఎక్కువ పడుతుంది అంటున్నారు అమెరికా పరిశోధకులు. పిల్లల్లో ఎక్కువ బరువు, తక్కువ బరువు సమస్యలకు కారణం అందరూ కలిసి కూర్చుని భోజనం చేయకపోవడమేనని వారం చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో కలిసి భోజనం చేసే సమయంలో వారి తిండి మీద ఓ కన్నేసి ఉంచవచ్చునీ, వారు ఎంత ఆహారాన్ని తీసుకుంటున్నారు? ఏఏ పదార్థాలు తింటున్నారు? అని పరిశీలించే అవకాశం ఉందని చెబుతున్నారు. దీని వలన పిల్లలకు సరిపడా ఆహారం అందే అవకాశం ఉందన్న విషయం వీరి పరిశోధనలో తేలింది. సుమారు 200 కుటుంబాలలో ఆహారపు అలవాట్ల మీద అధ్యయనం నిర్వహించిన అనంతరం వీరు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఎవరికి వారు తినే అలవాటు ఉన్న కుటుంబాల్లోని పిల్లలు అనారోగ్యంతోనూ, ఊబకాయంతోనూ బాధపడుతున్న విషయాన్ని వీరు గుర్తించారు. పిల్లలతో కలిసి తల్లిదండ్రులు భోజనం చేసినట్టయితే చాలా వరకూ సమస్యలు పరిష్కారం అవుతాయని వారు సూచిస్తున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

పెరుగుతున్న వయస్సుకి పీచు తోడు

పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదన్న విషయం తెలిసిందే! వృద్ధాప్యంలో పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చు అంటున్నారు ఆస్ట్రేలియా పరిశోధకులు. సుమారు 1600 మంది వృద్ధుల మీద వీరు పరిశోధనలు నిర్వహించారు. పీచు ఎక్కువగా తీసుకున్న వారు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడాన్ని వీరు గుర్తించారు. వీరిలో గుండెజబ్బులు, అరుగుదల సమస్యలు, కేన్సర్ వంటి సమస్యలు కనిపించలేదని పరిశోధకులు చెబుతున్నారు. పీచు అధికంగా లభించే కూరగాయలే కాకుండా నట్స్ వంటి వాటిని కూడా ఆహారంలో చేర్చుకుంటే మంచిదని వీరు సూచిస్తున్నారు. వృద్ధులు పీచు పదార్థాలను తీసుకునే ముందు వైద్యులను సంప్రదించాలని వారు అంటున్నారు. వైద్యుల సలహా మేరకే పీచును తీసుకోవాలని వారు సలహా ఇస్తున్నారు.



మైగ్రేన్‌తో గుండెజబ్బులా?

గుండె జబ్బులకు మైగ్రేన్ తలనొప్పి కారణమవుతుందన్న విషయం ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో వెల్లడైంది. ఈ ప్రమాదం పురుషుల కన్నా స్త్రీలకే ఎక్కువ ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. జర్మనీ, అమెరికా దేశాలలో సుమారు లక్షమంది మీద పరిశోధనలు నిర్వహించారు. వీరిలో అత్యధికభాగం స్త్రీలే! వీరు అధ్యయనం మొదలు పెట్టేసరికి స్త్రీలలో ఎవరికీ మైగ్రేన్ నొప్పి లేదు. ఇరవై సంవత్సరాల పాటు సాగిన వీరి అధ్యయనంలో మధ్యలో కొందరు స్త్రీలు మైగ్రేన్ నొప్పికి గురయ్యారు. సుమారు 1400 మందికి మైగ్రేన్ తలనొప్పిరాగా వారిలో 250 మంది దాకా గుండెపోటు కారణంగా మృతి చెందారు. వీరి మరణాలకి కేవలం మైగ్రేన్ నొప్పే కారణమా? అన్న విషయం మీద వీరు ఇంకా పరిశోధనలు నిర్వహిస్తున్నారు. కానీ మైగ్రేన్ కారణంగా కరోనరీ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ ఉందన్న విషయాన్ని వీరు స్పష్టం చేస్తున్నారు. నలభై సంవత్సరాలు దాటిన మహిళలు మైగ్రేన్ నొప్పికి గురైతే అలక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలని వీరు సూచిస్తున్నారు.

అకాల మృత్యువును దూరం చేసే తృణధాన్యాలు

తృణ ధాన్యాలు ఆరోగ్యాన్నిస్తాయన్న సంగతి తెలిసిందే! వీటిని ప్రతి రోజూ తీసుకోవడం వలన అకాల మృత్యువు నుంచి తప్పించుకోవచ్చు అంటున్నారు హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు. వీటి ద్వారా లభించే మల్టిపుల్ బయో యాక్టివ్ కాంపౌండ్ వలు ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుందని వీరు చెబుతున్నారు. ప్రతిరోజూ 70 గ్రాముల తృణధాన్యాలు తీసుకున్న వారిలో 22 శాతం అకాల మరణాలు తగ్గుతాయనీ, 23 శాతం గుండెజబ్బుల బారి నుంచి తప్పించుకోవచ్చని వారు అంటున్నారు. 20 శాతం కేన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని స్పష్టం చేస్తున్నారు. కొద్దిగా వయస్సు పైబడిన వారు తప్పనిసరిగా 49 శాతం తృణధాన్యాలను తమ ఆహారంలో చేర్చుకోవలసిందేనని వీరు అంటున్నారు. సుమారు ఏడున్నర లక్షలమంది మీద దాదాపు 40 సంవత్సరాల పాటు సుదీర్ఘ అధ్యయనాలు నిర్వహించిన అనంతరం వీరు ఈ విషయాన్ని నిర్ధారించారు.

-అవినాష్



ము... ము... ము...
ముద్దంటే చేదా!

ము..

ము.. ము..
ముద్దంటే చేదా నీకా
ఉద్దేశం లేదా/ఇపుడొద్ద
న్నావంటే కుర్రవాడా.... అనే
పాట పూర్వం రోజుల్లో హల్‌చల్ చేసేది. ముద్దు పెట్టడం, పెట్టించుకోవడం అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. ఎదుటి వ్యక్తి మీద మనకున్న ప్రేమను తెలియజేసే అత్యుత్తమమైన మార్గాలలో ముద్దు ఒకటి. తల్లిదండ్రులైనా, పిల్లలైనా, భార్యాభర్తలైనా, ప్రేమికులైనా, లేదా స్నేహితులైనా తమ ప్రేమను చేతల్లో చూపించాలంటే ముద్దుపెట్టుకుంటారు. ఆ ముచ్చట తీర్చుకోవాలంటే ముద్దే పరాకాష్ఠ మరి!

సృష్టిలో ముద్దుకు ఓ ప్రత్యేకత ఉంది. ప్రతి మనిషి తన భావాన్ని అవతలి వ్యక్తికి తెలియజేయడానికి ఎంతో ఉపయోగపడేది ముద్దే. ముద్దు పెట్టే స్థానాన్ని బట్టి దాన్ని అనేక రకాలుగా అర్థం చేసుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. మరి అలాంటి ముద్దుకు ప్రాధాన్యం కల్పించడానికే కాబోలు ప్రతి సంవత్సరం **జూలై ఆరవ తేదీని ఇంటర్నేషనల్ కిస్ డేగా** జరుపుకుంటారు. మరి ఆ ముద్దు ముచ్చట్లేంటో తెలుసుకుందామా!

లిప్‌లాక్‌కి ఆద్యులం మనమే!

ముద్దు అనే పదాన్ని పలకడానికి ఇప్పటికీ కొందరు తెగ ఇబ్బంది పడుతుంటారు. అయితే ఈ పదం ఏమీ ఇప్పటికిప్పుడు కనిపెట్టింది కాదు. సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితమే ముద్దు ఇవ్వడం, తీసుకోవడం అనే ప్రక్రియ మొదలైందట. ఒక విధంగా లిప్‌లాక్‌కి మన భారత్‌లోనే బీజం పడింది అంటారు. లిప్‌లాక్ అనేది మహాభారత కాలం నుంచే ఉందట. అయితే దీనికి తగిన ఆధారాలేవీ ఇప్పటి వరకూ లేవు. ఏది ఏమైనప్పటికీ ఈ కిస్ అనే పదం మొదట కస్‌గా పిలిచేవారట. క్రమక్రమంగా కిస్‌గా మార్పు చెందింది.

ముద్దంటే భయం?

ముద్దంటే అందరికీ ఇష్టమే. మరి ముద్దు పెడితే భయపడే వాళ్లు కూడా ఉంటారా అని ఆశ్చర్యపోతున్నారా. అవును కొంతమందికి ముద్దంటే భయం. ఇలా ముద్దు అంటే వద్దు అనే వ్యక్తులకు ఉండే భయాన్ని ఫిలెమాఫోబియా అంటారు. అనుబంధాలను బట్టి ఆవేశాలను బట్టి ముద్దులో ఉండే తీవ్రత కూడా మారుతుందని పరిశోధకులు అంటున్నారు. అంటే తల్లిదండ్రులు, బిడ్డల మధ్య, స్నేహితుల మధ్య, ప్రేమికుల మధ్య లేదా భార్యాభర్తల మధ్య ముద్దు తీవ్రత, దాని ప్రభావం ఒకొక్క రకంగా ఉంటుందట. ప్రతి మనిషి జీవితకాలంలో 20,160 నిమిషాలను ముద్దులు పెట్టడానికి ఉపయోగిస్తాడట! అంటే మనిషి జీవితంలో ముద్దుకున్న ప్రాధాన్యమేంటో ఈపాటికే మీకర్థమై ఉంటుంది. ఒకరికొకరు ఇచ్చుకునే ముద్దు వారి మధ్య అత్మీయానుబంధాలను పెంచేదిగా ఉంటే నిజంగా ముద్దు అమృతతుల్యమే కదా!

క్రిముల బదిలీ

ఇద్దరు వ్యక్తులు పదిసెకన్ల పాటు చుంబించుకోవడం వల్ల ఎనిమిదికోట్ల బ్యాక్టీరియా ఇరువురికీ బదిలీ అవుతుందని నెదర్లాండ్స్‌కి చెందిన మైక్రో బయాలజిస్ట్‌లు తమ పరిశోధనల్లో కనుగొన్నారు. వివిధ వయసులు గల జంటలపై వారు పరిశోధనలు నిర్వహించారు. రోజుకు తొమ్మిది సార్లు చుంబించుకునే జంటలలో ఈ బ్యాక్టీరియా మరింత ఎక్కువగా చేరుతుందని వారు చెప్పారు. బ్రిటీష్ హార్ట్ ఫౌండేషన్ నిర్వహించిన మరో సర్వేలో ప్రతీ ఐదు జంటల్లో ఒక జంట వారంలో ఒక్కసారి కూడా చుంబించుకోకుండానే సెక్స్‌లో పాల్గొంటున్నారు. 45 సంవత్సరాల వయసులో ఉన్న వ్యక్తులు వారానికి 30 సార్లు తమ భాగస్వామిని ముద్దుపెట్టుకుంటే 18 నుంచి 24 సంవత్సరాల వయసుగల వ్యక్తులు వారంలో కేవలం 11 సార్లు మాత్రమే తమ భాగస్వామిని ముద్దు పెట్టుకుంటారని ఈ సర్వేలో తేలింది.

పొందే ఆనందం వేరు వేరు!

ముద్దు పెట్టుకోవడానికి శరీరంలో పనిచేసే అన్నింటి కంటే ముఖ్యమైన కండరం ఆర్బిక్యులారిస్ ఓరస్. ముద్దు పెట్టుకునే సమయంలో రెండు పెదాలను దగ్గరగా

చేర్చి, వాటిని అవసరమైన రీతిలో మలిచి ముద్దు పెట్టుకోవడానికి తోడ్పడుతుంది ఈ కండరం. అందుకే ఈ కండరాన్ని కిస్సింగ్ మజిల్ అని అంటారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ ముద్దుల ద్వారా పొందే ఆనందం ఒకేలా అనిపించవచ్చు. కానీ ముద్దు పెట్టడం, లేదా పెట్టించుకోవడం మాత్రం ఒకేలా ఉండదు. ఇద్దరి అధర చుంబనాలు వేరువేరుగా ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు. ఇద్దరు పెట్టుకునే ముద్దులు రెండు విభిన్నమైన సందేశాలని అందిస్తాయట. మగవారి దృష్టిలో ముద్దు శృంగారానికి తొలి అడుగైతే, ఆడవారి దృష్టిలో ముద్దులనేవి ప్రేమని కొలిచే సాధనం. ఒక పురుషుడు తనకిచ్చే ముద్దును బట్టే ఏస్థాయిలో తనపై ప్రేమ ఉందనే విషయాన్ని స్త్రీలు అంచనా వేసుకుంటారు..

ఘాటు ముద్దు!

తొలిముద్దు అనేది జీవితాంతం మరిచిపోలేని ఒక అనుభూతి. ముద్దులో కూడా ఇష్టాయిష్టాలు ఉంటాయి. పెదవుల్ని పెదవుల్తో పెనవేసే ఫ్రెంచ్ ముద్దునే ఎక్కువ మంది ఇష్టపడతారు. ఐతే ఘాటైన ముద్దు పెట్టుకునే సమయంలో అందరూ కళ్లు మూసుకుంటారు. ఇది తెలియకుండా జరిగే ప్రక్రియ. ఇలా ఎందుకు జరుగుతుంది అనే విషయంపై ఇటీవల పరిశోధకులు పరిశోధనలు నిర్వహించారు. మానవ మెదడు కొన్ని కొన్ని సందర్భాల్లో, ఒకే సమయంలో రెండు విధులను నిర్వహించలేదు. ముఖ్యంగా సున్నితమైన విషయాల్లో మెదడు తన ఏకాగ్రతను రెండుచోట్ల ఒకే విధంగా కేంద్రీకరించలేదు. మానవ శరీరంలో అతిసున్నితమైన భాగాలలో పెదవులు ఒకటి. పెదవులను పెదవులతో జోడించే సమయంలో మెదడులోని న్యూరాన్లు ఉత్తేజితమవుతాయి. అలా అధిక సంఖ్యలో న్యూరాన్లు ఉత్తేజితం కావడంతో మెదడు చూపుపై నియంత్రణ కోల్పోతుంది. దీంతో తెలియకుండానే కళ్లు మూసుకుపోతాయని పరిశోధకులు తెలిపారు.

జంతువుల్లో ముద్దు

అసలు ఆలోచించి చూస్తే అనిపిస్తుంది అసలీ ముద్దులేంటి? ఎవరిదో ఎంగిలి మరొకరు తీసుకోవడం ఏంటి అని. ఒక్కసారి ముద్దు పెడితే దాదాపు 60 మిలియన్ల క్రిములు ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు ట్రాన్స్ఫర్ అవుతాయట. ఆ క్రిములలో కొన్ని శరీరానికి హాని కలిగించేవి ఉంటే, కొన్ని రక్షణ కలిగించేవి ఉన్నాయి. ఎవరెన్ని చెప్పినా సరే చాలామంది తొలిముద్దులోని మాధుర్యాన్ని మాత్రం మర్చిపోలేరు. ఎన్ని ఉన్నా రొమాన్స్‌లో మొదటిస్థానం ముద్దుకే. అందుకే పాశ్చాత్య దేశాలలో ముద్దు అనేది జీవితంలో కామన్ అని భావిస్తుంటారు పబ్లిక్ ప్లేస్‌లోనైనా ముద్దు పెట్టడానికి వెనకాడరు. అలాంటి కిస్‌లలో ఫ్లయింగ్ కిస్, హ్యాండ్ కిస్, లిప్‌కిస్, సింపుల్ కిస్ ఇలా రకరకాలున్నాయి. అయితే కేవలం మనుషులు మాత్రమే కాదు జంతువులలో చూస్తే కోతులు కూడా ముద్దు పెట్టుకుంటాయట. కోతులలో బానబోస్ అనే జాతి కోతులు మనుషుల్లాగా లిప్‌లాక్ కిస్సులు పెట్టుకుంటాయి. అయితే ఈ జాతి కోతులకి శృంగారంపై ఆసక్తి ఎక్కువ, మనుషులు కలిసినప్పుడు ఎలా అయితే చేతులు కలుపుకుంటారో అలా ఇవి కూడా ముద్దులు పెట్టుకుంటాయి. అంతే తప్ప మనుషులకులానే వీటికి భావోద్వేగాలేమీ ఉండవు.

క్యాలరీల్ని తగ్గించే కిస్సులు

ముద్దు శరీరంలోని కాలరీలను తగ్గిస్తుందట. ఓ సర్వే ప్రకారం నిమిషం సేపు ముద్దు పెట్టుకుని ఆరువందల క్యాలరీలు బర్న్ చేయవచ్చుట. ముద్దు పెట్టుకునేటప్పుడు ఆక్సిటోసిన్ అనే రసాయనం వెలువడుతుంది. దీనివల్ల శరీరం రిలాక్స్ ఫీలవుతుంది. అదేవిధంగా శరీరంలో వెలువడే ఎండార్ఫిన్ అనే రసాయనం మనల్ని మంచి మూడ్‌లోకి తీసుకెళ్లేలా చేస్తుంది. ఈ రెండూ ముద్దు పెట్టుకున్నప్పుడు వెలువడుతాయి.

వ్యాధి నిరోధక శక్తి పెంపు

ముద్దుతో వ్యాధినిరోధక శక్తి ఎలా కలుగుతుంది? అనుకుంటున్నారా. ఇది వినడానికి వింతగా ఉండొచ్చుగాని బాక్టీరియా ఒకరి నుంచి ఒకరికి వెళ్లడం వల్ల శరీరంలో యాంటిబాడీస్ తయారవుతాయి. దీని వల్ల శరీరంలోని వ్యాధి నిరోధకత పెరిగి మనల్ని రోగాల నుంచి దూరం చేస్తుంది.

నొప్పుల్ని దూరం చేస్తుంది!

రోజంతా పనిలో పడి ఒకే పొజిషన్లో కూచోవడం వల్ల సర్వసాధారణంగా బాడీ పెయిన్స్ వస్తుంటాయి. అయితే పెయిన్ కిల్లర్స్ వైపు మాత్రం వెళ్లకండి. దాని బదులు మీకు ఇష్టమైన వ్యక్తికి ఓ ముద్దు పెట్టండి. మీ బాడీ పెయిన్స్ దూరమవుతాయి. ఇందులో వెలువడిన రసాయనాల వల్ల నొప్పులు మటుమాయం అవుతాయి.

గుండెకు ఆరోగ్యం

ముద్దు పెట్టడం వల్ల గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ముద్దు పెట్టుకునేటప్పుడు అడ్రినలిన్ అనే రసాయనం మన శరీరం నుంచి విడుదలై మరింత రక్తాన్ని మన శరీరానికి పంప్ చేస్తుంది. దీనివల్ల గుండె ఆరోగ్యం మరింత మెరుగు పడుతుంది

రక్తపోటు తగ్గిస్తుంది

ముద్దు పెట్టడం వల్ల రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. దీనివల్ల రక్తపోటు తగ్గే అవకాశాలున్నాయి. అంతేకాకుండా ముద్దు వల్ల ఒత్తిడి దూరమవుతుంది కూడా. ముద్దువల్ల ఒత్తిడిని కలిగించే హార్మోన్లను తగ్గించవచ్చు.

ముద్దు పెట్టడం వల్ల కావిటీస్ తగ్గించుకోవచ్చు. అవతలి వారి బాక్టీరియా ఇవతలివారిలోకి బదిలీ కావడం వల్ల నోటి దుర్వాసన ఉన్నవారిలో ఆ దుర్వాసన తగ్గిపోతుంది.

- చింటు

లిప్‌లాక్‌తో కేన్సర్

లిప్‌లాక్‌ను ఫ్రెంచ్‌కిస్ అని కూడా అంటారు. ఈ రకం కిస్‌లు మన దగ్గర తక్కువే గానీ ఇతర దేశాలలో సర్వసాధారణం! కానీ ఈ ఫ్రెంచ్‌కిస్ వల్ల కేన్సర్ సోకే అవకాశాలున్నాయని ఆస్ట్రేలియాలోని రాయల్ డార్విన్ హాస్పిటల్‌లో హెడ్ అండ్ నెక్ సర్జరీ విభాగాధిపతి ప్రముఖ డాక్టర్ మహిబాన్ థామస్ పరిశోధనల్లో వెల్లడైంది. స్త్రీ, పురుషులు పరస్పరం పెదవులపై ముద్దుపెట్టుకోవడం వల్ల తల, మెడ సంబంధమైన కేన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని పరిశోధన వెల్లడించింది. చుంబనం వల్ల ప్రతి సంవత్సరం పురుషులలో పది శాతం, స్త్రీలలో ఏడు శాతం మంది కేన్సర్ బారిన పడుతున్నారని అమెరికాలో నిర్వహించిన మరో పరిశోధనలో వెల్లడైంది. చుంబనం ద్వారా సంక్రమించే వైరస్ కారణంగా తల మెడ కేన్సర్లు ఎక్కువ వస్తాయని పరిశోధకులు చెబుతున్నారు.

శరత్‌చంద్ర

సమంత@లవ్

5

సెల్: 98492 41286

వారం తర్వాత శ్రీకర్ ఆఫీసుకు వచ్చాడనేగానీ పని మీద కాన్సన్‌ట్రేషన్ చేయలేక పోతున్నాడు. పదే పదే సమంత గుర్తుకు వస్తోందతడికి. తమ్ముడు దినకర్ బలవంతంపై విజయవాడ వెళ్ళాడుగానీ, అక్కడకూడా అతడికి మనశ్శాంతి లభించలేదు. దినకర్ అభ్యర్థన మేరకు ఆ రోజు అరుణ వచ్చింది.

"బావగారూ, మీ విషయంలో ఆయన బాగా నెర్వస్‌గా ఫీలవుతున్నారు" చెప్పింది ఉపోద్ఘాతంగా.

"సారీ అమ్మా! నా వల్లే కదా మీ పెళ్ళి ఆలస్యమవుతోంది" అన్నాడు నొచ్చుకుంటూ.

"మా గురించి వర్రీ ఏముంది బావగారూ, మీ తమ్ముడు తాళి కట్టలేదనేగానీ నేను మీ ఫ్యామిలీ మెంబర్నే కదా" అంది.

"పోనీలేమ్మా, వాణ్ణి అర్థం చేసుకున్న అమ్మాయివి నువ్వన్నా దొరికావు" ఆర్ద్రత నిండిన స్వరంతో అన్నాడు.

"బావగారూ ఇఫ్ యూ డోంట్‌మైండ్ మీ మధ్య ఉన్న సమస్య ఏంటీ?" అడిగింది ఆరా తీస్తున్నట్టు.

ఎదురుగా కూర్చుని అన్నని చూస్తున్నాడు దినకర్.

"ఇవన్నీచెప్పి ఈ అమ్మాయిని ఎందుకురా డిస్టర్బ్ చేస్తున్నావు" అన్నాడు కాస్త నొచ్చుకుంటూ శ్రీకర్.

"అరుణ నీకు మరదలు మాత్రమే కాదన్నయ్యా, సైకియాట్రిస్ట్ కూడా" చెప్పాడు దినకర్.

"తను చాలా మంచి అమ్మాయి. కైండ్ హార్ట్. ఇంటెలిజంట్ బట్ నా మ్యారేజ్ ప్రపోజల్ రిజెక్ట్ చేసింది."

"ఆమె ఇంకెవరికైనా కమిట్ అయ్యారా?" అడిగింది అరుణ.

"అదేం లేదమ్మా, వివాహ వ్యవస్థపైనే తనకి సదభిప్రాయం లేదట" చెప్పాడు శ్రీకర్.

అరుణ భ్రుకుటి ముడిపడింది.

"మరి నన్నొకసారి మాట్లాడమంటారా బావగారూ" అడిగింది అరుణ నమ్రతగా.

"వద్దమ్మా, తను 'హర్ట్' అవుతుంది" చెప్పాడు శ్రీకర్.

"ప్రయత్నిస్తుందికదా అన్నయ్యా, తప్పేముంది" అన్నాడు దినకర్.

"తనని ఎవరూ మార్చలేరు" స్థిరంగా చెప్పాడు శ్రీకర్.

తాను పంపిన ఈ మెయిల్, దానికి ఆమె రిప్లయ్... స్నేహానికి అంగీకరించడం అవన్నీ అరుణకు చెప్పాడు శ్రీకర్.

"బావగారూ... మీ మీద ఆమెకి పాజిటివ్ అప్రోచ్ ఉంది. మీరు సహనంతో దానిని ప్రేమగా కన్వర్ట్ చేసుకోవాలి. అందుకు మీలో సహనం కావాలి. తప్పితే డిప్రెషన్‌కి గురికాకూడదు" చెప్పింది అరుణ.

శ్రీకర్‌లో ఎక్కడో ఆశల ద్వారాలు మెల్లగా తెరుచుకున్నాయ్.

"సర్... మీకు ఫోను" అటెండర్ పిలుపుతో లోకంలోకి వచ్చాడు శ్రీకర్.

ఆఫీసు సమయంలో సెల్‌ఫోను వీలైనంత వరకూ స్విచ్ఛాఫ్ చేయడం అతడికి అలవాటు.

"ఎవరా?" అనుకుంటూ ఫోన్ దగ్గరకు వెళ్ళాడు. అవతల లైన్లో సమంత.

ఒక నిమిషం అతడి గొంతులో తడారిపోయింది. "శ్రీ... మీతో మాట్లాడాలి" ఆదేశిస్తున్నట్టుగానే అడిగింది సమంత.

'బిజీగా ఉన్నానని' చెప్పి బెట్టుచేయాలనుకున్నాడు. కానీ అంతధైర్యం చేయలేకపోయాడు.

"ఎక్కడ కలుద్దాం" అడిగాడు.

"యాజ్ యూజ్ వెల్ కాఫీ షాప్" చెప్పింది.

"అక్కడ వద్దు అమీర్‌పేట 'బరిస్తా'లో కూర్చుందాం" చెప్పాడు.

ఏమనుకుందో ఏమో సరేనంది.

•••

అనుకున్నట్టుగానే ఆరున్నర అవుతుండగా సమంత వచ్చింది.

పది నిమిషాలకు ముందే అక్కడికి చేరుకున్నాడు శ్రీకర్. లేచి నిలబడి ఆహ్వానించాడు.

సమంత కూర్చుంటూ అడిగింది. "మీరు సిక్ అయ్యారని తెలిసింది. ఇప్పుడెలా ఉంది" అడిగింది.

'నీవల్లేకదా సిక్ అయ్యాను' అని చెప్పాలనుకున్నాడు కానీ అతడి ఇగో అడ్డు వచ్చింది.

జరిగిన కథ

బాల్యంలో తల్లి పడిన కష్టాలు ప్రత్యక్షంగా చూసిన సమంత పెళ్ళి, తాళి వ్యవస్థపై నమ్మకం కోల్పోతుంది. శ్రీకర్ చేసిన పెళ్ళి ప్రతిపాదనను తిరస్కరిస్తుంది. మరొకర్ని చూసుకోమని సమంత నిష్కర్షగా చెప్పడంతో మంచం పడతాడు శ్రీకర్. ఆడది దాసోహమయ్యేంతవరకు ప్రతి మగవాడూ ఇలాగే ప్రవర్తిస్తాడని తేలిగ్గా తీసుకుంటుంది సమంత. తన అన్నయ్య లవ్‌లో ఫెయిలయ్యాడని అతడి తమ్ముడు దినకర్ గ్రహిస్తాడు. అతడో వైద్యుడు. అతడి ప్రియురాలు సైకియాట్రిస్ట్. ఆ తర్వాత....

శ్రీకర్, సమంతలను ఒక్కటి చెయ్యాలనే ఉద్దేశం అందరిలో మొలకెత్తుతోంది. శ్రీకర్ తమ్ముడు, కాబోయే మరదలితో పాటు సమీర, రమణ కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. అదే సమయంలో సమంత తల్లిని కేన్సర్ చికిత్సకోసం హైదరాబాద్ తీసుకొచ్చారు. ఆమెకు చికిత్స జరిగిన వారం రోజుల సమయంలో సమంత, శ్రీకర్‌ల మధ్య సాన్నిహిత్యం పెరిగిందా? సమంత ఎలా రియాక్టయింది?

"ఇప్పుడు బాగానే ఉన్నాను" చెప్పాడు.

"మధ్యలో కలుద్దామనుకున్నాను. వీలు కాలేదు. ఊరికెళ్ళేటప్పుడు సెండాఫ్ ఇచ్చారు. ఓపిగ్గా వచ్చి రిసీవ్ చేసుకున్నారు" అంది కృతజ్ఞతగా.

"నన్ను ఫ్రెండ్ అన్నారు కదా, మన మధ్య అటువంటి ఫార్మాలిటీస్ అవసరమా?" అన్నాడు.

"అవసరం లేదు. చెప్పడం కర్టసీ అనిపించింది" నిజాయితీగా అంది సమంత.

"ఓకే... అది వదిలేయండి. నన్ను పిలిచారు. విషయమేంటో చెబుతారా?" అడిగాడు.

శ్రీకర్ తన పైన పీకల వరకూ కోపంతో ఉన్నాడని అర్థమైంది సమంతకు.

"ఏం నేను మిమ్మల్ని పిలవకూడదా? ఎప్పుడూ మీరు పిలిస్తేనే నేను రావాలా?" అంది తను కూడా కోపం నటిస్తూ.

"అలా అని కాదు" నసిగాడు.

ఆ మాత్రం చాలు సమంతకు అతన్ని డామినేట్ చేయడానికి.

"సర్లెండి. ఆకలిగా ఉంది. ఒక రవ్వదోసె చెప్పండి" అంది.

కొర....కొర చూస్తూనే బేరర్‌కి ఆర్డర్ ఇచ్చాడు.

బేరర్‌ని మళ్ళీ వెనక్కిపిలిచి "తొందరేం లేదు. నిదానంగా తెండి" అని చెప్పింది.

"ఎందుకో నా మీద ఇంత దయ కలిగింది" అన్నాడు శ్రీకర్ కొంచెం వ్యంగ్యం జోడించి.

"దయ ఎందుకనుకోవాలి? ప్రేమ అని అనుకోవచ్చుగా" అంది.

శ్రీకర్ నోరెళ్ళ బెట్టాడు.

శ్రీకర్ షాక్‌ని గుర్తించి..

"ఏం స్నేహితుల మధ్య ప్రేమ ఉండకూడదా? మా సమీరను ఎంత ప్రేమిస్తానో.... మిమ్మల్నీ అంతే ప్రేమిస్తాను" చెప్పింది. కొయ్యబారి విన్నాడు.

"మీతో ఒక విషయం చెప్పాలి" అడిగింది.

"చెప్పండి" అన్నాడు.

"మీకు 'పెళ్ళి' చేద్దామనుకుంటున్నాను" చెప్పింది.

షాకయినట్టు చూశాడు.

"నేను చెప్పేది నిజమే" అన్నట్టు చూసింది.

"పెళ్ళి విషయంలో మీ నాన్నగారు చాలా ఒత్తిడి చేస్తున్నారని తెలిసింది. నాలాంటి మూర్ఖురాలి

కోసం మీరు ఎదురుచూడడం మంచిది కాదనిపించింది. మీ స్నేహితురాలిగా మీకీ సలహా ఇవ్వాలనిపించింది."

శ్రీకర్‌కి కోపం వచ్చింది.

"నన్ను పెళ్ళిచేసుకోనన్నారు. అది మీ హక్కు. అంతటితో ఆపండి. నా పెళ్ళి గురించి మీరు సలహాలు ఇవ్వకండి." చెప్పి విసురుగా బయటకు నడిచాడు.

"ఇడియట్" అని తిట్టుకుని బేరర్‌ని పిలిచి బిల్ పే చేసి బయటకు నడిచింది.

తినకుండానే 'బిల్' పే చేస్తున్న సమంతను విస్తుపోయి చూశాడు బేరర్.

•••

"నువ్వు అతడికి అలాంటి సలహా ఇచ్చి ఉండకూడదు" అంది సమీర.

"నిజమే జాలిపడడం పొరపాటైంది."

"జాలా? పాడా.. నువ్వు చూపించింది అహంభావం" నిష్కర్షగా చెప్పింది సమీర.

"నోరు ముయ్యవే, నువ్వు మగ పక్షపాతివి" అంది సమంత.

"నీ ఫ్రెండ్ అనే బిరుదు కంటే మగపక్షపాతినన్న స్టాంపే నాకు సంతోషాన్నిస్తుంది" అంది సమీర.

"సర్లే డైలాగులు కొట్టకు. నువ్వేకదా. నా మీద బెంగతో సిక్ అయ్యాడని చెప్పావు. దానికి తెర దించాల్సిన బాధ్యత నాకు లేదా? అతన్ని ఎంత కాలం భ్రమలో పెట్టాలి?" అంది సమంత.

"ఆ భ్రమలోనైనా బ్రతకనీయ్. నువ్వికశాశ్వతంగా దక్కవని నిర్ధారించుకున్న మరు నిమిషం ఇంకా కుంగిపోతాడు" అంది.

"భలే చెప్పావే. నీలాంటి అమాయకులు ఉన్నంత కాలం ఇటువంటి పురుష పుంగవులు చలామణి అవుతూనే ఉంటారు" అంది సమంత.

"మగాళ్ళను నువ్వెందుకే అంత ద్వేషిస్తున్నావ్" అడిగింది సమీర.

"ప్రేమించడానికి కారణాలు లేక"

"అంటే స్త్రీ పురుష సంబంధాలు అర్థం లేనివా?"

"అని ఎవరన్నారు... చాలా మందికి అర్థవంతమైనవి కావచ్చు"

"నా వరకు మగవాడితో పని లేదు."

"జీవితకాలం ఇలాగే ఉంటావా?" నిలదీసింది సమీర

"పెళ్ళే జీవితమా?"

"కాకపోవచ్చు. పెళ్ళిద్వారా లభ్యమయ్యేవి రెండే రెండు. ఒకటి మానసిక అవసరాలు. రెండు శారీరక అవసరాలు. ఈ భూమి మీద జీవజాలాన్ని ప్రేమించడమే నా దృష్టిలో మానసిక అవసరం. దానికి మొగుడు అవసరం లేదు. రెండు శారీరక అవసరం. ఇదొక ఫాంటసీ. అంతగా నా ఒళ్ళు వేడెక్కితే మగవాళ్ళు వ్యభిచారుల్ని ఆశ్రయించినట్టు నేనూ మగవేశ్యలని ఆశ్రయిస్తా. అంతేతప్ప... మగవాడితో నాకున్న పర్మినెంట్ అవసరమేంటి? ఈ దేశంలో చాలామంది ఆడవాళ్ళకు మ్యారేజ్ ఒక ఎంప్లాయిమెంట్ లాంటిది. చాలామంది ఆడవాళ్ళు ఆత్మను చంపుకొని మొగుళ్ళకి చాకిరి చేస్తుంటారు.

ఈ ఏడాది పెళ్ళి ఖాయమే!

నడుం సుందరి ఇలియానాకి ఇటు దక్షిణాదిన, అటు ఉత్తరాదిన అవకాశాలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఇల్లి బేబీ చేతిలో ఒక్కటంటే ఒక్క బాలీవుడ్ సినిమా మాత్రమే ఉంది. దీని ఫలితం మీదే ఇలియానా సినీ జీవితం ఆధారపడి ఉందన్న సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే తిరిగి దక్షిణాది నుంచి పిలుపు వచ్చినా ఇలియానా ఓకే చెప్పకపోవడం పైనే పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆండ్రూని పెళ్ళి చేసుకోవడానికే ఇలియానా వచ్చిన ఆఫర్లని కూడా వదులుకుంటోందని అంటున్నారు. దీనికి తోడు ఇలియానా పోస్ట్ చేసిన ఫోటోలు కూడా పెళ్ళి ఖాయమనే చెబుతున్నాయి

ఆ జాబితాలోకి నేను రాదలుచుకోలేదు. నాకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉంది. చిన్న ఫ్లాట్ కొనుక్కొని స్థిర పడతా. 'చారిటీ' పిల్లలకు అమ్మనవుతా. అమ్మని తెచ్చుకుని కళ్ళల్లో పెట్టుకొని చూసుకుంటా. ఆమె శేష జీవితం సుఖమయంగా గడిపేందుకు కారణమవుతా" సుదీర్ఘంగా వివరించింది సమంత. సమీర కన్విన్స్ కాలేదు.

"వాగుడు ఆపు. నువ్వు శ్రీకర్‌ని ప్రేమిస్తున్నావ్..." గద్దించింది.

"అబ్సర్డ్.." సమంత ఇంకా పెద్దగా అరిచింది.

•••

"ఇక నా వల్ల కాదు" అంది సమీర.

"ఇంకోసారి ప్రయత్నించి చూడు సమీర" బ్రతిమలాడాడు రమణ.

"దాన్ని తన్నడమొక్కటే తరువాయి. అదెలా కన్విన్స్ అవుతుందో అర్థమై చావట్లేదు" అంది సమీర.

సమంత, శ్రీకర్‌ని కలిపేందుకు చేసే ప్రయత్నాల్లో సమీర, రమణలు మంచి స్నేహితులుగా మరొక అడుగు ముందుకువేసి ప్రేమికులుగా మారిపోయారు.

"పాపం శ్రీకర్‌కి తనంటే పిచ్చిప్రేమ" చెప్పాడు రమణ బాధగా.

"మరి రాత్రికి గడితీసి పెడతా... శ్రీకర్‌ని పంపించరాదూ... దాన్ని 'రేప్' చేసి పడేస్తే కాళ్ళ దగ్గర పడి ఉంటుంది..." అంది కోపంగా సమీర.

"కాళ్ళ దగ్గరపడి ఉండడం కాదు. కాళ్ళు చేతులు నరుకుతుంది" అన్నాడు రమణ నవ్వుతూ.

"బావుందిరా మగడా... నువ్వొచ్చిన గంటలో శ్రీకర్ గురించి చెప్పడంతప్ప, చేసే విషయం ఏదైనా ఉందా?" అంది సమీర అల్లరిగా అతడి కళ్ళల్లోకి చూస్తూ.

"ఏం చేయాలి..." అడిగాడు అమాయకంగా.

"నువ్వు ఆ శ్రీకర్‌తో తిరగడంతో మెదడు బ్లాంకైనట్టుంది. ఆ కళ్ళూ, పెదాలు ఇటివ్వు, ఓ ముద్దు పెట్టుకుంటా" అంది అల్లరిగా.

"నువ్వింత 'హాట్ గర్ల్‌వి' కదా, తనకేమీ ట్రైనింగ్ ఇవ్వవా?" అడిగాడు సమీరను దగ్గరకు తీసుకుంటూ రమణ.

"ఆ... దానితో పెట్టుకొంటే తడిగుడ్డ వేసుకొని పడుకోవాల్సి వస్తుంది. వాళ్ళ చావు వాళ్ళు చస్తారు. ముందు మన పెళ్ళికి ముహూర్తం పెట్టించు" అంది సమీర అతడికి దగ్గరగా జరుగుతూ.

"సారీ... వాడూ నేనూ ఒకేసారి పెళ్ళి చేసుకోవాలనుకున్నాం" చెప్పాడు రమణ.

"హుస్సేన్‌సాగర్లో దూకి చావండి ఇద్దరూ" అని రమణను సిమెంట్ బెంచీమీద నుండి నెట్టేస్తూ బ్యాగు తీసుకుని బయటకు నడిచింది సమీర.

సంజీవరెడ్డి పార్కులో అప్ప

యూట్యూబ్ ఛానల్ ప్రారంభిస్తుందట!

కోలీవుడ్‌లో వరుస సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సోషల్‌మీడియాలో తన ఫ్యాన్స్‌తో ఎప్పుడూ టచ్‌లోనే ఉంటుంది హన్సిక. ట్విట్టర్, ఫేస్‌బుక్‌లకే పరిమితం కాకుండా తన వీడియోలతో కూడిన ఓ వ్యక్తిగత యూట్యూబ్ ఛానల్‌ని ఓపెన్ చేయాలనుకుంటోందట. ఈ యూట్యూబ్ ఛానల్ ద్వారా తన సినిమా విశేషాలు, ప్రత్యేకతలు తన ఫ్యాన్స్‌తో ఎప్పటికప్పుడు పంచుకోవచ్చన్నది హన్సిక ఆలోచనట! దక్షిణాదిలో ఇలా యూట్యూబ్ ఛానల్‌ని స్వంతంగా ప్రారంభించిన ఘనత హన్సికకే దక్కుతుంది అంటున్నారు సినీ జనాలు.

టికే వచ్చి ఉన్న జనం వీళ్ళిద్దరిని వింతగా చూశారు.

•••

సమీర ఫ్లాట్‌కి వచ్చేసరికి సమంత ఏడుస్తోంది. "ఏమైందే.." అడిగింది ఆత్రుతగా సమీర.

"అమ్మకి బాగోలేదట. అమ్మని మావయ్య రేపు హైదరాబాద్ తీసుకొస్తున్నారు" చెప్పింది సమంత.

"అయ్యో... ఏమైందే" అడిగింది. చెప్పింది సమంత.

"ఓ...గాడ్" హడలిపోయింది సమీర.

"ఎలా తెలిసింది" మళ్ళీ తనే అడిగింది.

"అమ్మ స్నానానికని వెళ్ళి పడిపోయిందట. తర్వాత మావయ్యకి తెలిసి హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. అక్కడ డాక్టర్లు పరీక్ష చేస్తే విషయం బైట పడిందిట." చెప్పింది.

"మరి నాకు ఫోన్ చేయలేదేమే" అడిగింది.

"చేశాను. నీ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది" చెప్పింది.

హడావిడిగా బ్యాగ్‌లో ఫోన్ తీసుకుని చూసింది. పార్క్‌లో రమణను కలవడానికి వెళ్ళేటప్పుడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది సమీర... "అయ్యో..." అంటూ ఆన్ చేసింది.

"మరి ఒంటరిగా ఉండి ఏడుస్తున్నావా? శ్రీకర్‌కైనా ఫోన్ చేయవచ్చు గదా?" అడిగింది.

"చేయాలనుకున్నా.... కానీ ఎందుకో గిల్టీగా అనిపించింది. అవసరమైతేనే ఫోన్ చేస్తుందనుకుంటాడని చేయలేదు" చెప్పింది. మరు నిమిషంలో శ్రీకర్, రమణలకూ ఫోన్ చేసి ఫ్లాట్‌కి రమ్మని చెప్పింది సమీర. గంట వ్యవధిలో ఇద్దరూ సమంత ఫ్లాట్‌కి చేరుకున్నారు.

"సమంతా వర్రీకాకు. ఇప్పుడు కేన్సర్‌కి భయ పడాల్సిన పనిలేదు. మంచి ట్రీట్‌మెంట్ ఉంది కదా" చెప్పాడు శ్రీకర్.

"ఇక్కడ కేన్సర్ హాస్పిటల్‌కి తెస్తున్నారట. అక్కడ బాగవుతుందంటావా?" అడిగింది బేలగా.

"ఎస్... అక్కడ మంచి ట్రీట్‌మెంట్ దొరుకుతుంది, డోంట్ వర్రీ" చెప్పాడు శ్రీకర్.

"సమంతగారూ మీరు అప్‌సెట్ కాకండి. అమ్మకి మేం దగ్గరుండి నయం చేయిస్తాం" భరోసా ఇచ్చాడు రమణ.

కొద్దిసేపు మౌనంగా కూర్చుని "మీరా... వీళ్ళకి కొంచెం కాఫీ పెట్టివ్వవే" అంది.

సమీర లేచి వెళ్ళి ఫ్రిజ్‌లో పాల ప్యాకెట్ తీసి వంటగదిలోకి వెళ్ళింది.

శ్రీకర్ మనసు మెలి తిరిగినట్టుగా ఉంది.

తన తండ్రికి బాగోలేదని తెలిసినప్పుడు కూడా అతడంత బాధపడలేదు. ఎంతో కొంత ధైర్యంగా ఉన్నాడు.

సమంత ధైర్యం కోల్పోయిన తీరుచూసి అతడు కలవరపడ్డాడు.

రమణ ఇద్దరినీ ప్రైవసీగా వదలాలని నిర్ణయించుకుని ఫోన్ వచ్చినట్టు నటిస్తూ ఫ్లాట్ బయటకు వచ్చాడు.

"అమ్మకి నయమవుతుంది కదూ" అడిగింది బేలగా సమంత.

సమంతని దగ్గరకు తీసుకొని 'భయపడకు సమంతా' అని చెప్పాలనుకున్నాడు. కానీ తమాయించుకున్నాడు. సమంత తాను కూర్చున్న చోటు నుండి లేచివెళ్ళి అతడి చేతులు పట్టుకుంది.

"శ్రీకర్, కొంచెం దగ్గరుండి అమ్మకి చూపించవా?" అడిగింది.

"సమంతా..... ప్లీజ్.... అప్‌సెట్ కాకు. ఉయ్ ఆర్ ఆల్వేస్ విత్ యూ" అన్నాడు శ్రీకర్ ఓదార్పుగా.

అంతలోనే సమీర రెండు కప్పుల్లో 'టీ' తెచ్చింది. రమణ అక్కడ లేకపోవడం చూసి "రమణ ఎక్కడికెళ్ళాడు?" అడిగింది.

"ఏదో ఫోన్ వచ్చిందని బయటకు వెళ్ళాడు" చెప్పింది సమంత.

"అవునా" అంటూ ఒక కప్పు శ్రీకర్‌కి, మరో కప్పు సమంతకిచ్చింది. మళ్ళీ లోపలికి వెళ్ళి రెండు కప్పులు తీసుకొని వచ్చింది. ఒక కప్పు టీపాయ్ మీద పెట్టి రమణకు ఇచ్చేందుకు బయటకు వచ్చింది.

రమణ ఫోన్ మాట్లాడడం లేదు. వేలాడదీసిన బోన్సాయ్ మొక్కను చూస్తున్నాడు.

"ఫోన్ వచ్చిందని బయటకు వచ్చావట" అడిగింది అతడికి కప్పు అందిస్తూ.

"అవునూ... నువ్వూ నీ 'కప్పు' తీసుకుని బయటకు రా. కాస్సేపు వాళ్ళని ఒంటరిగా వదిలేయ్" అన్నాడు.

"సరే"నని తన కప్పు కూడా తీసుకొని బయటకు వచ్చింది.

దరిదాపు ఐదు.... పది నిమిషాలు శ్రీకర్, సమంత ఏకాంతంగానే గడిపారు.

రాత్రి పదవుతుండగా తమ ఫ్లాట్‌కి బయలుదేరారు.

సమంత బైట వరకూ వచ్చి సాగనంపింది.

"రేపు అమ్మ రాగానే మెసేజ్ ఇవ్వు. లీవు పెట్టి వస్తాను" చెప్పాడు శ్రీకర్.

శ్రీకర్ కారు రోడ్డుపై పరుగులు తీస్తోంది.

"సమంత పాపం బాగా వర్రీగా ఉంది కదూ" అన్నాడు శ్రీకర్.

"అవున్రా" చెప్పాడు రమణ.

"పైకి బింకం ప్రదర్శిస్తుంది గానీ.... చాలా ఒంటరితనం భరిస్తోంది కదూ" అన్నాడు శ్రీకర్.

"అవును. సమీర లేకుంటే ఇంకా ఒంటరిదవుతుంది" అన్నాడు రమణ.

"నిజమే" చెప్పాడు శ్రీకర్.

"త్వరలో సమీరను పెళ్ళి చేసుకోబోతున్నాను" చెప్పాడు. రమణ.

"నిజమా" అన్నట్టు చూశాడు శ్రీకర్.

"నిజమే.... నిన్నూ తనని ఒకటి చేయాలని చేసే ప్రయత్నాల్లో మేమిద్దరం ఒకటయ్యాం" చెప్పాడు రమణ.

"వెరీ గుడ్. మంచి పెయిర్ మీది" అభినందనగా చెప్పాడు శ్రీకర్.

"నువ్వు తొందరగా ఆ తల్లిని లైన్లో పెడితే నేను సమీరను రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేసు

కుని ఫ్లాట్‌కి తెచ్చేసుకుంటా” చెప్పాడు రమణ. శ్రీకర్ అదోలా రమణని చూశాడు.

“వీలైనంత త్వరగా చేసుకోరా. ఆ ఒంటరితనం భరించలేకైనా నాకు దగ్గరవుతుందేమో” అన్నాడు శ్రీకర్ ఆశగా.

“ఇప్పుడు చూశాను కదా... నువ్వంటే తనకి చాలా ప్రేమ ఉంది. నీ కళ్ళల్లో ఓదార్పుకోసం వెతుకు తోంది” చెప్పాడు రమణ.

“ఆ, ఉంటుంది. అది అమ్మకి బావోలేనప్పుడు మాత్రమే. అమ్మకు బాగుందని తెలియగానే మళ్ళీ తనలోని ‘దయ్యం’ బయటకు వస్తుంది” అన్నాడు చిరుకోపంగా శ్రీకర్.

పడి పడి నవ్వాడు రమణ.

●●●

వారం రోజులు కేన్సర్ హాస్పిటల్‌లో సమంత తల్లికి ట్రీట్‌మెంట్ నడిచింది.

ఈ వారం రోజుల్లో సమంత శ్రీకర్‌కి మాన సికంగా మరికొంత దగ్గరైంది.

తల్లికి శ్రీకర్‌ని, రమణను పరిచయం చేసింది.

ఇద్దరిలో శ్రీకర్ కాస్త సన్నిహితంగా మెదలడం గమనించింది సునంద.

సమంతకి శ్రీకర్ మంచి ఫ్రెండ్ అని చెప్పాడు రాజారావు. సునంద భ్రుకుటి ముడి పడింది. సమంత పెద్దగా పట్టించుకోలేదు. తల్లికి అందుబాటులో ఉంటూ మంచీ చెడ్డలు చూసు కుంది. హాస్పిటల్ పక్కనే ఉన్న సదనంలో రూం తీసుకున్నారు.

శ్రీకర్ వాళ్ళకి అందుబాటులో ఒక అసి స్టెంట్‌ని పెట్టాడు.

శ్రీకర్ సహాయ దృక్పథానికి రాజారావు, సునందతో పాటు ఆమెను చూడడానికి వచ్చిన సులోచన, సువర్చల కూడా సంతోషపడ్డారు.

వారం తర్వాత సునందని డిశ్చార్జ్ చేస్తూ మూడు నెలలకు ఒకసారి వచ్చి రేడియో థెరపీ చేయించు కోవాలని డాక్టర్లు సలహా ఇచ్చారు.

సునంద తిరుగు ప్రయాణానికి రంగం సిద్ధ మైంది.

తన ఫ్లాట్‌కి వచ్చి తనతో ఉండమని సమంత తల్లిని కోరింది. సునంద సున్నితంగా తిరస్క రించింది.

ఇక తల్లి మరో రెండుగంటల్లో ఊరికి వెళు తుందనగానే సమంతలో దుఃఖం సుడులు తిరి గింది.

“సమ్మూ, నీతో మాట్లాడాలిరా” అంది సునంద. అందరూ బయటకు నడిచారు. గదిలో సమంత, తల్లి మాత్రమే మిగిలారు. తల్లి ఒడిలో తల పెట్టు కుని కాసేపు పడుకుంది సమంత.

తల్లి కళ్ళలో నుండి వచ్చిన కన్నీళ్ళు తన బుగ్గ లపై పడడం గుర్తించింది సమంత.

“అమ్మా... ఏడుస్తున్నావా?” అని అడిగింది.

సునంద సమాధానం చెప్పలేదు.

“అమ్మా నీకేమీ కాదు. నయమవుతుం దమ్మా...” చెప్పింది ఓదార్పుగా.

“నేను నా గురించి కాదురా ఏడ్చేది” అంది సునంద గద్గద స్వరంతో.

“మరి ఎవరి గురించి అమ్మా?”

“నీ గురించేరా” అంది సునంద.

“నాకేమైందమ్మా...బావున్నాను కదా” అంది.

“బావున్నావని నువ్వనుకుంటున్నావురా. ‘ఒంటరి’వవు తున్నావేమోనని మేం దిగులు పడు తున్నాం.”

“పిచ్చి అమ్మా... ఈ భూమి మీదకొచ్చే ఏ జీవీ ఒంటరిది కాదు. తనకి తోడుగా ప్రకృతి ఎప్పుడూ అండగా ఉంటుంది” భరోసాగా అంది సమంత.

“నీ జీవితంలోకి అడుగుపెట్టే వ్యక్తి ప్రకృతిలో భాగం కాదా తల్లీ..” అడిగింది రుద్ధమైన కంఠంతో.

“అమ్మా....” అంది విసుగ్గా సమంత.

‘నాకు తెలుసురా... నువ్వు మొండిదానివి. నువ్వు పట్టిన కుందేలుకు మూడేకాళ్ళు అంటావు” అంది కాస్త అసహనంగా.

“అమ్మా, పెళ్ళి విషయం తప్ప నువ్వు ఏం చెప్పినా వింటాను” అంది కాస్త గారంగా.

“నీ తెలివి తేటలు అమ్మ మీద ప్రయోగిస్తు న్నావురా” అంది బాధగా సునంద.

“అదేం కాదమ్మా. పెళ్ళనే జంజాటం నాకొద్దమ్మా. నీ కూతురుగా నేను సంతోషంగా ఉండాలి, అంతే కదా! నీ మీద ఒట్టు. నేను నిజంగానే సంతోషంగా ఉంటాను. నేను సంపాదించే డబ్బుల్లో నీకు పంపగా నా అవసరాలకుపోను మిగిలినదంతా ఒక ‘చారిటీ’ సంస్థకు ఇస్తున్నాను. వాళ్ళంతా నాకు ఆత్మీయులే. అక్కడుండే పసివాళ్ళకు నేనే తల్లినన్న భావం నన్ను నిత్యం సంతోషంగా ఉంచుతుంది కదా” అంది.

“తల్లీ నీతో వాదించే శక్తి నాకు లేదురా. నిన్ను ఒక అయ్యచేతిలో పెట్టినప్పుడే నాకు సంతోషం. ఇక నువ్వేమీ మాట్లాడకు. తల్లిగా నేను కోరు కుంటున్న ఆఖరి కోరిక ఇదే.”

సమంత షాకయ్యింది.

సునంద తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది. తలుపు ఇవతల అందరూ ఎదురు చూస్తు న్నారు.

“రాజా కారు మాట్లాడావు కదా. ఇక బయలు దేరుదాం పద” అంది.

అక్క కాస్త కోపంగా ఉందని అర్థమైంది రాజా రావుకి.

ఆరిపోయిన ముఖంతో ‘సమంత’ బయటకు రావడం గమనించాడు.

లోపల జరిగిన సంభాషణ ఊహించుకోగల డతను.

సునంద గ్రామానికి బయలు దేరింది. ఒంట రిగా నిల్చుండిపోయింది సమంత.

సమంత తల్లి ఆరోజు డిశ్చార్జ్ అవుతుందని తెలిసి అప్పటికే అక్కడికి వచ్చారు శ్రీకర్, రమణ. ఏదో పని ఉందని సమీర హాస్పిటల్‌కి రాలేదు.

సమంత స్కూటీని ఫ్లాట్ దగ్గరకు తెమ్మని డ్రైవర్‌కి చెప్పి సమంత దగ్గర ఉన్న స్కూటీ కీస్ డ్రైవర్‌కి ఇచ్చాడు.

శ్రీకర్ డ్రైవింగ్ చేస్తుంటే సమంత ముందు సీట్లో కూర్చుంది.

“సమంతా, అమ్మ గురించి ఆలోచిస్తున్నావా? డోంట్ వర్రీ! ఆమెకు ఏమీ కాదు” ధైర్యం చెప్పాడు.

ఒక నిమిషం అతడి ముఖంలోకి చూసి చప్పున తల దించుకుంది.

సమంత కళ్ళు సజలాలయ్యాయి.

శ్రీకర్‌కి హృదయం పిండేసినట్టయ్యింది.

“సమంతా ప్లీజ్ ఏడవకు” అన్నాడు.

వెనక సీట్లో కూర్చున్న రమణ కూడా.

“సమంతా నువ్విలా అధైర్యపడితే ఎలా?” ధైర్యం చెప్పడానికి ప్రయత్నించాడు.

సమంతలో దుఃఖం ఆగలేదు.

ముగ్గురి మధ్య కాసేపు మౌనం రాజ్యమేలింది.

ఈలోపు సమంత ఫ్లాట్ వచ్చింది. ముందుగా ఫోన్ చేయడంతో సమీర క్రిందకి వచ్చింది. వెహి కల్‌లో ఉన్న లగేజీ తన చేతికి తీసుకుంది.

“భోంచేసి పోకూడదా?” అడిగింది సమంత.

“అవును రండి..” ఆహ్వానించింది సమీర.

వాస్తవానికి ఇద్దరికీ ఆకలిగానే ఉంది.

“పర్వాలేదు వెళ్తాం” చెప్పారిద్దరూ.

సమంత ఒత్తిడి చేయలేదు. సమీరకు మాత్రం ఇద్దరూవచ్చి భోంచేస్తే బావుంటుందని పించింది. ఆ పేరుతోనైనా కాసేపు రమణతో కబుర్లు చెప్పుకోవచ్చని ఆమె ఆశ.

రమణ పరిస్థితి కూడా దరిదాపు అదే విధంగా ఉంది. శ్రీకర్ చొరవ చూపకుండా తను చొరవ చూపితే బావుండదని ఆగాడు. సమీర చొరవ చూపుతూ “రండి... పర్వాలేదు” అంది

సమంత పెద్దగా రెసిస్ట్ చేయలేదు.

(ఇంకా వుంది)

వేడి వేడి బజ్జీలు...

వంటలు

బజ్జీలనగానే అందరికీ నోరూరుతుంది. చలికాలంలోగానీ, చిరుజల్లులు పడుతున్నప్పుడు గానీ వేడివేడిగా బజ్జీలు తింటే ఆ మజానే వేరు. వర్షం పడుతుంటే అప్పటికప్పుడు బయటికెళ్ళి బజ్జీలు కొనుక్కొని రావడం ఇంపాజిబుల్. అలాంటప్పుడు కాస్త వెరైటీగా, కొంచెం కొత్తగా ఈ బజ్జీలు ఇంట్లోనే తయారుచేసుకుని వేడివేడిగా లాగించేస్తే సరి.

పనీర్ బజ్జీలు

కావలసిన పదార్థాలు: శనగపిండి - ఒక కప్పు, బియ్యప్పిండి - రెండు కప్పులు, పనీర్ - 200గ్రా, జీలకర్ర - స్పూను, పచ్చిమిర్చి - 4, అల్లం తరుగు - రెండు స్పూన్లు, ఉల్లితరుగు - అర కప్పు, కొత్తిమీర - ఒక కట్ట, పుదీనా - ఒక కట్ట, ఉప్పు, కారం, నూనె - తగినంత

తయారీ పద్ధతి: ముందుగా పాన్‌లో కొద్దిగా నూనె వేడిచేసి, జీలకర్ర వేయించాలి. తర్వాత పచ్చిమిర్చి తరుగు, అల్లం తరుగు, ఉల్లి తరుగు వేయాలి. ఇవి వేగాక కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు వేసి మరో నిమిషం వేయించి చల్లారనివ్వాలి. ఇప్పుడు ఇందులో తగినంత ఉప్పు వేసి, మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేస్తే గ్రీన్ చట్నీ రెడీ. దీనిని పక్కన పెట్టుకోవాలి. తర్వాత పనీర్‌ను ముక్కలుగా కోసుకుని, మధ్యలో గాటు పెట్టి, ముందుగా తయారుచేసి పెట్టుకున్న గ్రీన్ చట్నీ పెట్టాలి. ఒక బౌల్‌లో శనగపిండిలో బియ్యప్పిండి, ఉప్పు, కారం, నీరు పోసి బజ్జీల పిండిలా కలుపుకోవాలి. ముందుగా స్టఫ్ చేసిన పనీర్ ముక్కలను శనగపిండిలో ముంచి, కాగుతున్న నూనెలో వేసి బంగారు వర్ణం వచ్చేవరకూ వేయించుకోవాలి. వీటిని టొమాటో సాస్‌తో సర్వ్ చేస్తే బాగుంటాయి.

అరటికాయ బజ్జీలు

కావలసిన పదార్థాలు: పచ్చి అరటికాయలు - 2 లేదా 3 (పొట్టు తీసి పలుచగా కావల్సిన ఆకారంలో కట్ చేసి పెట్టుకోవాలి), శనగపిండి - రెండు కప్పులు, బియ్యప్పిండి - కప్పు, కారం - స్పూన్, బేకింగ్ సోడా - చిటికెడు, వాము - అర స్పూన్, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ విధానం: ముందుగా ఒక గిన్నె తీసుకొని అందులో శనగపిండి, బియ్యప్పిండి, ఉప్పు, కారం, వాము, బేకింగ్ సోడా, సరిపడా నీళ్ళు పోసి బజ్జీల పిండిలా కలిపి పెట్టుకోవాలి. తర్వాత ఒక పాన్‌ను స్టవ్ మీద పెట్టి, అందులో నూనె పోసి, వేడిచేయాలి. వేడయ్యాక ఇప్పుడు ముందుగా చక్రాల్లా కట్ చేసి పెట్టుకున్న పచ్చి అరటికాయ ముక్కల్ని శనగపిండి మిశ్రమంలో ముంచి, కాగుతున్న నూనెలో వేయాలి. వీటిని బంగారు వర్ణం వచ్చేవరకూ వేయించుకోవాలి. బజ్జీల్ని టిష్యూ పేపర్లోకి తీసుకుని, ఆ తర్వాత సర్వింగ్ ప్లేట్‌లో పెట్టాలి. వీటికి టమాటా సాస్ మంచి కాంబినేషన్.

తీపి బజ్జీలు

కావలసిన పదార్థాలు: మైదాపిండి - పావు కిలో, చక్కెరపొడి - పావుకిలో, పెరుగు - రెండు కప్పులు, ఉప్పు - సరిపడా, పచ్చిమిర్చి - ఆరు, పెద్ద ఉల్లిపాయలు - రెండు, జీలకర్ర - ఒక టీ స్పూన్, అల్లం - చిన్న ముక్క, కరివేపాకు - రెండు రెమ్మలు, నూనె - పావు కేజీ

తయారీ విధానం: మైదాపిండిని జల్లించుకోవాలి. ఉల్లిపాయలు, కరివేపాకు, పచ్చిమిర్చి, అల్లం అన్నింటినీ సన్నగా తరిగి ఉంచుకోవాలి. మైదాపిండితో పాటు తరిగి ఉంచుకున్న ముక్కలు, పెరుగు, ఉప్పు, జీలకర్ర, చక్కెర పొడి వేసి బజ్జీల పిండిలాగా కలుపుకోవాలి. ఈ పిండిని నాలుగు గంటలపాటు నానబెట్టాలి. తరువాత పొయ్యిమీద బాణలి పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. నూనె కాగుతుండగా చిన్న చిన్న బోండాల లాగా వేసి బంగారు వర్ణం వచ్చేదాకా వేయించి తీయాలి. అంతే మైదాతో తయారైన తీపి బజ్జీలు సిద్ధమైనట్లే! తీపి వద్దనుకునేవాళ్ళు చక్కెరపొడి తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసి బజ్జీలు చేసుకోవచ్చు.

యాపిల్ బజ్జీలు

కావలసిన పదార్థాలు: యాపిల్స్ - 2, శనగపిండి - పావుకిలో, వరిపిండి - ఒక టేబుల్ స్పూన్, కారం - ఒక టీ స్పూన్, ధనియాల పొడి - ఒక టీ స్పూన్, జీలకర్ర పొడి - అర టీ స్పూన్, ఉప్పు - తగినంత, నూనె - సరిపడా

తయారీ పద్ధతి: ఒక గిన్నెలో శనగపిండి, వరిపిండి, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు, నీళ్ళు వేసి జారుగా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు యాపిల్‌ని శుభ్రంగా కడిగి గుండ్రంగా గాని, పొడవుగా గాని ముక్కలు కోసుకోవాలి. పొయ్యి మీద కడాయి పెట్టి సరిపడా నూనె పోసి బాగా కాగాక యాపిల్ ముక్కల్ని పిండిలో ముంచి బజ్జీలుగా వేసుకోవాలి. వీటిని జామ్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.

"మీ ఇద్దరికీ పెళ్ళై ఎన్నాళ్ళైంది?"
"ఆరు నెలలు"
"ఆరు నెలల్లో ఒక్కసారి కూడా..." కొద్దిగా ఆశ్చర్యపోయినట్టుగా అని, ఆగి మళ్ళీ అంది కౌన్సెలర్ "మీరేం చదువుకున్నారు?"
హర్షిత ముఖం అవమానంతో ఎర్రబడిందా ప్రశ్నకి. తటపటాయిస్తూ నెమ్మదిగా చెప్పింది ఇంగ్లీషులో, మీరు పొరబడుతున్నారు. శారీరక కలయిక గురించి కాదు నేను చెప్పేది, మానసిక తృప్తి గురించి".

అర్థమైందన్నట్టుగా తలాడించింది కౌన్సెలర్. తను చెప్పిన విషయం ఆమెకి మొదటే అర్థమైనా, మరోసారి క్లియర్‌గా చెప్పించడానికి ఆ ప్రశ్న ఆమె అడిగిందేమో నన్న అనుమానం వచ్చింది హర్షితకి ఆమె ముఖం చూస్తే.

"మీది ప్రేమ వివాహమా లేక పెద్దలు కుదిర్చిన పెళ్ళా?" హర్షిత ఆలోచనలని ముందుకు సాగనివ్వ కుండా తర్వాత ప్రశ్న సంధించింది కౌన్సెలర్.

"పెద్దలు కుదిర్చిన వివాహమే. అయితే, ఇద్దరం ఇష్టపడే పెళ్ళి చేసుకున్నాం" చెప్పింది హర్షిత.

"కట్న కానుకల విషయాల్లో పొరపొచ్చాలు లాంటివి ఏమైనా ఉన్నాయా? మీ వైపు వాళ్ళకీ అతడి వైపు వాళ్లకీ పెళ్ళిలో తగాదాలేమైనా....?"

"లేదు. మా పెళ్ళి చాలా బాగా జరిగింది. మా వాళ్ళూ, వాళ్ళ వాళ్ళూ బాగా కలిసిపోయారు".

"మీకు కానీ, మీ వారికి కానీ ఉద్యోగంలో ఏమైనా సమస్యలున్నాయా?"

"లేవు"

"ఆర్థిక సమస్యలు?"

"ఊహూ" తల అడ్డంగా ఆడించింది హర్షిత.

ఒక్క నిమిషం కౌన్సెలర్ ఏమీ మాట్లాడలేదు. తన ముందర కూర్చున్న హర్షితని పరిశీలనగా చూసింది.

"మరింకేమిటి మీ సమస్య?" అని ప్రశ్నిస్తు న్నట్టనిపించాయి ఆమె చూపులు హర్షితకి.

"శృంగారం ఒక అద్భుతమైన అనుభవమనీ, కొత్తగా పెళ్ళైన జంటలు దానికోసం పరితపించి పోతూ ఉంటారనీ, ఒకరిని విడిచి మరొకరు ఉండలేనంత మోహావేశం కమ్మేస్తుందనీ పుస్తకాల్లో చదివాను. సినిమాల్లో చూపిస్తారు. కానీ మా మధ్య అదేమీ జరగడం లేదు. శృంగారం యాంత్రి కంగా, దాంపత్యం మొక్కుబడిగా అనిపిస్తోంది. అదే మా సమస్య" సూటిగా చెప్పింది హర్షిత.

"ఆయనకి కానీ మీకు కానీ ఉద్యోగాల్లో నైట్ షిఫ్టులు ఉంటూ ఉంటాయా?"

"లేదు. ఇద్దరివీ నార్మల్ టైమింగ్సే. ఉదయం ఒకేసారి వెళ్ళి రాత్రి ఒకే సమయానికి ఇంటికి వస్తూ ఉంటాం".

"రోజూ సాయంత్రం ఇంటికి ఏ సమయంలో వస్తారు?"

"ఏడూ ఏడున్నర మధ్యలో" చేతిలో ఉన్న ఐఫోన్ టేబుల్ మీద ఉంచుతూ చెప్పింది హర్షిత.

"వచ్చాక ఏం చేస్తారు? ఇంటి పనుల విష యంలో మీ ఇద్దరి మధ్య సరైన అవగాహన ఉందా?"

"ఉంది. ఇంటి పనులు ఇద్దరం పంచుకుంటాం. రాత్రి భోజనం ఇద్దరం కలిసేచేస్తాం. కలిసి టీవీ చూస్తాం పడుకునే ముందు."

"వీకెండ్స్?"

"వీకెండ్స్ సాధారణంగా సినిమాకో షాపింగ్‌కో వెళ్తాం. నెలకొకసారి వీకెండ్‌కి మా ఇంటికో, వాళ్ళింటికో వెడతాం".

"మీరు చెబుతున్నదాన్ని బట్టి చూస్తే మీ ఇద్దరిమధ్య చక్కని అవగాహన ఉంది. మీకు రావాల్సిన సమస్య కాదు ఇది. మీ సమస్యకి కారణం ఏమై ఉంటుందని మీరు అనుకుంటున్నారు?"

"అది తెలిస్తే మీ దగ్గరికి ఎందుకు వస్తాం?" నవ్వింది హర్షిత. టేబుల్ మీద ఉన్న ఫోన్లో ఏదో మెసేజ్ వచ్చిందనడానికి సంకేతంగా చిన్న బీప్ వినిపించింది. హర్షిత మళ్ళీ సెల్‌ఫోన్ చేతుల్లోకి తీసుకుంది.

"మీరు ఏమీ అనుకోకపోతే, నేను మీకొక వీడియో చూపిస్తాను" అంది కౌన్సెలర్.

ఆమె చూపించబోయే వీడియో ఏమిటో ఊహించిన హర్షిత "మేం బాగా చదువుకున్న వాళ్ళం. అలాంటివి చాలా తెలుసు. ప్లీజ్" అంది అభ్యంతరం పెడుతున్నట్టుగా.

హర్షిత అభ్యంతరాన్ని ఏ మాత్రం పట్టించు కోనట్టుగా చిరునవ్వు నవ్వుతూ, పక్కనే ఉన్న కంప్యూటర్లో వెదికి, ఒక వీడియోని మీడియా ప్లేయర్లో ఆన్‌చేసి మానిటర్ని ఆమె వైపు తిప్పి చెప్పింది కౌన్సెలర్ 'ఇది చూడండి'.

హర్షిత ఊహించినట్టుగానే అది ఇద్దరు దంప తుల మధ్య శృంగారమే. అయితే, ఆ వీడియో తన ఊహకి భిన్నంగా ఉందన్న విషయం మొదలైన మొదటి నిమిషంలోనే అర్థమైంది హర్షితకి. ఆరు నిమిషాల పాటు సాగిన ఆ వీడియోని మాట్లాడ కుండా చూసింది.

"ఆ దంపతుల మధ్య ఉన్నదీ, మీ మధ్యన లేనిదీ ఏమిటో అర్థమయ్యిందా?" హర్షిత వీడియో చూడడం ముగించగానే, చిరునవ్వుతో అంది కౌన్సెలర్.

హర్షిత అయోమయంగా చూసిందామె వంక. 'ఆ మోహావేశాల్నీ పరవశాల్నీ వాళ్ళు నటిస్తున్నారు" అంది.

కౌన్సెలర్ మళ్ళీ నవ్వి అంది. "అది నటనే కావచ్చు. కానీ నేనడిగింది అదికాదు. వాళ్ళ శృంగారానికీ, మీ శృంగారానికీ ఉన్న తేడా మీరు గమనించారా అని".

హర్షిత ఆలోచనలో పడింది. కౌన్సెలర్ తన సంభాషణ కొనసాగించింది. దాదాపు ఇరవై నిమి షాలపాటు ఆమె చక్కటి భావప్రకటనతో, తను చెప్పదలుచుకున్నది వివరించి, చివరిగా అంది. 'ఇవాళ శుక్రవారం. రేపు ఎల్లుండీ మీ ఇద్దరికీ సెలవులే కనుక, నేను చెప్పినట్లు చేసి చూడండి. సోమవారం మా క్లినిక్‌కి వచ్చి మీ ఆనందాన్ని పంచుకోండి".

"థాంక్యూ" అని లేచి నిలబడింది హర్షిత. సరిగ్గా అదే సమయానికి పక్కగదిలో మగ కౌన్సె లర్‌తో మాట్లాడుతున్న ఆమె భర్త శ్రీహాస్ కూడా లేచి నిలబడ్డాడు.

•••

ఆరోజు శనివారం కావడంతో ఆలస్యంగా నిద్రలేచారు హర్షితా, శ్రీహాస్.

'ఏమిటివాళ ప్రోగ్రామ్?" కాఫీ కప్పులతో వచ్చిన హర్షితని చూస్తూ అన్నాడు శ్రీహాస్. టీవీలో వార్తలు వస్తున్నాయి. టీపాయ్ మీద ఆరోజు న్యూస్‌పేపర్ సగం తెరచి ఉంది. అప్పటికే వార్తలన్నీ చదివేసి, వినేసి ఉండటంతో అతడు తల తిప్పి ఆమె వంక చూశాడు. సాధారణంగా శనివారం షాపింగ్, మిగిలిన పనులు పూర్తి చేసుకుని, ఆదివారం పూర్తిగా విశ్రాంతికి కేటాయిస్తారు వాళ్ళు.

హర్షితకి ముందురోజు కౌన్సెలర్ చూపించిన వీడియో గుర్తుకు వచ్చింది. "ఇవాళ ఏ ప్రోగ్రామూ లేదు. హాయిగా ఇంటి దగ్గరే" అనబోయి ఆగింది. వచ్చే గురువారం అత్తగారి పుట్టినరోజు. ఆమెకి చీర కొనడానికి ఇవాళ వెళ్దామనుకున్నారు. ఈరోజు వెళ్ళకపోతే మళ్ళీ వీక్‌డేస్‌లో వెళ్ళడం కుదరదు.

'అత్తయ్యగారికి చీర కొనడానికి వెడదామను కున్నాం కదా?" అతడికి కాఫీ ఇస్తూ అంది. కాఫీ ఇవ్వడానికి కొద్దిగా ముందుకు వంగిందామె. రాత్రి వేసుకున్న కాటన్ నైట్ డ్రెస్ కొద్దిగా నలిగి, ఆమె ఒంటి ఒంపులకి సరిపడా సర్దుకున్నట్టుగా, అందంగా ఉంది.

తను కూడా ఒక కప్పు తీసుకుని ఎదురుగా సోఫాలో కూర్చుంది హర్షిత. ఉదయం లేవగానే

చూపులు కలసిన శుభవేళ...

-ఆకునూరి మురళీకృష్ణ

చన్నీళ్ళతో ముఖం కడుక్కుని, కుంకుమ బొట్టు పెట్టుకుందామె అలవాటు ప్రకారం. పచ్చగా మెరుస్తున్న నున్నటి బుగ్గలూ, లేత గులాబీ రంగులో ఉన్న లిప్‌స్టిక్ లేని పెదాలు, నీళ్ళతో అదిమి, దువ్వకుండా క్లిప్ పెట్టుకున్న జుట్టూ, అందంగా మెరుస్తున్న కుంకుమబొట్టూ... ఆమెని చూస్తూ ఒక్కక్షణం అలాగే ఉండిపోయాడతను.

"అయితే లంచ్ బయటే చేసేద్దాం. డిన్నర్‌కి మాత్రం ఇంటికి వద్దాం. సరేనా?" అన్నాడు.

"సరే" అంటూ టీపాయ్ మీద సగం తెరిచిన పేపర్ తను అందుకుని తిరగెయ్యసాగింది. పేపరు చదువుతున్న హర్షిత వంక చూస్తూ కూర్చున్నాడు అతడు.

ఒక చేత్తో కాఫీ కప్పు పట్టుకుని, మరో చేత్తో పేపరు పట్టుకున్న ఆమె చేతులు నీరెండ వెలుగులో నైట్ డ్రెస్ స్లీవ్స్‌లోంచి బంతిపూల దండల్లా కనిపిస్తున్నాయి. కాలి మీద కాలేసుకుని కూర్చున్నప్పుడు ఒక రకమైన అందం.. రెండు కాళ్ళనీ అలవోకగా మడిచినప్పుడు మరో రకమైన అందం...

"బ్రేక్‌ఫాస్ట్ ఏమిటి?" అన్నాడు ఆమెనలా చూస్తూ.

"మీకిష్టమైన ఇడ్లీ సాంబార్".

చేసే పనేం లేకపోవడంతో "అబ్బో మరైతే ఇంకేం. పద, ఇద్దరం కలిసి చేసేద్దాం" అన్నాడు ఉత్సాహంగా.

"అవసరం లేదు. నిన్న రాత్రే అన్నీ రెడీ చేసి ఉంచాను. ఇడ్లీ వేసి, సాంబార్ కుక్కర్లో పెట్టేస్తాను. మీరు స్నానం చేసి రండి" పేపరు మడత పెట్టి వంటింటి వైపు నడిచింది.

ఆమె వెళ్ళినవైపు చూస్తూ ఉండిపోయాడు శ్రీహాస్. ఆమె ఐదడుగుల ఐదంగుళాల ఎత్తు ఉంటుంది. ఐడియల్ బాడీ మాస్ ఇండెక్స్‌కి ఆమెను ఉదాహరణగా చెప్పవచ్చు. అయితే ఐడియల్ బి.ఎం.ఐ. ఉండగానే సరిపోదు. బాడీలో ఎక్కడ మాస్ ఎక్కువ ఉండాలో ఎక్కడ తక్కువ ఉండాలో ఎక్కడ ఉండీ లేనట్టుగా ఉండాలో అలా ఉంటేనే అసలైన అందం. అవన్నీ బ్రహ్మదేవుడు లెక్కలువేసి తయారు చేసినట్టు ఉండడం ఆమె ప్రత్యేకత. ఆమె నడుస్తుంటే కనిపిస్తున్న ఆ సౌందర్యాన్ని మొదటిసారిగా చూస్తున్నట్టుగా కళ్ళప్పగించి చూశాడతను.

ఆమె నెమ్మదిగా నడిచి వంటగదిలోకి వెళ్ళింది. టీవీలో ఇందాక చదివిన వార్తలనే మళ్ళీ చదువుతున్నారు. రిమోట్‌తో టీవీ కట్టేసి వంటగది వైపు నడిచాడు శ్రీహాస్. అతడు వెళ్ళేసరికి ఆమె చేతులు పైకెత్తి మునివేళ్ళపై నిలబడి పై అల్మారాలో ఏదో వస్తువు కోసం వెదుకుతోంది. ఆ భంగిమలో ఆమె శరీరంలోని సన్నని భాగాలు సాగి మరింత సన్నగా కనిపిస్తుంటే, ఎత్తైన భాగాలు మరింత ఎత్తుగా కనిపిస్తున్నాయి.

అలా చెయ్యెత్తి నిలబడడంవల్ల నైట్ ప్యాంట్‌కీ, టీ షర్టుకీ మధ్య ఏర్పడిన ఖాళీ ప్రదేశంలో కిటికీ లోంచి ఏటవాలుగా పడుతున్న ఒక సూర్య కిరణంపడి పరావర్తనం చెందుతూ బంగారు నగకి వన్నెపెట్టినట్టు మెరుస్తూ కనిపిస్తోంది ఆమె నడుము. అతడు అప్రయత్నంగా ఆమె నడుముచుట్టూ రెండు చేతులూవేసి దగ్గరగా హత్తుకున్నాడు.

ఆమె ఉలిక్కి పడ్డట్టు తలతిప్పి వెనక్కిచూసి, నవ్వింది. అలా తల తిప్పగానే నుదుటిమీద పడ్డ జుట్టుని పక్కకి తోసి, ఆమె బుగ్గమీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు అతడు "ఇంకో కాఫీ కావాలి. ఇస్తావా?"

"కాఫీ ఇస్తానుకానీ, బుద్ధిగా హాల్లో కూర్చోండి. పనిమనిషి వచ్చే వేళైంది" అతడి పట్టు విడిపించుకుంటూ అందామె. ఆమె అలా అందోలేదో కాలింగ్ బెల్ మోగింది.

"అపశకునపు పక్షి" కసిగా అన్నాడు అతడు ఆమె బుగ్గని మరింత గట్టిగా కొరుకుతూ.

ఆమె ఇష్టంగా దూరం నెట్టింది అతన్ని.

•••

డ్రైవింగ్ చేస్తున్న శ్రీహాస్ పక్కసీట్లో కూర్చుంది హర్షిత. నెలలో రెండు శనివారాలు షాపింగ్‌కి వెళ్ళే అలవాటు ఉన్న వాళ్ళకి ఆ రోజు షాపింగ్ చెయ్యడం ప్రత్యేకంగా ఉన్నట్టుగా అనిపించింది.

చీర సెలక్షన్ పూర్తయ్యాక "నువ్వు కూడా ఏమైనా తీసుకో" అన్నాడు శ్రీహాస్.

"నా షాపింగ్ అంటే ఇప్పట్లో తెమలదు" అందామె.

"చుడీదార్లు బాగున్నాయి. ఒకసారి ట్రై చెయ్యి. నచ్చితే తీసుకుందాం. లేకపోతే వెళ్ళిపోదాం" అని బలవంతం చేశాడు అతడు. ఎప్పట్లా ఆమె డ్రస్సులు సెలెక్ట్ చేస్తుంటే అతడు దూరంగా కూర్చోకుండా ఆమెతో పాటు సెలక్షన్‌కి వచ్చాడు.

ఇద్దరూ కలిసి రెండు మూడు డ్రెస్సులు సెలక్టు చేశారు. ఆమెతోపాటు అతను కూడా ట్రైల్ రూమ్ దగ్గరకి వచ్చాడు. ఆమె డ్రెస్ వేసుకుని వచ్చేవరకూ బయట వెయిట్ చేస్తూ ఎప్పటికప్పుడు తన కామెంట్లు చెప్పడంతో, రెండు డ్రెస్సులు తీసేసుకుంది. ఆ తరువాత మరికొంత షాపింగ్, అతడికీ, తనకీ నైట్ డ్రెస్సులూ, టీ షర్టులూ వగైరా... ఆ తరువాత అదే మాల్లో ఉన్న రెస్టారెంట్లోనే లంచ్ చేసి మరికొన్ని షాపులు తిరిగి ఇంటికి బయలుదేరారు.

స్టీరియోలోంచి వస్తున్న మ్యూజిక్ వింటూ అతడివంక చూసింది హర్షిత. నాలుగు గంటలపాటు షాపింగ్ చేసినా, ఆ అలసటే కనిపించడం లేదు అతడి మొఖంలో.

ఉదయం షాంపూ చేసిన జుట్టు గాలికి ఎగిరి నుదుటి మీద పడుతోంది. సగం పెరిగిన గడ్డం ముఖానికి అదో రకమైన అందాన్నిస్తోంది. అతడి పర్సనాలిటీకి హాఫ్‌స్లీవ్స్ టీ షర్టులు చాలా బాగుంటాయి. వయసు మరో ఐదేళ్ళు తక్కువైనట్టు కనిపిస్తున్నాడు. కారులో చాలాసార్లు అతడి పక్కనే కూర్చుని ప్రయాణం చేసినా, అతడి వంక అలా పరిశీలనగా ఎప్పుడూ చూడలేదు ఆమె.

తన వంకే చూస్తున్న ఆమెని చూసి చిన్నగా నవ్వాడు అతడు. ఆమె కొద్దిగా పక్కకి వంగి, అతడి మీద చెయ్యి వేసింది.

"ఈ ట్రాఫిక్‌లో కారు ఆపడం కష్టం" అన్నాడతడు నవ్వుతూ.

అతడి మాటలకి సిగ్గుపడి, తను కూడా నవ్వింది.

•••

ఇంట్లోకి అడుగుపెట్టగానే షాపింగ్ బ్యాగ్స్ సోఫాలో పడేసి, తలుపు గడియవేసి ఆమెని గట్టిగా హత్తుకున్నాడు శ్రీహాస్. వీపుమీద అతడి చేతులు తన చుడీదార్ హుక్స్‌ని వెదకడం గమనించిన ఆమె నవ్వుతూ అంది 'ఏమిటీ' అని.

"నువ్వు కొన్న డ్రెస్సుల సైజు గురించి కొంచెం అనుమానంగా ఉంది. ఒకసారి మళ్ళీ ట్రైల్ వేస్తావని.." నవ్వుతూ అన్నాడు శ్రీహాస్.

అతడి మెడచుట్టూ చేతులువేసి తమకంగా అతడి ముఖాన్ని దగ్గరగా తీసుకుని పెదవులు ముద్దాడింది. ఆమెను అలా హత్తుకుంటూ సోఫాలోకి తోశాడు శ్రీహాస్.

అతడి చేతులు ఆమె శరీరంతో ఆడుకున్నాయి. అలవాటైన ఆటే ఆయినా, ఆరోజు ఎందుకో కొత్తగా అనిపించిందామెకి. అతడామెకి, ఆమె అతడికీ ఇద్దరూ పరస్పరం ఏవేవో సుఖాల్ని రుచి చూపిం

అతడి ముఖాన్ని దగ్గరగా తీసుకుని పెదవులు ముద్దాడిందామె తమకంగా. ఇంకా హత్తుకుంటూ ఆమెను సోఫాలోకి తోశాడతను. అతడి చేతులు ఆమె శరీరంతో ఆడుకున్నాయి. అలవాటైన ఆటే. కానీ ఆరోజెందుకో మరింత కొత్తగా ఉంది ఇద్దరికీ!

రామచిలుకల్లో 372 రకాలున్నాయి. వీటిల్లో కొన్ని రకాల రామచిలుకలు 80 సంవత్సరాలు కూడా జీవిస్తాయి!

చాలని ప్రయత్నించారు. అలవాటైన రుచులే అయినా, ఆరోజెందుకో మరింత మధురంగా ఉన్నట్టనిపించాయి ఇద్దరికీ!

నాలుగడుగుల ఆ ఇంపోర్టెడ్ కుషన్ సోఫా ఆరడుగుల అతడికీ, అయిదున్నర అడుగుల ఆమెకీ అంత సౌకర్యవంతమైన ఆశ్రయమివ్వగల శక్తి తనకుందని మొదటిసారిగా తెలుసుకుని గర్వపడింది.

దాదాపు అరగంట తరువాత, చెమటతో తడిసిన తన బుగ్గలని అతడి ఛాతీకి రాస్తూ అందామె "ఏమైందివాళ మీకు?"

"ఏమైందో తెలియదుగానీ, అవ్వాల్సిందేదో అయిందనిపిస్తోంది. ఇన్నాళ్ళూ ఎదురు చూసిన ఆ 'ఇదేదో అయిందనిపిస్తోంది' నగ్నంగా ఉన్న ఆమె నడుము కింద చేతులు కదిలిస్తూ అన్నాడతడు.

ఆమెకి కూడా సరిగ్గా అలాగే అనిపించింది. ఆమె కళ్ళూ ఆనందంతో మెరిశాయి. 'ఒక చిన్న ఐడియా' తమ జీవితాన్ని ఇంతబాగా మార్చగలదని ఆమె అనుకోలేదు! ముందు రోజు కౌన్సెలర్ చూపించిన భార్యాభర్తల వీడియో గుర్తొచ్చింది.

●●●

హర్షిత ఊహించినట్టుగా, ఆ కౌన్సెలర్ చూపించబోయిన ఆ వీడియో నీలిచిత్రం కాదు. ఒక పాత తెలుగు సినిమా లోని పాట!

భర్త ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేవేళకి భార్య ముందు గదిలో చాప మీద కూర్చుని, జుట్టు దువ్వుకుని జడ వేసుకుని, అద్దంలో చూసుకుంటూ బొట్టు పెట్టుకుంటూ ఉంది. ఎప్పుడు వచ్చాడో తెలియని భర్త చాపమీద కూర్చుని, అద్దంలో బొట్టుదిద్దుకుంటున్న ఆమె రూపాన్ని అపురూపంగా చూస్తున్నాడు. ఆమె సిగ్గుల మొగ్గై, అద్దాన్ని ముఖానికి అడ్డుగా పెట్టుకుంది. అతడు అద్దం పక్కకి తీసి, ఆమె ఒళ్ళో పడుకుని ఆమె కళ్ళలోకి చూశాడు. ఏ సౌకర్యాలూ లేని మధ్య తరగతి ఇల్లు. ఆమె సాదా సీదా నూలు చీర కట్టుకుంది. బొట్టూ కాటుక తప్ప మరో మేకప్ లేదు. అతడు నలిగిపోయిన బట్టలే వేసుకున్నాడు. అయినా వాళ్ళ మధ్య ఏదో ఆకర్షణ!

ఆమె పెరట్లో స్నానంచేసి, చీర ఒంటికి చుట్టుకుని ఇంట్లోకి వచ్చి తలుపు దగ్గరగా వేసింది. తీరా చూస్తే తలుపు చాటున భర్త! అతడి చూపులు తడి చీరలో ఉన్న ఆమె అందాన్ని జుర్రుతున్నాయి. ఆమె అతడిని బయటికి నెట్టి తలుపు వెయ్యబోయింది. అతడు తలుపు వెయ్యనివ్వలేదు కానీ, బయటికి వెళ్ళలేదు. అలాగే ఆమెని పట్టుకుని అపురూపంగా చూశాడు. అతడు తనని 'అలా' చూడడం కోసమే తను స్నానం చేస్తున్నంత సేపూ తలుపు చాటున నిలబడి ఎదురు చూశాడని అర్థమైన ఆమె సిగ్గుల మొగ్గయింది.

రాత్రి భోజనాలయ్యాక ఆమె కాటన్ చీర కట్టుకుని, జడలో చిన్నమల్లె చెండు తురుముకుని, తాంబూలం పళ్ళెం తీసుకుని పడక గదిలోకి వచ్చింది. పైట తొలగి కనిపించిన ఆమె అందాలు చూసి, అతడు తాంబూలం పళ్ళెం బదులు ఆమె చెయ్యి అందుకుని తన దగ్గరకి లాక్కోబోయాడు. అంతలో పుస్తకం పట్టుకుని, కథ చెప్పమంటూ పిల్లాడు వచ్చాడు. అతడు దూరం జరిగాడు. ఆమె పిల్లాడికి కథ చెబుతున్నంతసేపూ అతడు ఆమెనే చూస్తున్నాడు. పిల్లవాడికి నిద్ర వచ్చి కళ్ళు మూతలు పడ్డాక, దీపం కాంతి తగ్గింది. ఇద్దరూ ఒకరిలోకి ఒకరు ఒదిగిపోయారు.

"ఆ దంపతుల మధ్యన ఉన్నదీ, మీ మధ్యన లేనిదీ ఏమిటో అర్థమయిందా?"

"ఆ మోహావేశాన్నీ పరవశాన్నీ వాళ్ళు నటిస్తున్నారు".

"అది నటనే కావచ్చు. కానీ నేనడిగింది అది కాదు. వాళ్ళ శృంగారానికీ, మీ శృంగారానికీ ఉన్న తేడా మీరు గమనించారా అని".

హర్షిత అయోమయంగా చూస్తుంటే కౌన్సెలర్ "మీరు చూసిన ఆ వీడియోలో భార్య భర్త వంకా, భర్త భార్య వంకా చూసినట్టుగా మీరిద్దరూ రోజులో ఎన్నిసార్లు ఒకరినొకరు పరిశీలనగా చూసుకుంటారు? ఒక్కసారి ఆలోచించి చెప్పండి?" అని అడిగింది.

హర్షిత ఆలోచిస్తుంటే కౌన్సెలర్ నవ్వింది "మీరు వచ్చిన దగ్గర నుంచీ గమనిస్తున్నాను. నేను మీతో మాట్లాడుతున్నా. మీ దృష్టంతా చేతిలో ఉన్న మీ సెల్‌ఫోన్ మీదే ఉంది. నేను మాట్లాడుతున్నాగానీ, మీరు నావంక చూసింది తక్కువే. సెల్‌ఫోన్లో వచ్చిన మెసేజ్‌లు చూడటమే ఎక్కువ. మీరేకాదు. మనలో చాలామందికి ఈ రోజుల్లో ఇది మామూలే. ఒక ఐడియా మన జీవితాన్నే మార్చేస్తుందని ప్రకటనలు విన్నాం. ఈ ఐడియాలూ, రిలయెన్సులూ వచ్చి నిజంగానే మన జీవితాన్నే మార్చేశాయి! ఎంతగా అంటే, భార్యాభర్తలు కూడా తలెత్తి ఒకరి ముఖాలు ఒకరు చూసుకోలేనంతగా, ఒకే ఇంట్లో ఉంటున్నా, భార్య ప్రపంచం వేరు, భర్త ప్రపంచం వేరు. సోషల్ నెట్ వర్కింగ్, హాబీల పేరిట మనం సృష్టించుకున్న విర్చువల్ వరల్డ్... మిథ్యా ప్రపంచం. ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా, తలదించుకుని ఈ మిథ్యా ప్రపంచంలో సేదతీరడానికి క్రమంగా అలవాటు పడిపోతున్నాం మనం.

వినడానికి చిన్నగా అనిపించినా, నిజానికి ఇది పెద్ద సమస్య. ఒకరి కళ్ళలోకి ఒకరు, ఒకరి ముఖం ఒకరు చూసుకోవడానికే తీరిక లేనప్పుడు ఇంక మీ ఇద్దరి మధ్య ఆకర్షణ ఎలా పుడుతుంది? ఆకర్షణ లేని కలయికలో యాంత్రికత తప్ప పరవశం ఎలా వస్తుంది?

ఒక కౌన్సెలర్‌గా నేను మీకిచ్చే సలహా ఏమిటంటే రోజూ దీనికి దూరంగా ఉండమని ఎలాగూ చెప్పలేను. కనీసం వారానికొక రోజైనా, ఈ మిథ్యా ప్రపంచాన్ని వీడి, మీ నిజమైన ప్రపంచంలో జీవించండి. ఇద్దరూ చెరో ఫేస్‌బుక్కులోనో, వాట్స్ ఎపోనో తలదాచుకోకుండా, అన్నీ కట్టి పడేసి ఒకరి ముఖాలు ఒకరూ చూసుకోండి. మీ మధ్య ఆకర్షణ దానంతట అదే పుడుతుంది. దాంపత్యంలో ఉన్న అసలు ఆనందం తెలుస్తుంది".

ఆమె మాటల్లో భావం తెలుసుకున్న హర్షిత ముఖమ్మీద అప్రయత్నంగా నవ్వు విచ్చుకుంది.

ఆమె సలహా మేరకు శుక్రవారం రాత్రే "మా ఇద్దరి మొబైల్ ఫోన్లు క్రాష్ అయ్యాయి. రిపేరుకి ఇచ్చాం. అత్యవసరమైతే ల్యాండ్‌లైన్ కాల్ చెయ్యండి" అని ముఖ్యమైన బంధువులకీ, స్నేహితులకీ ల్యాండ్‌లైన్ నుంచి ఫోన్ చేసి చెప్పింది హర్షిత. శ్రీహాస్ కూడా అదే పని చేశాడు. ఆ తరువాత ఇద్దరి మొబైల్స్ స్విచాఫ్ చేసి డ్రెస్సింగ్ టేబిల్ సొరుగులో పడేశారు.

ఇంట్లో ఉన్న డెస్క్‌టాప్‌నీ, ల్యాప్‌టాప్‌నీ కూడా స్విచాఫ్ చేసి, వాటికోసం కొన్న రంగురంగుల క్లాత్‌తో కవర్ చేసింది హర్షిత.

ఆ తరువాత తరచుగా వాళ్ళ మొబైల్ ఫోన్లు 'క్రాష్' అవుతూనే ఉన్నాయి. వాట్సప్‌లూ, ఫేసుబుక్కులూ 'కరప్ట్' అవుతూనే ఉన్నాయి. అయితే, వాళ్ళ దాంపత్యం మాత్రం ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా సాగుతూనే ఉంది.

నవ్య



సినీ నారాయణీయం

(ఎమ్మెస్ నారాయణ జీవితచిత్రం) 24

నటుడవ్వడం పూర్వజన్మ సుకృతం

చాలా కాలానికి ఆ ప్రొడ్యూసర్ హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కనిపిస్తే, పిలిచి నా కారు ఎక్క మన్నా. ఎక్కాడు. 'సార్ అప్పుడు మీరు ఎంత ఖర్చుపెట్టారు' అన్నా. 'పదివేలు' అన్నాడు. ఆ డబ్బు ఇస్తానుగానీ, వడ్డీ మాత్రం ఇవ్వలేనన్నా. క్షమించండి, నాకు డైరెక్షన్ తెలియకుండా చేసేశాను. మిస్టేక్ జరిగింది. ఏమనుకోకండి అని ఆ డబ్బిచ్చి పంపేశా.

ఆ మధ్య రవితేజగారి 'దరువు' సినిమాలో చిత్రగుప్తుడు వేషం వేశాను. యమలోకం సెట్ వేశారు. ఆ సెట్‌లో 300 లైట్లు. పైన హై ఓల్టేజి. కిందున్న పెద్దలైట్లను పార్‌లైట్స్ అంటారు. మూడు మీటర్ల దూరం నుంచి కూడా బాగా వేడి కొడుతూ ఉంటుందా లైటు. మన మొహం మాడిపోతుంది. పైగా ఆ స్మోక్ ఫైర్ గ్యాస్‌తో వస్తుంది.

వృత్తి ధర్మంలో రిస్క్ తప్పదు

ఆ వేడి లైట్ల మధ్య ఒక గంట షూటింగ్ జరిగాక అక్కడ ఆక్సిజన్ ఉండేది కాదు. తలకు విగ్గు, టర్బైన్, ఒంటిమీద మందంగా ఉండే దుస్తులు, నడుం వరకు నిండుగా ఆభరణాలు పెట్టుకుని షూటింగ్ చేస్తుంటే లోపల శరీరం ఉడికిపోతుందన్నమాట. ఆ విధంగా 10 రోజులు కంటిన్యూగా షూటింగ్ చేశాను. ఆ సినిమా చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది, 'అవసరమా?' అని. కానీ అది అవసరం కాదు. ఒక మనిషి కేవలం అవసరం కోసమే చేయడు, డబ్బుకోసం, తిండికోసం చేస్తాడు. అయితే మరణించిన తర్వాత కూడా రెండు తరాల వరకూ తినేంత ఉంది నాకు. సో యాక్షన్ మానేయచ్చు. కానీ, అది లేబర్ వర్క్ కాదు. అది కళకు సంబంధించిన పని. ఆ పనిలో అలాగే కష్టపడాలి. ఆ కష్టానికి సంబంధించిన టైమింగ్స్ అలాగే ఉంటాయి. ఏదో ఒక ఏకపాత్రాభినయం అయితే మన ఇష్టం వచ్చినప్పుడు వెళ్ళి చేయ వచ్చు. కానీ యాక్టర్స్ కాంబినేషన్స్ ఉంటాయి. అక్కడ హీరోగారు, డైరెక్టర్‌గారు మనం ఉండాలి. తోటి నటీనటులు ఇబ్బంది పడకుండా చేయాలి. కాబట్టి వియ్ మస్ట్ డూ ఇట్.

అదే సుకృతం

నేనొక యాక్టర్‌ని కాబట్టి యాక్టింగ్ చెయ్యాలి. డబ్బులేదని కాదు. అది వృత్తి ధర్మం. ఎందుకని వృత్తి ధర్మం అంటే, యాక్టర్ అనేది ప్రపంచంలో ఒక ప్రత్యేకమైన పదం. ప్రత్యేక వృత్తి. దానికి జీతం లేదు. కావలసినంత డబ్బు ఉంటుంది. దానికి టైమింగ్స్ ఉండవు. కానీ టైమ్‌కి వెళ్ళాలి. అదేంటంటే ప్రజలందరూ చూసి ఆనందించే ఒక ప్రత్యేకమైన వృత్తి. ప్రొఫెషనల్ వృత్తి కాదది. అందుచేత చేసి తీరాలి. ఆ చిత్రగుప్తుని పాత్ర నేను చేస్తేనే బాగుంటుంది. అంచేత నేనే చెయ్యాలి. దూకుడులో సినీ హీరో వేషం నేను చేస్తేనే బాగుంటుంది. అందుచేత నేనే చెయ్యాలి. ఈ సందర్భంగా నిన్న నా జీవితంలో ఒక గొప్ప రోజు. ఎలాగంటే 'సింహా' ప్రొడ్యూసర్ పరుచూరి ప్రసాద్‌గారు వెంకటేష్‌బాబు, శ్రీకాంత్ బాబు హీరోలుగా ఒక సినిమా తీస్తున్నారు. దాంట్లో నేను కమెడియన్. నన్ను పిలిచి మెహర్ రమేష్‌గారు రెండు గంటల సేపు నాకు కథ చెప్పారు. అలాంటి పాత్ర జీవితంలో నాకు వస్తుందని కలలో కూడా నేను అనుకోలేదు. నభూతో.... భవిష్యత్తులో రావచ్చు. బట్ నభూతో. భూతకాలంలో నేను చేయలేదు. ఒక అద్భుతమైన స్పాన్ ఉన్న గొప్ప క్యారెక్టర్. సైకో శ్రీను నా పేరు. క్రిమినల్ సైకాలజిస్ట్ వీడు. అసలు ఎంత జనరేట్ అయ్యిందంటే కామెడీ ఆద్యంతమూ పేలిపోయింది. అంచేత నేనది చేయ కూడదనుకుంటే ఎలా? నేను అలసిపోయాను. నేను చేయకూడదు. లేకపోతే నాకు డబ్బులు ఉన్నాయి. ఐయామ్ కంఫర్టబుల్ విత్ మై లైఫ్ కాబట్టి నేను చేయను అనటానికి లేదు. అంచేత నటుడు అవటం ఒక పూర్వజన్మ సుకృతం.

సునీల్‌కి సలహా

మద్రాసులో సినిమా కథల కోసం స్ట్రగుల్ అవుతున్న రోజుల్లో భీమవరం నుంచి సునీల్ ఉత్తరం రాశాడు. అతను ఇదివరకే పరిచయం. అతను కూడా సినిమ వేషాల కోసం ప్రయత్నిస్తూ ఉండేవాడు. ఉత్తరంలోని విషయం ఏంటంటే "గురూగారూ! సినిమాలలో వేషాలు పొందటం ఎలా?" అని. నేను వెంటనే సమాధానం పంపించాను. "సునీలూ, భీమవరంలో కూర్చుని మద్రాసులో గేలం వేస్తే ఎలా? ఓసారి చేప పడొచ్చు, కానీ ఇంతదూరంలో దారం తెగిపోవచ్చు. కాబట్టి చేప దగ్గరకు వచ్చి గేలం వెయ్యి. నెలకు 250 రూపాయలు మెస్సుకు, 50 రూపాయలు రూం షేరింగ్‌కు అవుతాయి. నెలకు 300 రూపాయలు వేసుకుని వచ్చేయ్, పని జరుగుతుంది" అని రాశా. తరువాత అతను వచ్చాడు. విజయం సాధించాడు కూడా.





ఎప్పుడూ పేపర్లమీద డైలాగులు రాసుకోలేదు

చాలామంది సినిమాల్లోకి రావాలని చూస్తారు. కానీ ఈ మాత్రం డబ్బు పెట్టుకునే స్థోమత లేక జారిపోతుంటారు. ఏం చెయ్యగలం?"

నీలం ప్రసాద్ అని నా ఫ్రెండ్. ఆయన స్క్రిప్టు రాసుకోవాలనుకున్నాడు. పేపర్లు అవసరమైె ఈయన రచయిత కదా. ఈయన దగ్గర ఉంటాయి అని దీపావళి రోజు మార్నింగ్ వచ్చి, సార్ షాపులన్నీ బంద్ చేసి ఉన్నాయి. ఒక దస్తా వైట్ పేపర్స్ ఇస్తే నేను మీకు మళ్ళీ పట్టుకొచ్చి ఇస్తానన్నాడు. వైట్ పేపర్స్ లేవండి అన్నా. నమ్మట్లేదు. ఊరుకోండి సార్ మీరు రచయిత. మీ దగ్గర పేపర్లు లేవంటే నేను నమ్మనండి అన్నాడు. ఓ పన్నెండండి, ఫెయిర్‌గా ఉన్నాం ఇద్దరం. మొత్తం రూం చూసుకోండి అన్నాను. నాకో బ్యాగ్ ఉంది. బీరువా కూడా లేదు. చిన్నపెట్టెలేవో ఉన్నాయి.

> **నటన అనేది ప్రజలందరూ చూసి ఆనందించే ఒక ప్రత్యేకమైన వృత్తి అని ఎమ్మెస్ భావన. దానికి జీతం ఉండదు. కావలసినంత డబ్బుంటుంది. టైమింగ్స్ ఉండవు. కానీ టైమ్‌కి వెళ్ళాలి. చేసి తీరాలి. బాగా సంపాదించాం కదా, ఇక చాలు, నటించను, బాగా అలిసిపోయాను అనుకుంటే కుదర్దు. కొన్ని పాత్రలు కొందరే చెయ్యాలి. అలాంటి అవకాశాలు కొందరికే వస్తాయి. అలాంటి అద్భుతమైన క్యారెక్టర్లు ఎమ్మెస్‌కి వచ్చాయి.**

అన్నీ ఓపెన్ చేసి నిజంగా టెస్ట్ చేశాడు. ఒక్క పేపర్ లేదు. మరిన్ని కథలు ఎలా రాశారు సార్ అన్నాడు. నేను 'ప్రతిష్ఠ' సినిమా కథ చెప్పినప్పుడు మీరున్నారు కదా సార్, ప్రొడ్యూసర్‌నన్నారు. పేపరు చూశానా నేను. పేపర్ చూడలేదు. ఈ సినిమాకి నేను డైలాగులు రాస్తున్నాను. రాసుకున్నది బయటకు తీసి పేపరు చూస్తూ ఎప్పుడన్నా మీ దగ్గర చదివానా? లేక చెప్పానా? అని అడిగా. చెప్పారు సార్. కరెక్టేనండి మీ చేతిలో నేను ఎప్పుడూ పేపరు చూడలేదు అన్నాడు. అలా షాక్ అయ్యాడు అతను. ఇప్పటికీ నేను కథలు, నాటికలు పేపర్లలో రాస్తే, అవన్నీ నా ఇంట్లో దొరకాలి కదా! లేవు. అంతే. ఒకడు టైపు చేసుకుంటాడు. ఒకడు ఆలోచించుకుని మాట్లాడతాడు. కవి అంటే పెన్ను పట్టుకుని పేపరు మీద రాసేవాడు కాదు. ఆలోచించేవాడు కవి.

రవిరాజా తండ్రి రచనలపై రీసెర్చ్ వర్క్

మద్రాసులో రచయితగా ప్రయత్నాలు చేసుకోవడానికి నాకు కాలేజీ వాళ్ళు మూడు సంవత్సరాలు సెలవు ఇచ్చారు కదా. ఆ మూడు సంవత్సరాలూ ఓ వైపు పూర్తయిపోతోంది. ఈ లోపు రవిరాజాగారు నన్ను ఆర్టిస్టుని చేసేశారు. నేనేం చేశానంటే రవిరాజాగారు నాకు ఇచ్చిన ఈ లిఫ్ట్‌కి కృతజ్ఞతగా ఆయన తండ్రిగారి పుస్తకాల మీద రీసెర్చ్ చేశాను. 'ఏ సోషలాజిక్ యాస్పెక్ట్ ఇన్ ద పినిశెట్టి వర్క్స్' అనేది నా టాపిక్. ఆ టాపిక్‌ని ప్రజెంట్ చేశానక్కడ. శంకర్‌రావు గారని ఒక తెలుగు ప్రొఫెసర్. బాగా చూశారు. మీరు రాసి ఇవ్వడం అదంతా ఉండదని చెబుతున్నారు కాబట్టి ఓ పని చేద్దాం, అని నా దగ్గర ఒక కుర్రాణ్ణి పెట్టారు. ఇదిగో మీరు చెప్పాలనుకున్నదంతా ఇతనితో చెబుతూ ఉండండి. ఇతను నాకు రాసిస్తాడు. నేను పరిశీలిస్తాను అన్నారు. అలా అతను నా దగ్గర వర్క్ చేస్తూ చేస్తూ ఉండగా నేను అక్కడి నుంచి యాక్టింగ్ వైపు షిఫ్ట్ అయిపోయాను. ఈలోగా నా టాపిక్‌ని యూనివర్సిటీ యాక్సెప్ట్ చేసింది. 'ఏ సోషలాజిక్ యాస్పెక్ట్ ఇన్ ద పినిశెట్టి వర్క్స్'. రవిరాజా నాన్నగారి నాటికలున్నాయి. 'పల్లెపడుచు', చిల్లరకొట్టు చిట్టెమ్మ', 'ఆడది' ఇవన్నీ చాలా ప్రాచుర్యంలో ఉన్నవి. ఆ రచనల మీద రీసెర్చ్ చేస్తూనే మరోవైపు నటుడుగా వేషాలు వేసుకుంటూ మెల్లిగా పూర్తిస్థాయి నటుడిగా మారిపోయి స్థిరపడిపోయాను.

ఇక్కడ నుంచి 'ప్రతిష్ఠ' సినిమాకి చాన్స్ వచ్చింది. ఈ సినిమాలో కృష్ణగారు హీరో. ఆయనకు నేనే కథ చెప్పాను. నేను కథ తయారుచేసి ఇచ్చాను. మాటలు నేనే రాశాను. తరణిరావు గారు డైరెక్టర్. సాగర్‌గారు అంతకుముందు 'అదిరింది గురూ' సినిమాకి కూడా నేనే రాశాను. ఈ సినిమా రాస్తూ ఇక్కడే ఉండాలి అని దీంట్లో ఒక వేషం ఇచ్చారు. కానీ బయటినుంచి కొన్ని వేషాలొచ్చాయి. ఇక్కడే ఉంటే రెండు మూడు వేషాలు పోయాయి."

చిరంజీవిగారు నా పేరున అర్చన చేయించారు

ఎం.ఎస్‌గారు కొన్ని రోడ్డు ప్రమాదాల్ని కూడా తప్పించుకున్నారు. ఆ మిస్సింగ్ యాక్సిడెంట్స్ గురించి ఆయన ఇలా చెప్పారు.

"ఓసారి ఈవీవీగారి సినిమా రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. షూటింగ్‌కి ఓ రెండు రోజులు సెలవులు వచ్చాయి. ఓసారి భీమవరం వెళ్ళి కాలేజీలో సంతకం పెట్టి వస్తాను అని పర్మిషన్ అడిగి రోడ్డు మీదకు వచ్చి విజయవాడ వెళ్ళే ఓ ప్రైవేటు బస్సు ఎక్కాను. అక్కడ ఆఖరి సీటు ఒకటే ఖాళీగా ఉంది. అక్కడ కూర్చున్నాను. తరువాత నార్కట్‌పల్లిలో మధ్యలో రెండు సీట్లు ఖాళీ అయ్యాయి. నేను అక్కడకు వెళ్ళి కూర్చున్నా. ఇంతలో ఇద్దరు దంపతులు ఎక్కారు. నేను ఖాళీ చేసిన సీటులో వాళ్ళు కూర్చున్నారు. బస్సు బయలుదేరి రోడ్డుపైకి వచ్చిందో లేదో ఓ లారీ వేగంగా వచ్చి బస్సు వెనక పక్క ఢీకొట్టింది. గ్లాసు పగిలి నా స్థానంలో కూర్చున్న అతనికి ముఖం అంతా రక్తసిక్తమైంది. నా గుండె ఝల్లుమంది. అదే నాకు జరిగితే ఆ సినిమా లేదు, నా ముఖం మారిపోయేది".

"మహారాష్ట్రలోని 'మహబలేశ్వర్‌'లో 'మృగరాజు' షూటింగ్ జరుగుతోంది. సూర్య అనే ఆర్టిస్ట్, నేను అక్కడికి వెళుతున్నాం. ఓ సుమోలో ప్రయాణం. తెల్లవారుజామున మూడింటికి నేను డోర్‌ను ఆనుకుని పడుకున్నాను. నిద్ర పట్టేసింది. ఆ డోర్ లాక్ వదిలేసింది. ఎనభై మైళ్ళ వేగంతో ఉన్న వాహనం నుంచి పడిపోయాను. తలకు ఓ నల్ల కండువా చుట్టుకుని ఉండడం వల్ల పెద్ద దెబ్బలు తగలలేదు. తల దిమ్ము నాలుగు రోజులు తగ్గలేదు. తరువాత రోజు షూటింగ్‌లో పాల్గొన్నాను. విషయం తెలిసి హీరో చిరంజీవిగారు నా పేరున అర్చన చేయించి, 'భగవంతుడు ఇచ్చిన రెండో జన్మ, సద్వినియోగం చేసుకో' అని దీవించారు.

(ఇంకావుంది)

-కూనపరాజు కుమార్

సెల్: 99899 99599



నిండు నూరేళ్ళు

12

-సింహప్రసాద్ సెల్: 98490 61668

'మా ప్రేమకి పెద్దవారి ఆశీస్సులు తీసుకోడానికి విజిత ఇంటికి భోజనానికెళ్ళాను. ఆనందపు పల్లకీ మీద ఊరేగుతూ వెళ్ళాను. విజిత అమ్మ, అన్నయ్య, వదినా ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. మరెంతో అభిమానంగా అన్నం పెట్టారు. ఆమె నాన్న రుద్రేశ్వరరావు ఏవో కారణాలు చెప్పి నేను సెలవు తీసుకోబోతుంటే వచ్చాడు. కావాలనే అలా చేశారని నా అనుమానం. అభిమానంగా గాక హడావుడిగా మాట్లాడారు. ఆయన మాటలు, చూపులు స్వచ్ఛంగా లేవు. ఏవో దాస్తున్నాయి. మా పెళ్లికి ఓకే అన్నప్పటికీ దాల్‌మే కుచ్ కాలాహై...!'

ఉలిక్కిపడ్డాను. డాడీని అనుమానించడమా? అబ్సర్డ్. విహాన్ మరీ ఇంతగా దిగజారి ఎలా ఆలోచించాడబ్బా!

టీవీ రంగంలో పుట్టిన రూమర్లు, ఓ పత్రికలో వచ్చిన వ్యంగ్య కథనాలు, అగ్నిపరీక్ష సీరియల్ నుంచి తొలగించి ఆ రోల్ శేషగిరికి ఇవ్వడం, అతన్ని అనుమానించడం, ఆర్జీగా తీసెయ్యడం, నేనిచ్చిన ధైర్యం, రుద్రేశ్వరరావు సిఫార్సుతో జెమినీ నాయుణ్ణి కలవడం, సినిమా ఛాన్సు, అగ్రిమెంటు... ఇలా వరుసగా జరిగిన ఘటనల్ని నిజాయితీగా రాశాడు.

'నా కెరీర్‌ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాడని శేషగిరిని అనుమానించాను. ద్వేషించాను. ఒకసారి ఘర్షణ పడ్డాను. అదంతా నా అపోహ మాత్రమేననీ అతడికి వాటితో సంబంధంలేదని అసలు మూలవిరాట్టు వేరే ఉన్నారని తర్వాత తెలిసింది. నా గురించి అవాకులూ చవాకులూ రాసిన పత్రిక తాలూకు సినిమా విలేకరి అనుకోకుండా ఒక రోజు కలిశాడు. ఎంతో టాలెంట్ ఉండి కూడా, నేను పాకుడురాళ్ళ మీంచి జారిపోతున్నందుకు ఎంతో బాధ పడ్డాడు. ఒకరి గుట్టు విప్పాడు. నా మీద విష ప్రచారానికీ, అగ్నిపరీక్ష సీరియల్ నుంచీ, ఎఫ్‌ఎమ్ రేడియో నుంచి ఉద్వాసనకూ కారణం, కారకుడూ రుద్రేశ్వరావుట!

నా కళ్ళని విశ్వసించలేకపోయాను. తల విదిలించి మళ్ళీ చదివాను. కర్టే. అది డాడీపేరు! మైగాడ్!

నాన్న నాకు తెలీకుండా, నాకే మాత్రం అనుమానం రాకుండా నా వెనుక ఇంత కుట్ర పన్నారా? ఆయనకి విహాన్‌ను అల్లుడుగా చేసుకోవడం ఇష్టం లేదా? అదే నిజమైతే ఆ మాటే చెప్పొచ్చు. ఆయన మాట జవదాటనని చెప్పానుగా. అయినా పెళ్లికి అంగీకరించినట్టు ఫోజు కొట్టి ఈ గోతులు తవ్వడం ఎందుకు? ఎవర్ని పూడ్చిపెట్టడానికి?

'జెమినీనాయుడి నుంచి లీగల్ నోటీసు వచ్చాక తెలిసింది, అగ్రిమెంటులోని విపరీత క్లాజుల వెనుక రుద్రేశ్వరావు హస్తం ఉందని! నా కెరీర్‌నీ, తద్వారా నన్నూ నాశనం చేసి విజితని నానుంచి దూరం చెయ్యాలని ఆయన ప్రయత్నం. ఇది ఆయన పన్నాగం అని అర్థమైంది. విజితకి నేను సరిజోడు కాదు. ఒప్పుకుంటాను. ఎంచేతంటే ఆమె ఒక దేవత. నేను తాడూ బొంగరంలేని సాదాసీదా మనిషిని. సామాన్యుణ్ణి, ఆమె భక్తుణ్ణి. ఆ విషయం నాకు బాగా తెలుసు. అయినా ప్రేమకు ఆస్తులూ అంతస్తులూ పరువులూ ప్రతిష్ఠలూ ఇగోలు భేషజాలూ అడ్డొస్తాయని ఊహించలేకపోయాను. విజిత స్నేహమే నాకు ఆ భరోసా ఇచ్చింది. అయినా ఆయన తన అభిప్రాయం నాకు చెప్పిఉంటే విజితకి తెలీకుండా నొప్పించకుండా దూరంగా జరిగేవాణ్ణి. ఒక మాటతో పోయేదానికి కత్తి ప్రయోగించారు. వరుసగా జరిగిన జరుగుతున్న ఘటనలు నన్ను ఉన్మత్తుణ్ణి చేశాయి. లాగి విడిచిన బాణంలా వెళ్ళి జెమినీ నాయుడి మీద విరుచుకుపడ్డాను. నా కెరీర్‌కు నిలువునా నిప్పుపెట్టడానికి కుట్ర చేసింది ఎవరని నిలదీశాను. మొదట బుకాయించినా తర్వాత రుద్రేశ్వరావు పేరు చెప్పాడు. నన్ను నేను నిగ్రహించుకోలేక పోయాను. ఆ ఘర్షణలో...!'

నిర్ఘాంతపోయాను. ఇదంతా నిజమేనా? నాన్న... నాన్న ఇంత నీచానికి ఒడిగట్టారా? మేకవన్నె పులిలా మారి వేటాడారా? ఇదంతా నా కోసమే! నామీది ప్రేమతోనే?

ఓహ్! సమాధి మీద పునాదులు నిర్మిస్తే నేనెలా హర్షిస్తాననుకున్నారు?

గుండెని అగ్నిశిఖలు నలువైపుల నుంచీ ఆక్రమించి కాల్చేస్తున్నాయి. రక్తకన్నీళ్ళు ధారలు

కట్టాయి. ఒళ్ళంతా గాజు పెంకుతో చీరినట్టు భగ భగ మండిపోతోంది.

మళ్ళీ పుస్తకంలోకి చూశాను. కన్నీటి తెర లోంచి చదివాను.

'నేను చేసింది తప్పే. నేరమే. జెమినీనాయుడి

జరిగిన కథ

ప్రేమించిన ప్రియుడు విహాన్ జైలుపాలవడంతో తప్పని పరిస్థితుల్లో తండ్రి చెప్పిన సంబంధమే చేసుకుంటుంది విజ్జి. పెళ్ళి తర్వాత కూడా అతన్ని మరిచిపోలేకపోతుంది. ఇంతలోనే ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు ఆమెకు మెసేజ్ ఇస్తాడు విహాన్. అతన్ని రక్షించేందుకు భర్తను కూడా లక్ష్యపెట్టకుండా అర్ధరాత్రి బయలుదేరి పూనే నుండి హైదరాబాద్ వెళుతుంది. ఆర్నెల్ల అజ్ఞాతవాసంలో విహాన్ తలదాచుకున్న గదికి వెళ్ళి అతడి డైరీ స్వాధీనం చేసుకుంటుంది. విజ్జితో పరిచయం, తన ప్రేమకథ వివరంగా ఉంది అందులో. ఆ డైరీ చదువుతూ విస్తుపోతోంది విజ్జి. ఆ తర్వాత....

మీద చెయ్యి చేసుకోకుండా ఉండాల్సింది. కడుపు మీదా గుండె మీదా ఏకకాలంలో ఇనుప సుత్తితో బాదేసరికి భరించలేక పోయాను. ఆగ్రహంతో మండాను. పశువునైపోయాను. తర్వాత పోలీస్ స్టేషన్లోనూ జైలు గోడల మధ్యా ఎంత చింతిస్తే, ఎంత పశ్చాత్తాపపడితే ఏం లాభం! జరగకూడనిది జరిగిపోయింది. నా నుదుటి రాత శాశ్వతంగా మారిపోయింది. పాపం విజిత. ఆంబోతుల పోరాటం మధ్య నలిగిన లేగదూడలా. నన్ను సానుభూతితో అర్థం చేసుకుంది. నా ఆవేశాన్ని సమర్థించింది. తన తండ్రి లాయర్ని పెట్టి నన్ను విడిపిస్తాడని కలలుకన్నది. ఆర్థికంగా అండగా ఉంటానని నమ్మకంగా చెప్పింది. ఆమెకి తెరవెనుక ఈ బాగోతాలు తెలీవు!

రుద్రేశ్వరరావు తన మనిషి ద్వారా బేరం పెట్టాడు. నేను విజితని మర్చిపోయి దూరంగా ఆమెకి కన్పించనంత దూరంగా వెళ్ళిపోవాలి. అందుకు అంగీకరిస్తే అగ్రిమెంటు నుంచి కేసు నుండి జైలు నుండి విడిపిస్తానన్నారు. అమ్మ, తమ్ముళ్ళు, చెల్లెలి అమాయకపు మొహాలు గుర్తొచ్చాయి. నేను సమిధనై కాలిపోయినా ఫరవాలేదు మా వాళ్ళైనా బావుంటే, కాదు బ్రతికితే చాలు! వాళ్ళకోసం నా బతుకూ భవిష్యత్తూ బలిపెట్టుకోడానికి సిద్ధపడ్డాను.

సినిమా అగ్రిమెంటు చిరిగిపోయింది. కేసు కాంప్రమైజ్ అయింది. జైలు నుంచి విడుదల అయ్యాను. విశాల విశ్వంలోకి అడుగుపెట్టాక తెలిసింది నేను నేను కాదు ఒక జీవచ్ఛవాన్ని అని..!"

కుళ్ళి కుళ్ళి ఏడ్చాను.

నాన్న ఒకరి కెరీర్నీ, జీవితాన్నే కాదు ఏకంగా ఒక కుటుంబాన్నే హత్య చేశారు! నిజంగా రాక్షసత్వమే!

పురాణకథల్లోని రాక్షసులు యజ్ఞయాగాలు ధ్వంసం చేశారు. మునుల్ని హింసించారు. అమాయకుల్ని బాధించారు. కానీ ఎవరూ ఇలా ఒకరి మీద అకారణ కసితో కక్షతో ఒక బడుగు కుటుంబాన్నే రోడ్డున పడేయలేదు!

నవరంధ్రాల్లోని ఒక్కోదాన్నీ మూసేస్తూ వచ్చి కడకు ఆ రంధ్రాలన్నింటినీ మూసేసి విహాన్ గిలగిల తన్నుకునేలా చేశారు. ఆత్మహత్య చేసుకునేందుకు కారణమయ్యారు. అతడు లేడని తెలిసిన మరుక్షణం ఆ కుటుంబం మూకుమ్మడి ఆత్మహత్యలకు తలపడొచ్చు. అదే జరిగితే ఆ పాపం నాన్నదే! ఆ శాపం మా కుటుంబానికే!

చెప్పలేనంత బాధ, క్షోభ గుండెల్ని మెలిపెడుతోంటే హోరున భోరున ఏడ్చాను. అలా ఎంత సేపు ఉండిపోయానో నాకే తెలీదు.

ఇంటావిడ టీ కప్పుతో వచ్చింది. అతికష్టమ్మీద సాధారణ స్థితి కొచ్చాను.

ఆవిడ ఎన్నో రకాలుగా ఓదార్చింది. కర్మ సిద్ధాంతమూ వల్లించింది.

విహాన్ స్వామీజీగానో బాబాగానో మారి ఉంటాడనీ, అతడి భార్య కావడం నీ పూర్వజన్మ సుకృతమనీ, మా బంధం ఇంతవరకే రాసిపెట్టి ఉందని చెప్పింది.

అన్నిటికీ ఊ కొట్టాను.

పుస్తకాలూ బట్టలూ కారు డిక్కీలో సర్దాను. వాటిని ఏం చేయాలో నాకూ తెలీదు. వదిలేసినా

బ్రేక్ కోసం కుమారి ఎదురు చూపులు

'కుమారి 21 ఎఫ్' సినిమా విడుదలైనప్పుడు హెబ్బా ఎక్కడికో వెళ్ళిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ ఆమె ఎక్కడికి పోలేదు కావలసినంత గ్లామర్ సోకు ఉన్నా హెబ్బా మీద ఎందుకో దర్శకనిర్మాతల కన్ను పడలేదు. ప్రస్తుతానికి హెబ్బా చేతిలో రెండు సినిమాలు ఉన్నాయి. ఈ సినిమాల్లో సెకండ్ హీరోయిన్‌గా చేస్తోందే తప్ప మెయిన్ హీరోయిన్‌గా చేయడం లేదు. తన మొదటి సినిమాలాగా తనకు బ్రేక్ ఇచ్చే సినిమా కోసం హెబ్బా పటేల్ ఎదురు చూస్తోందట!

నష్టం లేదు. ఆవిడ వాటి గురించే ప్రత్యేకంగా ఫోన్ చేసింది. అదీగాక వాటిని అమూల్య సంపదగా భావిస్తోందామె! గనుక వెంట తీసుకెళ్ళక తప్పదు!

•••

బ్యాక్ టు పెవిలియన్. తిరిగి హైదరాబాద్ వెళ్తున్నాను.

విహాన్‌కోసం వచ్చాను. అతడు బతకాలని ఆగమేఘాలమీద వచ్చాను. కడకు అతడెలా ఉన్నాడో అసలు భూమ్మీద ఉన్నాడో లేదో తెలీకుండా వెనుదిరుగుతున్నాను.

మొన్నరాత్రి పడిన ఆందోళనా బీజం మొలకెత్తి విస్తృత రూపం దాల్చింది. అది కొంచెం కూడా ఉపశమించకుండానే...!

అంతిమ సమయంలో కూడా నిజాలు నాకు తెలియనివ్వకూడదనుకున్నాడు. నేను బాధపడతానని అశాంతి పాలవుతానని అతడి భావన. తపన.

అయినా నాకు తెలిశాయి.

నాన్న ఒక నివురుగప్పిన నిప్పు. మనిషి ముఖం తగిలించుకున్న రాక్షసుడు.

విహాన్ ఆంతర్యంలో ఎంత ఆర్ద్రత! ఆత్మీయత! తడి!

విహాన్! విహాన్! ఎక్కడున్నావ్? ఎలా ఉన్నావ్? అసలున్నావా లేదా?

ఎవరు చెబుతారు? ఎలా తెలుస్తుంది? ఎందుకంత అమాయకంగా చావాలనుకున్నావ్? నువ్వొస్తావన్న చిరు ఆశ ఎప్పటికీ మాలో బతికించాలనా? ఎంత పని చేశావ్ విహాన్?

నా కళ్ళు జలపాతాలవుతోంటే నా మనస్సు నన్ను ఛెళ్ళు ఛెళ్ళున కొట్టింది. అదిరిపడ్డాను. కంపించాను.

నిజమే. నేను గ్రహించలేదు గాని నీ చావుకి నేనే కారణం. మన స్నేహాన్ని స్నేహంగానే ఉంచితే సరిపోయేది. దాన్ని ప్రేమగా మార్చుకున్నాం. పెళ్లిపీటలెక్కాలనుకున్నాం. అదే నీ పాలిట మృత్యువయింది. లేకపోతే హాయిగా ఉండే వాడివి. సీరియల్స్‌లో నటిస్తూ అవకాశం చిక్కితే సినిమాల్లోకే వెళ్ళి ఆనందంగా ఉండేవాడివి. నీ కుటుంబం నువ్వు కోరుకున్నట్టుగా ఒక స్థాయికి చేరుకునేది. కష్టాలూ కన్నీళ్ళూ లేకుండా మీ అందరి జీవన యానం చక్కగా చక చకా సాగిపోయేది!

ఇదంతా నా వల్లే... నేను అదృష్టదేవతని కాదు విహాన్ నీ పాలిట శనిదేవతను!

కెరటాలు కెరటాలుగా దుఃఖం పొంగి పొరలి వస్తోంది.

చిత్రంగా ప్రకృతి కూడా నా బాధ చూసి కన్నీరు పెట్టుకుంటోంది. కాదు నా మీద కసీ, కోపం ప్రదర్శిస్తోంది.

శివాలెత్తినట్టుగా గాలీ వీస్తోంది. పగబట్టినట్టు వర్షం తెగబడుతోంది. మెరుపుల కత్తులు ఆకాశాన్ని చీలుస్తున్నాయి. ఉరుములు ఆగ్రహంతో నిప్పులు కురిపిస్తున్నాయి!

కళ్ళు మూసుకున్నాను.

మా ప్రేమ వ్యవహారం నుంచి ఈ క్షణం దాకా జరిగిందంతా ఎవరైనా తుడిచేస్తే బావుణ్ణు! విహాన్‌కి పునర్జీవం, పునఃశక్తి పోయడానికి ఇదంతా ఒక మాయగా మార్చేస్తే బావుణ్ణు! లైఫ్‌ని కొంచెం రివైండ్ చెయ్యగలిగితే బావుణ్ణు!

ఊహు! అది సాధ్యం కాదు. ఎవరి తరమూ కాదు. గతం చెరిగిపోదు. రానున్నది ఆగదు. ఇదో అనంతకాల ప్రవాహం. మనిషి మహా ప్రస్థానం!

మనస్సునిండా ఏదో తెలీని శూన్యత. మొలకెత్తుతున్న వైరాగ్యభావన. పెదాలమీద శుష్కహాసం కదిలీ కదలనట్టు కదిలింది.

'మీ నవ్వు చాలా బావుంటుంది' చెవిలో గుసగుసలాడాడు విహాన్.

ఉలిక్కిపడి చుట్టూ చూశాను.

'ఐ స్టిల్ లవ్యూ..'

అవును. ఆ గొంతు విహాన్‌దే. ఎక్కడున్నాడు?

కలయజూశాను. కారులో నేను. నలుదిక్కులా వర్షం. రోడ్డునే చూస్తూ జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్న డ్రైవరు!

ఇంకెవరూ లేరు. అంతా భ్రమ!

సెల్‌లోని ఆఖరి మెస్సేజ్ మళ్ళీ చదివాను. మళ్ళీమళ్ళీ చదివాను.

కన్నీటిబొట్లు రాలిపడ్డాయి. ఇంకా ఎక్కడ దాక్కుని ఉన్నాయో మరి!

అనుకోకుండా 'కాల్' నొక్కాను. రింగు వెళ్తోంది. ఆసక్తిగా చెవి ఒగ్గాను.

"సుబ్బారెడ్డిని... అవతలెవరూ?"

"ఏ సుబ్బారెడ్డి?"

"కర్నూలు.."

"విహాన్ ఫోన్ నీ దగ్గరికెలా వచ్చింది." గద్దించాను.

లైన్ కట్ చేశాడు. మళ్ళీ ఎన్నిసార్లు చేసినా లిఫ్ట్ చెయ్యలేదు కాని స్విచ్ఛాఫ్ చేశాడు.

అయ్యో! చక్కని ఛాన్స్ పోయింది. లింక్ తెగిపోయింది. కనీసం ఆ సెల్ అతడికెలా వచ్చిందో చెప్పినా ఏదో క్లూ దొరికేది. దాన్ని పట్టుకుని విహాన్‌ని ట్రేస్ చేసేదాన్ని!

చేతికి చిక్కినట్టే చిక్కి చేజారి పోయింది.

కాని నా మనోవీధిలో బుల్లి ఆశారేఖ తళుక్కుమని మెరిసింది.

విహాన్ సెల్ కర్నూల్లో ఉంది గనుక అతడు అక్కడో ఆ చుట్టుపక్కలో ఉండి ఉంటాడు. తన పేరూ ఊరూ తెలియకూడదని జాగ్రత్త పడుతూ అంతదూరం వెళ్ళి ఉంటాడు. ఆ దగ్గర్లో సూసైడ్ చేసుకునుండొచ్చు. పోలీసులు గుర్తు తెలియని అనాథ శవంగా భావించి మార్చురీలో ఉంచి విచారణ చేస్తూండవచ్చు!

అక్కడి పోలీస్‌స్టేషన్లలోనూ మార్చురీలోనూ ఆసుపత్రుల్లోనూ విచారిస్తే విహాన్ ఆచూకీ తప్పక తెలుస్తుంది.

మరొక్కక్షణం ఆలస్యం చెయ్యకుండా, "నన్ను కర్నూల్లో డ్రాప్ చేసి వెళ్ళగలవా?" డ్రైవర్‌ని అడిగాను.

"కర్నూలు వెళ్ళాలా? మళ్ళీ అక్కడ ఒకటి రెండ్రోజులు పడుతుందేమో. ఇంకో టాక్సీ తీసుకుందురుగాని మేడమ్. నన్ను మాట్లాడమంటే మాట్లాడి పెడతాను".

విహాన్ కోసం విజిత చేస్తున్న అన్వేషణ ఆగలేదు. డైరీలో అతడు రాసుకున్న భయంకర నిజాలు గుండె గాయంలా ఆమెను తొలిచేస్తున్నాయి. ఇది ఆమె ఊహించని ద్రోహం! విహాన్‌కీ, అతని కుటుంబానికీ నిజంగా జరగరానిదేదైనా జరిగితే ఆ పాపం శాపంలా వెంటాడుతుంది! అలా వీల్లేదు..వీల్లేదు.. అనుకుంటూ ఆలోచనల్లో మునిగిపోయింది విజిత. అసలు విహాన్‌కు ద్రోహం చేసిందెవరు? అతడి ఆచూకీ ఆమె కనిపెట్టగలిగిందా?

"మాట్లాడి రింగ్‌రోడ్ దగ్గరికి రమ్మను. సిటీలోకి ఎంటరవ్వకుండా వెళ్ళిపోతాం. అర్జంటుగా వెళ్ళాలి.."

అతడా పనిలో పడ్డాడు.

నా సెల్ మోగింది. సుబ్బారెడ్డేమోనని ఆశగా చూశాను. మంజుల. పూనేలో మా పక్కింటావిడ. తమిళియన్.

"హలో విజితా.."

"ఎలా ఉన్నావు మంజులా".

"అర్జంటుగా హైదరాబాదు పోయుండావు. సారు చెప్పినాడు. ఎందమాదిరి ఉండాది.."

"ఎవ్రీథింగ్ ఓ.కే. ఎనీథింగ్ ఇంపార్టెంట్?"

"మా తంబి కృష్ణన్‌దా ఫోన్ చేసినాడు. నీదిదా నెంబరు కలవడం లేదని చెప్పినాడు. ఒందుమారి ఫోన్ చెయ్యుబ్బా..."

"ఇప్పుడే చేస్తాను. ఆయన నెంబరు నా దగ్గరుంది. థాంక్యూ మంజూ"

కృష్ణన్! తమిళ సినీ డైరెక్టర్!

అయిదారు సినిమాలు డైరెక్ట్ చేశాడు. అన్నీ విభిన్న కథాంశాలు గలవే. స్టార్ల జోలికిపోడు. అమెచ్యూర్స్‌తో కొత్త వాళ్ళతో తీస్తుంటాడు. కొన్ని హిట్టయ్యాయి. కొన్ని ఎబౌ యావరేజ్‌గా ఆడాయి.

సినిమాకీ సినిమాకీ సంవత్సరం గ్యాప్ తీసుకుంటాడు.

మంజుల అతడి అక్క. తల్లీతండ్రీ ఒక ప్రమాదంలో చనిపోగా ఆవిడే అతడి ఆలనా పాలనా చూసిందిట. ఆవిడంటే అతడికెంతో అభిమానం. ప్రేమ. తల్లిలానే భావిస్తాడు. స్క్రాప్ నుంచి ఎలాంటి గాడ్ ఫాదర్ లేకపోయినా స్వయంకృషితో పైకొచ్చాడని తమ్ముడంటే ఆవిడకెంతో ఆప్యాయత, గర్వం!

స్టోరీ ఐడియా కోసమో డెవలప్‌మెంటు కోసమో ఆవిడింటికి పూనే వచ్చి రెండు మూడు నెలలు ఉంటాడు. అతడి కోసమే మంజులా వాళ్ళు త్రీ బెడ్‌రూం ఫ్లాట్ తీసుకున్నారు. ఒక రూం ప్రత్యేకంగా అతడికి కేటాయించారు. దాన్నిండా అతడి వస్తువులే ఉంటాయి. అతడొచ్చినప్పుడే దాన్ని తెరుస్తారు.

ఆ మధ్య అతడు పూనే వచ్చి రెండు నెలలు ఉన్నాడు. అప్పుడే నాకు పరిచయం చేసింది మంజుల.

చక్కగా మాట్లాడతాడు. దానికిమించి మంచి శ్రోత.

తన గురించీ తన వారి గురించీ ముఖ్యంగా మంజుల గురించీ చెప్పాడు. మంజుల ఏం మాట్లాడినా ఏం పెట్టినా ఆత్మీయంగా ఉంటుందని మెచ్చుకున్నాడు. తన సినిమాల గురించేమీ చెప్పలేదు. మంజుల దగ్గర సీడీలున్నాయనీ వీలున్నప్పుడు చూసి అభిప్రాయం చెప్పమన్నాడు.

ఆ మర్నాడే సీడీలు తీసుకెళ్ళి చూశాను. వాణిజ్య అంశాలకు పెద్దపీట వెయ్యకుండా సహజత్వంతో వాస్తవంగా జరిగిందేమో అన్పించేట్టుగా ఉన్నాయి. కథ, సన్నివేశాలు గుండెల్ని తడిపేశాయి. సినిమా అయిపోయాక కూడా దానిలోని పాత్రల గురించే ఆలోచిస్తాం.

నా అభిప్రాయాలు శ్రద్ధగా విన్నాడు. నా గురించి చెప్ప మన్నాడు.

నా బాల్యం, అలనాటి సంఘటనలు, తల్లిదండ్రులు, బంధువులు, చదువు సంధ్యలు, చిన్ననాటి స్నేహాలు, ప్రేమ, పెళ్ళి, ఇతర ముఖ్యఘటనలు ఒక మిత్రుడిలా అడిగాడు. అతడు అడిగిన తీరుకు ఏదీ దాచకుండా అంతా చెప్పెయ్యాలనిపించింది. చెప్పేశాను.

విహాన్ పరిచయం నుంచి జైలు పాలవడం వరకూ, ఆ తర్వాత అదృశ్యమై పోవడమూ చెప్పాను. మా నాన్న మా పెళ్లికి ఒప్పుకున్న సంగతి మాత్రం చెప్పలేదు. మంచి స్నేహితులమనే కవరింగ్ ఇచ్చాను.

"బావుండాది. సినిమాకి ఓ.కే. బట్ బ్యాగ్రౌండ్ కావాలి. అది లేకుండా కంప్లీట్‌గా చెప్పేది కుదరదు. స్ట్రాంగ్ విలన్ ఉంటే హీరో నిండా ఎలివేట్ అవుతాడు. ఆలోచిస్తానబ్బా.." అన్నాడు.

మా బంధువుల గురించీ వాళ్ళ ఇళ్లల్లో జరిగిన వాటి గురించీ కూడా అడిగాడు. స్నేహితురాళ్ళ కథలూ చెప్పాను. లలిత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దంపతుల ఆత్మహత్యలు, తలుపులమ్మకు అమ్మాజీ చేసిన కౌన్సెలింగూ వివరించాను.

అమ్మాజీ గురించి మరిన్ని వివరాలడగ్గా ఆవిడ ఫోటోలు చూపించి ఆవిడ చేస్తోన్న మహిళా సేవ వివరించాను.

పరిచయస్తుల్నుంచి అన్నిరకాల వివరాలూ సేకరించి వాటిల్లో వచ్చిన అంశాలని తన సినిమాలో భాగం చేస్తుంటాడట. సహజమే అతడి కథా వస్తువట.

కాస్త చనువుపెరిగాక ల్యాప్‌టాప్‌లో విహాన్ ఫోటోలు చూపించాను. టీవీ సీరియల్ క్లిప్పింగ్స్ చూపించాను. వీలుంటే విహాన్‌ని తన సినిమాల్లో ప్రోత్సహించమని కోరాను. అప్పటికే విహాన్ ఎక్కడున్నాడో నాకు తెలీదు. అయినా అతడి ఆచూకీ తెలుస్తుందన్న నమ్మకంతో అర్థించాను. అతడికి చిన్నపాటి చేయూత లభిస్తే మళ్ళీ అతడి జీవితం చిగురిస్తుందని పుష్ప ఫలభరితమవుతుందని నా ఆశ!

"నో ప్రామిస్. చూద్దాములే.."

కొన్ని విహాన్ ఫోటోలు అప్పటికప్పుడు ఆయన మెయిల్‌కి పంపాను.

ఇప్పుడు కృష్ణన్ నాతో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడంటే దాని గురించే అయ్యుంటుంది. రెండ్రోజులుగా శ్రమిస్తున్నా విహాన్ ఉనికే తెలియడం లేదు. అతడడిగితే ఏం సమాధానం ఇవ్వాలి?

అతడికి ఫోన్‌చేసి ఏదో చెప్పేద్దామనుకున్నానో లేదో అతడే ఫోన్ చేశాడు.

ఎంబారాసింగ్‌గా ఫీల్ అవుతూ కాల్ తీసుకున్నాను.

"రొంబ థాంక్సమ్మా. నీ బౌన్సర్ దోస్తు కథే ఫైనల్ చేసుండాము. అతన్ని చెన్నయ్‌దా పంపించు. అర్జంటు. ఆ రోల్ అతడే వేస్తే ఫీల్ బాగుండును. లాంగ్వేజ్ నో ప్రోబ్లం. నేను చూసుకుంటా. నెక్స్ట్ మంత్ షూటింగ్ ప్లాన్ చేస్తిమి. అర్జంటుగా వచ్చి నన్నుదా కలవమను. నాది కంపెనీ ఎడ్రస్సు ఎస్సెమ్మెస్ ఇస్తును. శానా అర్జంటు ఉన్నది..."

నేనేం మాట్లాడలేదు. గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

విహాన్ విహాన్! నువ్వెన్నాళ్ళ నుంచో ఎదురు చూసిన 'బ్రేక్ క్షణాలు వచ్చేశాయి. అదృష్టం నీ తలుపు అదే పనిగా తడుతోంది. తలుపుతియ్! తలుపు తియ్.....!

"ఎవరితో మాట్లాడుతున్నారు మేడమ్" డ్రైవర్ అడిగాడు.

లోలోపల మాట్లాడుతున్నాననుకుంటూ పైకే మాట్లాడేశానన్న మాట!

విహాన్ దురదృష్టం మీద మరింత సానుభూతి కలిగింది. అలాంటి గోల్డెన్‌ఛాన్స్ మిస్సవడానికి కారణమైన నాన్నమీద పీకలదాకా కోపం వచ్చింది. అసహ్యమేసింది.

నాన్నని చూసినప్పుడల్లా ఆయన విహాన్‌కి చేసిన ద్రోహమే గుర్తొస్తుంది. మళ్ళీ మునుపట్లా ఆయనతో ప్రేమగా ఉండటం సాధ్యమేనా!

ఎంత పనిచేశావు డాడీ. ఏ నిప్పుల్లో కడుక్కుంటే ఆ పాపం ప్రక్షాళనమవుతుంది?

నా మనస్సంద్రంలో ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి దుఃఖోద్వేగపు అలలు!

•••

కర్నూలు వెళ్ళేసరికి రాత్రి ఎనిమిదిన్నరయింది.

ఈ వేళప్పుడు పోలీస్‌స్టేషన్‌కే ఆసుపత్రులకే తిరగటం క్షేమం కాదని హోటల్లో రూం తీసుకు

వందే వైద్య శుభంకరా!

మెడలో నాగరాజులా స్టెతస్కోపుతో
ఒళ్ళంతా విబూది పూతలా తెల్లకోటుతో
దర్శనమిచ్చే వైద్యుడు రోగుల పాలిట శివుడు
నాలుక చూసి వ్యాధిని పసిగట్టే త్రిలోచనుడు
జబ్బుల జాతకమెరిగిన సర్వేశ్వరుడు
కంది గింజంత మందుబిళ్ళతో
కొండంత నొప్పిని హరించే హరుడు

శరణన్న రోగులను కరుణించే బోళాశంకరుడు
గాయాలను క్షయించే లయంకరుడు
వ్రణాలను నయంచేసే ప్రణవనాథుడు
దేహ సంతాపహారి జ్వరారి స్మరారి
వ్యాధులపై విలయతాండవమాడే
ప్రళయభయంకరుడు
రోగుల వ్యధలను బాపే శుభంకరుడు
కొన ఊపిరితో ఉన్న వాడిని తన చికిత్సతో
కొత్తగా ఆవిష్కరింపజేసే జీవేశ్వరుడు
గుండెకు బదులుగ గుండెను పొదిగే వైద్యుడు
మానవ ఆకారానికి కరి శిరమును జోడించిన
పరమేశ్వరుడు

(జూలై 1 వైద్యుల దినోత్సవం సందర్భంగా)

-చిరమన వెంకటరమణయ్య

సెల్: *94413 80336*

న్నాను.

టాక్సీవాడికి రెండు మూడ్రోజులు పని ఉంటుందని ముందే చెప్పాను.

ఏది ఏమైనా సరే విహాన్ జాడ తెలుసు కున్నాకే ఇంటికి తిరిగి వెళ్ళాలని నిశ్చయించు కున్నాను.

ఆ మాట రాజేశ్వర్‌కి చెప్పాలి. అతడి రియాక్షన్ ఎలా ఉన్నా సరే.

మొదటి రింగుకే లిఫ్ట్ చేశాడు. "ఫోం చేశావా రాజేశ్వర్?"

"బయటచేసి ఇప్పుడే ఇంటికొచ్చాను. విహాన్ న్యూస్ అప్‌డేట్ ఏంటి?"

"నో ప్రోగ్రెస్. కాని తవ్వుతున్న కొద్దీ పాములు బయట పడుతున్నాయ్"

"యూ మీన్ స్నేక్స్?"

"కాదు అనకొండే. విహాన్ కెరీర్ని కాటేసి బతుకును మింగేసింది!"

"గాడ్! వాళ్ళెవరు?"

"ఎవరైతేనేం రివర్స్ చెయ్యలేనివి చాలా జరిగి పోయాయి. ఇంకోచిత్రం చెప్పనా? అతడు తలదాచు కున్న ఊళ్ళో అతన్ని స్వామీజీగా భావిస్తున్నారు. ఏ హిమాలయాలకో వెళ్ళిపోయి ఉంటాడను కుంటున్నారు"

"టూమచ్ మౌఢ్యం!"

"నేనలా అనుకోవట్లేదు. అన్నీ వదిలేసుకున్న వాళ్ళు మహాత్ములే కదా. ఏమీ ఆశించకుండా ఎలాంటి కోరికలూ లేకుండా దేనికీ పాకులాడ కుండా సర్వసంగ పరిత్యాగిలా బ్రతికాట్ట!"

"అది సరే, ఇప్పుడెక్కడున్నావ్? ఏం చేస్తున్నావ్?"

"కర్నూలు వచ్చాను. హోటల్లో ఉన్నాను. డిన్నర్ చెయ్యాలనిపించక టిఫిన్ చేశాను".

"ఫోం చేసుండాల్సింది. ఆరోగ్యాన్ని అశ్రద్ధ చెయ్యకు. కంటిన్యూస్‌గా తిరుగుతూనే ఉన్నావు. నలతగా లేదూ!"

"లేదుగాని ఏదో తేడాగా మాత్రం ఉంది.."

"డాక్టర్ని కన్సల్ట్ చెయ్..."

"చేస్తేనే మంచిదనిపిస్తోంది. చూద్దాం.."

"చూద్దాం కాదు రేపు మార్నింగ్ కన్సల్ట్‌చెయ్. అవునూ. కర్నూలు ఎందుకెళ్ళావ్? హావ్ యూ గాట్ ఎనీ న్యూ ఇన్ఫర్మేషన్?"

"విహాన్ సెల్ ఒకరి దగ్గరుంది. అతడిక్కడే ఉన్నాడు..."

"దానిని బట్టి అతన్ని ట్రేస్ చేద్దామనుకుంటు న్నావా? సిల్లీ. నువ్వు షెర్లాక్ హోమ్స్‌వి కాదు. మైండిట్. నన్నడిగితే ఇంక నీ పరిశోధన కట్టిపెట్టి తిరిగొచ్చెయ్యడం బెటర్".

"అసలేం జరిగిందో తెలుసుకోకుండా ఎలా తిరిగిరాను?"

"తెలుసుకుని ఏం చేస్తావ్?" కఠినంగా వచ్చాయి మాటలు.

"రాజేశ్వర్!"

"ఫ్రాంక్‌గా ఆలోచించు. సూసైడ్ చేసుకుంటు న్నానని మెస్సేజ్ ఇచ్చి రెండ్రోజులైంది. చేసేసు కుంటే నువ్వు చేసేదేం ఉండదు. లక్కీగా చేసు కోలేదనుకో నువ్వు చేయాల్సిందీ ఉండదు. ఎంచే తంటే ఆత్మహత్య ఒకానొక బలహీన గడియలో క్షణికావేశానికి లోనై చేసేసుకుంటూరు. ముందూ వెనుకా ఏమీ ఆలోచించరు. ఏ కారణం వల్లనైనా ఆ నిమిషంలో చేసుకో లేదనుకో ఇంక చేసుకోరు. అందుకే ఆత్మహత్య ప్రయత్నాన్ని ఒక్క గంట వాయిదా వేయించగలిగితే వాళ్ళా పనికి పూను కునే సాహసం చెయ్యరంటారు. ఎందుకంటే వాళ్ళ వివేకం, విజ్ఞత మేల్కొంటాయి గనుక!"

ఆలోచనలోపడ్డాను. రాజేశ్వర్ మాటల్లో పాయింటు లేకపోలేదు.

"విజితా! నీది సున్నిత మనస్తత్వం. తేలిగ్గా ప్రతిస్పందించే హృదయం. అంచేత ఆ దారుణ వార్త వినేసరికి షాక్ అయ్యావ్. ఏదో చెయ్యాలి. ఎలాగైనా ఆ ఘోరకృత్యాన్ని ఆపాలని వెళ్ళావ్. ఒక మిత్రురాలిగా అది నీ బాధ్యత. అది నెర వేర్చావు. అందుకు తృప్తిపడు. స్థిమితపడు. అంతే తప్ప ఇంకా ఇంకా శోధించాలనుకోవడం అర్థ రహితం. మరొకరి పర్సనల్ స్పేస్‌లోకి మనం ప్రవేశించకూడదు.."

"నీ విశ్లేషణ ఫైన్. అతడు క్షేమంగా ఉంటే ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండను. అతడు... అతడు శవమైతే అది దిక్కులేనిది కాకూడదు. కాకులూ గద్దలూ పీక్కు తినకూడదు. అనాథ శవంలా ఖననం చేయబడకూడదు. కనీస దహన సంస్కారానికి నోచుకోకుండా పోకూడదు. అందు కనే ఈ పరుగులూ తాపత్రయాలూ! ప్లీజ్ అండర్ స్టాండ్ మీ.." బరస్టయ్యాను.



"ఇట్స్ ఓకే! నీకెలాంటి అవసరం వచ్చినా చెప్పు హెల్ప్‌స్తాను. నీ ఆరోగ్యం జాగ్రత్త. వేళకు తిను. టూమచ్‌గా ఆలోచించకు. రేపు డాక్టర్ని కలు.."

"థాంక్యూ డియర్".

ఫరవాలేదు. రాజేశ్వర్ అర్థం చేసుకున్నాడు. అంటే నేను చేస్తున్నది కరక్టే. ఇది వృథా ప్రయాస కాదు!

విహాన్ తల్లి గుర్తొచ్చింది. రాజేశ్వర్‌కి మళ్ళీ ఫోన్ చేశాను.

"నీతో ఒక సంగతి పంచుకోవాలనిపించి చేశాను.."

"చెప్పు విజ్జీ..."

"విహాన్ వాళ్ళమ్మ పండంటి బిడ్డని కంటానని ఆశీర్వదించింది".

"ఆ శుభవార్త ఎప్పుడు చెబుతావా అని ఎదురు చూస్తున్నాను డియర్.."

"నా ఒంట్లో ఏదో తేడాగా అనిపిస్తోంది. ఒక వేళ.. టూ ఎర్లీ.. చూద్దాం".

"చూడటం కాదు రేపు డాక్టర్ని కలుస్తున్నావ్. అంతే"

"ఓకే బై..."

మధురమైన ఊహలు గిలిగింతలు పెడుతోంటే శరీరంలోని అణువణువూ పరవశమవుతోంటే మృదువుగా నా పొట్టను తడిమి చూసుకున్నాను.

మా ఊహ ఊపిరి పోసుకుంటే ఎంత బావుణ్ణు!

కాసేపలా తీయని ఊహల్లో ఊరేగుతుండి పోయాను.

అతికష్టం మీద, ఒక రకంగా బలవంతంగా ఆ ఆలోచనా వలయంలోంచి బయటపడ్డాను.

ఆ సుబ్బారెడ్డిని ఇంతపెద్ద నగరంలో ఎలా కనుక్కోవడం? పోలీసుల ద్వారా సమాచారం సేకరించడం ఎలా? మార్చురీల కెళ్ళి ఎలా చెక్ చేయడం?

శాంతమ్మకేదైనా సమాచారం అందిందేమో అనే ఆలోచనొచ్చింది.

వెంటనే విహాన్ వాళ్ళింటికి ఫోన్ చేశాను.

"లేదమ్మా. చీమచిటుక్కుమన్నా వాడొచ్చా డేమోనని ఉలిక్కిపడి చూస్తున్నా. నీకూ కన్పించ లేదా తల్లీ?" ఆమె స్వరం నిండా నిరాశ!

"ఇంకాలేదు. కన్పించగానే ఫోన్ చేస్తాను. మీరేం ఆందోళన పడొద్దు. పైన దేవుడున్నాడు.."

"పైన దేవుడుంటాడు. కింద భూదేవీ ఉంటుంది. మధ్దెన మా బతుకులే ఉండవు. ఏలిన్నాటి శనేదో మా వెంటబడి తరుముతోంది లేమ్మా. నువ్వు మాత్రం ఏం చెయ్యగలవు చెప్పు. అంతా మా ప్రారబ్దం!"

ఇందర్ని ఇన్నిరకాలుగా బాధపెట్టి క్షోభపెట్టి టెన్షన్ పెట్టి తనేం బావుకుంటాడు?

ఉక్రోషమొచ్చింది గాని సంబాళించుకున్నాను.

'విహాన్‌కి భూమ్మీద నాలుగు నూకలు మిగుల్చు దేవుడా!'

ఈ రాత్రి సరిగ్గా నిద్రపోలేక పోయాను. కాస్త కునుకు పడితేచాలు. పీడకలలు నిర్దాక్షిణ్యంగా దాడి చేస్తున్నాయి.

మేఘాల అంచున మెరుపులా ఆ కలల మధ్యలో ఓ చిన్న తీయని కల.. విహాన్ నా కడు పున నా బిడ్డగా పుట్టాట్ట!

(ఇంకావుంది)

నేనెక్కిన రెక్కల గుర్రం

వియస్‌పి తెన్నేటి

ప్రేమ అంటే పిల్లలాటా? ప్రేమ అంటే జింకవేటా?
ప్రేమకెపుడూ పెద్దపీట ప్రేమ అగజాత కంచుకోట
ప్రేమ సత్యం ప్రేమ నిత్యం ప్రేమ అఘమర్షణ కీర్తనం
ప్రేమతో కైలాటమంటే అది అసిధారా నర్తనం !

www.arkavidya.com

వియస్‌పి తెన్నేటి
vsptenneti@gmail.com

ప్రతులకు :
09000544243
09347524243
08885591236
ramaniprasad1959@gmail.com
వెన్నెల జెండా

పుస్తక సమీక్ష

తొలి అడుగులు

నవల
అక్కినేని కుటుంబరావు
ధర: 100 రూపాయలు
పేజీలు: 240
ప్రతులకు: నవోదయ, నవచేతన, నవతెలంగాణ, విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్ హౌస్‌లు, బ్రాంచీలు.

ఉత్తమ చిత్రాల దర్శకుడు, విమర్శ నాత్మక వాస్తవికవాద రచయిత అక్కినేని కుటుంబరావు. కార్మికుల జీవితాలపై తొలి తెలుగు నవల రాసిన రచయిత. ఆరు దశాబ్దాల క్రితం నాటి ఒక బాలుడి బాల్యాన్ని కళ్ళకు కట్టి చూపించే నవల ఇది. నేటి తరం బాలలు కోల్పోయిన బాల్యాన్ని కళ్ళకు కట్టిన నవల.

దైవనిధి

మల్లాది రామలక్ష్మి
ధర: 300 రూపాయలు
పేజీలు: 320
ప్రతులకు: వేద పబ్లికేషన్స్, మారుతీ అపార్ట్‌మెంట్స్, ఎ.సి.గార్డ్స్, హైదరాబాద్-04
సెల్: 98490 06361

భగవంతుని గుణగణాలను, విశేషాలను, పురాణ కథలను వివరించి, దైవం గురించి అవగాహన కలిగించే పుస్తకమిది. సృష్టి, ఉపనిషత్తులు, దశావతార కథలు, భారతీయ మహర్షులు, క్రియా యోగులు, దివ్య పురుషులు, పుణ్యక్షేత్రాలు, హిందువుల పండుగలు, అష్టాదశ పురాణాలు, సప్త నదులపై అవగాహన కలుగుతుంది.

ప్రముఖ వాగ్గేయకారులు

డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు
ధర: 100 రూపాయలు
పేజీలు: 104
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు, ఆంధ్రప్రదేశ్, నవచేతన బుక్‌హౌస్ బ్రాంచీలు, తెలంగాణ.

వాగ్గేయ వాఙ్మయం ఈనాటి విద్యార్థిలోకానికి చేరువ చేయాలనే ఉద్దేశంతో చేసిన రచన ఈ పుస్తకం. తెలుగులో వాగ్గేయ రచనలు చేసిన వారితో సహా సంస్కృత, ఆధునిక వాగ్గేయకారులు సహా లబ్ధప్రతిష్టులైన వారి జీవితం, కృషి గురించి చక్కటి భాషలో వివరించారు ఈ పుస్తకంలో.

అపురూపమైన 11వ ముద్రణ

వెన్నముద్దలు

జనార్దన మహర్షి



నేటి జీవన పోరు
మనుషుల తీరు
మనస్తత్త్వాల హోరు
అన్నింటినీ స్పృశిస్తూ
చిన్న చిన్న పదాలతో
ఇందులోని కవితలు
మీ హృదయాన్ని హత్తుకుంటాయి
* * *
మీకిష్టమైన వారికి
వేయి పూలివ్వండి
వంద ఫలములివ్వండి
మూడు ముత్యాల హారాలివ్వండి
రెండెకరాల పొలము ఇవ్వండి
లేదా...
ఈ ఒక్క 'వెన్నముద్దలు' ఇవ్వండి

ప్రతులకు :
క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్
9848065658, 9848506964, 8885446222.
& ప్రధాన పుస్తక కేంద్రాలు

రివ్యూ

- రాజశుక

ఇది కీలక సమయం!

రాహుల్ గాంధీకి బాధ్యతలు అప్పగించడం కంటే తానే స్వయంగా సారథ్యం వహించడం వల్ల సోనియా గాంధీ తన పార్టీకి మేలు చేసినవారవుతారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి మళ్లీ అధికారంలోకి రావాలంటే పార్టీ అధ్యక్షుడుగా రాహుల్ గాంధీ ఉండాలా లేక ప్రియాంక గాంధీ ఉండాలా అని ఆ పార్టీలో తీవ్రస్థాయిలోనే చర్చలు జరుగుతున్నాయి. రాహుల్ గాంధీని తక్షణం పార్టీ అధ్యక్షుడిగా చేయాలని కొందరు సీనియర్ నాయకులు బహిరంగంగానే డిమాండ్ చేస్తుండగా, ఆయన వల్ల ఉపయోగమేమీ లేదనీ, ఆయన సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో కూడా గెలవలేకపోతోందనీ మరి కొందరు నాయకులు వాదిస్తున్నారు. ఈ వర్గం ప్రియాంక గాంధీని పార్టీ అధినేతగా కోరుకుంటోంది. అయితే, పార్టీలో ప్రియాంక గాంధీ నాయకత్వాన్ని వ్యతిరేకించేవారు కూడా లేకపోలేదు. ఎలిజబెత్ రాణి లాగా సోనియా గాంధీయే పార్టీ అధినేతగా కొనసాగవచ్చు కదా అన్నది వీరి వాదన.

అయితే, పార్టీ అధ్యక్ష పదవిలో రాహుల్ గాంధీయే కూర్చోబోతున్నారనేది తాజాగా వినిపిస్తున్న మాట. జూన్ 19తో ఆయనకు 46 ఏళ్లు నిండాయి. దాదాపు దశాబ్ద కాలం నుంచి ఆయన రాజకీయాల్లో నలుగుతున్నారు. కాబట్టి, ఆయన అధికారికంగా అధినేత కావడం అన్నది సహజమే. అయితే, కొందరు నాయకులు ఆశ్చర్యపోతున్న విషయమేమిటంటే, ఎందుకు సోనియా గాంధీ ఈ అధినేత పదవిని రాహుల్ గాంధీకి అప్పగించాలనుకుంటున్నారు? ఆమె ఈ రకమైన మార్పు కోరుకోవడానికి బహుశా రెండు కారణాలు ఉన్నాయి. ఏదో ఒక దశలో వృద్ధులు యువతకు అధికారం బదలాయించాలనుకోవడం ఇందులో మొదటిది. ఆమె క్రియాశీల రాజకీయాల నుంచి రిటైర్ కావాలనుకుంటున్నారని, అందుకనే పార్టీ పగ్గాలు తమ వంశాంకురమైన రాహుల్‌కు అప్పగించాలనుకుంటున్నారని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రెండవది ఏమిటంటే, ఆమెకు ఆరోగ్యం బాగుండి ఉండదు. అందుకనే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవాలనుకుంటున్నారనేది పార్టీలోని మరో వర్గం అభిప్రాయం. ఈ అభిప్రాయం నాయకులకే కాదు, పార్టీ కార్యకర్తలకు, ప్రజానీకానికి కూడా ఉంది. ఆమె అనారోగ్యం గురించి ఎవరికీ పెద్దగా వివరాలు తెలియవు. అయితే, ఆమె నిరంతరం చికిత్సలో ఉండాల్సిన పరిస్థితి ఉన్నందువల్లే ఆమె నాయకత్వం నుంచి తప్పుకునే ఆలోచనలో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాహుల్ గాంధీకి పార్టీ అధినేత బాధ్యతలు అప్పగించాలని ఆమె భావిస్తుండడానికి ఇదే కారణమనుకుందాం. కానీ, ఆమె చాలా కాలం క్రితమే విదేశాలు వెళ్లి చికిత్స చేయించుకు వచ్చారు. ఇప్పుడు ఆమె అనారోగ్యంతో ఉన్నట్టు ఎక్కడా దాఖలాలు కనిపించడం లేదు. ఫొటోల్లో కూడా ఆమె చురుకుగా, ఆరోగ్యంగానే కనిపిస్తున్నారు. బయట కనిపించినప్పుడు కూడా ఆమెలో ఎక్కడా అనారోగ్య లక్షణాలు అగుపించడం లేదు.

ఒత్తిడిలో సోనియా

అలా అయితే, మరెందుకు ఆమె రాహుల్‌కు ప్రమోషన్ ఇద్దామనుకుంటున్నారు? ఒక కారణం-బహుశా అంతర్గతంగా ఆమె మీద ఏదో ఒత్తిడి వస్తుండాలి. పార్టీ పరిస్థితి నానాటికీ క్షీణిస్తున్నందువల్ల పార్టీ దిశను మార్చాల్సిన అగత్యాన్ని నాయకులు ఆమెకు గుర్తు చేస్తూ ఉండవచ్చు. పార్టీలో నాటకీయంగా, తీవ్రంగా ఏదైనా జరగకపోతే, త్వరలో పార్టీ సమాధి కావడం తథ్యం అన్నది పార్టీ నాయకుల భావన. ఒకప్పుడు 200 మంది లోక్‌సభ సభ్యులున్న కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు 45 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. లోక్‌సభలో లేని 150 మంది కాంగ్రెస్ నాయకుల్లో ఎక్కువమంది గత ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చుచేసినా ఏమాత్రం ఫలితం లేకుండా పోయింది. అంతేకాదు, చాలా మంది సభ్యులు అనేక దశాబ్దాల రాజకీయ జీవితాన్ని పార్టీ కోసం పణంగా పెట్టారు. పార్టీ కుప్పకూలడమంటే వారి జీవితాలు సమాధి అయినట్లే. వందలాది మంది కాంగ్రెస్ నాయకుల జీవితాలు పార్టీ చుట్టూనే, అందులోనూ సోనియా కుటుంబం చుట్టూనే తిరుగుతోందంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు. ఇలా ఆందోళన చెందుతున్న నాయకుల్లో కొందరు రాహుల్ గాంధీ వైపు మొగ్గు చూపుతుండగా, మరి కొందరు ప్రియాంక గాంధీ పేరునే పదే పదే ప్రస్తావిస్తున్నారు.

అందుకనే మెజారిటీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఆ కారణంగానే పార్టీ నాయకత్వం విషయంలో స్పష్టత కోరుతున్నారు. ఇప్పటికైనా పార్టీ పగ్గాలను సరైన నాయకుని చేతిలో

పెడితేనే తమ భవిష్యత్తు పదిలంగా ఉంటుందని అధినాయకత్వం చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నారు. కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాల్లోనూ అధికారాన్ని కోల్పోవడం వల్ల పార్టీ ఆర్థిక సమస్యలతో కూడా అవస్థలు పడుతోంది. పార్టీ నాయకత్వంలో మార్పు కోరడానికి అది కూడా ఓ కారణం. ఇంతకూ ఈ మార్పు వల్ల కాంగ్రెస్ పార్టీకి ఏమైనా ప్రయోజనం ఉంటుందా? పార్టీకి సారథ్యం వహించడంలో సోనియా రికార్డును ఎవరూ సందేహించలేరు. రెండు దశాబ్దాల నుంచి ఆమె నాయకత్వం పార్టీని దాదాపు ఒక్కటిగానే నడిపిస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లోనే ఆమె అప్పట్లో పార్టీ సారథ్యాన్ని తన చేతుల్లోకి తీసుకున్నారు. ఆమె సారథ్యంలో ఓ గాంధీయేతర ప్రధానమంత్రి అధికారంలో కొనసాగారు. పార్టీ నాయకులు కొన్ని అవినీతి కార్యకలాపాల్లో ఉన్నారంటే అది వేరే విషయం. పార్టీ నాయకులు కకావికలు కాకుండా పార్టీని ఒక్క తాటి మీద నడిపించిన ఘనత మాత్రం సోనియా గాంధీకే చెల్లుతుంది.

అపార అనుభవం

ఆమె సారథ్యంలో నాయకత్వానికి కొన్ని అవాంతరాలు ఏర్పడి ఉండవచ్చు. భారతీయ జనతా పార్టీకి చెందిన అటల్ బిహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది కూడా ఆమె కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తున్నప్పుడే. కాంగ్రెస్ పరాజయాల పాలవుతూ, భారతీయ జనతా పార్టీ ఎదుగుతున్న సమయంలోనే సోనియా గాంధీ పార్టీ పగ్గాలు చేపట్టారు. పార్టీకి జవజీవాలు తెచ్చిపెట్టారు. 2004లో ఆమె పార్టీని అధికారంలోకి తెచ్చారు. అనేక ఉపయోగకర పథకాలు, చట్టాల కారణంగా ఆమె పార్టీ మళ్లీ రెండవసారి అధికారంలోకి వచ్చింది. ఈ పాలనలో తాను చెప్పింది చేశారనే ఘనతను సోనియా గాంధీకి ఆపాదించవచ్చు. ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన అనేక పథకాలు, కార్యక్రమాలను ఆమె అమలు చేసి చూపించారు. రాజకీయంగా కూడా తన సమర్థతను ఆమె అనేక పర్యాయాలు నిరూపించుకున్నారు. ఆ తరువాత ఆమె సారథ్యంలో పార్టీ ఘోరంగా ఓడిపోయి ఉండవచ్చు. కానీ, పార్టీని మళ్లీ నిలబెట్టడానికి, దాని గాయాలు మాన్పడానికి ఏం చేయాలన్నది ఆమె తెలుసుకోగల స్థితిలో ఉన్నారు.

ఈ ఇరవయ్యేళ్ల కాలంలో ఆమె రాజకీయ పరంగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. ఎక్కడా దేనికీ కుంగిపోయిన, అధైర్యపడిన దాఖలాలు లేవు. ఇక అనేక జయాపజయాలు చవి చూశారు. పార్టీ పరిస్థితుల్ని అనేక సందర్భాలలో చక్కదిద్దారు. ఆమె లేకపోతే పార్టీ లేదనే అభిప్రాయం ప్రజలకు కలిగేలా చేయగలిగారంటే ఇది చిన్న విషయం కాదు. మన్మోహన్ సింగ్ వంటి రాజకీయేతర నాయకుడితో దాదాపు పదేళ్ల పాటు ప్రధాని బాధ్యతలు మోయించడం ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. అనేక లోపాలు, లొసుగులు మన్మోహన్ సింగ్‌కు ఆపాదించిన కార్యకర్తలు, ప్రజానీకం, విజయాలను, సాఫల్యాలను మాత్రం ఆమెకు ఆపాదించారు. రాజకీయంగా ఎంతో పరిణితి చెంది ఉంటే తప్ప ఇటువంటి వ్యూహం సాధ్యం కాదు. అనేక పర్యాయాలు మిత్రపక్షాలను ఒకే తాటిమీద నడిపించిన ఘనత, ప్రతిపక్షాలను నిలువరించిన సామర్థ్యం కూడా ఆమెకే దక్కుతుంది.

ఇటువంటి ప్లస్ పాయింట్లేవైనా రాహుల్ గాంధీకి ఉన్నాయా? లేవు. ఇందులో సందేహమేమీ లేదు. నిజానికి మన్మోహన్ సింగ్ రెండవ పర్యాయం అధికారం చేపట్టిన తరువాత నుంచి పార్టీలో రాహుల్ భజన ప్రారంభమైంది. ఆయనకు నాయకత్వం అప్పగించాలనే డిమాండ్ 2009 తరువాత నుంచే ఊపందుకుంది. ఆయనను పార్టీ ఉపాధ్యక్ష పదవిలో కూర్చోబెట్టడం ఆయన భవిష్యత్తుకు ఒక స్పష్టత నిచ్చింది. అయితే, ఆయనకు ఎన్ని పదవులు, ఎన్ని బాధ్యతలు అప్పగించినా ఆయన మాత్రం తన సమర్థతను నిరూపించుకోలేకపోయారు. కారణమేమిటో తెలియదు. దేశ సమస్యల విషయంలో గానీ, అంతర్జాతీయ విషయాల్లో గానీ ఆయనకు సరైన అవగాహన లేదని పార్టీలోనే తరచూ ఓ నిశ్చితాభిప్రాయం వ్యక్తమవుతుంటుంది. ఆయన సారథ్యంలోనూ, ఆయన ఉపాధ్యక్షుడిగా ఉండగానూ కాంగ్రెస్ పార్టీ అనేక ఎన్నికల్లో పరాజయం పాలైంది. దీనికంతటికీ పరాకాష్ఠగా 2014 ఎన్నికల్లో ఆయన సారథ్యంలోనే పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఆయనకు ఓ లక్ష్యమంటూ లేదని, ఆయనలో రాజకీయ సత్తా లోపించిందని, అంతకు మించి పార్టీని ముందుకు తీసుకువెళ్లాలన్న ఆసక్తి కూడా లేదని పార్టీలో చాలామందికి అర్థమైపోయింది. నరేంద్ర మోదీ కంటే ఆయన రెండు దశాబ్దాలు చిన్నవాడైనప్పటికీ, ప్రధానమంత్రితో పోలిస్తే ఆయన అనేక దశాబ్దాలు వెనుకబడి ఉన్నారు.

పరాజయాల భారంతో కుంగిపోతున్న కాంగ్రెస్‌పార్టీలో కదలిక పుట్టింది. పార్టీని బతికించేందుకు నాయకత్వ బాధ్యత ఎవరికి అప్పగించాలనే అంతర్మథన నేపథ్యంలో నేతలూ, కార్యకర్తలూ తలోదారీ పట్టారు. రాహుల్ గాంధీ..? ప్రియాంకా గాంధీ..? ఎవరికి పట్టం కడతారు? జనానికి సోనియాగాంధీ మీద ఉన్న నమ్మకం ఆమె కుమారుడి మీద లేదు. మరి ఆమె కూడా ఎలిజబెత్ రాణి తరహాలోనే ఆలోచిస్తారా?

సోనియాకు ఇప్పుడు 70 ఏళ్లు. చురుకుగా, దృఢంగా కనిపిస్తుంటారు. ఆమెకు ఎటువంటి అనారోగ్యమూ లేదనుకుంటే, ఆమె మరికొన్నేళ్లు చురుకుగానే ఉంటారనడంలో సందేహం లేదు. ఆమె మీద జనానికి ఉన్న నమ్మకం ఆమె కుమారుడు రాహుల్ మీద లేదు. ఆమె ఏదైనా ముఖ్య అంశం మీద ప్రకటన చేశారంటే జనం వెంటనే ఆమె మీద దృష్టి సారిస్తారు. రాహుల్ గాంధీలో అటువంటి ఆకర్షణేమీ లేదు. కాంగ్రెస్ పరిస్థితి నానాటికీ అధ్వాన్నంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాహుల్ గాంధీని పార్టీకి సారథిని చేయడం మంటల మీద పెట్రోలు పోయడమే అవుతుందేమో! బ్రిటిష్ రాణి ఎలిజబెత్ కూడా పదవి నుంచి తప్పుకునే ఉద్దేశంలో లేరు. ఆమె గనుక పదవి నుంచి తప్పుకుంటే ఆమె కుమారుడే రాజవుతాడు. అయినప్పటికీ ఆమె మాత్రం పదవి నుంచి తప్పుకోవడానికి ససేమిరా అంటున్నారు. తన కుమారుడు తనంత సమర్థుడు కాదని ఆమె నిశ్చితాభిప్రాయం. సోనియా గాంధీ కూడా ఇదే పంథాలో ఆలోచించాల్సి ఉంది. ఆమె పార్టీని దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. మన్మోహన్ సింగ్ విషయంలో మాదిరిగానే, రాహుల్ గాంధీ విషయంలో కూడా వెనుక నుంచి నడిపించాలనుకుంటే అది వేరే విషయం.

నవ్య

నోబెల్ కథలు

యుద్ధం

-లూయీజి పిరాండెల్లో



లూయిజి పిరాండెల్లో 28 జూన్ 1867న ఇటలీలో జన్మించారు. 1934లో సాహిత్యంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. 69 ఏళ్ళ వయసులో 10 డిసెంబర్ 1936న మరణించారు.

రోమ్ నుంచి వెళ్లే ప్రయాణికులు నైట్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించి తెల్లవారుజామున ఫాబ్రియానో అనే చిన్నస్టేషనులో ఆగాల్సి ఉంటుంది. అక్కడినుంచి వాళ్ళని ఒక పాత లోకల్ రైలు సుల్మోనా ప్రధాన రైలు మార్గానికి చేరుస్తుంది.

ఆ పాత పొగబండిలో రాత్రంతా గడిపిన వాళ్ళు అప్పటికే ఐదుగురు ఉన్నారు. విచారం కప్పేసిన మొహంతో దిగులుగా ఉన్న ఒక లావుపాటి స్త్రీ తెల్లవారుజామున ఆ రెండో తరగతి పెట్టెలోకి ఎక్కింది. ఆమె దాదాపు ఒక లావుపాటి మూటలా ఉంది. ఆమె వెనుక ఆమె భర్త కూడా పెట్టెలోకి ఎక్కాడు. అతని మొహం కూడా విచారంగా ఉంది. అతడు సన్నగా బలహీనంగా ఉన్నాడు. మొహం నిర్జీవంగా తెల్లగా పాలిపోయినట్లు ఉంది. చిన్నగా ఉన్న అతని కళ్ళు సిగ్గుతో ముడుచుకుపోతున్నట్లు ఉన్నాయి. అతడు ఎందుకో ఇబ్బంది పడుతున్నట్టు అతని కళ్ళు సూచిస్తున్నాయి.

సీటులో కూర్చున్న తర్వాత అతడు పెట్టెలో ఉన్న ప్రయాణికులకు మర్యాదపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపాడు. భార్యవంక చూసి, ఆవిడ మొహం మీద కప్పుకున్న కోటు తొలగిస్తూ "నీకు ఇప్పుడు ఎట్లా ఉంది?" అని అడిగాడు. ఆమె సమాధానం ఇవ్వకుండా కోటుని తిరిగి మొహం మీద కప్పుకుంది.

'దరిద్రపు లోకం' అని గొణుగుతూ భర్త విషాదంగా నవ్వాడు.

తర్వాత తన భార్య విషాదంగా ఉండడానికి గల కారణాన్ని తోటి ప్రయాణికులకు తెలియజేయడం తన బాధ్యతన్నట్టు అతనికి అనిపించింది. వాళ్ళ ఒక్కగానొక్క కొడుకుని యుద్ధంలోకి పంపాల్సి రావడమే ఆవిడ దుఃఖానికి కారణమని అతను చెప్పాడు. వాళ్ళ అబ్బాయికి ఇరవై ఏళ్ళు. కొడుకు తోడిదే లోకంగా బతికారు. కొడుకు చదువు కోసమే సుల్మోనాలో ఉన్న ఇంటిని వదిలిపెట్టి మరీ రోమ్ వచ్చారు. ఆరు నెలల పాటు యుద్ధరంగానికి వెళ్ళకుండా వాలంటీర్‌గా సేవలు అందించాలనే షరతు మీద తండ్రి అతన్ని సైన్యంలోకి పంపాడు. అయితే ఇప్పుడు అధికారులు అకస్మాత్తుగా ఒక తంతి ఇచ్చారు. మూడు రోజుల తర్వాత కొడుకు యుద్ధరంగానికి వెళ్ళాల్సి ఉంటుందని, ఈలోగా అతని దగ్గరకు వచ్చి వీడ్కోలు పలికి వెళ్ళాలనేదే ఆ తంతి సారాంశమని ప్రయాణికులతో తండ్రి చెప్పాడు.

అతను చెబుతున్నంతసేపూ ఆవిడ ఏడుస్తూ గట్టిగా మూలుగుతూనే ఉంది. ఆవిడ దుఃఖోద్వేగానికి శరీరం కూడా కదిలిపోతుంది. అయితే అతను చెబుతున్నదంతా ప్రయాణికులు మౌనంగా విన్నారు తప్ప ఆవిడ పట్ల వాళ్ళలో సానుభూతి కనిపించలేదు. ఎందుకంటే వాళ్ళంతా కూడా అలాంటి స్థితిలో ఉన్నవాళ్ళే. అతడు చెప్పిన దాన్ని శ్రద్ధగా విని చివరికి ఒకతను నోరు విప్పాడు.

'మీ కొడుకు యుద్ధరంగానికి ఇప్పుడు వెళుతున్నందుకు మీరు దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. మా అబ్బాయి యుద్ధం మొదలైన మొదటి రోజే వెళ్ళిపోయాడు. గాయపడి ఇప్పటికి రెండుసార్లు తిరిగి వచ్చాడు కూడా. కోలుకున్న తర్వాత మళ్ళీ తిరిగి వెళ్ళాడు" అన్నాడు.

"నా సంగతేంటో తెలుసా? మా ఇద్దరబ్బాయిలూ, ముగ్గురు మేనల్లుళ్ళూ ఇప్పటికే యుద్ధరంగంలో ఉన్నారు" మరో ప్రయాణికుడు అన్నాడు.

"అయితే అయ్యుండొచ్చు. కానీ మా విషయం అలాకాదు. మాకున్నది ఒక్కగానొక్కకొడుకు" భర్త నిట్టూరుస్తూ అన్నాడు.

ఆ భార్యాభర్తలు అంతులేని దుఃఖంతో రైలెక్కారు. వాళ్ళ కొడుకు యుద్ధరంగానికి వెళుతున్నాడు. వీడ్కోలు పలకడానికి రమ్మని పిలుపు వచ్చింది. అందుకే వెళుతున్నారు. ఆ తల్లి దుఃఖం వర్ణనాతీతం. ఆమెకు ఎంతో మంది నచ్చజెబుతున్నాగానీ, ఈ లోకం తనను అర్థం చేసుకోవడం లేదని ఆ తల్లి వాపోతోంది. అయితే, ఆ తల్లిదండ్రులు రైలెక్కిన తర్వాత ఏం జరిగింది? అసలా రైల్లో ఎవరున్నారు? వాళ్ళేమన్నారు?

"అందులో తేడా ఏముంది? ఒక్కడే కొడుకున్నప్పుడు అతి శ్రద్ధతో అతన్ని చెడగొడతాం. అయితే ఎక్కువమంది పిల్లలు ఉన్న తల్లిదండ్రులు వాళ్ళను ప్రేమించే దానికన్నా ఒక్కడే కొడుకు ఉన్న తల్లిదండ్రులు అతన్ని ప్రేమించేదేమీ ఎక్కువ కాదు. పిల్లలపై తల్లిదండ్రులకి ఉండే ప్రేమను రొట్టెముక్కలా తలాకొంచెం పంచి ఇవ్వలేం. పిల్లల మధ్య ప్రేమను సమానంగా పంచడం కూడా సాధ్యం కాదు. తండ్రి తన పిల్లల్లో ప్రతి ఒక్కరికీ పూర్తి ప్రేమను పంచుతాడు. పిల్లలు ఒకళ్ళే ఉన్నా, పదిమంది ఉన్నా అందరికీ ఎలాంటి విచక్షణా లేకుండా పూర్తి ప్రేమను అందిస్తాడు. నేను ఇప్పుడు నా ఇద్దరు పిల్లల కోసం బాధపడుతున్నాను. అయితే నేను ఒక్కొక్కరికోసం నా బాధను సగం సగం పంచగలనా? నిజానికి ఒక్కొక్కరి కోసం రెట్టింపుగా బాధపడుతున్నాను. రెండో ప్రయాణికుడు అన్నాడు.

"నిజమే, నిజమే" భర్త నిట్టూరుస్తూ అన్నాడు. "అయితే ఉదాహరణకి (దేవుడి దయవల్ల మీకు అలా జరగకూడదని కోరుకుందాం) ఒక తండ్రికున్న పిల్లలు ఇద్దరూ యుద్ధ రంగంలోనే ఉన్నారనుకుందాం. వాళ్ళల్లో ఒకరు చనిపోయినా ఆ తండ్రిని ఓదార్చేందుకు, తండ్రి ఊరట పొందేందుకు రెండో కొడుకు ఉంటాడు. కానీ మా విషయంలో.." అంటూ అతను ఆగిపోయాడు.

"నిజమే" అంటూ ప్రయాణికుడు మధ్యలోనే అడ్డొచ్చాడు.

"తండ్రిని ఓదార్చేందుకు ఒక కొడుకు బతికే ఉంటాడు. కానీ ఇంకో కొడుకు కోసం తండ్రి అంత దుఃఖాన్నీ దిగమింగుకుని బతికే ఉండాలి. కానీ ఒకే ఒక కొడుకు ఉన్నప్పుడు అతను చనిపోతే అతనితోపాటు మనం కూడా చనిపోవచ్చు. అప్పుడు మన దుఃఖానికి విముక్తి ఉంటుంది. ఈ రెండు పరిస్థితుల్లో ఏది భయంకరమో ఇప్పుడు ఆలోచించు. నీ పరిస్థితికన్నా మా పరిస్థితి భయంకరమైనదని అనిపించడం లేదూ" రెండో ప్రయాణికుడు అన్నాడు.

"అర్థం పర్థం లేని వాదన" నాలుగో ప్రయాణికుడు జోక్యం చేసుకుంటూ అన్నాడు. లావుగా

ఎర్రగా కందిన మొహంతో రొప్పుతున్నాడు. ఎర్రని జీరలున్న అతని ఉబ్బిన కళ్ళల్లోంచి పెల్లుబుకుతున్న ఉద్రేకాన్ని అతని శరీరం తట్టుకోలేదేమో నన్నంత బలహీనంగా ఉన్నాడతను.

"అర్థం లేని మాటలు" మళ్ళీ అన్నాడతను. మాట్లాడేటప్పుడు ఊడిపోయిన ముందు పళ్ళు కనిపించకుండా అతను నోటికి చేతిని అడ్డం పెట్టుకుంటున్నాడు.

"మనం మనకి ఉపయోగపడతారని పిల్లల్ని కంటామా?" అన్నాడతను.

మిగిలిన ప్రయాణికులు అతని వంక విషాదంగా చూస్తూ ఉండిపోయారు. యుద్ధం మొదలైన రోజే కొడుకుని యుద్ధ రంగానికి పంపానన్న తండ్రి నిట్టూరుస్తూ "నువ్వన్నది నిజమే. మన పిల్లలు మనకు చెందినవాళ్ళుకాదు. వాళ్ళు దేశానికి చెందినవాళ్ళు" అన్నాడు.

"అదో బూటకం" లావుపాటి ప్రయాణికుడు అన్నాడు.

"మనం పిల్లల్ని కనేటప్పుడు దేశం గురించి ఆలోచిస్తామా? పిల్లలు ఎందుకు పుడతారంటే... పిల్లలు పుట్టాలి కాబట్టి పుడతారు. పుట్టిన తర్వాత వాళ్ళు మన జీవితాన్ని వాళ్ళ వెంట తీసుకెళతారు. ఇది నిజం. మనం వాళ్ళకు చెందిన వాళ్ళం. కానీ ఎప్పటికీ వాళ్ళు మనకు చెందరు. వాళ్ళకు ఇరవైఏళ్ళ వయసు వచ్చేటప్పటికి కచ్చితంగా ఆ వయసులో మనం ఎలా ఉన్నామో వాళ్ళూ అలాగే అవుతారు. మనకు కూడా అప్పుడు అమ్మా నాన్నా ఉంటారు. అయితే వాళ్ళతో పాటే ఇంకా చాలా విషయాలు కూడా ఉంటాయి... అమ్మాయిలు, సిగరెట్లు, రకరకాల భ్రమలు, కొత్తకొత్త బంధాలు... దేశం మీద ప్రేమ కూడా ఉంటుందనుకో... దేశం ఒక పిలుపు ఇచ్చినప్పుడు మనవంతు కర్తవ్యంగా బాధ్యతతో ప్రతిస్పందించాలి. మనకు ఇరవై ఏళ్ళు వచ్చినప్పుడు అమ్మా నాన్నా ఒప్పుకోకపోయినా ఆ పిలుపును పట్టించుకోవాలి. ఇక ఇప్పుడు మన వయసువాళ్ళ విషయానికొస్తే, మనకు ఇప్పటికీ దేశంమీద ప్రేమ బలంగానే ఉంటుంది. అయితే దానికన్నా పిల్లలమీద ప్రేమ ఇంకా ఎక్కువ ఉంటుంది. అవకాశం వస్తే యుద్ధరంగంలోకి మీ పిల్లల బదులు మీరు వెళ్ళడానికి సిద్ధంగా లేని తల్లి తండ్రులు మీలో ఎవరన్నా ఉన్నారా? అతను ప్రశ్నించాడు.

అక్కడ కాసేపు మౌనం రాజ్యమేలింది. అతను అన్నదానికి ఒప్పుకుంటున్నట్టుగా అందరూ తలలూపారు.

"మన పిల్లలకి ఇరవై ఏళ్ళు వచ్చినప్పుడు వాళ్ళ అభిప్రాయాల్ని మనం ఎందుకు కాదనాలి? వాళ్ళకి ఆ వయసులో దేశంమీద ప్రేమ కలగడం సహజం. మనమీద ఉండే ప్రేమకన్నా దేశం మీద ఉండే ప్రేమ ఎక్కువగా ఉంటుంది. అది సహజమే కదా? ఆ వయసులో వాళ్ళు మనల్ని ముసలి వాళ్ళుగా జమకడతారు. 'ఎక్కడికీ కదలకుండా ఇంట్లోనే ఉండాల్సిన వాళ్ళు' అనుకుంటారు. దేశం స్వతంత్రంగా ఉండాలంటే దానిని కాపాడుకోవాలి. దేశం కూడా రొట్టెలాగానే నిత్యావసరంగా మారిపోయింది. ఆకలితో చనిపోకుండా మనలోని ప్రతి ఒక్కళ్ళూ బతికి బట్ట కట్టాలంటే దేశాన్ని ఎవరో ఒకరు కాపాడుతూ ఉండాలి. ఇరవై ఏళ్ళు వచ్చిన తర్వాత ఆ పని మన పిల్లలు చేస్తున్నారు, చేస్తారు. వాళ్ళని కన్నీటితో యుద్ధరంగానికి పంపాలని వాళ్ళు కోరుకోవడం లేదు. ఒకవేళ వాళ్ళు చనిపోవాల్సి వస్తే సంతోషంగా ప్రాణత్యాగం చెయ్యాలని కోరుకుంటున్నారు.

లోకంలో కుళ్ళు, దుర్గంధం, జీవితంలోని నిరాసక్తత, చేదు, అల్పత్వం - ఇవేవీ తెలియకుండా, జీవితంలోని చేదు వాస్తవాలు రుచి చూడకుండానే యువకులుగా ఆనం



స్టేజీ పై చిందేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ఏంటి? స్టేజీపై డ్యాన్సు లేయడం ఏమిటి? అన్న అనుమానం వస్తోందా? ఈ ఎమ్మెల్యే నిజమైన ఎమ్మెల్యే కాదు 'సరైనోడు' ఎమ్మెల్యే. ఆ సినిమాలో ఎమ్మెల్యేగా చేసిన క్యాథరిన్ ఫిలింఫేర్ అవార్డుల్లో స్టేజి మీద డ్యాన్సు చేసింది. క్యాథరిన్ డ్యాన్స్‌ని ఒళ్ళంతా కళ్ళుగా చేసు కొని చూశారట ప్రేక్షకులు. తనలో మంచి నటే కాదు, మంచి డ్యాన్సరు కూడా దాగి ఉందని నిరూపించిన క్యాథరిన్ మీద టాలీవుడ్ దర్శక నిర్మాతల కళ్ళు పడ్డాయంటున్నారు. ఇప్పటి దాకా కోలీవుడ్‌లోనే ఎక్కువగా సినిమాలు చేస్తున్న క్యాథరిన్ సరైన అవకాశం వస్తే టాలీవుడ్‌ని కూడా దున్నేస్తానంటోంది.

దంగా ప్రాణాలొడ్డేందుకు సిద్ధపడుతున్నారంటే అంతకన్నా దేశం కోసం మనం కోరుకునేదేముంటుంది? పిల్లల్ని తల్చుకుని ఏడవడం కన్నా ప్రతి ఒక్కళ్ళూ వాళ్ళ త్యాగస్ఫూర్తిని చూసి గర్వించడం నేర్చుకోవాలి. అందరూ నాలాగానే దేవుడికి కృతజ్ఞతలు తెలియజేయాలి. ఎందుకంటే చనిపోయే ముందు నా కొడుకు ఒక సందేశం పంపాడు. తను కోరుకున్నట్టుగా ఉత్తమ కార్యం కోసం చనిపోవడం తనకెంతో సంతృప్తి కలిగిస్తోందని. మీరు చూస్తున్నారుగా. అందుకే నేను సంతాపం సూచించే దుస్తులు వేసుకోకుండా..." అంటూ అతను తన కోటు విప్పి చూపించాడు. అతను అలా అంటున్నప్పుడు అతని గొంతు వణికింది. అతని కళ్ళు నీటితో నిండిపోయాయి. చివరికి అతను బలవంతంగా నవ్వాడు. అయితే అది వెక్కిళ్ళలాగా అనిపించింది.

"నిజమే... నిజమే" అంటూ అందరూ తల లూపారు.

రైలు పెట్టెలో ఒక పెద్ద మూటలాగా ఒక మూలన ఉన్న ఆ లావుపాటి స్త్రీ కూడా అంతా వింది. గత మూడు నెలలుగా భర్త, స్నేహితులూ అందరూ ఆమెకు నచ్చజెపుతూ వస్తున్నారు. ఒక ప్రమాదకరమైన జీవితంలోకి కొడుకుని పంపుతున్నప్పుడు తల్లి ఎంత ధైర్యంగా ఉండాలనే విషయాన్ని వారు చెబుతూ వచ్చారు. అయితే సానుభూతి వాక్యాలు చెప్పడానికి ప్రయత్నించిన వాళ్ళలో ఎవరూ తనపరిస్థితిని సరిగా అర్థం చేసుకోలేకపోయారని ఆమె అనుకుంటూ వచ్చింది.

అయితే ఇప్పుడు ఆ ప్రయాణికుడు చెప్పిన విషయం ఆమెకు ఆశ్చర్యాన్నీ దిగ్భ్రమనీ కలిగించింది. ఆమె అకస్మాత్తుగా ఒక విషయాన్ని గ్రహించింది. మిగిలిన వాళ్ళు తనని సరిగా అర్థం చేసుకోవడం లేదని తను అనుకుంటున్నది సరి కాదని, తప్పు వాళ్ళల్లో లేదని ఆమె అనుకుంది. పిల్లల్ని యుద్ధ రంగంలోకి పంపి వారి ఎడబాటునీ, చివరికి వారి మరణాన్ని కూడా మౌనంగా ఎలాంటి దుఃఖం లేకుండా అంగీకరిస్తున్న ఇతర తల్లిదండ్రుల ఔన్నత్యానికి తను చేరుకోలేక పోవడం తన లోపమని ఆమె గ్రహించింది.

ఆమె తలెత్తి ఆ ప్రయాణికుడు చెబుతున్న విషయాల్ని, తన కొడుకు సంతోషంగా దేశాన్ని కాపాడడానికి ఎలా సిద్ధపడాలో అతను చెబుతున్న దాన్నంతా శ్రద్ధగా ఆలకించింది. తను ఎప్పుడూ కలలో కూడా ఊహించి ఎరుగని ఒక కొత్త లోకంలోకి అడుగుపెట్టినట్టు ఆమె భావించింది. ఈ కొత్త ప్రపంచం గురించి ఆమెకు ఏ మాత్రం తెలియదు. తన కొడుకు మరణం గురించి ధీరోదాత్తంగా మాట్లాడుతున్న ఆ తండ్రిని అందరూ అభినందించడం చూసి ఆమె చాలా సంతోషించింది.

అప్పుడు ఆమె అకస్మాత్తుగా కలలోంచి మేల్కొన్నట్టు అంతవరకూ అతడు చెబుతున్న దానిని ఏ మాత్రం విననట్టుగా ఆ ముసలాయన వైపు తిరిగి ఇలా అడిగింది.

"అయితే... మీ అబ్బాయి నిజంగా చనిపోయాడా?"

అందరూ ఆమెవైపు తలతిప్పి చూశారు. ఆ ముసలాయన కూడా కన్నీళ్ళతో తడిసి ఉబ్బెత్తుగా ఉన్న తన కళ్ళని ఆమె వైపు తిప్పి అలాగే చూస్తూ ఉండిపోయాడు. కొంతసేపు గడిచిన తర్వాత ఆయన సమాధానం చెబుదామని చూశాడు కానీ మాట్లాడలేకపోయాడు. ముసలాయన ఆమె మొహం వంకే దీర్ఘంగా చూస్తూ ఆమె అనాలోచితంగా అడిగిన ప్రశ్న గురించి ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఆయన అకస్మాత్తుగా అప్పుడే ఆ విషయాన్ని గ్రహించినట్టు చూశాడు. అవును తన కుమారుడు చనిపోయాడు. ఇంక తిరిగి కనిపించడు. ముసలాయన మొహం దుఃఖంతో కుంగిపోయినట్టు అయింది. ఆయన మొహం ముడుచుకుపోయింది. ఆయన జేబులోంచి చేతిరుమాలు పైకితీసి కళ్ళొత్తుకున్నాడు. అందరూ ఆశ్చర్యంగా ఆయన్నే చూస్తున్నారు. మరుక్షణం ఆయన హృదయ విదారకంగా వెక్కిళ్ళు పెట్టి ఏడవసాగాడు. అతని దుఃఖానికి అంతు లేనట్టు అనిపించింది.



అనువాదం: **జి.లక్ష్మి** e-mail: guttalakshmi62@gmail.com

చిత్రమైన డైటు శరీరానికి చేటు

బరువు తగ్గేందుకు చాలామంది చాలా రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ కాలం పిల్లలైతే మరీనూ. అమ్మాయిలైనా, అబ్బాయిలైనా హెల్దీగా, ఫిట్‌గా ఉండటానికి చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. ఈ క్రమంలో కొన్ని సార్లు వారు ఆహారం మానేసి అనారోగ్యాల బారిన పడే అవకాశాలు కూడా ఉన్నాయి. అవగాహన లేమితో చేసే కొన్ని పనులు హాని తీసుకొస్తాయి కూడా! ఆ విధంగా 'నియతాహారం' అనే పదానికి విపరీతార్థం వచ్చేలా వింతైన డైట్ ఫాలో అయ్యే కొంతమంది గురించి చదివేసేయండి!

మంచినీళ్లు తాగకుండా ఎవరైనా ఉండగలరా?

కానీ ఆ వ్యక్తి మాత్రం కొన్ని సంవత్సరాల నుంచి చుక్కనీరు తాగకుండా బతికేస్తున్నాడు.

మీరు రోజూ అరటిపండ్లు మాత్రమే తిని బతికేయగలరా?

ఆ అమ్మాయి వట్టి అరటిపండ్లు మాత్రమే తిని ఆకలి తీర్చుకుంటోంది! ఆల్కహాల్ అతిగా తాగితే కష్టాలు తప్పవు. కానీ ఆ వ్యక్తి కొన్ని సంవత్సరాల నుంచి ఆల్కహాల్ మాత్రమే తీసుకుంటున్నాడు! ఇలా వింతైన డైట్‌ను ఫాలో అయ్యే వారి గురించి సరదాగా తెలుసుకోండి అయితే వారు చేస్తున్నారు కదా అని, మీరూ అలాంటి పద్ధతినే ఫాలో అవ్వకుండా, డాక్టర్లు చెప్పిన ప్రకారం నియతాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండే ప్రయత్నం చేయండి..

కేవలం అరటిపండ్లతోనే

అరటిపండ్లు ఒకటీ రెండు తింటే మంచిదే.. అదే రోజూ కేవలం అరటి పండ్లు మాత్రమే తింటే లావు అవుతారని మరికొందరు చెబుతారు. అయితే న్యూట్రీషనిస్ట్ యులియా టర్బాత్ మాత్రం రోజూ బనానా డైట్‌తో బతికేస్తుంది. అది తప్ప ఏమీ ముట్టదు. బనానా డైట్ అంటే కేవలం అరటి పండ్లు, నీళ్లు మాత్రమే తాగి బతకడం అన్నమాట. దాదాపు 12 రోజులు ఈ డైట్ ఫాలో అయింది. ఈ డైట్ ఫాలో అవడం వల్ల చర్మం ఆరోగ్యంగా మారిందని ఆమె చెబుతోంది. అయినా అందరి శరీరతత్వం ఒకేలా ఉండదు కదా!

నూడుల్సే మహా పసందు

వండుకోవడానికి బద్ధకమైనప్పుడో ఆకలి బాగా వేసినప్పుడో వెంటనే ఐదు నిమిషాల్లో చకచకా రెడీ కావాలనుకునేవారికి ఇన్‌స్టంట్ ఆహారం నూడుల్స్. జార్జీ రీడ్మాన్ అనే ఓ అమ్మాయి ఐదేళ్ల వయసులో నూడుల్స్ రుచి చూసింది. దాంతో ఆమెకి ఆ రుచి తెగ నచ్చేసిందట. అంతే అప్పటి నుంచి 13 ఏళ్లు నూడుల్స్ తప్ప ఏమీ తినకుండా ఉంది. ఇలా నూడుల్స్ తింటే ఆమె ఆరోగ్యం ఎలా ఉంటుందో అన్న ఆలోచనతో ఆమెను 18 ఏళ్ల వయసులో డాక్టర్లు పరీక్షించగా ఆమె ఆరోగ్యం 80 ఏళ్ల వయసు వాళ్ల మాదిరిగా ఉందని చెప్పారు. అంటే ఆమె శరీరానికి ఏ మాత్రం పోషకాలు అందలేదు.

పిజ్జానే విందు భోజనం

పిజ్జా, బర్గర్‌లు లాంటివి తింటే బరువు పెరగడం ఖాయం. కానీ మార్లాండ్‌కి చెందిన డాన్ జాన్సన్ శరీరంలో మాత్రం కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్‌లోనే ఉన్నాయట. అతనికి వెజిటేరియన్‌గా ఉండాలంటే ఇష్టం. అందులోనూ పిజ్జా అంటే మహా ఇష్టం. అయితే వెజిటబుల్ పిజ్జా తినడం ఇష్టంలేక కేవలం చీజ్ పిజ్జా ఎంచుకున్నాడు. అంతే, 25 ఏళ్ల పాటు కంటిన్యూగా కేవలం పిజ్జాలు మాత్రమే తిన్నాడు. అప్పుడప్పుడు ఒక బౌల్ సెరెల్స్ తినేవాడట.

నీళ్లు తాగకుండా

నీళ్లు తాగకుండా ఎవరైనా ఎన్ని రోజులు ఉండగలరు? నీళ్లు బరువును తగ్గిస్తాయి. ఇంకా నీళ్లు తాగకుంటే అనారోగ్యం కూడా. కానీ మన భారతీయ సాధువు ప్రహ్లాద్ జానీ మాత్రం 70 ఏళ్ల నుంచి చుక్క నీరైనా తాగకుండా బతుకుతున్నాడు. అతను నీరు తాగకుండా ఇన్ని సంవత్సరాలు ఎలా ఉన్నాడో అర్థంకాక డాక్టర్లు సైతం ఆశ్చర్యపోతున్నారు.

బీర్ తప్ప ఏదీ వద్దు

రోజూ ఆల్కహాల్ తాగితే శరీరంలో రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి. కానీ డెన్‌మాయిల్స్ అనే అతనికి ఇవేమీ పట్టవు. అతను బీర్‌డైట్ ఫాలో అవ్వాలి అనుకున్నాడు. అంతే, 46 రోజుల పాటు కేవలం బీర్ మాత్రమే తాగాడు. ఈ 46 రోజుల్లో అతను రోజుకు 4 నుంచి 5 బీర్లు తాగాడు.

బంగాళాదుంపలు భలే పసందు

ప్రతిరోజు బంగాళాదుంపలు తినాలంటే ఎంత బోరో కదా! పైగా ఇవి ఎక్కువ ఫ్యాట్‌ను కలిగిస్తాయని అంటారు. అయితే క్రిస్ వయటేకి బంగాళాదుంపలంటే పిచ్చి. పైగా వాషింగ్టన్ స్టేట్‌కి పొటాటో కమిషన్ హెడ్ కూడా! అతను పొటాటో డైట్ ఫాలో అయిపోయాడు. ఒకటి కాదు రెండు కాదు 60 రోజులు కేవలం బంగాళాదుంపలు మాత్రమే తిన్నాడట.

- మాధురి దేవళ్ల



మరో అరగంటకల్లా టిఫిన్ తెచ్చింది రాధ.

"ఇప్పుడేమీ వద్దండీ. ఉదయాన్నే ఆకలిగా ఉంటే అక్కడ కొండమీది పాకలో తినేశాను. ప్రస్తుతానికి ఏమీ వద్దు" అన్నాడు.

అయితే ఆ అమ్మాయి అజంతా శిల్పంలా అందంగా, గుడారానికి దిగ్గొట్టిన మేకులా స్థిరంగా అక్కడే పాతుకుపోయింది చేతిలోని ప్లేటుతో. బహుశా అది అతిథి మర్యాదకు ఆనవాలేమో. ఆ అమ్మాయి వాలకం చూసి గోపాలరావు కూడా నవ్వేశాడు.

"అది తీసుకోకుంటే అమ్మాయి కదలదు. అయినా ఎప్పుడో ఉదయం ఆరు గంటలకు తిన్నావు. ఇప్పుడు తొమ్మిది కావస్తోంది. అరిగిపోయి ఉంటుంది. ఫర్వాలేదు తీస్కో. మరో ముఖ్యమైన సంగతేమిటంటే ఇక్కడుండే పక్షంలో ఏ విషయంలోనూ మొహమాటం పనికిరాదు. ఇన్నేళ్ళ తరువాత అయిన వాళ్ళను కలిశానన్న ఆనందం కాసేపైనా ఉండనీ. పైగా చదివేవాళ్ళకు ఆరోగ్యం ముఖ్యం. తిండి విషయంలో అశ్రద్ధ కూడదు. తిండి వేళ తప్పిపోయిందంటే అనారోగ్యాన్ని ఆహ్వానించినట్టే" అన్నాడు గోపాలరావు.

ఇక తప్పదన్నట్టు దాన్నందుకున్నాడు విష్ణు. ఆరోగ్యం పట్ల వాళ్ళు చూపుతున్న శ్రద్ధకు మెచ్చుకోలుగా చూశాడు.

టిఫిన్ ముగించేంతలో ఈసారి కాఫీకి బదులు టీ తెచ్చింది రాధ.

"ఇక్కడ కొండ ప్రాంతంలో టీ పెంపకం ఎక్కువ. కాస్త దూరంగా వెళ్తే టీ ఎస్టేట్లు ఉన్నాయి. చూడ్డానికి చాలా బాగుంటాయి. కొండవాలులో చూసినంతమేరకు పచ్చగా కళ్ళకింపుగా ఉంటాయి. చాలాసార్లు అక్కడ సినిమా షూటింగులు కూడా జరిగాయి" అన్నది.

"మీరెప్పుడైనా సినిమా షూటింగ్ చూశారా?"

లేదన్నట్టు అడ్డంగా తలూపింది నిరాశగా.

"మరి షూటింగులు జరిగాయని మీకెలా తెలుసు?"

"సినిమా షూటింగ్ వాళ్ళు వచ్చారని ఊళ్ళో మాట్లాడుకుంటారు. మా ఊళ్ళో థియేటర్ కూడా లేదు. అందువల్ల సినిమాలు కూడా చూడలేం" అంది నీరసంగా.

"ఈసారెవరైనా మాట్లాడుకుంటే చెప్పండి. వెళ్ళి షూటింగ్ చూసొద్దాం".

ఉత్సాహంగా తలూపింది రాధ. టీ తాగి కప్పు కింద పెట్టి లేచాడతను.

"అంకుల్, ఒకసారి అలా ఊళ్ళోకి వెళ్ళొస్తాను" అన్నాడు.

హావేలీ

2

-ఎస్. ఘటికాచలరావు సెల్:90031 41474

జరిగిన కథ

అరకులోయ మార్గంలో ఒక కుగ్రామా నికి వెళ్ళే తోవలోనే ఉంది పాడుబడిన హావేలీ ప్యాలెస్. ప్రశాంత వాతావరణంలో ఐపీఎస్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు పోలీసు అధికారి గోపాలరావు ఇంటికొస్తాడు విష్ణు. మైసూర్ ప్యాలెస్ తరహాలో ఉన్న ఈ హావేలీ అతడి నెంతగానో ఆకర్షిస్తుంది. ఆ ప్యాలెస్ పేరెత్తగానే గోపాలరావులో ఉలికిపాటు, అక్కడి మను షుల ప్రవర్తన, వారు పెట్టే ఆంక్షలు విష్ణుకి ఆశ్చర్యం కలిగిస్తాయి.

ఆ తర్వాత.....

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? ఈ ఊరి గురించి తెలుసు కోడానికి. ఎలాగూ రెణ్ణెల్లపాటు ఇక్కడే ఉంటా నుగా. ఏదెక్కడుందో తెలుసుకుందామని..." అంటూ ఆగాడు.

"వెళ్ళొద్దు... నువ్వు గ్రామానికి కొత్త. ఈ గ్రామం గురించి ఇక్కడి జనం గురించి నీకు తెలియదు. నువ్వు తిరిగి ఊరికెళ్ళేదాకా నీ బాధ్యత నాది. కాబట్టి నేను చెప్పినట్టే నడుచుకోవాలి" అన్నాడు. ఉరిమినట్టుందతని గొంతు.

హఠాత్తుగా మారిన అతని ధోరణికి ఆశ్చర్య పోయాడు విష్ణు. గోపాలరావు గొంతులో కర్క శత్వం కనిపించింది. అప్పటివరకూ బాగానే మాట్లా డిన అతని గొంతులో హఠాత్తుగా ధ్వనించిన కాఠిన్యానికి ఆశ్చర్యపోయాడు.

"కారణం తెలుసుకోవచ్చా?" ఆశ్చర్యాన్ని అణుచు కుంటూ అడిగాడు.

"కొన్నింటికి కారణాలుండవు. చెప్పినట్టు నడుచుకోవాలి. అంతే" అతని గొంతులో ధోరణి ఏ మాత్రం మారలేదు.

రాధ కూడా విష్ణు వైపు బిక్కుబిక్కుమంటూ చూసింది. తండ్రి మాటకు కట్టుబడి ఉంటాడో, లేక వెళ్తాడో అన్న మీమాంసలో ఉందామె.

"నేను తొమ్మిది గంటలకు డ్యూటీకి వెళ్తాను. వచ్చేవరకూ ఇతన్ని జాగ్రత్తగా చూసుకో అమ్మాయ్. బయటికి వెళ్ళనివ్వకు" అన్నాడు కుర్చీలో నుంచి లేస్తూ.

విష్ణు పరిస్థితి అయోమయంగా ఉంది. 'ఊళ్ళో తిరగడానికి ప్రతిబంధకాలెందుకు? అలా తిరగడం మంచిది కాదని ఎందుకు చెప్తు న్నాడు?' ఆలోచిస్తూ తనకు కేటాయించిన గది లోకి వెళ్ళాడు. కిటికీ తలుపు తెరిస్తే చల్లని గాలి లోనికి ప్రవేశించి గగుర్పాటు కలిగించింది. అదే సమయంలో అక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం గమనించాడు.

అక్కణ్ణుంచి కనుచూపుమేరలో అతని కంట బడింది 'హావేలీ!'

'వావ్' అనుకున్నాడు మనసులో. అక్కడికి వెళ్ళాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది. కానీ గోపాల రావు బయటికి వెళ్ళడాన్నే వారిస్తున్నాడు. కారణం అర్థం కావడం లేదు.

సరిగ్గా తొమ్మిది గంటలకు డ్యూటీకి బయలు దేరాడు గోపాలరావు. అరకు స్టేషన్లో ఉద్యోగం. టీవీఎస్ ఫిఫ్టీ బండి మీద వెళ్తాడు. ఆరోజు వెళ్ళే ముందు రాధ, విష్ణులిద్దరికీ ఇంటి వద్ద జాగ్ర త్తగా ఉండమని హెచ్చరించి మరీ వెళ్ళాడతను.

అతను వెళ్ళగానే గది బయటికి వచ్చాడు విష్ణు.

"ఏంటండీ ఈ కట్టుబాట్లు? నేను మగాణ్ణి. నాకేమౌతుంది? పిరికిపందలా ఇంట్లో ఉండా లంటే ఎలా? అయినా ఇరవై నాలుగ్గంటలూ చదవగలమా? కాస్త అయినా ఆటవిడుపు ఉండ ఖ్ఖర్లేదా?" రాధ ఏమీ మాట్లాడలేక పోయింది.

"నేను బయటికి వెళ్ళి అరగంటలో వచ్చే స్తాను. మీరు జాగ్రత్తగా ఉండండి ఇంట్లో" అంటూ చెప్పులేసుకుని ఆమె వైపు తిరిగైనా చూడకుండా బయటికి నడిచాడు విష్ణు.

ఆమె మనసులో ఏదో భయం. నోరు తెరిచి అతన్ని వారించాలనుకున్నా ఆ పని చేయలేక పోయింది. కారణం అతను మగాడు. పైగా బల వంతుడు. మరోవైపు అతను బయటికి వెళ్ళాడని తెలిస్తే తండ్రి ఏమంటాడోనన్న ఆందోళన! ఇబ్బంది కరమైన పరిస్థితుల్లో చిక్కుకుంది రాధ.

ఆమె వాలకం గమనిస్తూ నిర్లక్ష్యంగా బయ టికి నడిచాడు విష్ణు. వీధిలోకి రాగానే రెండు వైపులా చూశాడు. దాదాపువంద మీటర్ల పొడ వున్న వీధి. ఇళ్ళు అక్కడక్కడ ఉన్నాయి. వీధిలో డజను ఇళ్ళుంటాయేమో. వీధి చివర ఏదో ఒక చిన్న టీ కొట్టులాగుంది. మొత్తం ఉన్నది వంద ఇళ్ళలోపే. ఇలాంటి చోట వీడికి ఏం వ్యాపారం జరుగుతుంది?

అయితే వెంటనే అతని అనుమానం తీరి పోయింది. దూరంగా ఏదో ఒక టూరిస్ట్ బస్సు ఆగి ఉంది. అందులోనుంచి దిగిన జనాలు నేరుగా ఇటుకేసే వస్తున్నారు.

అంటే ఇదేదో ఒక టూరిస్ట్ స్పాటన్నమాట. నిజమే. రాధ చెప్పినట్టు సినిమా షూటింగులు జరుగుతాయట గదా.

బయటికి వెళ్ళిన విష్ణు వీధి చివరి టీ కొట్టు వరకూ వెళ్ళాడు.

అంతలో బస్సులో జనాలు కూడా అక్కడికి చేరుకున్నారు. వాళ్ళ భాషేమిటో అర్థం కాలేదు. వినడానికి ఒరియా లాగుంది. మరికొందరు బెంగాలీ మాట్లాడుతున్నట్టు అనిపించింది. వచ్చిన

వాళ్ళు ఐదు నిమిషాల్లో చాయ్ తాగేసి వేగిరం బస్సు వద్దకు వెళ్ళిపోయారు.

విష్ణు తను కూడా ఒక టీ ఇవ్వమని చెప్పి అక్కడే బెంచి మీద కూర్చున్నాడు.

టీ కొట్టువాడు విష్ణువైపు అదోలా చూశాడు. లోపలికి వెళ్ళి అక్కడున్న పని వాడితో ఏదో చెప్పాడు. వాడు మరొకడితో మాట్లాడాడు. విష్ణు ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు. రెండు నిమిషాల్లో టీ వచ్చిందతని చేతికి. నిదానంగా సిప్ చేస్తూ పరిసరాలన్నీ గమనిస్తున్నాడు విష్ణు. టీ కొట్లో ముగ్గురూ విష్ణువైపే గుడ్లప్పగించి చూస్తున్నారు.

టీ తాగడం ముగించి డబ్బులిచ్చి లేచాడు.

బస్సాగిన ప్రాంతం అక్కడికి కొంత దూరంలో ఉంది. అక్కణ్ణుంచి కొండమీదికి సన్నని రోడ్డు. ఇటువైపు గ్రామానికీ అటువైపు హవేలీకి కూడా కాలిబాట ఉన్నట్టు కనిపిస్తోంది. ఉదయం తను నడిచొచ్చిన దారి అదేనేమోననిపించింది. కేవలం టూరిస్టు బస్సులు మాత్రమే అక్కడికి వస్తాయి లాగుంది. రూట్ బస్సులేవీ గ్రామంలోకి రావు. ఊళ్ళోకి సరుకులు తెచ్చేందుకు అన్నట్టుగా టెంపో లాంటి చిన్న ఆటోలు రెండు అక్కడ ఆగున్నాయి.

నిదానంగా నడుచుకుంటూ అతను టూరిస్టు బస్సు ఆగిన ప్రదేశానికి చేరుకున్నాడు. అక్కణ్ణుంచి చూస్తే గోపాలరావు ఇల్లున్న వీధి పక్కనే మరో వీధి కూడా కనబడింది. చుట్టూ కలయజూశాడు. అక్కణ్ణుంచి హవేలీ చాలా స్పష్టంగా కనబడుతోంది. అయితే బస్సు మాత్రం హవేలీ వద్దకు వెళ్ళలేదు. ఆగిన చోటినుంచే వెనక్కు తిరిగి కొండ మీదికి వెళ్ళిపోయింది. రాజుల కాలం నాటి భవంతిని ఒక మాన్యుమెంట్‌లాగా అందరికీ చూపించవచ్చు. పైగా ఆ భవంతి అక్కడున్న వాళ్ళందరికీ పెద్ద దిక్కుగా ఉన్న రాజా విజయేంద్రవర్మదేనని గోపాలరావు చెప్పాడు. అయినా అక్కడికి ఎవరూ వెళ్ళడం లేదు. ఆ భవంతిలో ఏదో మర్మం ఉందనిపించింది. అయితే అదేమిటో అర్థం కాలేదు.

ఇప్పుడు ఆలోచించడం అనవసరమనుకుని మళ్ళీ వీధిలోకి వచ్చాడు.

బయటకు వెళ్ళొద్దని అతనికి ఆంక్ష విధించి డ్యూటీకి వెళ్ళిపోయాడు ఎస్సై. రాత్రి కిటికీ తలుపులు తెరిచి నిద్రించవద్దని మరో ఆంక్ష పెట్టాడు. అలా అనేకొద్దీ హవేలీలో ఏముందో చూడాలనే కోరిక అతనిలో పెరిగిపోతోంది. ఈ ఆంక్షలతన్ని చికాకు పరుస్తున్నాయి. రాత్రి కావాలనే కిటికీ తెరిచి నిద్రపోయాడు. ఏవో శబ్దాలు! ఆకస్మికంగా మెలకువ వచ్చింది. ఆ నిర్మానుష్య ప్రదేశంలో పక్కనే ఎవరో మాట్లాడుతున్న అనుభూతి! చెవులు రిక్కించాడతను!

అదే సమయంలో అక్కడి టీ కొట్లో వ్యక్తి అతని దారికి అడ్డం వచ్చాడు.

"ఎవరు నువ్వు?" అనడిగాడు. అతని గొంతులో కర్కశత్వం ఉంది. అతని చూపుల్లో చురుకుదనం ఉంది. శరీరం దృఢంగా ఉంది.

"నా పేరు విష్ణు. ఎస్సై గోపాలరావుగారి బంధువును. వాళ్ళింట్లోనే దిగాను. పరీక్షలకు చదువుకోవడానికి వచ్చాను. రెండు నెలలు ఇక్కడే ఉంటాను".

ఆ చివరి వాక్యంలోని ఒక్కొక్క పదాన్ని విడగొట్టి స్పష్టంగా నిదానంగా ఒత్తి పలికాడు. కొట్టు వాడు మాట్లాడలేదు. అలా అనేదానికన్నా అతనికి మాట పెగల్లేదంటేనే బాగుంటుంది.

"ఇంకేమైనా అడగాలా?" పదునుగా వచ్చాయి విష్ణు నోటి నుంచి మాటలు.

లేదన్నట్టుగా తలూపాడతను. విష్ణు అడుగు ముందుకేశాడు ఇంటివైపు.

గంట తరువాత తిరిగొచ్చిన విష్ణును చూసి "ఎక్కడికెళ్ళారు?" అనడిగింది రాధ.

"చెప్పానుగా. ఊరికే అలా గ్రామం చూసొద్దామని వెళ్ళాను"

"నాన్నగారు వెళ్ళొద్దన్నా ఎందుకెళ్ళారు?"

ఆమె వైపు విచిత్రంగా చూశాడు. ఆమె గొంతులోనూ అదే కఠినత్వం, కర్కశత్వం. అతను మౌనం వహించాడు.

"చదువుకోడానికేగా వచ్చారు. అంత పెద్ద పరీక్షకు చదువుకునే వాళ్ళు ఇలా అనవసరంగా టైం వేస్ట్ చెయ్యొచ్చునా?" గొంతులో అదే కాఠిన్యం.

అప్పుడు అర్థమైందతనికి ఆమె వాళ్ళ నాన్నను ఇమిటేట్ చేస్తోందని. చిన్నగా నవ్వి తల పంకించాడు. ఆమె ఫక్కున నవ్వింది. పలువరుస తళుక్కుమంది. అతని గుండె లయతప్పింది. దాన్ని దారిలో పెట్టేందుకు ప్రయత్నించాడు.

వాతావరణం తేలికపరచే ఉద్దేశంతో "అవునూ. ఎందుకు వద్దన్నారు?" అన్నాడు.

హఠాత్తుగా ఆమె ముఖంలో ఒక విధమైన బెరుకు కనిపించింది. ఆమె మాట్లాడ్డానికి సంకోచిస్తున్నట్టు అనిపించింది. అది గమనించి అతను మళ్ళీ అడగలేదు. అప్పుడు సమయం ఉదయం పది గంటలు.

తన గదిలోకి వెళ్ళి విష్ణు తలుపులు మూసుకున్నాడు. బయట హాల్లో టీవీ పెట్టిన శబ్దం వినవచ్చింది. ఏదో సీరియల్ వస్తున్నట్టుంది.

గది తలుపులు మూసుకున్న విష్ణు కిటికీ తలుపులు తెరిచాడు.

కంటికెదురుగా దూరంగా హవేలీ కనబడుతోంది.

'ఒకసారి హవేలీ లోపలికెళ్ళి చూసి రావాలి' అనుకున్నాడు మనసులో.

బైట టీవీ చూస్తున్న రాధ మూసి ఉన్న గది తలుపుల వైపు పదే పదే చూడసాగింది.

మొదటిసారిగా ఆమె మనసులో కొన్ని సందేహాలు మెదిలాయి.

'నిజంగా ఇతను తమకు దూరపు బంధువేనా? చదువుకోడానికే వచ్చాడా? ఇతని మాటలు ఎంతమేరకు నమ్మవచ్చు? అంతపెద్ద పరీక్షకు చదువుకోడానికి ఈ మారుమూల ప్రదేశానికి రావాలా? పట్నంలో లేని వసతులు ఈ కుగ్రామంలో ఉంటాయా? కేవలం అతను చూపించిన ఒక ఉత్తరం ఆధారంగా తండ్రి అతన్ని ఎలా నమ్మాడు? ఎప్పుడో పన్నెండేళ్ళ క్రితం చూసిన వ్యక్తిని ఇప్పుడు గుర్తించడం సాధ్యమా? అప్పటి పోలికలు, ఆనవాళ్ళు ఇప్పుడు ఉంటాయా? తన తండ్రి కనీసం వాటి గురించి ఏ విధమైన ఆరా తీసినట్టు కనిపించలేదు' అంతులేని ఆలోచనలు ఆమె మెదడును తినేస్తున్నాయి.

టీవీ చూస్తున్నా ఆలోచనలు తెమలక సతమతమైపోయింది. కొంతసేపటికి టీవీ కట్టేసి వంట పనికి ఉపక్రమించింది. అదే సమయంలో గది తలుపులు తెరుచుకుని అతను బయటికి వచ్చాడు. అతని చేతిలో ఏవో పుస్తకాలున్నాయి.

ముందు హాల్లో కుర్చీలో కూర్చున్నాడు. అంతలోనే అక్కడికి కొంతదూరంలో వంటింట్లోకి

అందుకే అంత ఇచ్చారట!

'జనతా గ్యారేజ్' సినిమా కోసం నిత్యాకి భారీ ప్యాకేజీ ముట్టిందన్న వార్తలు జోరుగా షికారు చేస్తున్నాయి. ఈ సినిమాలో నిత్యది సెకండ్ హీరోయిన్ రోలే అయినా, మాలీవుడ్‌లో ఆమెకున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకనిర్మాతలు ఆమెకు భారీ మొత్తం ముట్టజెప్పారని అంటున్నారు. ఈ సినిమాలో మాలీవుడ్ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ఉన్నప్పటికీ నిత్యా ఎఫెక్టే ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారట!

వెళ్ళబోతున్న ఆమెను చూసి "ఇక్కడ కూర్చోవచ్చునా?" అనడిగాడు.

అతని చేతిలోని పుస్తకాలు చూసి తేలికపడ్డ మనసుతో తలూపింది.

"టీవీ పెట్టుకోవచ్చా?" మరో ప్రశ్న అడిగాడు.

లోపలికి వెళ్ళబోతూ మళ్ళీ ఆశ్చర్యంతో భృకుటి ముడి వేసింది.

"ఎప్పటికప్పుడు ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలుసుకోవాలి కదండీ. పరీక్షలకు అది చాలా ముఖ్యం. వార్తలు చూస్తేనేకదా మనకవి తెలిసేది".

మళ్ళీ నవ్వేసి తలూపి "అన్ని ఛానల్సూ రావు" అంది.

"ఫర్వాలేదు. ఏదో ఒక న్యూస్ ఛానల్ వస్తే చాలు" అని వచ్చిన ఒక న్యూస్ ఛానెల్ పెట్టి చేతిలో పుస్తకం తిరగేస్తూ, టీవీ చూస్తూ కూర్చుండిపోయాడతను.

"చదువుకోడానికి పట్నంలో లేని వసతులు ఈ గ్రామంలో ఉంటాయని ఎలా అనుకున్నారు?" వంటింట్లో నుంచి ఆమె అడిగింది.

ఎదురుచూడని ఆ ప్రశ్నకు ఒక్కక్షణం ఏం జవాబు చెప్పాలో అర్థం కాలేదు. అంతలోనే సర్దుకుని "చదువుకోడానికి కావలసింది వసతి కాదు. ప్రశాంతత. డిస్టర్బెన్స్ లేకుండా ఉంటేనే ఏకాగ్రత కుదురుతుంది. ఏకాగ్రత ఉంటేనే చదివింది మెదడుకు ఎక్కుతుంది. ఎక్కితేనే పరీక్షలు బాగా రాయగలం. బాగా రాస్తేనే పాసవ్వగలం. పాసైతేనే ఉద్యోగం. ఐపీఎస్ ఉద్యోగంలో చేరితేనే గౌరవం. అదే మా తండ్రి ఆశయం".

ఇందులో ఇంత విషయముందా అన్నట్టుగా అతని వైపు చూసింది రాధ.

"పట్నంలోని రణగొణధ్వనుల మధ్య అస్సలు ఏకాగ్రత కుదరదు. అందుకే నేను ఏదైనా మరో ఊరికి వెళ్ళి ఎక్కడైనా హాస్టల్లో ఉండి చదువుకుంటానని నాన్నతో చెప్తే, అక్కర్లేదు మీ మావయ్య ఉన్నాడు వెళ్ళు, అక్కడ ప్రశాంతంగా ఉంటుంది అని అడ్రస్ ఇచ్చి పంపాడు. నిజంగా నేననుకున్న దానికంటే ఎక్కువ ప్రశాంతత, అంతకుమించి అద్భుతమైన పరిసరాలూ ఇక్కడ ఉన్నాయి. నా పరీక్షలో నేను కచ్చితంగా పాస్ అవుతాను".

అతని మాటలకు ఆమె కళ్ళు సంతోషంతో మెరిశాయి. ఇంకా ఎన్నాళ్ళు వేచి ఉండాలో అన్నట్టు కూడా ఉన్నాయా చూపులు. అదే సమయంలో హఠాత్తుగా మూడీగా మారిపోయిందామె. ఒక పట్టాన ఆమె ఫీలింగ్స్ అర్థం చేసుకోలేకపోతున్నాడు.

ఒక గంట తరువాత కమ్మని వంటను తృప్తిగా భోంచేశాడు.

భోజనం తరువాత గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుని కునుకు తీశాడు. సాయంత్రం గోపాలరావు వచ్చే సమయానికి అతనింకా నిద్రపోతూనే ఉన్నాడు.

వచ్చీ రావడంతోటే అతనడిగిన మొదటి ప్రశ్న "అతను బయటికి వెళ్ళాడా?"

అవునన్నట్టుగా తలూపింది రాధ. అతని ముఖంలో క్రోధం తొంగి చూసింది. వద్దన్న పని చేసినందుకు వెంటనే అతన్ని చెడామడా తిట్టెయ్యాలనుకున్నాడు. అయితే గది తలుపు వేసి ఉంది. అతను నిద్రలో ఉన్నాడు. సంతోషమైనా, కోపమైనా భావాలేవైనా సరే వెంటనే దాన్ని వ్యక్తీకరించకపోతే తరువాత వాటి ప్రభావం పెద్దగా ఉండదు. అందుకే కోపం వచ్చినప్పుడు తమాయించుకోడానికి పది అంకెలు లెక్కబెట్టమంటారు. ఇప్పుడు గోపాలరావు పరిస్థితి కూడా అదే.

సాయంత్రం విష్ణు లేచేసరికి సమయం ఐదున్నర. అతను లేచిన పది నిమిషాలకు రాధ కాఫీ తెచ్చిచ్చింది.

బయట కూర్చున్న గోపాలరావును చూసిన విష్ణుకు రాధ తను బయటికి వెళ్ళిన విషయం తండ్రితో చెప్పే ఉంటుందనిపించింది. అయితే అతను ప్రశాంతంగానే ఉన్నాడు. తుఫాను ముందు ప్రశాంతతలా అనిపించలేదు విష్ణుకు.

కొద్దిసేపటి తరువాత లేచి లోపలికి వచ్చిన

మనమీదేనర్రోయ్!

సరసి



గోపాలరావు విష్ణును చూసి "నాతో రా" అంటూ బయటికి నడిచాడు. సందిగ్ధావస్థలో లేచి ఐదు నిమిషాల్లో తయారై అతని వెంట నడిచాడు విష్ణు.

గోపాలరావును చూసిన గ్రామస్థులు మర్యాదగా లేచి నిలబడుతున్నారు. అతని వెంట నడుస్తున్న విష్ణు జాగ్రత్తగా పరిసరాలనూ మనుషులనూ గమనిస్తూ నడుస్తున్నాడు. ఎస్సై అనే మర్యాద, భయం అక్కడున్న అందరి ముఖాల్లో కనిపిస్తోంది.

"నిన్నెందుకు బయటికి వెళ్ళవద్దన్నానో అర్థం చేసుకోవాలి. నేనుగా చెప్పినా ఈ గ్రామస్థులు ఎవరూ నిన్ను మా బంధువంటే నమ్మరు. పోలీసు వాడి కిందే జమ కట్టేస్తారు. అందుక్కూడా కారణం ఉంది. గత సంవత్సరం కొన్ని సంఘటనలు జరిగాయి ఇక్కడ. వాటి ఫలితంగా చాలా మంది పోలీసు అధికారులు ఇక్కడికి వచ్చి వెళ్ళారు. నేను పోలీసు ఉద్యోగం చేస్తున్న కారణంగా వచ్చిన ప్రతీ అధికారి మా ఇంట్లోనే మకాం వేశాడు. చెప్పకోగూడదు గానీ వాళ్ళు వెళ్ళిన తరువాత గ్రామస్థులతో నాకు విపరీతమైన గొడవలు జరిగాయి. దాదాపుగా గ్రామం మొత్తం నాకు ఎదురు తిరిగింది. అధికారులైనంత మాత్రాన వయసుకు వచ్చిన అమ్మాయి ఇంట్లో ఉండగా, పరాయి వాళ్ళను ఇంట్లో ఎలా ఉంచుకుంటావని గ్రామస్థులంతా ఒక్క గొంతుతో అడిగారు. అంతేకాదు, తరువాత కూడా వాళ్ళ నోటికొచ్చినట్టు మా అమ్మాయిని గురించి తప్పుగా మాట్లాడారు".

విష్ణుకు విషయం కొంచెం అర్థమైంది. కన్న తండ్రి మనసులో ఆవేదన అది. అందులోనూ రాధ తల్లిలేని పిల్ల. ఎంతైనా ఆడపిల్ల విషయంలో కన్నతల్లిలా జాగ్రత్తలు తీసుకోలేడు.

"అంతేకాక వాళ్ళు మాట్లాడిన మాటలకు తగినట్టుగా ఒకరిద్దరు అధికారులు అమ్మాయి పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. మా అమ్మాయి వాళ్ళకు దీటుగా జవాబిచ్చినా బహుశా సమస్యను అంతదూరం తీసుకురావల్సింది కాదని తరువాత అనిపించింది. అయితే అప్పటికే ఆలస్యం జరిగిపోయింది. అవమానాల పాలైన అధికారులు తమ పరువు కాపాడుకునేందుకు గ్రామంలో తమకు చేతనైనంతలో అమ్మాయి గురించి దుష్ప్రచారం చేశారు. అప్పుడు గానీ గ్రామస్థుల మాటలు నేను అర్థం చేసుకోలేక పోయాను. ఇప్పుడు విషయమేమిటో బాగా అర్థమైందనుకుంటాను" అంటూ ఆపాడు.

"సారీ అంకుల్. ఇది ముందుగా చెప్పి ఉంటే అసలు నేను ఇక్కడ దిగేవాణ్ణే కాదు గదా. ఇప్పటికీ మించిపోయింది లేదు. నేను అరకు వెళ్ళి అక్కడేదైనా గది చూసుకుంటాను" అన్నాడు విష్ణు.

"ఇప్పుడిక పర్వాలేదు. పరిస్థితి అర్థమైందిగా. ఎలా ఎదుర్కోవాలో అది కూడా తెలిసిందనుకుంటాను. ఇప్పుడిక నాకే దిగులూ లేదు. వెనక్కు వెళ్దామా?"

"అంకుల్, ఆ హవేలీ చూడాలనుకుంటున్నాను" అన్నాడు కాసేపాగి మెల్లగా. అతనివంక దిగ్భ్రాంతిగా చూశాడు గోపాలరావు.



కొద్దిసేపు మౌనం తాండవించింది. అడుగులు ముందుకు పడుతున్నాయి కానీ ఆలోచనలు తెగడం లేదు గోపాలరావుకు.

కాసేపటికి చిన్నగా నిట్టూర్చి "నేనింతకు మునుపు చెప్పిన 'సంఘటనలు' ఆ హవేలీకి సంబంధించినవే. అందువల్ల అక్కడికి వెళ్ళక పోవడమే మంచిది. నువ్వు నీ చదువు ముగించుకుని పరీక్షలేవో రాసి పాసయ్యే మార్గం చూసుకో. అనవసరంగా లేనిపోని గొడవల్లో చిక్కుకోవద్దు. తర్వాత మీ వాళ్ళకు నేను సమాధానం చెప్పకోవాల్సి వస్తుంది" అన్నాడు గోపాలరావు సాధ్యమైనంత శాంతంగా.

అయితే అతని మాటల్లోనే అతను ఎంతో అశాంతిగా ఉన్నట్టు పసిగట్టాడు విష్ణు. ఎలాగైనా సాధ్యమైనంత త్వరలో ఆ హవేలీలోకి ప్రవేశించాలన్న కోరిక అతని మనసులో అంతే గాఢంగా బలపడింది.

"సరే పదండి" అంటూ వెనక్కు తిరిగాడు విష్ణు. అతని దృష్టి మాత్రం ఆ హవేలీ మీదే ఉంది. మళ్ళీ మళ్ళీ వెనక్కు తిరిగి చూస్తూ ముందుకు అడుగులు వేశాడతను.

వాళ్ళిద్దరినీ గ్రామస్థులు తదేకంగా చూస్తూ నిలబడ్డారు. కొందరి ముఖాల్లో ఏవో భావాలు కదలాడుతున్నాయి. వాటిని వ్యక్తపరచలేని పరిస్థితుల్లో చిత్తరువుల్లా నిలబడి చూడ్డం తప్ప మరేమీ చెయ్యలేకపోయారు. ఇల్లు చేరుకునే సరికి చీకటిపడింది.

"రాత్రి కిటికీ తలుపులు తెరవొద్దు. ఇది నీ మంచికోసమే" అన్నాడు గోపాలరావు.

అర్థం కాలేదు విష్ణుకు. కారణం అడగదల్చుకోలేదు. 'ఇతను ప్రతి విషయానికీ ప్రతిబంధకాలు కల్పిస్తున్నాడు. మరీ ఇన్ని కట్టుబాట్లా? ఇక ఏ మాటలూ వినగూడదు. ఏం చేసినా ప్రయోగాలే. ప్రాక్టికల్‌గా చేసిచూసి తెల్సుకోవడమే' అని నిర్ణయించేసుకున్నాడు.

రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రకు ఉపక్రమించే ముందు విష్ణు ఆ గ్రామంలో తన మొదటిరోజు అనుభవాలు ఒక చిన్న పుస్తకంలో రాసుకున్నాడు.

గది తలుపులు మూసిన తరువాత మెల్లగా కిటికీ తలుపులు తెరిచాడు.

బయట చిమ్మచీకటిగా ఉంది. కాసేపటికి కొద్దిగా వెలుతురు ఉన్నట్టు కనిపించింది. వెంటనే గదిలో లైటు ఆర్పేశాడు. అప్పుడు బయట ఏముందో స్పష్టంగా కనిపించింది. వెండి వెన్నెల్లో దూరంగా కాస్త మసగ్గా కనిపిస్తోంది హవేలీ.

ఇంటి చుట్టుపక్కల మరే ఇళ్ళూ లేవు. ఆ వీధిలో అదే చివరి ఇల్లు. ఆ వీధి అక్కడితో అంతమౌతుంది. పక్కన అంతా జిల్లేడు, బ్రహ్మజెముడు చెట్లతో నిండినపొదలు. కాస్త దూరంగా రెండు వేపచెట్లు, మరో రెండు మూడు చింత చెట్లు. దూరంగా, హవేలీకి దగ్గరగా, బహుశా... అది మామిడి తోపేమో.

కిటికీగుండా కాసేపు పరిసరాలన్నీ చూసి పడుకున్నాడు విష్ణు. మధ్యాహ్నం నిద్రపోయినందు వల్ల తొందరగా నిద్ర పట్టక పక్క మీద అటూ ఇటూ దొర్లుతున్నాడు.

సుమారు గంటసేపు ప్రయత్నించిన మీదట మగతగా కళ్ళు మూత పడ్డాయి.

సరిగ్గా ఐదు నిమిషాలు గడిచీ గడవక ముందే ఠక్కున మెలకువ వచ్చింది.

దూరంగా ఎక్కడో ఏదో శబ్దం వినిపిస్తోంది. ఎవరో మాట్లాడుతున్నట్టు!

దిగ్గున లేచి కూర్చున్నాడు. శబ్దం సరిగ్గా వినడానికి ప్రయత్నించాడు. దూరంగా కాదు ఎవరో పక్కనే మాట్లాడుతున్న అనుభూతి. కాసేపు అలాగే కూర్చుని మెల్లగా లేచి కిటికీ వద్దకు వెళ్ళి పూర్తిగా నిలబడకుండా మోకాళ్ళ మీద కూర్చుని బయటికి చూశాడు.

(ఇంకావుంది)

మొలకెత్తే కాగితాలు!

కెల్విన్

నోటు పుస్తకంలోని కాగితాలను చించి, వాటితో పడవలు చేసి నీళ్ళల్లో వదులుతున్న చిన్నారికి ఉన్నట్టుండి ఓ పెద్ద సందేహం వచ్చింది. వెంటనే పరిగెత్తుకుంటూ తల్లి దగ్గరకు వెళ్ళి, "అమ్మా! చెట్టు నుంచి కాగితం తయారు చేస్తారని చెప్పావు కదా! మరి కాగితం నుంచి చెట్టు వస్తుందా? అనడిగింది. ఆ చిన్నారి ప్రశ్నకు ఆ తల్లి జవాబు చెప్పలేకపోయినా, నేను జవాబు చెప్తానంటోంది కృతికాపర్వాల్. కాగితం నుంచి కూడా మొక్కను మొలిపించవచ్చునంటోంది. ఇంతకీ ఏమిటా మొలకెత్తే కాగితాల కథ?

టొమాటో అండ్ కో సంస్థ తయారుచేస్తుందీ కాగితాన్ని! ఇదో నయా తరహా కాగితం. ఈ కాగితంతో తయారుచేసిన గ్రీటింగ్ కార్డయినా, కరపత్రమైనా, క్యాలెండర్ అయినా సరే చెత్తకుండీలో పడేయక్కర్లేదు. వాటిని ఎంచక్కా పెరట్లో నాటితే, అందాల తోట మీ ఇంటి అందాన్ని రెట్టింపు చేస్తుంది. ఆశ్చర్యంగా ఉంది కదూ! కాలుష్యం లేకుండా కాగితాలతో మొక్కలు మొలిపించాలన్న ఆమె ఆలోచనకే పెద్దపెద్ద కంపెనీలు ఫిదా అయ్యాయి మరి.

ఆలోచన వచ్చిందిలా

కృతికాపర్వాల్ పుట్టింది, పెరిగిందీ జైపూర్‌లోనే. రాజస్థాన్ రాజధాని జైపూర్ హస్తకళలకు పెట్టింది పేరు. అక్కడే డిగ్రీ చదివి అమెరికాలో ఎంబీఏ చేసింది. ఎంబీఏ చేసేటప్పుడు ప్రాజెక్టులో భాగంగా వచ్చిన ఆలోచనే ఈ 'మొలకెత్తే కాగితాలు'. ఆమెకు వచ్చిన ఈ ఆలోచనకు స్ఫూర్తి జైపూర్‌లో తయారయ్యే చేతి తయారీ కాగితాలే అని చెప్పవచ్చు. ఆ కాగితాల్లో కాయగూరలూ, పండ్ల విత్తనాలూ ఉంచగలిగితే? కాగితం వాడేశాక దాన్ని నాటి, అందులో నుంచి విత్తనాలు మొలకెత్తేలా చేస్తే! ఈ ఆలోచనే ఆమెను మొలకెత్తే కాగితాలు తయారుచేసేలా చేసింది. వీటినే ప్లాంటబుల్ పేపర్స్ అనీ, సీడ్ పేపర్స్ అని కూడా అంటారు.

అస్సలు అనుకోలేదు

కృతికాపర్వాల్ ఒక రోజు అనుకోకుండా ఓ ఫంక్షన్‌కి వెళ్ళింది. ఆ ఫంక్షనే ఆమె జీవితాన్ని పెద్ద మలుపు తిప్పింది. ఆ ఫంక్షన్లో ఓ పెద్దాయన ఆమెకు పరిచయమయ్యాడు. ఆమెను వ్యాపారవేత్తగా మార్చింది ఆయనే. కిసాన్ కెచప్‌లో పనిచేసే ఆ పెద్దాయన వల్లే ఆమె సెలబ్రిటీగా మారింది. "మా ఉత్పత్తుల ప్రచారం కోసం సీడ్ పేపర్స్ తయారుచేసిస్తారా!" అని ఆ పెద్దాయన అడిగినప్పుడు, వచ్చిన అవకాశం ఎందుకు పోగొట్టుకోవాలనుకుని వెంటనే తన అంగీకారం తెలియజేసింది.

పదిహేను రోజులు సమయం తీసుకుని, రకరకాల ప్రయోగాలతో తొమ్మిది దశల్లో ఆ కాగితాలు తయారుచేసి వాళ్ళకు అందించింది. వాటికి మంచి స్పందన రావడంతో తన ఉత్పత్తులపై కృతికకు నమ్మకం కలిగింది. తొలి ఆర్డర్‌ని డెలివర్ చేశాకే ఆమె తన కంపెనీకి 'టొమాటో అండ్ కో' అని పేరు పెట్టింది.

15 రకాల విత్తనాల కాగితాలు తయారీ

ఈ కాగితాల తయారీ కూడా అంత ఈజీగా అయ్యే వ్యవహారమేం కాదు. కాగితంలో విత్తనం సజీవంగా నిలవాలి. దానికి కృత్రిమ రసాయనాలేవీ వాడకూడదు. సేంద్రియ పద్ధతుల్లో తయారైన కాగితం లేదా కాగితం గుజ్జునే వాడాలి. వాటికి ప్రత్యేక పద్ధతుల్లో శుద్ధి చేసిన విత్తనాలూ, కొన్ని రకాల జిగుర్లూ కలపాలి. పర్యావరణానికి హాని చేయని సహజ రంగులే దీనికి ఉపయోగిస్తారు. ముఖ్యంగా కాగితాన్ని సన్నగా సాఫీగా మార్చేటప్పుడు విత్తనం ఏమాత్రం దెబ్బతినకుండా ప్రత్యేక పద్ధతిలో చేయాలి. మొదట్లో టొమాటో విత్తనాలు మాత్రమే ఈ కాగితాల్లో ఉంచేవాళ్ళు. అవి కాకుండా కాగితం మందంతో కలిసిపోయే ఇతర రకాల విత్తనాలు ఏమున్నాయా? అని ఆలోచించింది కృతిక. మరీ మందంగా ఉంటే, ఆ కాగితం మీద రాయడానికీ, చదవడానికీ, మడతపెట్టడానికీ పనికిరాదు. రకరకాల ప్రయోగాల తర్వాత ప్రస్తుతం పదిహేను రకాల విత్తనాలతో వీటిని తయారుచేస్తున్నారు. మల్లె, తులసి, క్యారెట్, బంతీ, లెట్యూస్, పొద్దుతిరుగుడూ, నిమ్మ, గోధుమలూ, పార్స్లీ, లావెండర్ వంటి విత్తనాలని కాగితాల్లో పెట్టేస్తున్నారు.

డైరీలు, డోర్ ట్యాగులూ

సీడ్ పేపర్స్‌ను కరపత్రాలు, ట్యాగులు, గ్రీటింగ్ కార్డులు, డైరీలు ఇలా ఎన్నింటికో వాడుతున్నారు. వీటిని ఉపయోగించిన తరువాత కుండీల్లో ఉంచి నీళ్ళు పోస్తే చాలు. పది నుంచి పదిహేను రోజుల్లో కాగితాల నుంచి మొక్కలు మొలకెత్తడం ప్రారంభిస్తాయి. సదస్సులు, ఫంక్షన్లు జరిగినప్పుడు ఉపయోగించే తాత్కాలిక ఐడీ కార్డులు, కాఫీ కప్పులు వంటివాటిని కూడా వీటితో తయారుచేస్తే పర్యావరణానికి మేలు కూడా!

-లక్ష్మీనర్మద

కాగితంతో కొత్తగా...

వానాకాలం వస్తే సరదాగా కాగితపు పడవలు చేసి నీళ్ళల్లో వదులుతారు పిల్లలు. కానీ కెల్విన్ నికోల్స్‌కు కాగితాలు ఇస్తే ఒక్క పడవలేంటీ? ఎలాంటి బొమ్మనైనా ఎంతో అందంగా మలుస్తాడు. కాగితాల్ని జీవం ఉట్టిపడే ఆకృతుల్లో తీర్చిదిద్దుతాడు. మట్టి, లోహాలతో చేసిన బొమ్మల్లా కాగితంతోనే బొమ్మలోని అన్ని భాగాలు చేసి కళాఖండాలు తీర్చిదిద్దుతాడు. వీటిని ప్రదర్శనకు పెడితే ఒక్కో బొమ్మ 15 లక్షలకు పైగా పలుకుతుందట! కాగితాలతో రకరకాల జంతువులను తయారుచేసేస్తూ అందర్నీ ఆకట్టుకుంటున్నాడు కెల్విన్.

నన్నొదిలేయండి ప్లీజ్...!

'నేను లాయర్ లక్ష్మణ్‌ని మాట్లాడుతున్నాను. ఓసారి అర్జంటుగా రాగలవా? ప్లీజ్!'.

'వస్తున్నాను' అని సమాధానమిచ్చాడు డిటెక్టివ్ శరత్. ఫోను పెట్టేసి అసిస్టెంట్ రామువైపు చూశాడు.

'లాయర్ లక్ష్మణ్ దగ్గరకు వెళ్తున్నాను. ఏదైనా అవసరం వస్తే నీకు మెసేజ్ పంపుతా' అంటూ బయటకు నడిచాడు శరత్.

శరత్‌ను నేరుగా తన పర్సనల్ రూమ్‌లోకి తీసుకువెళ్లాడు లాయర్. అప్పటికే అక్కడ సోఫాలో ఓ వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతని ముఖంలో భయం, అలసట, వేదన స్పష్టంగా కనబడుతున్నాయి. గడ్డం నెరిసి ఉంది. ఇతడు నా క్లయింట్ వాసుదేవరావు. అతను చెప్పింది విన్న తరువాత మీకు ఫోన్ చేశాను. మీ సలహా అవసరం' అంటూ వివరాలు చెప్పమన్నట్టుగా అతడికి సైగ చేశాడు.

వాసుదేవరావు చెప్పడం ప్రారంభించాడు. 'నేను వ్యాపారిని. నా భార్య పేరు కల్యాణి. మాకు పిల్లలు లేరు. ఈ మధ్య మా ఇద్దరికీ వాసంతి పరిచయమైంది. మా ఇద్దరి మధ్య ఏదో ఉందని ఊహించుకుంటూ నా భార్య బాధపడేది. ఎంత చెప్పినా నమ్మలేదు. వారం క్రితం రాత్రి టీవీ చూస్తుంటే నా గదిలోకి దూసుకు వచ్చి, 'నీ ప్రేయసిని చంపేశాను. ఇవాళ ఆనందంగా, నీకు ఇష్టమైన కూర చేస్తాను' అంది. ఆమె మాటల్ని కొట్టిపారేయొచ్చు. కానీ ఆమె బట్టలనిండా రక్తం, ఆమె ముఖంలో ఎగ్జయిట్‌మెంట్, ఒకరకమైన పైశాచికం. వాసంతిని కొట్టి చంపేసి రోడ్డు మీద పారేశానని చెప్పింది. ఇంటికి వాసంతి కారు తీసుకొచ్చింది. నాకు ఏం చేయాలో తోచలేదు. పోలీసులు వచ్చేలోగా పారిపోవాలి, నా భార్యను రక్షించుకోవాలి అనుకున్నాను. వెంటనే నా పి.ఎ.తో చెప్పి బెంగళూరుకు విమానం టికెట్స్ బుక్ చేయించి, వాసంతి కారులోనే ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాం. కారు అక్కడ వదలిపెట్టి బెంగుళూరు వెళ్లాం. అక్కడి నుంచి రైల్లో మంగుళూరు వెళ్ళాం. మంగుళూరు నుంచి కారులో గోకర్ణం వెళ్ళి అక్కడే ఒక గది అద్దెకు తీసుకున్నాం. కల్యాణిని అక్కడే ఉంచి నేను వెనక్కుతిరిగి వచ్చాను. నేరాన్ని దాచటం పెద్దనేరమే. ఈ కారణంగా నేను మానసిక ప్రశాంతత కోల్పోయాను. కానీ ఇక్కడ మరోవైపు పత్రికలు హత్యకు గురైన మహిళ ఎవరో తెలియరాలేదని రిపోర్ట్ చేశాయి. న్యాయ సలహాకోసం లాయర్ దగ్గరకు వచ్చాను' వణుకుతూ, ఏడుస్తూ చెప్పాడు వాసుదేవరావు. లాయర్‌వైపు తిరిగాడు శరత్. 'ఇందులో నేను చేసేదేమీ లేదు. మీరు పోలీసులకు చెప్పండి' అన్నాడు శరత్.

'చెప్పాను' అన్నాడు లాయర్. అతని మాట పూర్తవుతుండగానే గదిలోకి వచ్చాడు విజయ్.

'నా క్లయింట్ అప్రూవర్‌గా మారాడు. తాను లొంగిపోయి, నేరస్థురాలిని పట్టిస్తున్నాడు. ఇతడి పట్ల సానుభూతిగా వ్యవహరించాలి. భార్యను రక్షించాలనుకుని నేరం దాచాడు. కానీ మనస్సాక్షి ఒప్పుకోక ఆమెను పట్టిస్తున్నాడు. ఇందుకు డిటెక్టివ్ శరత్ సాక్షి' అన్నాడు లాయర్ లక్ష్మణరావు. శరత్ మౌనంగా బయటకు నడిచాడు.

●●●

శరత్ ఆఫీసుకు వెళ్ళాడు ఇన్‌స్పెక్టర్ విజయ్. 'వాసంతి హత్యకేసులో నేరం చేసిన కల్యాణిని పట్టుకోవాలి. అందుకు నీ సహాయం కావాలి' శరత్ ఎదురుగా కూర్చుంటూ అడిగాడు విజయ్.

'అదేమిటి? గోకర్ణంలో ఆమెను ఉంచిన హోటల్ అడ్రసు ఇచ్చాడుగా వాసుదేవరావు?'

'మేము వెళ్లేటప్పటికి కల్యాణి ఆ హోటల్ గదిలో లేదు. వాసుదేవరావు వెళ్లినప్పటినుంచీ ఆమె హోటల్‌కి రాలేదట. కానీ ఆమె పేరిట మంగుళూరు నుంచి బెంగుళూరుకు ఏసీ క్లాసు రైల్ టికెట్ బుక్కైంది. కానీ షెడ్యూల్ ప్రకారం ఆమె ప్రయాణం చేయలేదు. ఎంత ప్రయత్నించినా ఆమె ఆచూకీ దొరకడం లేదు' చెప్పాడు విజయ్.

శరత్ చాలాసేపు మౌనంగా ఉండి, 'మరి వాసంతి విషయం ఏమిటి?' అని అడిగాడు.

'వాసంతి డైవోర్సీ. తండ్రితో ఉంటోంది. కల్యాణి, వాసుదేవరావులతో సన్నిహితంగానే ఉండేదని తండ్రి చెప్తున్నాడు. వాళ్లిద్దరూ వాసంతి ఇంటికి వచ్చేవారట' చెప్పాడు విజయ్. వెంటనే రాముని పిలిచాడు శరత్. 'వాసుదేవరావు ఇంట్లో పనివాళ్ళందరినీ ప్రశ్నించి, వివరాలు సేకరించు. నేను వాసంతి తండ్రిని ప్రశ్నిస్తాను' అన్నాడు శరత్.

●●●

'దాంపత్య వైఫల్యం వల్ల వాసంతికి వివాహమంటేనే నచ్చేది కాదు. ఎవరితోనూ స్నేహం చేసేది కాదు. కానీ కల్యాణితో ఎలాగో స్నేహం కుదిరింది. ఆమె భర్తతో వాసంతికి శారీరక సంబంధం ఉందంటే నేను నమ్మను. కల్యాణి పొరబడింది' కన్నీళ్లు ఆపుకుంటూ చెప్పాడు వాసంతి తండ్రి.

'కల్యాణి ఎలాంటిది?'

'మంచిది. నా కూతురిని సుత్తితో కొట్టి చంపేంత క్రౌర్యం ఆమెలో ఉందనుకోను. కానీ ఏ మనిషిలో ఎలాంటి రాక్షసుడు దాగున్నారో ఎవరు చెప్పగలరు?'

'సరే. నేనోసారి ఇల్లు చూడవచ్చా?' అడిగాడు శరత్.

'మీ ఇష్టం' అన్నాడాయన.

ఇంట్లోని అణువణువూ వెతికాడు శరత్. బెడ్‌రూమ్ షెల్ఫ్‌లో అడుగున ఉన్న రహస్య అరలో డైరీ దొరికింది.

'నేను దీన్ని తీసుకుంటాను' అడిగాడు శరత్.

●●●

'గోకర్ణప్యాలెస్' ముందు ఆగాడు శరత్. తిన్నగా మేనేజర్ దగ్గరకు వెళ్లాడు. శరత్ ప్రశ్న వినగానే మేనేజర్ రికార్డులన్నీ శరత్‌కు అందించాడు.

'వారిద్దరూ ఎలా ఉండేవారు? ఏదైనా ఉద్విగ్నతలో ఉన్నట్టుండే వారా?' అడిగాడు శరత్.

'లేదండి. రోజూ పొద్దున్నే దైవ దర్శనం చేసుకునేవారు. తరువాత బీచ్ దగ్గర కూర్చునేవారు. మళ్ళీ సాయంత్రం దర్శనం చేసుకుని బీచ్ దగ్గర కూర్చునేవారు.

'ఇద్దరూ కలిసి వెళ్లారా చివరి రోజు?'

మేనేజర్ తల గోక్కున్నాడు. 'గది అయితే ఖాళీ చేయలేదు. ఆ రోజు ఇద్దరూ కలిసి వెళ్లారు. వెనక్కు రాలేదు'.

కాసేపు ఆలోచిస్తూ నిలబడ్డాడు శరత్. విజయ్‌కి

తన భర్తతో అక్రమ సంబంధం పెట్టుకుందన్న కారణంగా ఒక మహిళను హత్యచేసిందో ఇల్లాలు. ఆ నేరం కప్పిపుచ్చేందుకు ప్రయత్నించాడు ఆమె భర్త. ఒక న్యాయవాదిని ఆశ్రయించాడు. ఆ న్యాయవాది డిటెక్టివ్ శరత్‌ను పిలిపించి సహాయం కోరాడు. తన భార్య అమాయకురాలనీ, ఎలాగైనా ఆమెను కాపాడాలనీ శరత్‌ను వేడుకున్నాడు ఆ భర్త. సాక్ష్యాలు సంపాదించి నేరస్థుల్ని పట్టించే డిటెక్టివ్ ఈ కేసులో ఏం చేశాడు?

ఫోను చేశాడు.

'వాసుదేవరావుతో పాటు ఆమె కూడా మంగుళూరు వచ్చిందట. మామూలుగా అయితే, ఆమె అతన్ని రైలెక్కించి హోటల్‌కు వెళ్లిపోవాలి. కానీ వాసుదేవరావు రైలు ఎక్కేశాక ఆమె ఎటు వెళ్లిందో తెలియటం లేదు' చెప్పాడు విజయ్.

ఇంతలో రాము ఫోన్ చేశాడు. బాస్... పని వాళ్ళు చెప్పిన ప్రకారం వాసుదేవరావు, కల్యాణి లది అన్యోన్య దాంపత్యం. కల్యాణి చాలా మంచిది. ఆమె హత్య చేసిందంటే ఎవ్వరూ నమ్మట్లేదు' చెప్పాడు రాము.

చాలాసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు శరత్. నేరుగా మంగుళూరు పోలీసు అధికారి వద్దకు వెళ్లాడు. తనని పరిచయం చేసుకున్నాడు.

కల్యాణి ఫోటో చూపించి, 'ఇటీవలి కాలంలో గుర్తు తెలియని మహిళ శవం ఏదైనా దొరికిందా?' అని అడిగాడు.

అధికారి ప్యూన్‌ని పిలిచి 'ఇతడిని పాండ్యన్ దగ్గరకు తీసుకువెళ్లు' చెప్పాడు.

కల్యాణి ఫోటో పరిశీలనగా చూశాడు పాండ్యన్. 'గుర్తు తెలియని శవాలు బోలెడు దొరుకుతుంటాయి. కానీ ఈ ఫోటోలోని అమ్మాయి పోలికలు ఉన్న శవం ఒకటి ఒడ్డున దొరికింది. కొన్నాళ్లు చూసి అనాథ సంస్కారం చేశాం.

శవం ఫోటోలు అందించాడు.

ఫోటోలు చూశాక విజయ్‌కి ఫోన్ చేశాడు శరత్.

•••

'ఆ ఈ అమ్మాయి ఇంకెవరితోనో వచ్చి మా రిసార్టులో ఉంది.' చెప్పాడు మేనేజర్.

'ఇతడితోనా?' వాసుదేవరావు ఫోటో చూపించాడు శరత్.

ఫోటోను పరిశీలనగా చూసి తల అడ్డంగా తిప్పాడు మేనేజర్. ఇతన్ని చూసినట్టు లేదు.

అటునుంచి తిన్నగా రైల్వే అధికారుల దగ్గరకు వెళ్లాడు శరత్.

'మీరు అడిగిన వ్యక్తి మీరు చెప్పిన తేదీల్లో రైల్లో ప్రయాణించలేదు' అని శరత్‌కు చెప్పారు అధికారులు. తర్వాత విమానాశ్రయానికి కూడా వెళ్ళి అదే సమాచారం అడిగాడు.

'మీరు చెప్పిన పేరున్న వ్యక్తి విమానంలో ప్రయాణించాడు' అది విని సంతోషంగా నవ్వాడు శరత్.

•••

తలుపు తెరచి విజయ్, శరత్‌లను చూసి ఆహ్వానించాడు వాసుదేవరావు.

'కల్యాణి ఆచూకీ తెలిసిందా?' ఆత్రంగా అడిగాడు.

'తెలిసింది, మిమ్మల్ని రైలు ఎక్కించిన తరువాత ఆమె గోకర్ణం వెళ్ళలేదు. ఒక వ్యక్తితో కలిసి మంగుళూరు బీచ్ దగ్గర రిసార్టులో ఉంటోంది' చెప్పాడు శరత్.

'ఇంపాజిబుల్. కల్యాణి అలాంటిది కాదు' అన్నాడు వాసుదేవరావు.

'వాసుదేవరావు అలాంటి వాడా?' అడిగాడు శరత్.

అతడు కంగు తిని, 'అంటే అర్థం ఏమిటి?' అని కోపంగా అడిగాడు.

వాసంతి డైరీ తీసి టేబిల్‌పై పెట్టాడు శరత్. 'ఇది వాసంతి డైరీ. మీరు తన వెంటపడుతున్నారనీ, మిమ్మల్ని ఎలాదూరం పెట్టాలో తెలియటం లేదనీ, కల్యాణిని బాధ పెట్టటం ఇష్టం లేదనీ డైరీలో రాసుకుంది'

'అబద్ధం' అరిచాడు వాసుదేవరావు.

'మంచి కథ అల్లి నేరం కల్యాణి మీదకు నెట్టావు. నిన్నెవరూ పట్టుకోలేరనుకున్నావు' అన్నాడు శరత్.

'నాకేం తెలియదు. వాసంతిని హత్య చేశానని కల్యాణి స్వయంగా నాతో చెప్పింది' అన్నాడు వాసుదేవరావు.

'కానీ కల్యాణి మాతో మరో రకంగా చెప్పింది. నిన్ను దగ్గరకు రానీయలేదన్న కోపంతో వాసంతిని నువ్వు కొట్టి చంపావని, ఇంటికివచ్చి ఈ విషయం నీ భార్యతో చెప్పి పోలీసుల నుంచి పారిపోయేందుకు ఆమెను తీసుకుని మంగుళూరు వచ్చావని చెప్పింది'.

'ఎప్పుడు చెప్పింది?'

'నేను మంగుళూరు నుంచి తిన్నగా వస్తున్నాను'

'కల్యాణి బ్రతికే ఉందా?'

'బ్రతికే ఉంది. ఆమెను నువ్వు చంపి సముద్రంలోకి తోసినా, ఇంకా ఎలా బ్రతికి ఉందని ఆలోచిస్తున్నావా? నీ నేరం నిరూపించడం కోసమే ఆమె ఇంకా బ్రతికి ఉంది' అన్నాడు శరత్.

ఏడవటం ఆరంభించాడు వాసుదేవరావు. 'ప్లీజ్. నన్నొదిలేయండి. నేను వాసంతి మీద మోజు పడ్డాను. ఆమె ఒప్పుకోలేదు. ఆవేశం తట్టుకోలేక చంపేశాను. కల్యాణిని తీసుకుని పారిపోయాను. నిజం తెలిసిన కల్యాణి పోలీసులకు లొంగిపొమ్మని చెప్పింది. నేను లొంగిపోకపోతే తానే పోలీసులకు అప్పగిస్తానంది. అందుకనే....!

నాకు జైలుకు వెళ్లాలని లేదు. పొరపాటైంది. క్షమించండి' ఏడుస్తున్న వాసుదేవరావు వైపు చూసి బయటకు నడిచాడు శరత్. అతడిని అరెస్టు చేయటానికి ముందుకు నడిచాడు విజయ్.

-కస్తూరి మురళీకృష్ణ

సెల్: 98496 17392



సారంగం

రామా చంద్రమౌళి

కల భళ్ళున చిట్లి చెదిరిపోయింది.

నల్లని ఒక మహాబిలంలో నుండి చిక్కని చీకటిని చీల్చుకుంటూ, తెల్లగా వందల వేల సంఖ్యలో బిలబిలమని పావురాల మహోత్సర్గం. విచ్చుకుంటున్న రెక్కల జీవధ్వని. ఒక ధవళ వర్ణార్నవంలోకి పక్షులన్నీ ఎగిరి ఎగిరి... ఆకాశం వివర్ణమై దూరంగా సూర్యోదయమౌతూ బంగారు రంగు, కాంతి జల.

అంతా నిశ్శబ్దం. దీర్ఘ, గాఢ, సాంద్ర నిశ్శబ్దం.

లోపల గుండెల్లో ఏదో మృదు ప్రకంపన. అర్ధచైతన్య, పార్శ్వ జాగృదావస్థలో వినీవినబడని సారంగీ విషాద గంభీర రాగధార.

ఏదో అవ్యక్త వ్యవస్థ, విచ్ఛిన్నమౌతున్నట్టో, లేక సంలీనమై సంయుక్తమౌతున్నట్టో విద్యుత్ప్రవాహమేదో ప్రవహిస్తోంది ఆపాదమస్తకం ఒక తాదాత్మ్య పారవశ్యంలో.

భాష చాలదు కొన్ని అనుభూతులను అనుభవాలుగా అనువదించడానికి. ఫేజెస్, స్థాయి, ఉన్నతి, తురీయత వెరసి భౌతికాభౌతిక ఆవరణలో నిరంతరాన్వేషణ.

వెదుకులాట. ఎడతెగని అనంతశోధన.

జీవితమంటే వెదకడమేనా? వెదకడానికి ఒక అంతమంటూ ఉంటుందా? ప్రశాంతతకోసం వెదకడం, డబ్బుకోసం వెదకడం, సౌఖ్యాలకోసం వెదకడం, మనిషి తనను ప్రేమించే మరో మనిషికోసం వెదకడం, చివరికి అర్థం కాని “ఏదో” కోసం వెదకడం.

ప్రొఫెసర్ బాలసిద్ధ కళ్ళు తెరిచాడు ప్రశాంతంగా.

ఎక్కడినుండో ఊర్ధ్వలోకాల అవతలి నుండి యోజనాల గగన మార్గం ద్వారా ఎండుటాకులా తేలితేలి కిందకు జారిజారి ప్రచలిస్తున్న భూతలంపై వాలిపోతున్నట్టు అనుకంపన వీణ తంత్రి మృదువుగా మోగుతున్నట్టు అనునాదం.

రైలు పరుగెడుతూనే ఉంది. టకటకా టకటకా పట్టాల లయాత్మక ధ్వని.

అరవై ఏడేళ్ళ జీవితం.

తన జీవితం ఒక మూసివేసిన పుస్తకంగా మిగిలి అన్నీ సంక్లిష్టతలే, అన్నీ చీకటి వెలుగులే,

క్రీనీడలే, అన్నీ దాచబడ్డ ఎండిన పూలే.

కిటికీలో నుండి బయటికి చూశాడు బాలసిద్ధ.

రైలు చాలా వేగంగా పోతోంది. కిటికీలో నుండి దూరంగా భద్రకాళి గుడి శిఖరం, తటాకం నీలిగా ఇటు పద్మాక్షమ్మ గుట్టలు.

రైలు కాజీపేట్ దాటి బైపాస్ ట్రాక్‌పై నుండి వరంగల్. నాగపూర్ దాటిన తర్వాత వరంగల్లే. మహావేగం.

చదువు, ఆలోచనలతో కూడిన తెలివితేటలు, డబ్బు, కీర్తి, అన్నీ సంపూర్ణంగా ఉన్నాయా మనిషికి. కానీ ఇంకా దేన్నో వెతుక్కుంటూ బయలు దేరాడు. రైల్లో ప్రయాణం. ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చేసరికి గమ్యం అతడికర్థమైంది. జ్ఞాపకాలు...? బాల్యం నాటి జ్ఞాపకాలు అతన్ని వెంటాడు తున్నాయి. ఆ పరిపూర్ణ మనిషికి నిజమైన సంతృప్తి ఎక్కడ లభిస్తుంది? అతను సేదదీరేదెక్కడ?

వేగం, కాలం, దూరం, పని మహబూబియా హైస్కూల్. వెంకటయ్య సార్ లెక్కలు. ఒక తొట్టిని ఒక పంపు ఒక గంటలో ఖాళీ చేయును. అదే తొట్టిని మరొక పంపు అరగంటలో నింపును. ఆ రెండు పంపులను ఏకకాలంలో ఒక గంటసేపు నడిపించిన తొట్టిలో నీరు ఎంతశాతం నిండును?

ఏక కాలంలో రెండు పనులు, అనేక పనులు వేర్వేరు కాలాలలో విడివిడిగా, ఒకేసారిగా, ఒకరి చేతనే వేర్వేరు వ్యక్తులచే సామూహికంగా ఒంటరిగా.

పని... పని... ఎప్పుడూ పని లెక్కలే.

జీవితంలో ఎంతపని జరిగి ఎంత డబ్బు సంపాదించి, ఎంత సంపదను సంపాదించి, ఎన్ని బ్యాంక్ బ్యాలెన్స్‌లు కూడబెట్టి, ఎన్ని సుఖాలను పొంది, ఎన్ని...?

అన్నీ ప్రశ్నలే... జవాబులేని పరంపరగా ప్రశ్నలు.

ఐతే చివరికేం మిగిలింది అనేది అంతిమం.

ఇప్పుడేం మిగిలింది తన దగ్గర.

ఏరో స్పేస్ ఇంజనీరింగ్... రాకెట్ డిజైన్స్ స్పెషలిస్ట్... ఫ్యూయల్ కంపోజిషన్స్ ఎక్స్‌పర్ట్... క్రయోజెనిక్ ఇంజన్స్ రూపశిల్పి. దేశదేశాల్లో ఎనిమిది యూనివర్సిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్. పన్నెండు డాక్టరేట్స్... మూడు పోస్ట్ డాక్టరేట్స్. డిగ్రీలు.. అంతా ఒక అతివిశాలమైన వృత్తి క్షేత్రం.

పదుల సంఖ్యలో తను రాసిన పుస్తకాలు.. ప్రపంచ వ్యాప్తంగా... ఎందరో తన అభిమాన విద్యార్థులు... ఐతే,

మరి ఈ శూన్యం, ఈ వెలితి, ఈ వ్యాకులత ఎందుకు?

రైలు వేగం తగ్గుతోంది. బొందివాగు, హంటర్ రోడ్, రైల్వే గేట్. బాలసిద్ధ తన ఎ.సి కోచ్ సీట్లో నుండి లేచి వెంట ఉన్న ఒకే ఒక బ్రీఫ్‌కేస్‌ను తీసుకుని డోర్‌లోకొచ్చి నిలబడి..

ఎదురుగా గోవిందరాజుల గుట్ట.

సాయంత్రపు నీరెండ పడ్తూ... ధగధగా మెరుస్తూ కొండ పైన గుడి, గుడి శిఖరం.

సంతోషం ఎందుకో పొంగి ఉప్పొంగి బాలసిద్ధను ఉక్కిరిబిక్కిరి చేసింది.

ప్లాట్‌ఫాంపై మైక్‌లో ప్రకటన వినబడ్తోంది "యువర్ అటెన్షన్ ప్లీజ్.."

దిగి చుట్టూ ఒకసారి తేరిపార చూచి,

చిన్నపిల్లాడు పరమానందంతో పొంగి పోతున్నట్టు పులకింత.

వెళ్ళాలి.

అటే. గోవిందరాజుల గుట్టపైకి. ఎప్పటినుండో మనసులో, ఆత్మలో నిక్షిప్తమై ఉన్న కోరిక బయటకు వచ్చి, ఓ ఆటో మాట్లాడుకుని.

స్టేషన్‌కు ఎడమవైపుకు తిరిగి..

వరంగల్లును విడిచి ఇరవై ఎనిమిదేళ్ళు.

చాలా మారిపోయింది నగరం.

ఐదు నిమిషాలు.. కుడివైపు తిరిగి దేవీ థియేటర్ అని ఒక హోర్డింగ్, కుడివైపు ఒక ఆర్చ్. దేవాలయానికి దారి. టైం చూసుకున్నాడు బాలసిద్ధ. నాలుగూ నలభై ఐదు.

అప్పుడు చిన్నప్పుడు ఇదే టైముకి వచ్చేవాడు తను ఈ గుట్టపైకి. అక్కడి మంటపం కుడి దిక్కు మెల్లగా రాతి సొరికెలోకి దూరి.

మెట్లెక్కుతున్నాడు ఒక్కొక్కటి. పైకి ఎన్నోమెట్లు. ఓ నలభై ఉంటాయేమో.

పైకి పోతున్నకొద్దీ కిందివన్నీ చిన్నగా అస్పష్టంగా అనిపిస్తాయా?

హమ్మయ్య వచ్చేసింది పైన గుడి మంటపం.

అవే రాతి స్థంబాలు, అదే పైరాతికప్పు, తెల్లగా సున్నం వేసిన పిట్టగోడలు.. పైన వేలాడుతూ కంచు గంట.

ఒకసారి రామనర్సయ్య సార్.. ఆయన సైకిల్‌పై తనను.. డబుల్ సవారి.. ముందు పైప్‌పై కూర్చుండబెట్టుకుని తొక్కుతూ.. బుక్కొల్ల తోట దిక్కు తీసుకుపోతూ.

"ఒరే బాలసిద్ధూ ఎదురుగా చూస్తున్నావు గదా, ఏమి కనబడ్తోందిరా నీకు" అనడిగాడు యధాలాపంగా.

పరిశీలనగా చూచి చెప్పడం ప్రారంభించాడు తను. "దూరంగా అజంజాహి మిల్లు, ఆపైన చిమ్నీ గొట్టం, ఇరుప్రక్కలా గుంపులు గుంపులుగా చెట్లు, ఆ వైపు కరెంటు స్థంభాలూ, దూరంగా మేస్తున్న బర్రెలు' అని.

'ఇంకా.."

"ఇంకేముంది సార్. ఏమీ లేదంతే" అన్నాడు తను తడుముకోకుండా.

"బాగా చూచి చెప్పు".

"ఇంకేమీ లేద్సార్".

"నే చెప్పనా.."

"మౌనం..',

"పైన ఎదురుగా విశాలంగా పరుచుకుని అనంతాకాశం".

అప్పుడు చూశాడు తను. విశాలాకాశాన్ని.

నిజమే. మనుషులనీ, ఈ సకల చరాచర జగత్తునీ కమ్ముకుని ఆవహించి నిశ్శబ్దంగా వ్యాపించి ఉన్న వినీలాకాశం.

వెనక్కి తిరిగి సార్ కళ్ళలోకి చూశాను.

సార్ కళ్ళు కూడా ఆకాశం వలెనే లోతుగా నిండుగా ఆర్ద్రంగా దయతో... కరుణనిండి.

ఎందుకో కన్నీళ్ళొచ్చాయప్పుడు. అర్థం కాలేదు ఎందుకో.

పైకి చేరి చుట్టూ చూశాడు ప్రొఫెసర్ బాలసిద్ధ. ఎవరూ లేరు గుట్టపై.

తనకు చిన్నప్పుడు పరిచయమున్న కుడి దిక్కు రాతి గుండువైపు నడిచాడు. సొరికె. అదే సొరికె... నల్లగా చీకటి.

మెల్లగా లోపలికి తొంగి చూచి మెల్లగా దిగి అడుగులు వేసుకుంటూ, ఒకటి.. రెండు.. పదడగులు.. భళ్ళున వెలుతురు చిమ్ముకొచ్చి ఒక ఓపెనింగ్.

అక్కడే తను కూర్చుని ప్రతి వేసవి కాలం సంవత్సరం పరీక్షలప్పుడు చదువుకునేది పగళ్ళు.

జ్ఞాపకాలు. ముసిరే జ్ఞాపకాలు. మనస్సు నిండా కురిసే జ్ఞాపకాలు, పులకింతగా.

కూర్చున్నాడు రాతినేలపైన ఒక గుండుకు ఒరిగి, తృప్తిగా ఊపిరి పీల్చుకుని, కళ్ళు మూసుకుని.

కాలం లోలకమై, అటూ ఇటూ ఊగి తూగి కంపిస్తూ... నిశ్శబ్దిస్తూ.

పది నిమిషాల తర్వాత బాలసిద్ధ కళ్ళు తెరిచాడు.

ఎదురుగా కింద చిన్నగా వ్యాపించిన నగరం. పైన అతి విశాలంగా ఆకాశం.

బాలసిద్ధకు ఆ క్షణం ఒక్క ఆకాశం తప్ప ఇంకేమీ కనబడ్డం లేదు. ఒక్క ఆకాశమే సృష్టంతా వ్యాపించి ప్రశాంతంగా.

సెల్: 93901 09993

93

సీతశోకం:రాముని దుఃఖం

అంగదరాయబారం ఫలించలేదు. యుద్ధాన్ని ప్రకటించాడు రాముడు. రామదండు లంకపై దాడి చేసింది. రాక్షసులు లక్షల్లో మరణించారు. అందుకు ఆగ్రహించాడు ఇంద్రజిత్తు. యుద్ధరంగంలోకి ప్రవేశించాడు. రాత్రిపూట యుద్ధంలో అజేయంగా నిలిచాడు. మాయా యుద్ధానికి పూనుకున్నాడు. నాగాస్త్రాన్ని ప్రయోగించాడు. సర్పాకారం కలిగిన ఇంద్రజిత్తు పదునైన బాణాలు రామలక్ష్మణులను తీవ్రంగా బాధించాయి. మర్మస్థానాలకు గురిపెట్టి వదిలిన అతని బాణాలకు రామలక్ష్మణులు స్పృహ కోల్పోయారు. నేలపై కూలిపోయారు. వారిని చూసి సుగ్రీవాది ప్రముఖులు విలపించారు. విభీషణుడు చెప్పిన మీదట రక్షణకవచంగా ఏర్పడి వానరులంతా రామలక్ష్మణులను రక్షించసాగారు.

రఘువీరులను మృత్యుముఖంలో ఉంచి, రాక్షస వీరుల జయజయధ్వానాలు అందుకున్నాడు ఇంద్రజిత్తు. యుద్ధాన్ని చాలించాడు. కోలాహలంగా నగరానికి చేరుకున్నాడు. తండ్రిని కలిశాడు. నాగపాశాలతో రామలక్ష్మణులను బంధించానంటూ యుద్ధరంగంలో జరిగిందంతా తండ్రికి వివరించాడతను. రామలక్ష్మణులు కళ కోల్పోయారని, కొన ఊపిరితో ఉన్నారని చెప్పాడు.

"ఏదీ ఆ మాట మరొక్కసారి చెప్పు?" అడిగాడు రావణుడు. సింహాసనం నుంచి లేచి నిల్చున్నాడు.

"రామలక్ష్మణులు కళ కోల్పోయారు. కొన ఊపిరితో ఉన్నారు." చెప్పాడు ఇంద్రజిత్తు. ఆ మాట ఘంటారావంలా వినవచ్చింది రావణునికి. ఒక్క ఉదుటన ఇంద్రజిత్తును సమీపించాడు. గట్టిగా కౌగిలించుకున్నాడతన్ని.

"శభాష్! గొప్పమాట! నేను కోరుకున్న మాట చెప్పావు." అన్నాడు. ఇంద్రజిత్తు శిరసుని ఆఘ్రాణించాడు. అతని నుదుటన ముద్దుపెట్టాడు.

"చెప్పు! వీనుల విందైన నీ యుద్ధతంత్రాన్ని అంతా ఒకటొకటిగా వివరించు." అడిగాడు రావణుడు. తండ్రి కోరినట్టుగానే తన యుద్ధతంత్రాన్నంతా వివరించి, అక్కణ్ణుంచి నిష్క్రమించాడు ఇంద్రజిత్తు. తన మందిరం వైపు నడిచాడు. అతని నడకనూ, ఆ నడకలో వీరత్వాన్నీ గమనించి ఆనందించాడు రావణుడు. తర్వాత మంత్రివర్గాన్ని ఆదేశించాడిలా.

"రామలక్ష్మణులు కళ తప్పారు. మృత్యుముఖంలో ఉన్నారన్న వార్త లంక నాలుగు వైపులా చాటింపు వేయండి. అలాగే ఆ మాటని అశోక వనంలో సీత వినేట్టుగా చెప్పండి. కావాలంటే రాక్షసస్త్రీలు తోడుగా పుష్పకవిమానాన్ని ఎక్కి, ఆ చవట రాముణ్ణీ, వాడి తమ్ముడు లక్ష్మణుణ్ణీ చూసి రమ్మనండి. వెళ్ళండి."

రాజాజ్ఞను తు.చ.తప్పలేదు మంత్రివర్గం. రావణుడు చెప్పినట్టుగానే చేశారు. రామలక్ష్మణులు మృత్యుముఖంలో ఉన్నారని తెలియగానే సీత ఆందోళన చెందింది. పెద్దపెట్టున ఏడ్చింది.

"ఆఖరి చూపులు చూస్తానంటే వెళ్ళిరా! పుష్పకం నీ కోసం సిద్ధంగా ఉంది." అన్నారు.

త్రిజటసహా సీత పుష్పకాన్ని అధిరోహించింది. ఏడుస్తూ యుద్ధరంగానికి బయల్దేరింది.

పుష్పకంలో ప్రయాణిస్తూ లంకానగరాన్ని చూసింది సీత. నగరం అంతటా పతాకాలు ఎగురుతున్నాయి. రాక్షసులంతా ఉత్సాహంగా ఉండి, తుళ్ళుతున్నారు. పండగవాతావరణం కనిపించిందామెకు. రామదండు విడిసిన చోటుకు చేరుకుని ఆకాశం నుంచి చూడసాగింది. వానరులంతా నిరుత్సాహంగా ఉన్నారు. సన్నగా రోదిస్తూ కనిపించారు. అంత ఎత్తులో విమానంలో ఉండి, రామలక్ష్మణులను వెదుక్కుంది సీత. కనిపించారిద్దరూ. నేలనంటి పడుకుని కనిపించారు. రావణుడు చాటించినట్టుగానే ఇద్దరూ కళ తప్పి ఉన్నారు. జీవం లేని బొమ్మల్లా ఉన్నారు. ఇప్పుడో అప్పుడో పోయేట్టుగా ఉన్నారు. సన్నగా శ్వాస పీలుస్తున్నారు. వారి పక్కగా ధనుస్సులూ, అమ్ముల పొదులూ పడి ఉన్నాయి.

"అయ్యో" అంది సీత. నెత్తి కొట్టుకుంది. కన్నీరు కార్చింది.

"ఎంత ఘోరం? ఎంత ఘోరం? మహావీరులు మట్టికరిచారంటే తట్టుకోలేకపోతున్నాను. నేను లంకలో ఉన్నానని తెలుసుకున్నారు, నాకోసం సముద్రంపై వంతెన నిర్మించారు. మహాసైన్యంతో యుద్ధానికి తలపడ్డారు. సముద్రం అంతా దాటి, ఒడ్డుకు చేరి విజయోత్సవవేళ చిన్న గుంటలో పడి ప్రాణాలు పోగొట్టుకున్నట్టు, ఇంద్రజిత్తు మాయాయుద్ధంలో చనిపోయారా నా రామలక్ష్మణులు! అయ్యో! వరుణ, వాయవ్య, ఇంద్రాస్త్ర, బ్రహ్మాస్త్ర, బ్రహ్మశిరోనామ మహాస్త్రాల్లో ఇద్దరూ మహాపండితులే! ఈ పండితుల్ని ఏ ఒక్క అస్త్రమూ కాపాడలేకపోయిందా? ఇంద్రజిత్తుకు కాలం కలిసొచ్చింది. నా వాళ్ళకు కలసి రాలేదు. పైగా పొట్టన పెట్టుకుంది." అంది సీత. గుండెలు బాదుకుంది.

"నా పాదాల్లో పద్మరేఖలు ఉన్నాయన్నారు. అవి శుభలక్షణాలన్నారు. నేను రాజాధిరాజు పత్నిగా పట్టాభిషిక్తురాలనవుతాననీ, నాకు వంశోద్ధారకులైన ఇద్దరు కొడుకులు జన్మిస్తారనీ అన్నారు. నా భర్త నూరు యజ్ఞాలు చేస్తారన్నారు. అవన్నీ అబద్ధాలేనా? కావాలనే జ్ఞానులు అబద్ధాలు చెప్పారా? నా శరీరం మాణిక్యకాంతితో వెలిగిపోతున్నదనీ, నా పలువరుసలో సందుల్లేవనీ, నా తలవెంట్రుకలు నునుపైనవనీ, నా పాదాల వేళ్ళన్నీ నేలను అంటుకుంటాయనీ, కనుబొమలు ఎడమైనవనీ, కళ్ళూ, కణతలూ, కాళ్ళూ, చేతులూ బలమైనవనీ, నా గోళ్ళు నునుపుగా గుండ్రంగా ఉంటాయనీ, అరికాళ్ళూ, అరిచేతులూ ఎర్రగా మెరిసిపోతుంటాయనీ... ఇవన్నీ శుభలక్షణాలనీ, వీటన్నిటివల్లా నేను సౌభాగ్యవతినై వర్ధిల్లుతానన్నారు సాముద్రికవేత్తలు. వారు కూడా అన్నీ అబద్ధాలే చెప్పారా? లేదంటే...ఈ శుభలక్షణాలేవీ నాలో లేవా?

లేవేమో! లేకపోబట్టేనేమో! నేనింత దౌర్భాగ్యురాలినయ్యాను. నేనే ఇంతగా దుఃఖిస్తున్నానే, తన ఒక్కగానొక్క కొడుకూ, ముద్దులకొడుకూ రామచంద్రుడు మరణించాడంటే ఆ కౌసల్యాసాధ్వి ఏమవుతుందో? ఎంతగా దుఃఖిస్తుందో?" అంది సీత. పుష్పకం స్తంభానికి తల బాదుకుని రోదించసాగింది.

తట్టుకోలేని దుఃఖం, ఓదార్చలేనితనం, త్రిజటకి ఏం చెయ్యాలో తోచలేదు. ఏడుస్తున్న సీతను చూసి చూసి, ఎందుకో రామలక్ష్మణులను పరిశీలనగా చూడాలనిపించడంతో వారిని తదేకంగా చూసింది త్రిజట. రఘువీరుల ముఖలక్షణాలను జాగ్రత్తగా గమనించింది. ఆశలు రేకెత్తాయామెకు.

స్తంభానికి తల బాదుకుంటున్న సీతను వారించింది.

"అమ్మా" అంది.

"తల్లీ! నేనింత వరకూ ఒక్క అబద్ధం ఆడలేదు. ఇక ముందు కూడా ఆడను. నువ్వంటే నాకు చాలా ఇష్టమమ్మా! నీ పవిత్రత, నీ మైత్రీ, నీ పాతివ్రత్యాలకు నేను చేతులెత్తి నమస్కరిస్తాను. నీలాంటి ఆడది ఇక ఈ భూలోకంలో పుట్టదూ, పుట్టబోదు. అందుకే నువ్వంటే నాకు ఇష్టం తల్లీ! పిచ్చి ఆరాధన. ఏడుపాపు! దయచేసి నేను చెప్పింది విను." అంది త్రిజట.

ఏడుస్తూనే చెప్పమ్మా అన్నట్టుగా చూసింది సీత.

"అమ్మా! రామలక్ష్మణులు గాఢమూర్ఛలో ఉన్నారే గాని, మరణించలేదు. జాగ్రత్తగా చూడండమ్మా! కళ తప్పిన మాట నిజమేగాని, ఆ ముఖంలో మృత్యుకళ లేదు. సన్నగా శ్వాస ఆడుతోంది. త్వరలోనే కోలుకుంటారిద్దరూ, అందులో అను

మానం లేదు." అంది త్రిజట.

నిజమా? అన్నట్టుగా ఆశగా చూసింది సీత.

"నిజం తల్లీ! ప్రభువు మరణిస్తే సేవకులు నిరుత్సాహులూ, యత్నహీనులూ అవుతారు. ఇక్కడ సేవకుల్లో ఆ దుర్లక్షణాలే లేవు. గమనించండి! పైగా వారంతా నిర్భయులై శత్రువుల్ని ఎదిరించేందుకు చెట్లూ, రాళ్ళూ ధరించి నిల్చున్నారు." అంది త్రిజట.

అవునవును అనుకున్నది సీత.

"వీటన్నిటికంటే రామలక్ష్మణులు మరణించ లేదని చెప్పడానికి అద్భుతమైన సాక్ష్యం ఒకటి ఉంది. అదేమిటో తెలుసా తల్లీ?" అడిగింది త్రిజట.

తెలియదు అన్నట్టుగా తలూపింది సీత.

"ఈ పుష్పకమే ఆ అద్భుతమైన సాక్ష్యం. దివ్యశక్తి కలిగిన ఈ విమానం మృతిచెందిన వారిపై నిలువదు తల్లీ, తప్పుకుంటుంది." అంది త్రిజట.

ఆ మాటకి పట్టలేని ఆనందంతో చేతులు జోడించి త్రిజటకు నమస్కరించింది సీత.

"తల్లీ! నువ్వన్నట్టుగానే రామలక్ష్మణులు బతికి ఉంటే నాకంతకంటే కావాల్సింది లేదు. అలాగే జర గాలని వేనవేల దేవుళ్ళకు మొక్కుకుంటున్నాను." అంది సీత. త్రిజటను దగ్గరగా తీసుకుని కౌగిలించుకుంది.

పుష్పకం వెను తిరిగింది. అశోకవనం చేరు కుంది. రాక్షసస్త్రీలు సీతను యథాస్థానంలో కూర్చో బెట్టారు. కూర్చోగానే రఘువీరుల క్షేమాన్ని ఆశిస్తూ సీత ధ్యానం ప్రారంభించింది.

కాసేపటికి రాముడు ఇక్కడ తేరుకున్నాడు. మేల్కొన్నాడు. కళ్ళు విప్పి చూశాడు. చుట్టూ కాపలాగా ఉన్న వానరవీరుల్ని చూసి, తర్వాత తమ్ముడు లక్ష్మణుడేడి? అని పక్కనేపడి ఉన్న లక్ష్మణుణ్ణి గమనించాడు. రక్తం ధారలు కట్టి, ఒళ్ళంతా చిల్లులతో ఉండి, స్పృహ కోల్పోయిన లక్ష్మణుణ్ణి చూసి తట్టుకోలేకపోయాడు రాముడు. భోరుమన్నాడు.

రామలక్ష్మణులు మృత్యుముఖంలో ఉన్నారని తెలియగానే సీత పెద్ద పెట్టున ఏడ్చింది. పుష్పక విమానంలో ప్రయాణిస్తూ రాక్షసుల ఉత్సాహాన్నీ, రామదండు నిరుత్సాహాన్నీ గమ నించింది. కళతప్పి పడిఉన్న రామలక్ష్మణులను చూసి కన్నీరు కార్చింది. తనలో ఎన్నో శుభలక్షణాలున్నాయని సాముద్రికవేత్తలు చెప్పినవన్నీ అబద్ధాలేనా? అని వాపోయింది. తలబాదుకుని రోదిస్తున్న సీతను ఓదార్చిన త్రిజట ఆమెకు ఏమని చెప్పింది?

"లక్ష్మణా! నేనెంత పాపిని కాకపోతే, నిన్ను ఇలా ఈ స్థితిలో చూస్తాను? నీలాంటి సోదరుణ్ణి కాపాడలేని ఈ అశక్తునికి సీతే కాదయ్యా, ఈ లోకమే అక్కర్లేదు. భూమండలాన్ని వెదికితే సీత లాంటి రమణీమణి దొరకవచ్చేమోగాని, నీలాంటి బుద్ధిశాలీ, శూరవరేణ్యుడూ తమ్ముడిగా దొరకడు గాక దొరకడు." అన్నాడు రాముడు. లక్ష్మణుని ఒడిలోనికి తీసుకున్నాడు.

"లక్ష్మణా! నేనెన్నడూ నిన్ను కసిరికొట్టలేదు. కోపగించుకోలేదు. ఒకవేళ నేను కోపగించుకున్నా, బదులు చెప్పనివాడివయ్యా నువ్వు. బదులు చెప్ప డమే కాదు, కనీసం ముఖం కూడా చిట్లించుకున్న పాపాన పోలేదు నువ్వు. కార్తవీర్యార్జునుణ్ణి కూడా ఎదిరించి, గెలువగలిగిన నువ్వు నేల కూలావే... నేనెంత దురదృష్టవంతుణ్ణి?" లక్ష్మణుని ముఖంలో ముఖం పెట్టి దుఃఖించసాగాడు రాముడు.

"అన్నా అంటూ నాతో అడవులకు వచ్చావు. నాతో పడరాని పాట్లు పడ్డావు. ఇప్పుడిలా ఒంటరిగా వీర స్వర్గం చేరుకుని నన్ను ఒంటరిని చేస్తావా? నీకిది న్యాయంగా ఉందా?" లక్ష్మణుణ్ణి ప్రశ్నించాడు రాముడు.

"కష్టాలు గట్టెక్కి రేపు నేను అయోధ్యకు వెళితే లక్ష్మణుడేడి? అని అడిగిన వాళ్ళకు సమా ధానం ఏం చెప్పను? నా లక్ష్మణుడేడి రామా? అని పరిగెత్తుకువచ్చిన తల్లి సుమిత్రకు ఏం చెప్పి అనునయించగలను? నీకు తోడుగా ఉంటా డని నీతో లక్ష్మణుణ్ణి అడవులకు పంపానయ్యా! నువ్వేమో వాణ్ణి మృత్యుదేవతకు అప్పజెప్పి వచ్చావా? ఇదేం న్యాయంవయ్యా అంటే నేనేం కావాలి? తమ్ముణ్ణి కాపాడుకోలేని వీరుడూ ఒక వీరుడేనా? అని పురజనులు అంటే బతికి లాభం ఏమిటి?" తనని తానే ప్రశ్నించుకున్నాడు రాముడు.

"విభీషణుణ్ణి లంకారాజ్యానికి రాజు చేస్తానన్న ప్రతిజ్ఞ తప్పుతున్నాను. క్షమించు విభీషణా! నన్ను క్షమించు. లక్ష్మణుడు లేని నేను లేను. నాకు బతకాలని లేదు. వెళ్ళిపోతున్నాను, నేనూ లక్ష్మణునితో పాటుగా అమరలోకాలకు వెళ్ళిపోతు న్నాను, నన్ను అడ్డుకోకండి." అన్నాడు రాముడు. అని తనని గమనిస్తూ తల్లడిల్లుతున్న సుగ్రీవుణ్ణి చూశాడు..

"మిత్రమా" అన్నాడు.

"స్వామీ" రాముణ్ణి సమీపించాడు సుగ్రీవుడు.

"మంచిమనసుగల మిత్రుడూ, హితుడూ ఏం చెయ్యాలో ఎంత చెయ్యాలో అంతా నువ్వు నాకు చేశావు. కాకపోతే విధి వక్రించి మనం విడి పోతున్నాం. నువ్విక ఆలస్యం చెయ్యక ఇప్పుడే ఈ క్షణంలోనే అంగద, హనుమ, నల, నీలాది వీరులతోనూ, సైన్యంతోనూ సేతువుదాటి కిష్కిం ధకు పారిపో! ఈ మాట ఎందుకు అంటున్నానం టే...నేను పోయానని తెలిసిన మరుక్షణం రావ ణుడు నిన్ను బతకనీయడు. ఇక్కణ్ణుంచి పారి పోయేందుకు కూడా నీకు అవకాశం ఇయ్యడు." అన్నాడు రాముడు.

సమాధానం ఏం చెప్పాలో తెలియక కన్నీరు పెట్టుకుని నిల్చున్నాడు సుగ్రీవుడు.

"మహావీరులారా! హనుమ, అంగద, గజ, గవాక్షులారా! ప్రాణాలకు తెగించి మీరు నాకు చేసిన సేవలకు ఇదే నా ఆఖరి నమస్కారం! మీకు నేను సర్వదా కృతజ్ఞుణ్ణి. దయచేసి నా మాట వినండి! మీరంతా కిష్కింధకు వెంటనే వెళ్ళిపోండి! ఆలస్యం చెయ్యకండి. వెళ్ళండి." అన్నాడు రాముడు. అందరికీ పేరు పేరునా నమస్కరించి, కృతజ్ఞతలు చెప్పి కుప్పకూలిపోయాడు. మళ్ళీ స్పృహ తప్పాడు. రాముడు అలా మాట్లాడడం, కుప్పకూలిపోవడం, స్పృహతప్పడాన్ని చూసి తట్టుకోలేకపోయారు వానరులు. అంతా ఒక్కపెట్టుగా గొల్లుమన్నారు. రోదించసాగారు.

-అరణి

సౌభాగ్య చక్రం

జూన్ 29 నుంచి
జూలై 5 వరకు

శ్రీ బిజుమళ్ళ బిందుమాధవశర్మ

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 20 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, విద్యావిషయాలు, బదిలీలు, నిర్మాణాలు, ఇంట్లో వేడుకల అంశాలకు ఈ వారం ప్రాధాన్యమిస్తారు. బుధవారం బదిలీలు, మార్పులు, చేర్పులకు అనుకూలం. కుటుంబ వ్యవహారాలపై దృష్టి సారిస్తారు. 30,1 తేదీల్లో ఆర్థిక విషయాలకు సంబంధించి స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి శుభప్రదం. 2,3 తేదీల్లో సన్నిహితుల వైఖరి కలవరపెడుతుంది. కీలకమైన పత్రాలు అందుకుంటారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. 4,5 తేదీల్లో బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.



వృషభం (ఏప్రిల్ 21 - మే 21 మధ్య పుట్టినవారు)

విద్యావిషయాలు, పెట్టుబడులు, షాపింగ్, సోదరీసోదరుల వ్యవహారాలు, బదిలీలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం విద్యార్థులకు శుభప్రదం. ప్రయాణాలు, చర్చలు లాభిస్తాయి. సినీ, రాజకీయ రంగాల వారికి శుభప్రదం. 30,1 తేదీల్లో విద్యార్థులకు శుభప్రదం. ప్రయాణాలపై దృష్టి పెడతారు. 2,3 తేదీల్లో పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల నుంచి ఒత్తిడి రావచ్చు. 4, 5 తేదీల్లో ప్రయాణాలు, చర్చల్లో నిదానం అవసరం. వాగ్వివాదాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి.

మిథునం (మే 22 - జూన్ 21 మధ్య పుట్టినవారు)

పెట్టుబడులు, పొదుపు పథకాలు, షాపింగ్, కీలక నిర్ణయాలు, ఫీజుల చెల్లింపులపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం పెట్టుబడులు లాభిస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. 30,1 తేదీల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. 2,3 తేదీల్లో పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలు వాయిదా వేయడం మంచిది. రుణాలు, పొదుపు పథకాలకు సంబంధించి ఆరా తీస్తారు. 4, 5 తేదీల్లో ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. రుణప్రయత్నాలు ఫలించకపోవచ్చు. షాపింగ్‌లో నాణ్యత గమనించాలి.

కర్కాటకం (జూన్ 22 - జులై 22 మధ్య పుట్టినవారు)

సమావేశాలు, దూరప్రయాణాలు, కీలక నిర్ణయాలు, పెట్టుబడులపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉన్నత పదవులు అందుకుంటారు. వ్యాపారంలో ప్రోత్సాహకరం. 30,1 తేదీల్లో బృంద కార్యక్రమాల్లో పాల్గొంటారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. 2,3 తేదీల్లో దూరప్రయాణాలు, ఉన్నత విద్యా విషయాల్లో అనుకోని ఆటంకాలు ఎదురవుతాయి. ఆత్మపరిశీలన చేసుకుంటారు. యోగధ్యానాలకు అనుకూలం. 4, 5 తేదీల్లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇది తగిన సమయం కాదు. కొత్త ప్రాజెక్టులు, ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది.



సింహం (జులై 23 - ఆగస్టు 23 మధ్య పుట్టినవారు)

వృత్తి, వ్యాపారాలు, ప్రముఖుల కలయిక, ప్రయాణాలు, విద్యా విషయాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. రాజకీయ, సినీ రంగాల వారు శుభవార్త అందుకుంటారు. 30,1 తేదీల్లో వృత్తి, వ్యాపారాల్లో గత అనుభవంతో లక్ష్యాలు సాధిస్తారు. ప్రముఖులను కలుసుకుంటారు. 2,3 తేదీల్లో ఆర్థిక విషయాల్లో అనుకోని అవాంతరాలు ఎదురవుతాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. 4,5 తేదీల్లో ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించాలి. అవాంతరాలు ఆటంకాల కారణంగా మనశ్శాంతి లోపిస్తుంది. ఒక సమాచారం కలవరపెడుతుంది.



కన్య (ఆగస్టు 24 - సెప్టెంబర్ 22 మధ్య పుట్టినవారు)

సమావేశాలు, వృత్తి, వ్యాపారాలు, బంధుమిత్రుల కలయిక, ఆర్థిక వ్యవహారాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం రుణప్రయత్నాలు ఫలిస్తాయి. పెట్టుబడులు లాభిస్తాయి. 30, 1 తేదీల్లో బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. 2,3 తేదీల్లో సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. బృందకార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారు. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా కొంత నిరుత్సాహకరంగా ఉంటుంది. 4, 5 తేదీల్లో ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. బంధుమిత్రుల నుంచి మాట పడాల్సి రావచ్చు. స్పెక్యులేషన్లకు దూరంగా ఉండాలి.



తుల (సెప్టెంబర్ 23 - అక్టోబర్ 23 మధ్య పుట్టినవారు)

ఆర్థికపరమైన సమావేశాలు, వృత్తి వ్యాపారాలు, పెద్దలు, బంధుమిత్రుల కలయికపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో ప్రోత్సాహకరం. 30,1 తేదీల్లో పెద్దల ఆరోగ్యం మెరుగవుతుంది. బీమా, గ్రాట్యుటీ పనులకు అనుకూలం. 2,3 తేదీల్లో సమావేశాల్లో పెద్దల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. 4,5 తేదీల్లో లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. పైఅధికారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగే ప్రమాదం ఉంది.

వృశ్చికం (అక్టోబర్ 24 - నవంబర్ 22 మధ్య పుట్టినవారు)

భాగస్వామ్యాలు, ఆర్థిక వ్యవహారాలు, ప్రయాణాలు, వేడుకలు, వృత్తి, వ్యాపార విషయాలపై ఈ వారం శ్రద్ధ పెడతారు. బుధవారం వృత్తి వ్యాపారాల్లో పట్టుదలతో వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు. 30,1 తేదీల్లో బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. శ్రీమతి, శ్రీవారి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. 2,3 తేదీల్లో ఆర్థికపరమైన సమావేశాలు ఫలించకపోవచ్చు. విద్య, సమావేశాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. 4, 5 తేదీల్లో ప్రయాణాల్లో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. విద్యా సంస్థల ఎంపిక విషయంలో తికమక పడతారు. శ్రమాధిక్యం తప్పకపోవచ్చు.



ధనుస్సు (నవంబర్ 23 - డిసెంబర్ 21 మధ్య పుట్టినవారు)

ఆరోగ్యం, స్పెక్యులేషన్లు, పెట్టుబడులు, బీమా, రుణప్రయత్నాలు, ఫీజులు, బిల్లుల చెల్లింపులపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం చిన్నారులు, ప్రియతముల కోసం విలువైన వస్తువులు సేకరిస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. 30,1 తేదీల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. సహోద్యోగుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. 2,3 తేదీల్లో స్పెక్యులేషన్లలో ఆచితూచి వ్యవహరించాలి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. 4,5 తేదీల్లో ఖర్చులు అంచనాలు మించుతాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. రుణప్రయత్నాలు ఫలించకపోవచ్చు. బీమా, గ్రాట్యుటీ, క్లెయిముల వ్యవహారాలకు అనుకూలం.

మకరం (డిసెంబర్ 22 - జనవరి 20 మధ్య పుట్టినవారు)

ప్రేమానుబంధాలు, స్పెక్యులేషన్లు, భాగస్వామికి సంబంధించిన అంశాలు, క్రయవిక్రయాలపై ఈ వారం దృష్టి పెడతారు. బుధవారం కుటుంబ సభ్యుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి శుభప్రదం. 30, 1 తేదీల్లో వివాహ నిర్ణయాలకు అనుకూలం. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. 2,3 తేదీల్లో భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. 4, 5 తేదీల్లో స్పెక్యులేషన్లలో ఆచితూచి వ్యవహరించాలి. పందాలు, పోటీలకు దూరంగా ఉండండి. భాగస్వామి వైఖరి ఆవేదన కలిగిస్తుంది.

కుంభం (జనవరి 21 - ఫిబ్రవరి 18 మధ్య పుట్టినవారు)

విందు వినోదాలు, విద్యా విషయాలు, వృత్తి, వ్యాపారాలు, భాగస్వామి వ్యవహారాలపై ఈ వారం దృష్టి సారిస్తారు. బుధవారం ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. 30,1 తేదీల్లో కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి శుభప్రదం. 2,3 తేదీల్లో చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం కలవరం కలిగిస్తుంది. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. 4, 5 తేదీల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. విందు వినోదాల్లో పరిమితి పాటించండి. లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి.

మీనం (ఫిబ్రవరి 19 - మార్చి 20 మధ్య పుట్టినవారు)

విద్యా విషయాలు, వేడుకలు, పొదుపు పథకాలు, ప్రేమానుబంధాలు, ఉద్యోగ, వ్యాపారాలకు ఈ వారం ప్రాధాన్యం ఉంటుంది. బుధవారం ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. 30,1 తేదీల్లో విద్యార్థులకు శుభప్రదం. సోదరీసోదరుల విషయాల్లో శుభ పరిణామాలు సంభవం. 2,3 తేదీల్లో కుటుంబ సభ్యుల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. 4,5 తేదీల్లో ప్రేమానుబంధాలు బెడిసికొట్టే ప్రమాదం ఉంది. చిన్నారులు, ప్రియతముల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. విద్యార్థులు లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి.

నవ్య సినిమా

ఇంటివారు కాబోతున్న ప్రేమజంట

ఇంటివారు కాబోతున్నారు అంటే పెళ్ళి చేసుకోబోతున్నారని కాదు. ఇంటికి యజమానులు అవబోతున్నారని అర్థం. బాలీవుడ్ ప్రేమ జంట విరాట్ కోహ్లీ, అనుష్క శర్మలు ఆ మధ్య విడిపోయారన్న వార్తలు బాగానే వినిపించాయి. అవన్నీ గిట్టని వాళ్ళు అల్లిన కట్టు కథలే అని తేలిపోయింది. ఇద్దరూ కలిసి ముంబాయిలో ఓ ఖరీదైన సువిశాలమైన అపార్టుమెంట్ కొనడానికి సిద్ధమైపోయారు. ఈ అపార్ట్‌మెంటు ఖరీదు అక్షరాలా 34 కోట్లు. గతంలో కత్రినా, రణవీర్‌లు ఇలాంటి ఖరీదైన అపార్టుమెంటే కొని సహజీవనం మొదలెట్టారు. తీరా విబేధాలు వచ్చి విడిపోయాక దాన్ని ఎవరు తీసుకోవాలో తేల్చుకోలేకపోయారు. ఈ జంటకు కూడా అలాంటి ఇబ్బంది రావచ్చు అంటున్నారు బాలీవుడ్ జనాలు.

పద్మశ్రీ వద్దంటున్న భరణి

రచయితగా, నటుడుగా తనికెళ్ళ భరణి సుపరిచితుడే! వివాదాలకి దూరంగా ఉండే ఆయనంటే చాలామందికి ప్రేమ.. అంతకు మించి గౌరవం కూడా! అలాంటి వ్యక్తి పద్మశ్రీ అవార్డు తనకు వచ్చినా తీసుకోనంటూ వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. ఆయన ఆ విధంగా ఎందుకు మాట్లాడారో చాలా మందికి అర్థం కాలేదు. కానీ ఆయన వాదన వింటే మాత్రం ఆయనలోని గొప్పతనం, ఆయన ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారో తేలికగానే బోధపడుతుంది. తెలుగు సినీ పరిశ్రమలో ఎస్వీరంగారావు, సావిత్రి, సూర్యాకాంతం లాంటి మహానటులకు దక్కని పద్మశ్రీ గౌరవం తనకు వద్దని ఆయన చెప్పడం చాలా మందిని ఆశ్చర్యపరచడమే కాదు, వ్యక్తిగా ఆయన గొప్పతనాన్ని చాటింది కూడా!

మౌన వ్రతంలో వర్మ

ప్రతి విషయాన్ని విమర్శిస్తూ ట్వీట్లు చేసే రాంగోపాల వర్మ, శిష్యుడు పూరీ విషయంలో మాత్రం మౌన వ్రతం పాటిస్తున్నాడు అంటున్నారు సినీజనాలు. మొన్నటికి మొన్న ప్రపంచం అంతా ఫాదర్స్ డే జరుపుకుంటే ఆ రోజు పూరీ గాడ్ ఫాదర్స్‌డేని జరుపుకున్నాడు. పూరీ గాడ్ ఫాదర్ రాంగోపాలవర్మ అన్న సంగతి తెలిసిందే! ఆయన ఫోటోను గాడ్‌ఫాదర్ లెవల్లో డిజైన్ చేసి ట్విటర్‌లో పెట్టాడు పూరీ. కారణం ఏమిటో తెలియదు కానీ ప్రతి సందర్భాన్నీ విమర్శించే వర్మ ఫాదర్స్ డే మీద ఎలాంటి కామెంట్లూ చేయలేదు. శిష్యుడు తనని గాడ్‌ఫాదర్‌గా భావించినందుకే వర్మ మౌనంగా ఉన్నాడని అంటున్నారు.

సైతాన్‌గా మారిన బిచ్చగాడు

తెలుగు రాష్ట్రాలలో 'బిచ్చగాడు' కొందరిని కోటీశ్వరులని చేసేశాడు. ఈ సినిమాని చాలా తక్కువకి కొనుక్కున్న వాళ్ళు కోట్ల రూపాయల లాభాన్ని కళ్ళజూశారు. దాంతో ఈ సినిమా హీరో విజయ్ ఆంటోని తెలుగువారికి అభిమాన పాత్రుడయ్యాడు. ఇతని తరువాతి సినిమా మీద టాలీవుడ్ జనాలు చాలా ఆశలే పెట్టుకుంటున్నారు. తన తరువాత సినిమాలో 'సైతాన్'గా రాబోతున్నాడు. అప్పుడే ఈ సినిమా మీద టాలీవుడ్‌లో చాలా మంది కళ్ళు పడ్డాయట! జులైలో రాబోతున్న ఈ సినిమాను దక్కించుకోవడానికి అప్పుడే పోటీ మొదలైంది అంటున్నారు.

అడ్వాన్సులు ఫుల్.. సినిమాలు నిల్

ఆ ఇద్దరూ సత్తా ఉన్న దర్శకులే! వారిని నమ్మి నిర్మాతలు అడ్వాన్సులు కూడా ఇచ్చి కూర్చున్నారు. కాని ఇప్పుడు వారితో సినిమా అంటే ఆమడదూరం పోతున్నారు. ఇంతకీ వారిద్దరూ ఎవరు? అనే సందేహం వస్తోందా...? ఒకరు శ్రీకాంత్ అడ్డాల, మరొకరు హరీష్ శంకర్. మెగా హీరోలతో చేయడానికి వీరిద్దరికీ అడ్వాన్సులు అందాయి. కానీ 'బ్రహ్మోత్సవం' తరువాత శ్రీకాంత్ అడ్డాలతో చేయడానికి మెగా హీరోలు సిద్ధంగా లేరట! హరీష్ శంకర్‌కి డిజాస్టర్లు లేకపోయినా 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్' తరువాత మరో సినిమా చేయలేదు. దాంతో అడ్వాన్సులు అందినా షూటింగ్‌లకు పిలిచేవారు లేక ఆ ఇద్దరు దర్శకులు ఖాళీగా ఉంటున్నారట! ఇలా మరికొంత మంది దర్శకులు టాలీవుడ్‌లో ఉన్నారని అంటున్నారు.

అది నా తప్పు కాదు

-నయనతార

నయనతార....పేరు వినగానే రూపం కన్నా ముందు వివాదాలే గుర్తుకు వస్తాయి. మనిషి ఎంత అందంగా ఉంటుందో సమస్యలు కూడా అంతలా వైపైలా ఆమె చుట్టూ తిరుగుతూనే ఉంటాయి. ప్రేమలో విఫలమైన ప్రతిసారీ పడిలేచిన కెరటంలా ముందుకు దూసుకు వెడుతూనే ఉంది. ఏ పాత్రలోనైనా అవలీలగా పరకాయ ప్రవేశం చేయగల సత్తా నయనతార సొంతం. మూడు పదుల వయస్సులో కూడా అందరికీ కావలసిన హీరోయిన్ అయింది. తెలుగులో కొద్దిగా గ్యాప్ తీసుకుని సినిమా చేస్తున్న నయనతారతో....

'బాబు బంగారం' టీంని ఇబ్బంది పెడుతున్నారట?

నేనేమీ ఇబ్బంది పెట్టడం లేదు. ఇచ్చిన డేట్లు అయిపోయాయి. యూనిట్ షూటింగ్ పూర్తి చేయలేదు. నా డేట్ల వరకూ కరెక్ట్‌గానే వచ్చాను. కోలీవుడ్‌లో ఒప్పుకున్న సినిమాలను వదలలేను కదా? అందుకే తిరిగి అక్కడ షూటింగ్‌లకి హాజరవుతున్నాను. మరికొన్ని రోజులు కావాలని అడిగారు. మరో పదిరోజులు ఇచ్చాను. డేట్ల లోపు షూటింగ్ పూర్తి చేయకపోతే అది నా తప్పు కాదు కదా! నేను ఇబ్బంది పెడుతున్నానని అనడం ఎంత వరకు న్యాయం. చెప్పిన టైంకి వస్తాను. షూటింగ్ అయిపోగానే వెళ్ళిపోతాను. నా టైం లోపు షూటింగ్ పూర్తి చేసే బాధ్యత యూనిట్‌దే!

ఈ సినిమా ఆలస్యానికి కారణం మీరే అంటున్నారు ఎంత వరకూ నిజం?

ఇది నూటికి నూరుపాళ్ళూ అబద్ధం. రెండోసారి డేట్లు అడిగినప్పుడు కోలీవుడ్‌లో సినిమాలు చేస్తున్నాను. అవి పూర్తయిన తరువాత ఇస్తానని చెప్పాను. ఇచ్చాను. సినిమా ఆలస్యానికి వేరే కారణాలు ఉండవచ్చు. కానీ నేను మాత్రం కచ్చితంగా కాదు.

కోలీవుడ్‌లో స్టార్ హీరోలతో పాటు కుర్ర హీరోలతోనూ చేస్తున్నట్టున్నారు?

సినిమా ఒప్పుకునే ముందు కథ ఏమిటి? అందులో నా పాత్ర ఎంత అని చూస్తానే తప్ప హీరోల గురించి పెద్దగా పట్టించుకోను.

మోస్ట్ డిజైరబుల్ ఉమెన్‌గా కోలీవుడ్‌లో ఆలస్యంగా గుర్తింపు వచ్చిందనుకుంటున్నారా?

నేను కోలీవుడ్‌లోకి అడుగుపెట్టి పన్నెండు సంవత్సరాలు అవుతోంది. అవార్డుల కోసం ఎప్పుడూ ఎదురు చూడలేదు. కష్టపడి పనిచేయడం ఒక్కటే నాకు తెలుసు. దాన్నే నమ్ముకున్నాను. ఇప్పటి వరకూ నాకు ఏ విధమైన గుర్తింపు లభించినా అది నా కష్టానికి తగిన ప్రతిఫలమే! ఇప్పుడు ఈ అవార్డు కూడా అలాంటిదే! ఎప్పుడు వచ్చింది? అని ఆలోచించడం కన్నా ఇప్పటికైనా నా కష్టాన్నీ, నిజాయితీని గుర్తించారని ఆనందపడడం మంచిది కదా! నేనూ అదే అనుభవిస్తున్నాను.

నిర్మాతగా మారాలని ఎందుకు అనిపించింది?

అవన్నీ గాలి కబుర్లు. నిర్మాతగా మారాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. నిర్మాతగా మారడం అంటే టీ తాగినంత తేలిక కాదు. దానికి చాలా ధైర్యం ఉండాలి. నాకా ధైర్యం లేదు. అందుకే నిర్మాణం జోలికి పోను. ఈ రంగంలో నా స్నేహితురాళ్ళు కొందరు నిర్మాతలుగా మారి చేతులు కాల్చుకున్నారు. వారిని చూసిన తరువాత కూడా నేను నిర్మాతగా మారాలని అనుకోవాలా?

సెకండ్ ఇన్నింగ్స్‌లో బాగా సక్సెస్ అవడానికి కారణం?

ప్రారంభంలో తెలిసీ తెలియక చేసిన తప్పులు నాకు బోలెడు ఫ్లాపులు తెచ్చిపెట్టాయి. కొన్ని సందర్భాలలో బాగా డిప్రెషన్‌కి గురయ్యాను కూడా! ఇప్పుడు ఆ తప్పులు చేయకుండా జాగ్రత్త పడుతున్నాను. విజయాలు అందుకుంటున్నాను.

తెలిసీ తెలియక చేసిన తప్పులంటే?

మొదట్లో కొన్ని సినిమాలు మొహమాటానికి చేయవలసి వచ్చింది. కథ అంత బాగా లేదని

అర్థం అయినా కూడా చేశాను. అపజయాన్ని మూట కట్టుకున్నాను. ఇప్పుడు మాత్రం ఆ మొహమాటాలు పెట్టుకోదలుచుకోలేదు. కథ నచ్చితే పారితోషికం తక్కువ ఇచ్చినా ఒప్పుకుంటాను కానీ, నచ్చకపోతే ఎంత ఇచ్చినా తీసుకోను.

సెకండ్ ఇన్నింగ్స్‌లో పారితోషికం పెంచారట కదా?

నా సినిమాకి ఇంత ఇవ్వమని ఎవరినీ డిమాండ్ చేయలేదు. చేయను కూడా! ఇక పెంచడం, తగ్గించడం ఎందుకు ఉంటుంది.

కోలీవుడ్‌లో దర్శకుడిని ప్రేమించారనీ, పెళ్ళి కూడా చేసుకోబోతున్నారట కదా?

అవన్నీ పుకార్లే. విఘ్నేష్ దర్శకుడిగానే కాకుండా నాకు మంచి స్నేహితుడు మాత్రమే. స్నేహితుడితో క్లోజ్‌గా మూవ్ అయితే అతగాడిని ప్రేమించినట్టా, పెళ్ళి చేసుకున్నట్టా? మా మధ్య అలాంటిదేమీ లేదు.

ప్రేమకూ, పెళ్ళికీ ఫుల్‌స్టాప్ పెట్టినట్టేనా?

ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకుంటాను అని చెప్పలేను. అది ఐదు సంవత్సరాలు కావచ్చు. అంతకు మించి కావచ్చు. మనసుకి నచ్చిన వ్యక్తి దొరికితే తప్పకుండా చేసుకుంటాను.

మనసుకు నచ్చిన వ్యక్తి అంటే ఎలా ఉండాలి?

ఆ వ్యక్తికి నిజాయితీ అనే క్వాలిఫికేషన్ తప్పనిసరి. ఆ క్వాలిఫికేషన్ ఇంత వరకూ నాకు ఎవరిలోనూ కనిపించలేదు.

ఓ వ్యక్తితో ఎప్పటికీ నటించనని అన్న మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉంటారా?

ప్రభుదేవాతో ఎప్పటికీ నటించనని చెప్పాను. ఇప్పటికీ అదే చెబుతున్నాను. అతనితో ఈ జీవితంలో కలిసి నటించే అవకాశమే లేదు.

శింబుతో భవిష్యత్తులో నటిస్తారా?

మధ్యలో ఆగిపోయిన సినిమాను పూర్తి చేశాను తప్ప అతనితో కొత్త సినిమా చేయలేదు. అతనితో మరో సినిమా చేస్తానా? లేదా? అన్నది చెప్పలేను. భవిష్యత్తు నా చేతుల్లో లేదు కదా?

ఇటీవల తరచూ దుబాయ్ వెడుతున్నట్టున్నారు ఎందుకు?

అక్కడ మా బ్రదర్ ఉన్నాడు. మా ఫ్యామిలీ కూడా అక్కడే ఉంది. షూటింగ్‌లో కొద్దిగా గ్యాప్ దొరికితే అక్కడికి వెడుతుంటాను. ఫ్యామిలీతో కొంత కాలం గడిపితే రీఫ్రెష్ అవుతాం కదా అందుకే! అంతకు మించి కారణం లేదు.

ఆగస్టులో మీవి ఒకేసారి మూడు సినిమాలు విడుదలవుతున్నట్టున్నాయి?

తమిళంలో రెండు సినిమాలు, తెలుగులో ఒకటి విడుదల అవుతోంది. చాలా కాలం తరువాత తెలుగులో నా సినిమా విడుదల కావడం ఆనందంగా ఉంది. వెంకటేష్ గారితో గతంలో చేశాను. మా పెయిర్‌కి మంచి పేరొచ్చింది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది.

ఖాళీ సమయాల్లో ఏం చేస్తారు?

ఖాళీ దొరికితే పార్టీలకూ, పబ్బులకూ వెళ్ళే వ్యక్తిని కాను నేను. కొద్ది టైం దొరికినా మా పేరెంట్స్‌తో గడుపుతాను. అందరం కలిసి హాలిడే ట్రిప్ ప్లాన్ చేసుకుంటాం. బయట నాకు స్నేహితులు తక్కువే! ఉన్న కొద్దిపాటి స్నేహితులు ఎవరి బిజీలో వారు ఉంటారు. నాకు తీరిక ఉన్నప్పుడు వారికి ఉండదు. వారికి తీరికున్నప్పుడు నాకుండదు. అందుకు ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండా పేరెంట్స్‌నే ఇబ్బంది పెడతాను.

చివరగా...పెళ్ళి తరువాత కూడా నటిస్తారా?

పెళ్ళే ఎప్పుడు చేసుకుంటానో తెలియదు. ఇక పెళ్ళి తరువాత నటిస్తానా? లేదా? అన్నది ఇప్పుడే ఎలా చెప్పగలను. అప్పటి పరిస్థితులను బట్టి నా నిర్ణయం ఉంటుంది. నా జీవితంలో ఏదీ అనుకున్నది అనుకున్నట్టు జరగలేదు. కాబట్టి ఇప్పుడే ఏ విషయాన్నీ అనుకోవడం లేదు.

-చిన్ని

అలాంటి గిఫ్టు ఇవ్వలేదట!

హాట్ ఆంటీ బిపాసాబసు ఇంత కాలానికి పెళ్ళి చేసుకొని ఓ ఇంటిదైంది. ఇది అందరూ సంతోషించదగ్గ విషయమే! ఎప్పుడూ ఈ ఆంటీ చుట్టూ వివాదాలు కందిరీగల్లా ముసురుతూ ఉంటాయి. పెళ్ళయ్యాక కూడా వాటికి బ్రేక్ పడలేదు. ఈసారి ఖరీదైన బహుమతి గురించి! సల్మాన్ ఈ బ్యూటీకి పదికోట్ల రూపాయల విలువ చేసే ఇంటిని గిఫ్టుగా ఇచ్చాడని బాలీవుడ్‌లో హాట్ హాట్ చర్చ మొదలైంది. ఈ విషయం బిపాసా దాకా కూడా వెళ్ళింది. దాంతో తప్పనిసరై వివరణ ఇచ్చుకుంది బిపాసా. తనకు సల్మాన్ నుంచి అంత ఖరీదైన గిఫ్టు ఏదీ రాలేదంటూ స్పష్టం చేసింది.

ఇంటర్వ్యూ

నాటి జానపద చారిత్రక చిత్రాల్ని రీమేక్ చెయ్యాలి

-కెకె శర్మ

పాత తరం నటుడు కె.కె.శర్మ. ఆచార్య ఆత్రేయ ఆశీస్సులతో కెరీర్ ప్రారంభించి ఐదు దశాబ్దాలుగా సుమారు 600 చిత్రాల్లో నటించి సినీ ప్రేక్షకులను రంజింపజేశారు. జానపద, చారిత్రక చిత్రాలు మళ్ళీ రావాలనీ, అమూల్యమైన ఆ పాత చిత్రాలను నేటి సాంకేతిక విలువలతో రీమేక్ చేస్తే పిల్లలు ఎంతో ఎంజాయ్ చేస్తారనీ అంటున్న శర్మ ఇంటర్వ్యూ....

మాది విజయనగరం. మా నాన్నగారు రామకృష్ణమూర్తి, అమ్మ దుర్గమ్మ. కవులు, కళాకారులకు నిలయమైన విజయనగరంలో జన్మించడం నా అదృష్టం. పిఠాపురం మహారాజా కాలేజీలో ఎస్ఎస్ఎల్‌సి వరకు చదివాను. ఇంటర్మీడియట్‌లో చేరినప్పటి నుండే కాలేజీలో నాటక ప్రదర్శనల్లో పాల్గొనేవాణ్ణి. నటుడు హరనాథ్, శంకరాభరణం నిర్మాత ఏడిద నాగేశ్వరరావు, రేడియో న్యూస్‌రీడర్ ఏడిద గోపాలరావు...వీళ్ళంతా ఇంటర్మీడియట్‌లో నా క్లాస్ ఫ్రెండ్స్. వాళ్ళతో కలిసి కాలేజీ వార్షికోత్సవాల్లో నాటకాలు ప్రదర్శించేవాణ్ణి. అక్కడే ఉపాధ్యాయులు, కాలేజీ విద్యార్థులంతా నన్ను, నా నటనను చూసి ఎంతో ఆనందించేవారు. ప్రోత్సహించేవారు. హాస్యం బాగా పండిస్తాడని వారిచ్చిన ఆశీస్సులే, ఆ మాటలే నన్ను కమెడియన్‌ను చేశాయి.

మద్రాసులో నాటక ప్రదర్శనలు

చదువు పూర్తయిన తర్వాత రైల్వే శాఖలో ఫైర్‌మన్‌గా ఉద్యోగంలో చేరాను. ఉద్యోగం చేస్తూనే మధ్య మధ్యలో మద్రాసు వెళ్ళి వస్తూ ఉండేవాణ్ణి.

తొలి చిత్రం గండికోట రహస్యం

